# సౌందర్యలహరీసౌందర్యము

## (పరిశోధనగ్రంథము)

**(1994లో ఉస్మానియవిశ్వవిద్యాలయ సంస్కృత విభాగంలో పి.హెచ్.డి (డాక్టరేటు) పట్టాను, స్వర్ణపతకమును పొందిన ఈ పరిశోధనగ్రంథము ఉస్మానియా విశ్వవిద్యాలయమువారి అనుమతితో ముద్రితము)**


పరిశోధకుడు:

**డా॥ అయాచితం నటేశ్వర శర్మ**

విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రాచ్యవిద్యాపరిషత్తు
ప్రాచ్యకళాశాల, కామారెడ్డి.
పూర్వపీఠాధిపతి, ప్రాచ్యభాషావిభాగము,
ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు.



**కౌముదీ ప్రచురణలు**

**హైదరాబాదు**

**2024**

# సౌందర్యలహరీసౌందర్యము

పరిశోధన గ్రంథము


| | | |
|---|---|---|
| రచయిత | : | **డా॥ అయాచితం నటేశ్వరశర్మ** |
| కాపీరైట్స్ | : | సర్వస్వామ్యములు రచయితవి |
| ప్రచురణ | : | 17, జూన్, 2024<br>క్రోధి – ఆషాఢ శుద్ధ ఏకాదశి, బుధవారము |
| ప్రథమముద్రణ | : | 2024 |
| ప్రతులు | : | 500 |
| వెల | : | రూ. 200/- |
| ప్రతులకు | : | **డా॥ రాళ్లబండి కౌముది, వేపా జాహ్నవి**<br>ప్లాట్‌నం. 401, ప్రగతి అరిహంత్ రెసిడెన్సీ,,<br>బ్లాకు – 1, డిమార్ట్ ప్రక్కన,<br>మిలిటరీ డైరీ ఫారంరోడ్,<br>ఓల్డ్ బోయిన్‌పల్లి, సికింద్రాబాదు – 500009 |
| ముఖ చిత్రం | : | **ఇంద్రకంటి యామిని** |
| ముద్రణ | : | **సాయి తిరుమల ప్రింటింగ్ ప్రెస్**<br>చిక్కడపల్లి, హైదరాబాద్. |

# శ్రీ శంకరభగవత్పాదులు



శ్రుతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయమ్ ।
నమామి భగవత్పాద శంకరం లోకశంకరమ్ ॥


దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీ శారదాపీఠాధీశ్వరులు,జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాసన్నిధానంవారు
జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ సన్నిధానం వారలకు సాష్టాంగ ప్రణామాలు
జగద్గురువుల పాదరేణువు...అయాచితం నటేశ్వరశర్మ



Website : www.kamakoti.org
email : kanchimutt@gmail.com

Contact : 044-27222115
Acts : 044-27224238
Cell : 9445421115

|| Sri Chandramouleeswaraya Namah ||
Sri Sankara Bhagavadpadacharya Paramparagatha Moolamnaya Sarvajnapeeta

His Holiness Sri Kanchi Kamakoti Peetadhipathi

## JAGADGURU SRI SANKARACHARYA SWAMIGAL

**Srimatam Samsthanam**

**No. 1, Salai Street, Kancheepuram - 631 502, Tamilnadu State, INDIA.**

For Sri Kanchi Kamakoti Peetam
Agent ... Sankaracharya Swamigal Mutt



श्री जगद्गुरुशङ्कराचार्यमहासंस्थानम्, पुष्पगिरिः

శ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానము, పుష్పగిరి



శ్రీ విద్యా శంకర ప్రసన్న

జగద్గురువులైన శంకరభగవత్పాదుల వారి కరకమలాల నుండి జాలువారిన స్తోత్రవాఙ్మయము ద్వారా లోకము ఎంతగా ఉద్ధరింపబడిందో ప్రత్యేకించి చెప్పవలసిన ఆవశ్యకత ఏమాత్రం లేదు. సమాజములో ప్రతీ ఒక్కరు వేదాంతశాస్త్రాన్ని జిజ్ఞాస వల్లే మోక్షమార్గాన్ని అన్వేషించడానికి అశక్తులు కావున సగుణోపాసన పద్ధతియను అనుసరించి దేవతలను స్తుతిస్తూ దేవతానుగ్రహానికి పాత్రులౌతున్నారు. దేవతల యొక్క అనుగ్రహాన్ని పొందడం కోసం జగద్గురువుల చేత స్తోత్రాలు లిఖించబడ్డవి. కాలడి గ్రామము నుండి ప్రకృతి అందాలకు నెలవైన కాశ్మీర దేశానికి పయనమైన శ్రీశంకరులు ఆ కాశ్మీరములో శక్తి యొక్క ఆరాధన చేసారు. తర్వాత శక్తిస్తు స్తోత్రాలను రచించారని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. శంకరాచార్యుల ద్వారా లిఖింపబడిన స్తోత్రములలో శివానందలహరి, సౌందర్యలహరి మొదలైనవి సర్వత్ర ప్రసిద్ధమై ఉన్నవి. కావ్యాలు ఖండ కావ్యాలు, ముక్తకాలు, దూతకావ్యాలు, దృశ్య కావ్యాలు, శ్రవ్యకావ్యాలని ఎలాగైతే విభజింపబడి విలాసాన్ని పొందిన ఉన్నవో అదేవిధంగా నామ – శర్మ – రూప – బింబ – నమస్కార – ఆశీః – పరాక్రమ – విభూతి – ప్రార్థనాది రూపాలుగా స్తోత్రములు విభజింపబడి విరాజిల్లినవి.

విద్యావంతులైనా, అల్పులైనా శంకర కృత ఆధ్యాత్మికామృతానందలహరిలో మునిగి పునీతులై ఉన్నారు. వేదాంతాది శాస్త్రములు, సమస్త తంత్రాలు, సమయాచార విధానములు, శ్రీవిద్యోపాసనా మార్గాలు, షోడశ్యాది మహావిద్యలు, కుండలినీ విద్యలు మొదలైనవెన్నో వారిచేత రచింపబడ్డ సౌందర్యలహరి స్తోత్రములో నిక్షిప్తం చేయబడి స్తోత్రానికి అపూర్వమైన సౌందర్యాన్ని అనుసంధింపజేసినవి. మంత్ర రహస్యాలు, వేదసూక్తములు, శ్రీచక్రారాధన విధివిధానాలు, రసవిచారము, ధ్వన్యలంకారవిన్యాసాలు మొదలైనవెన్నో సౌందర్యలహరి స్తోత్రములో అంతర్గతముగా ఉన్నవని నిరూపిస్తూ **సౌందర్యలహరీ సౌందర్యము అనే పేరుతో ఒక పరిశోధనాత్మక గ్రంథాన్ని రచించిన ప్రముఖ సంస్కృతాంధ్రపండితులు శ్రీ అయాచితం నటేశ్వరశర్మ గారి యొక్క కృషి మిక్కిలి శ్లాఘనీయమని తెలుపుతూ అస్మదాశీస్సులు అందిస్తున్నాము.**

**ఇతి నారాయణ స్మృతిః**

తిథి : క్రోధి – జ్యేష్ఠ బహుళ – అమావాస్య

05-07-2024

క్షేత్రం: భాగ్యనగరం

श्रीः

శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామినః

శ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానము – పుష్పగిరి

శరజ్జ్యోత్స్నాశుద్ధాం శశియుతజటాజూటమకుటాం
వరత్రాసత్రాణస్ఫటికఘుటికాపుస్తకకరామ్
సకృన్న త్వా నత్వా కథమివ సతాం సన్నిదధతే
మధుక్షీరద్రాక్షామధురిమధురీణాః ఫణితయః 15

ఓ భగవతీ! శరదృతువులోని చంద్రుని వెన్నెలవలె నిర్మలమైనదీ, చంద్రునితో కూడిన జటాజూటకిరీటంతో కూడినదీ, ఇష్టప్రదమైనదీ, అభయం ఇచ్చేదీ, స్ఫటికపానపాత్రతో కూడినదీ, పుస్తకముద్రతో కూడినదీ అయిన నాలుగు చేతులతో కూడిన నీ మూర్తిని మాటి మాటికి నమస్కరించే వారికి తేనె వంటి తీయనైన, పాలవంటి నిర్మలమైన, ద్రాక్షవలె మధురమైన వాక్శక్తి తప్పక లభిస్తుంది.

అమ్మవారి త్రికూట విద్యలోని ప్రథమకూటం అయిన వాగ్భవకూటానికి సంబంధించిన సాత్త్వికధ్యానాన్ని చెప్పే శ్లోకం ఇది. అమ్మవారి సాత్త్విక స్వరూపం అయిన సారస్వతరూపాన్ని నిరంతరం ధ్యానించే వారికి కలిగే ఫలం ఎలాంటిదో ఈ శ్లోకంలో చక్కగా చెప్పారు శంకరభగవత్పాదులు!

# సౌందర్యలహరీ సౌందర్యము

## విషయసూచిక


సంకేతపదసూచిక xiv

**ప్రథమ తరంగము**

1. నివేదనము 1
2. స్తోత్రసాహిత్య వికాసము 5
3. స్తోత్రసాహిత్యము - సౌందర్యలహరి 18
4. సౌందర్యలహరీ కర్తృత్వవిచారము 19
5. శంకరాచార్యజీవన చరిత్ర 21
6. శ్రీశంకరాచార్యుల కృతులు - సమీక్ష 26
7. శ్రీశంకరాచార్యుల కాలనిర్ణయము 29

**ద్వితీయతరంగము**

1. నామౌచిత్య వృత్తౌచిత్యములు 32
2. సౌందర్యలహరీ శ్లోకసంఖ్యావిచారము 34
3. సౌందర్యలహరీ విభాగము 35
4. సౌందర్యలహరి పాఠభేదములు 36

**తృతీయతరంగము**

1. తంత్రము 43
2. సౌందర్యలహరి-తంత్రము 53
3. యోగము 56
4. తంత్రయోగ సమన్వయము 61

| | | |
|---|---|---|
| 5. | సమయాచారము - వేదమూలకత్వము | 68 |
| 6. | శ్రీవిద్యామూలబీజము | 69 |
| 7. | శ్రీవిద్యామంత్రము | 70 |
| 8. | కాదివిద్య | 71 |
| 9. | హాదివిద్య | 71 |
| 10. | సాదివిద్య | 72 |
| 11. | దౌర్వాససీవిద్య | 72 |
| 12. | షోడశీవిద్య | 73 |
| 13. | శ్రీవిద్యామూర్తివర్ణనము | 73 |
| 14. | భగవతీ చరణవైభవము | 74 |
| 15. | భగవతీచరణమహిమ | 75 |
| 16. | భగవతీచరణమయూఖములు | 75 |
| 17. | భగవతీచరణనిర్ణేజనజలమహిమ | 76 |
| 18. | భగవత్యపాంగమహిమ | 77 |
| 19. | భగవతి-అనేకరూపములు | 77 |
| 20. | భగవతీసేవాఫలము | 78 |
| 21. | వివిధప్రయోగము | 79 |
| | సారస్వతప్రయోగము | 79 |
| | మాదనప్రయోగము | 79 |
| 22. | గారుడప్రయోగము | 80 |
| 23. | శ్రీచక్రము | 80 |
| 24. | శివచక్రములు-శక్తిచక్రములు | 81 |
| 25. | శ్రీచక్రలేఖనపద్ధతులు | 82 |
| 26. | సమయాచారము | 84 |

27. శివశక్తి సామ్యాదిభేదములు 85
28. పంచవిధసామ్యములు 86
29. త్రివిధతాదాత్మ్యములు 89
30. చతుర్విధైక్యములు 89
31. షడ్విధైక్యములు 89
32. సాదాఖ్యకళ 90
33. మహావేధప్రకారము 90
34. సౌందర్యలహరి–షట్చక్రపూజాక్రమము 93
35. తాంత్రికుల యోగము - కుండలినీ యోగము 94
36. కుండలిని 98

**చతుర్థతరంగము**

1. సౌందర్యలహరి–శతకత్వవిచారము 101
2. మంగళాచరణము 102
3. సౌందర్యలహరి - రసము 104
4. సౌందర్యలహరి–అలంకారసౌందర్యము 108
5. వర్ణనలు 116
6. ధ్వని 121
7. కవిసమయములు 125
8. కవితాశైలి 127
9. పూర్వగాథాచర్వణము 133
10. యతినియమములు–వర్ణమైత్రి 138
11. సౌందర్యలహరి–శాస్త్రకావ్యత్వము 140
12. కవిశ్రేణిలో సౌందర్యలహరి కర్తృస్థానము 141

**పంచమతరంగము**

1. సౌందర్యలహరి - వ్యాఖ్యానములు 143

**షష్ఠతరంగము**

1. వైదికత 144
2. సౌందర్యలహరి - అద్వైతతత్త్వప్రతిఫలనము 149
3. ఆచారములు-సంప్రదాయములు 154
4. సౌందర్యలహరిపై ప్రాచీనస్తోత్రముల ప్రభావము 156
శ్రీలలితాసహస్రనామస్తోత్ర ప్రభావము 157
శ్రీలలితాత్రిశతీప్రభావము 165
. శ్రీశివమహిమ్నః స్తోత్రము 166
సుభగోదయస్తుతి 167
5. అనంతరస్తోత్రసాహిత్యముపై సౌందర్యలహరీ ప్రభావము 171
i) మూకపంచశతి 172
ii) జగన్నాథపండితరాజకృతులు 173
6. సమాజముపై సౌందర్యలహరీప్రభావము 173
7. నీరాజనము 175

**పరిశిష్టము**

1. సంగీతసంప్రదాయములు 177
2. శ్లోకప్రయోగసంప్రదాయములు 179
3. ఉపసంహారము 182
4. ఉపయుక్తగ్రంథసూచిక 184

# మాతాపితృవందనమ్



## మాతాపితృస్తుతిః

కమలాయితమత్స్వాంత సమధిష్ఠితదైవతమ్ ।
అనంతరాజశర్మాణం పితరం సతతం భజే ॥ 1

ఏకాంతతనుజప్రేమదుగ్ధసాగరవాసినీమ్ ।
జయలక్ష్మీం దయామూర్తిం మాతరం ప్రణమామ్యహమ్ ॥ 2

ఈశ్వరాంకితసర్వస్వం ధర్మకర్మసమన్వితమ్
భాస్వన్నిజగుణాకృష్టసజ్జనం పితరం భజే ॥ 3

లలితాదత్తసౌభాగ్యశ్రీచక్రావాసనందితామ్
కారుణ్యామృతవాగ్వర్షాం హర్షదాం మాతరం భజే ॥ 4

హ్రీంబీజభాస్వచ్ఛ్రీవిద్యాతత్త్వజ్ఞానప్రహర్షితౌ
వందే మత్పితరౌ సాక్షాత్పార్వతీ పరమేశ్వరౌ ॥ 5

హసన్మానసనీరజ భవామోదసమంచితౌ
పరస్పరానురాగశ్రీరంజితౌపితరౌభజే ॥ 6

సకలాగమ సంవేద్య శ్రీవిద్యాతత్త్వభూషితౌ
సమయాచారతాత్పర్యహృదయౌపితరౌభజే ॥ 7

కల్యాణదాయకార్షేయ కథాశ్రుతి సముత్సుకౌ
నిత్యవ్రతసదాచారచారిణౌ పితరౌ భజే ॥ 8

హరీశ్వరార్చనావ్యక్తాభిన్నతత్త్వైకదర్శనౌ
బ్రహ్మసత్యత్వ సిద్ధాంతభావుకౌ పితరౌ భజే ॥ 9

లసద్వైదికసద్విద్యాప్రాప్తసౌశీల్యశోభితౌ
వృద్ధసంసేవనాసక్తహృదయౌ పితరౌ భజే ॥ 10

హ్రీంకారతత్త్వజిజ్ఞాసాప్రేరితాధ్యయన వ్రతౌ
బ్రహ్మోత్సవార్చితానంతదేవేశౌ పితరౌభజే ॥ 11

సమస్తక్లేశసంతాప సహనోన్నతమానసౌ
పుత్రాభ్యుదయసన్మార్గదర్శకౌ పితరౌ భజే ॥ 12

కందర్పాది మహాద్రష్టృమంత్రవిద్యాసమన్వితామ్
సౌందర్యలహరీం శ్రీమచ్ఛంకరాచార్యకర్తృకామ్ ॥ 13

లలితాకృపయా సమ్యక్ పరిశీల్యవినిర్మితామ్
అనేక విద్వదాచార్యమార్గ నిర్దేశసమ్మతామ్ ॥ 14

హ్రీంకారవేద్యమాతృశ్రీ సమయాచార్యసంయుతామ్
కృతిమమైతాం మత్పిత్రోః పాదపీఠే సమర్పయే ॥ 15

శ్రీంబీజతత్త్వమధురా భూయాదానందదాయినీ
మయా వ్యాఖ్యాతతత్త్వేయం సంశోధిత కృతిశ్చిరమ్ ॥ 16

**– డా॥ అయాచితం నటేశ్వరశర్మా**

# కృతజ్ఞతావిష్కృతి

1988లో నేను ఎం.ఫిల్. పట్టాను స్వీకరించిన తరువాత, 1989లో నన్ను పి.హెచ్.డి. పరిశోధనకై ప్రోత్సహించి, శ్రీశంకరభగవత్పాదుల 'సౌందర్యలహరి' స్తోత్రమును పరిశోధనాంశముగ సూచించి, ప్రోత్సహించిన ఆనాటి సంస్కృతశాఖాధ్యక్షులు ఆచార్య ప్రమోదగణేశలాలే గారు,

నేను సౌందర్యలహరిపై పరిశోధనకు పూనుకొన్న సందర్భములో నాకు పరిశోధన పర్యవేక్షకురాలిగా వ్యవహరించి, తమవాత్సల్యసహకారాలను అందించిన ఆనాటి సంస్కృత శాఖాచార్య ఆచార్య కప్పగంతుల కమలగారు,

నేను పరిశోధనకోసం కృషిచేస్తున్న సమయములో నాకు నిత్యము ఎన్నోసలహాలను, సూచనలను అందించిన నా సహవ్రతులు, శతావధాని డా॥ అవధానం రంగనాథవాచస్పతిగారు,

పరిశోధనకు సంబంధించిన అధ్యయన సమయములో నాకు కలిగిన అనేక సందేహములను తీర్చి, దారి చూపినవారు సంస్కృతాంధ్ర విద్యా ప్రవీణులు, పూజ్యులు దోర్బల విశ్వనాథశర్మగారు,

శ్రీవిద్యాసంబంధమగు జటిలవిషయములను వివరించి, తోడ్పడిన చిత్కళ పుండరీక శర్మగారు ... ఈ మహనీయులకు కృతజ్ఞతాంజలి.

పరిశోధన సమయమున ప్రత్యక్షముగ, పరోక్షముగ నాకెందరో సహకరించిన. వారందరికీ నా కృతజ్ఞతలు.

పరిశోధన ఫలవంతమై 1994లో నాకు పి.హెచ్.డి. పట్టాతోబాటు, స్వర్ణపతకములభించి, నేటికి మూడుదశాబ్దములు గడచినవి. ఇప్పుడీ శోధన గ్రంథము ముద్రణకు నోచుకొని, పాఠకులకు అందుతున్నందుకు నా కృషి సార్థకమని భావింతును.

నా ఈ పరిశోధనగ్రంథమునకు ఆశీస్సులను అనుగ్రహించిన శృంగేరీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీభారతీతీర్థమహాస్వామివారికి, శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ స్వామివారికి మరియు కంచికామకోటిపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీవిజయేంద్రసరస్వతీ స్వామివారికి, పుష్పగిరిపీఠాధిపతులు విద్యా శంకరభారతీస్వామివారల చరణకమలములకు నా నమస్సుమాంజలులు. జగద్గురువుల ఆశీరనుగ్రహము లభించుట నా అదృష్టము.

ముద్రణకు సంబంధించి, డి.టి.పి.తోబాటు, పుస్తక రూపకల్పన చేసిన మా పూర్వవిద్యార్థి, అష్టావధాని డా॥ గణపతి అశోకశర్మకు శుభాశీస్సులు.

పుస్తక ముద్రణకు సహకరించిన 'దర్శనమ్' మరుమాముల వేంకట రమణశర్మ గారికి ధన్యవాదములు.

**– డా॥ అయాచితం నటేశ్వర శర్మ**

# సౌందర్యలహరీసౌందర్యము

## సంకేతపదసూచిక

| | |
|---|---|
| శ్రీ.ల.స.నా.స్తో. | శ్రీలలితాసహస్రనామస్తోత్రమ్ |
| శ్రీ.ల.స.నా.స్తో.భా. | శ్రీలలితాసహస్రనామస్తోత్రభాష్యమ్ |
| శ్రీ.వి.స.నా.భా. | శ్రీవిష్ణుసహస్రనామభాష్యమ్ |
| శ్రీ.శి.మ.స్తో. | శ్రీశివమహిమ్నఃస్తోత్రమ్ |
| శ్రీ.ల.త్రి. | శ్రీలలితాత్రిశతీ |
| శ్లో. | శ్లోకము |
| స. | సర్గము |
| సం.ప.దే.స్తో. | సంస్కృతేపంచదేవతాస్తోత్రాణి |
| సౌ.ల. | సౌందర్యలహరీ |
| సౌ.ల.ద.వ్యా. | సౌందర్యలహరీదశవ్యాఖ్యానాని |
| సౌ.వ.వ్యా. | సౌభాగ్యవర్ధనీవ్యాఖ్య |
| A.S.S.V | Andhra Sataka Sahitya Vikasam |
| S.L. | Saundaryalahari |
| S.S.B.J.C. | Sri Sankara Bhagavatpada Jeevana Charitam |
| V.S.S. | Vaidik Sahitya Aur Sanskrithi (Hindi) |

# ప్రథమతరంగము

## నివేదనము

అతిప్రాచీనమగు సంస్కృతసాహిత్యములో స్తోత్రములకుగల స్థానము విశిష్టమైనది. వివిధదేవతలను ఉద్దేశించి రచించిన స్తోత్రములు విరివిగా నున్నవి. అట్టివానిలో శక్తిమహిమను ప్రతిపాదించు 'సౌందర్యలహరి' అనర్ఘమగు స్తోత్రరత్నము. ఈస్తోత్రము భక్తిభావబంధురమే గాక, తంత్రయోగాది శాస్త్రాంశములకును, రసాలంకారాది కావ్యాంశములకును నిధానము. కవితా సౌందర్యదృష్టిచేతను అగ్రగణ్యము. శాక్తసంప్రదాయము లోను, సాధారణభక్త లోకమునందును నిత్యపారాయణరూపముగ ప్రశస్తినిపొందిన ఈస్తోత్రమును అధ్యయనమొనర్చుట ఐహికాముష్మికో భయఫలదాయకమని సాంప్రదాయికుల విశ్వాసము. ఈ అభిప్రాయమును హృదయమునందుంచుకొని, నేను 'సౌందర్య లహరి అధ్యయనము' అను అంశమును పరిశోధనకార్యమున స్వీకరించితిని.

శాక్తతంత్రములలో శ్రీవిద్యాతంత్రమును ప్రతిపాదించు సౌందర్య లహరిలో కుండలినీరూపిణియగు శక్తి వర్ణింపబడినది. ఆ శక్తి మానవ దేహము నందలి షట్చక్రముల భేదనమనెడు యోగముచే సాధ్యమగునని ఈస్తోత్రమున నిరూపింపబడినది. ఆమెయే ఈస్తోత్రమునకు ధ్యేయమని చెప్పబడినది. ఈ అభిప్రాయమును లక్ష్యముగా చేసికొని ఈ పరిశోధన గ్రంథము షట్చక్రముల సంకేతరూపములగు ఆరుప్రకరణములచే విభజింప బడినది. ఈ ప్రకరణముల చివర ఉపసంహారాత్మకముగ ఈపరిశోధన సారాంశభూతమగు పరమేశ్వరీతత్త్వ ప్రతిపాదనరూపముగ నొకవ్యాస భాగము నిబంధింపబడినది. షట్చక్రముల భేదనమువలన లభించునదియు,

ఈ పరిశోధనగ్రంథములోని వివిధ ప్రకరణములలో సమీక్షింపబడిన అంశములచేత తెలిసికొనదగినదియు అగు 'తత్త్వము' పరమేశ్వరీస్వరూపమే అనుట ఫలితార్థము.

ఈ పరిశోధనగ్రంథములో ప్రావేశిక విషయసమీక్షణాత్మకమగు ప్రథమ తరంగమున స్తోత్రసాహిత్య వికాసము ప్రాచీనకాలమునుండి సమీక్షింపబడినది. స్తోత్రసాహిత్యములో సౌందర్యలహరికి గల స్థానము విచారింపబడినది. సౌందర్యలహరీ కర్తృత్వ విషయమున వివిధవాద ప్రతివాదపూర్వకముగ విచారింపబడినది. కర్తృత్వవిషయమున ప్రామాణికములగు అంశములు లభింపకపోవుటచేత సంప్రదాయము యొక్కయు, లోకము యొక్కయు సరణిని అనుసరించి శ్రీశంకరాచార్య కర్తృకమను భావనతో, ఆచార్యుల జీవనచరిత్రము, కృతిసమీక్షణము, కాలనిర్ణయము మొదలగు విషయములు అవలోకింపబడినవి.

బాహ్యస్వరూపావలోకనాత్మకమగు ద్వితీయ తరంగమున సౌందర్యలహరిలో ప్రతిపాదింపబడిన విషయములు సంగ్రహముగ పరిశీలింపబడినవి. ఈస్తోత్రముయొక్క నామవిషయమున, కవిచే స్వీకరింపబడిన శిఖరిణీవృత్తవిషయమున ఔచిత్యము విచారింపబడినది. శ్లోకసంఖ్యావిషయములో వివిధమతములు ప్రదర్శింపబడినవి. 'నూరు శ్లోకములే' అను లక్ష్మీధరుని అభిప్రాయమునే సామంజస్యముగా విమర్శింపబడినది. ఈస్తోత్రమునకుగల రెండు విభాగముల విషయములో వివిధాంశములు పరిశీలింపబడినవి.

అంతస్తత్త్వానుశీలనాత్మకమగు తృతీయతరంగమున సౌందర్యలహరిలో ప్రతిపాదింపబడిన తంత్రయోగాద్యంశములు లక్ష్యలక్షణ సమన్వయపురస్సరముగ చూపబడినవి. తంత్రసాహిత్యవికాసము సమీక్షింపబడినది. తంత్రము లోని వైదికత్వావైదికత్వమును; వైవిధ్యమును

ప్రతిపాదింపబడినవి. ఈ స్తోత్రమున పేర్కొనబడిన సమయాచార స్వరూపమును తెలుసుకొనుటకు కౌలమిశ్రాద్యాచార భేదముల లక్షణములు ఉదాహరింపబడినవి. సౌందర్యలహరిలో ప్రతిపాదితము లైన కౌలాచార సిద్ధాంతములు సమీక్షింపబడినవి. సమయాచార లక్షణము పేర్కొనబడి, దాని వేదమూలకత ప్రతిపాదింపబడినది. సౌందర్య లహరిలో ప్రతిపాదింపబడిన సమయాచార స్వరూపములగు శ్రీవిద్యామూలబీజములు, మంత్రస్వరూపము, కాది–హాది–సాది–దౌర్వాసస్యాది విద్యలు షోడశీవిద్యా ప్రాధాన్యము, శ్రీవిద్యామూర్తి వర్ణనము, భగవతీసేవామహిమ, ఫలము మొదలగు అంశములు పరామర్శింపబడినవి. శ్లోకములలో ఉద్ధరింపబడిన సారస్వతాది ప్రయోగముల స్వరూపము పేర్కొనబడినది. శ్రీవిద్యా మంత్రములకును, శ్రీదేవికిని అభిన్నరూపమగు శ్రీచక్రము యొక్క ఉద్ధారము నిరూపింపబడినది. శ్రీచక్రలేఖన పద్ధతులు తెల్పబడినవి. సమయాచారము యొక్క ప్రధానవిషయములగు పంచవిధసామ్యము: వాని స్వరూపము – సౌందర్యలహరీ శ్లోక సమన్వయపురస్సరముగ చూపబడినవి. సాదాఖ్యకళా తత్త్వము చెప్పబడినది. తంత్రమార్గమున షట్చక్రములను పూజించు విధానము, వానిలో శివశక్తుల భావనము మొదలగు అంశములు పేర్కొనబడినవి. తాంత్రికుల యోగమునందు ప్రధానమైనదియు, శక్తిస్వరూపిణియు అగు 'కుండలిని' యొక్క స్వరూపము, ఆ శక్తి మేల్కొనుటయు, నిద్రించుటయు పేర్కొనబడినది. చివర సౌందర్యలహరిలో పేర్కొనబడిన తంత్రప్రధానములగు దేవీనామములు వివరింపబడినవి. తంత్రసాంకేతికపదములు వ్యాఖ్యానింపబడినవి.

కావ్యాంగవివేచనాత్మకమగు చతుర్థ తరంగమున ఈ స్తోత్రము కావ్య ప్రక్రియలలో 'శతక'మగునని నిరూపింపబడినది. మంగళాచరణ విశిష్టత చెప్పబడినది. రసవిషయమున భక్తిశృంగారములను పేర్కొని, 'భక్తి భావముగనే కాని రసము కా'దను ప్రాచీనాలంకారిక సిద్ధాతమును స్థాపించి,

భక్తిభావము లన్నియు శృంగారమున అంతర్భవించును గాన, ఈ స్తోత్రమున ప్రధానరసము శృంగారమనియు, అంగరసము శాంతమనియు ప్రతిపాదింపబడినది. శ్లోకములలో భాసిల్లు అలంకార సౌందర్యము ప్రదర్శింపబడినది. వర్ణనల విషయములో కవిప్రతిభ ఆవిష్కరింపబడినది. ధ్వని పేర్కొనబడినది. కవి సమయములు దర్శింపబడినవి. కవితాశైలి సమీక్షింపబడినది. సౌందర్యలహరిలో తంత్ర యోగాద్యంశములు కనబడుటచే ఇది 'శాస్త్ర కావ్య'మని స్థాపింపబడినది. కవుల శ్రేణిలో సౌందర్యలహరీ కర్త యొక్క స్థానమెట్టిదో లక్షణములననుసరించి నిరూపింప బడినది.

వ్యాఖ్యానాంశసమాలోనాత్మకమగు పంచమ తరంగములో సౌందర్య లహరి యొక్క వ్యాఖ్యానములు నిర్దేశింపబడినవి. వ్యాఖ్యాతల పరిచయము, వారి రచనా విధానము వివేచింపబడినది. వ్యాఖ్యానములలో ప్రతిబింబించిన తంత్రాలంకారికపాఠభేదాద్యంశములు పరామర్శింపబడినవి. 'ప్రతి శ్లోకములో ఒక రహస్యమంత్రార్థమును పేర్కొన్న' వ్యాఖ్యానము సమీక్షింప బడినది. ఆయా వ్యాఖ్యానములలోగల ఇతర వ్యాఖ్యాతల అభిప్రాయముల ఖండనమండనాదులు ప్రదర్శింపబడినవి. చివర లక్ష్మీధరవ్యాఖ్యానము యొక్క వైశిష్ట్యము సోదాహరణముగ పేర్కొనబడినది.

ప్రాభావికాంశ పరిశీలనాత్మకమగు షష్ఠతరంగములో సౌందర్యలహరి యొక్క వైదికత పరిశీలింపబడినది. అద్వైతతత్త్వమెట్లు ప్రతిబింబించెనో చూపబడినది. సౌందర్యలహరిపై శ్రీశివమహిమ్నః స్తోత్ర – శ్రీలలితా సహస్రనామ – శ్రీలలితా త్రిశతి – సుభగోదయాది ప్రాచీన స్తోత్రముల ప్రభావము దర్శింపబడినది. అనంతర స్తోత్రసాహిత్యముపై సౌందర్యలహరీ ప్రభావము సమీక్షింపబడినది. ఈ సందర్భమున మూకపంచశతి, జగన్నాథ పండితరాయల స్తోత్రలహరీపంచకము ఉదాహరింపబడినది. సమాజముపై సౌందర్యలహరి ప్రభావము

విచారింపబడినది. సౌందర్యలహరిలో ప్రతిబింబితములైన సామాజికాచార ములు, సంప్రదాయములు చూపబడినవి. చివర ఈ సిద్ధాంతవ్యాసము యొక్క ఉపసంహార రూపముగ 'నీరాజనము' సమర్పింపబడినది.

ఈ పరిశోధన వ్యాసము యొక్క ప్రారంభములో సంక్షిప్తపదములను వివరించు సూచిక ఈయబడినది. గ్రంథాంతములోని 'పరిశిష్ట' ప్రకరణములో ప్రామాణికమగు లక్ష్మీధరపాఠానుసారముగ సౌందర్యలహరీ శ్లోకములు ప్రదర్శింపబడినవి. సౌందర్యలహరీ శ్లోకములను గానముచేయు సంగీతసంప్రదాయము పేర్కొనబడినది. శ్లోకప్రయోగవిధానము జతచేయబడినది. శ్రీశంకరాచార్యుల కృతులుగా లోకమున ప్రచారములో నున్న గ్రంథముల పట్టికలు ప్రదర్శింపబడినవి. సౌందర్యలహరీశ్లోకముల అకారాది క్రమసూచికయు, పదసూచికయు నిబంధింపబడినది. చివర ఈ సిద్ధాంతవ్యాసరచనకు ఉపయోగింపబడిన వివిధగ్రంథముల పట్టిక అకారాదిక్రమమున భాషావిభాగ పూర్వకముగ ఈయబడినది.

ఈ సిద్ధాంతవ్యాసమున కంచికామకోటిపీఠము వారు ప్రచురించిన లక్ష్మీధరాది దిశవ్యాఖ్యాసమన్వితమగు 'సౌందర్యలహరి' ప్రామాణికముగ అనుసరింబడినది. తెలుగు భాషలో వెలువడిన వివిధ సంస్కరణలు పరిశీలింపబడినవి. Sir John wooruff గారి పీఠికలు చూడబడినవి.

## 2. స్తోత్రసాహిత్య వికాసము

ఈలోకమున మానవుల జీవనము కర్మోపాసన జ్ఞానమార్గములచో ఐహిక పురుషార్థత్రయమగు ధర్మార్థకామములయొక్కయు, పార్యన్తికపురుషార్థ మగు మోక్షముయొక్కయు ఫలరూపమ్మైయున్నది. ఈ చతుర్విధ పురుషార్థములను సాధించుటకై ప్రవృత్తములైన శ్రుతులు, స్మృతులు, ఇతిహాసములు, పురాణములు, శాస్త్రములు, దర్శనములు, కావ్యములు

మున్నగునవి భారతీయవాఙ్మయము యొక్కయు, సంస్కృతియొక్కయు ఔన్నత్యమును ప్రకాశింపజేయుచున్నవి.

కాని, శ్రుతులు అల్పజ్ఞులకు అగమ్యములై యున్నవి. స్మృతులు ఆయా ఆచారములననుసరించు వారికే సులభ సాధ్యములు. శాస్త్రములు శ్రమైక వేద్యములు. వేదాంతప్రస్థానభేదములు శాస్త్రసాపేక్షములు. పురాణములు విస్తృతములగుటచే బహుకాలవిజ్ఞేయములు. ఇట్టి దురవస్థలో అల్పజ్ఞులైనవారు వేనినాశ్రయించినచో అచిరకాలమున సులభముగ ఈ సంసారసాగరమును తరింపగలుగుదురనెడి సంశయమునకు అద్వితీయముగ మనకు లభించు సమాధానము – అట్టివి 'స్తోత్రములే' అని.

భారతీయ స్తోత్రవాఙ్మయము సనాతనము. అతి విస్తృతము. అనంతము. అనేకములగు భారతీయభాషలలో వెలుగొందుచున్న వేలకొలది స్తోత్రములు ఈ స్తోత్రవాఙ్మయమునకు గల బహిరంగజనాదరణను ప్రకటించుచున్నవి. విశేషించి, సంస్కృత వాఙ్మయమున స్తోత్రములకు విశిష్టస్థానము గలదను మాట అందరెరిగినదే.

స్తోత్రసాహిత్యముయొక్క మౌలికస్వరూపము వేదములందు లభ్యమగును. వేదములలో స్తోత్ర–ఋక్–స్తోమ–స్తోభ–మంత్రములనెడి పదములు స్తోత్రపర్యాయవాచకములుగానే కనబడును. ఈ విషయమున ప్రాచీనులు చెప్పిన స్తోత్రలక్షణములను పరిశీలింపవలసియున్నది.

'స్తు'ధాతువునకు లేదా 'ష్టుఞ్'ధాతువునకు 'ష్టన్' ప్రత్యయము చేరగా స్తోత్రశబ్దము నిష్పన్నమగునని తారానాథ తర్కవాచస్పతియు, రాధాకాంత దేవుడును తమతమ కోశములలో పేర్కొనిరి. ప్రగీతమంత్రసాధ్యమగు స్తుతియే సోత్రమని నిరుక్తములో యాస్కుడు చెప్పెను. ప్రగీత్యమనగా గానాత్మకత్వమే. వేదములలో రెండు విధములగు స్తుతులున్నవి. అవియే

– ప్రగీతాప్రగీతములు. ప్రగీతమంత్రసాధ్యములగు స్తుతులు స్తోత్రములనియు, అప్రగీతమంత్ర సాధ్యము లగు స్తుతులు శస్త్రములనియు యాస్కుడు నిరుక్తములో పేర్కొనుటచే గాన రహితములగు ఋక్కులు శస్త్రములనియు, గానసహితములగు సామములు స్తోత్రములనియు పిలువబడుచున్నవి. శ్రీమద్భాగవతమునందును ఈ విషయమే–

**ఋగ్యజుస్సామాథర్వాఖ్యాన్వేదాన్పూర్వాదిభిర్ముఖైః**
**శస్త్రమిజ్యాం స్తుతిస్తోమం ప్రాయశ్చిత్తం వ్యధాత్క్రమాత్'**

అని స్పష్టముగ పేర్కొనబడినది.

పై శ్లోకమున స్తోమశబ్దము ప్రయోగింపబడినది. స్తుతిస్తోమమనగా స్తుతికై ఉద్దేశింపబడిన ఋక్సముదాయమను అర్థమును బలదేవోపాధ్యాయుడు చెప్పుచున్నాడు. కాని స్తోమ శబ్దము స్తవమనార్థకమని నిరుక్తమునందును, అథర్వవేదసాయణభాష్యమునందును నిరూపింపబడినది. స్తుతియనగా గుణియందు అధికసామంజస్యమును కలిగియున్నది.

గుణకర్మాదులచే ప్రశంసించుటయే స్తోత్రమని అమరుడనెను. గుణకథనమే స్తోత్రమని వాచస్పతి పేర్కొనెను. గుణసంకీర్తనాత్మకమగు స్తవనసాధనమే స్తోత్రమని శ్రీశంకరభగవత్పాదుడనెను. స్తవనసాధనమే స్తోత్రమని హలాయుధుడు అభిప్రాయపడెను. భాస్కరరాయలు ప్రగీతమంత్రసాధ్యకగుణి నిష్ఠ గుణాభిధానము వైదికస్తోత్రమనియు, లౌకికమగు గుణానువాదము లౌకికస్తోత్రమనియు నుడివెను. శివమహిమ్నస్తోత్రవ్యాఖ్యాత అగు మధుసూదనాచార్యుడుగూడ గుణినిష్ఠగుణాభిధానమే స్తోత్రమనెను. గుణములకే ప్రాధాన్యమునిచ్చి చెప్పునది స్తోత్రమని ఋగ్వేదభాష్యము వక్కాణించుచున్నది.

ఇన్ని లక్షణములను పరిశీలించిన తరువాత వేదమునగాని, లోక వ్యవహారమునగాని గుణినిష్ఠగుణవర్ణనమే స్తోత్రమను పేరుతో పిలువబడు చున్నదను మాట నిశ్చమయమని తేలుచున్నది.

'స్తోత్రము' అనుపదమునకు సమానార్థకములగు సూక్త–ఋక్–స్తోమ శబ్దములు వేదములలో అవిరళముగ ప్రయోగింపబడినవి. 'సు'అను ఉపసర్గతో కూడిన 'వచ' ధాతువునకు 'క్త' ప్రత్యయము చేరగా సూక్తశబ్దము నిష్పన్నమగునని వాచస్పతి పలికెను. సుందరముగా చెప్పుట, విశిష్టమగు ఏకార్థమును ప్రతిపాదించు ఏకదైవత్యవేదమంత్రసముదాయము, చక్కగా పలుకుట అను అర్థములలో సూక్తశబ్దము ప్రయోగింపబడుచున్నదని ఆతడు పేర్కొనెను.

'ఋచ్యతే స్తూయతే అనయా' (దేనిచే స్తవింపబడునో అది స్తుతి) అను వ్యుత్పత్తిచే 'ఋచ్' ధాతువునకు కరణమున 'క్విప్' ప్రత్యయమురాగా నిష్పన్నమగు 'ఋక్' అనుపదము స్తవనము, స్తుతి, పూజ అను అర్థములను చెప్పునని వాచస్పతి నుడివెను. కాని ఈ అర్థమునకు భిన్నముగ జైమిని – ఎచట అర్థవశముతో పాదములుండునో అది ఋక్కు అని చెప్పెను.

స్తోమ శబ్దము స్తవనార్థకమని నిరుక్తములోను, అథర్వవేదసాయణ భాష్యములోను కలదు. కాని భవభూతి సమూహార్థమున స్తోమశబ్దమును ప్రయోగించెను.

'మన' ధాతువునకు సత్కారమనెడి అర్థమున్నందువలన మంత్రశబ్దము కూడ స్తుతిసమానార్థకమే అని సురేంద్రనారాయణ త్రిపాఠి పలికెనుగాని, మంత్రశబ్దము స్తుతి అనెడి అర్థమున రూఢము కానందువలనను, మననత్వమే మంత్రత్వమని నిరుక్తములో యాస్కుడు పేర్కొనుటవలనను మంత్రశబ్దమునకు స్తుతి అనెడి అర్థము సమంజసము గాదని తెలియవలెను.

ఇట్లు వేదములలో ప్రగీతమంత్ర సాధ్యమగునదియే స్తోత్రమని చెప్పబడుటచే సామములకే స్తోత్రత్వము సిద్ధమగుచున్నది. వేదములలో సామవేదమును నేనే అనుచు – 'వేదానాం సామవేదోఽస్మి అని గీతలో

కృష్ణుడు పలుకుటవలనను, 'గుణసంకీర్తనాత్మకుడైన ఆ హరియే స్తుతియు, స్తవన క్రియయు, స్తోతయునై యున్నాడు' అనెడి శ్రీశంకరభగవత్పాదుల వచనము ననుసరించియు ఈ విషయము స్పష్టమగును.

స్తోత్రముల వైవిధ్యమును గూర్చి సంస్కృతవాఙ్మయములో అచ్చటచ్చట పేర్కొనబడినది. మత్స్యపురాణములో స్తోత్రములు ద్రవ్యాద్యు పాధిభేదముల ననుసరించి చతుర్విధములని ఇట్లు చెప్పబడినది–

**'ద్రవ్యస్తోత్రం కర్మస్తోత్రం విధిస్తోత్రం తథైవచ**
**తథైవాభిజనస్తోత్రం స్తోత్రమేతచ్చతుర్విధమ్'**

నిరుక్తము యొక్క దుర్గాదాసీయ వ్యాఖ్యలో స్తుతులు నామ–రూప–కర్మ–బంధువులనెడి నాలుగు విధములుగ నున్నవని చెప్పబడినది. శ్రీలలితా సహస్రనామభాష్యమున భాస్కరరాయలు స్తోత్రములు షడ్విధములను అభియుక్తోక్తిని ఇట్లు ప్రతిపాదించెను –

**'నమస్కారస్తథాశీశ్చ సిద్ధాన్తోక్తిః పరాక్రమః**
**విభూతిః ప్రార్థనా చేతి షడ్విధం స్తోత్రలక్షణమ్'**

'బృహద్దేవత'అను గ్రంథములో చతుర్విధస్తోత్రములిట్లు పేర్కొనబడినవి.

**'స్తుతిస్తు నామ్నా రూపేణ కర్మణా బాంధవేనచ**
**స్వర్గార్థధనపుత్రాద్యైరర్థై రాశీస్తు కథ్యతే'**

'ఋక్'అను శబ్దము స్తోత్రపర్యాయవాచకమని పూర్వమే చెప్పబడినది. అట్టి ఋక్కులు త్రివిధములని నిరుక్తమిట్లు చెప్పినది –

"ఇమాశ్చ ఋక్పదభాజః పరోక్షకృతాః ప్రత్యక్షకృతాః ఆధ్యాత్మిక్యశ్చ. తత్ర పరోక్షకృతాః సర్వైః నామభిః నామవిభక్తిభిః యుజ్యతే. పరోక్ష కృతాయాః ఉదాహరణమ్ – ప్రథమపురుషైశ్చాఖ్యాయతే – ఇంద్రో దివః, ఇంద్ర ఈశో

పృథివ్యాః ఇతి. ప్రత్యక్ష కృతాశ్చ మధ్యమపురుషేణాఖ్యాయన్తే – త్వమితి సర్వనామ్నా నిర్దేశః. యథా – త్వమింద్రబలాదధిమ్ ఇతి ఆధ్యాత్మిక్యశ్చ – ఉత్తమపురుష యోగా అహమితి సర్మనామ్నాచ నిర్దేశః భవతి – అహం భువ వసునః పూర్వస్య పితరహం ఇతి”

స్తోత్రములు వైదికములనియు, అవైదికములనియు ద్వివిధములు. వైదికములలోను దేవతాభేదముచేతను, శ్లోకసంఖ్యాభేదము చేతను వైవిధ్యము కనిపించును.

ఈవిధముగ స్తోత్రములు నామ – కర్మ – రూప– బంధు – నమస్కార– ఆశీః – సిద్ధాన్తోక్తి – పరాక్రమ – విభూతి – ప్రార్థన – ద్రవ్య – విధ్యాది భేదములతో అనేక విధములుగ నున్నవి.

స్తుతదేవతల అనుగ్రహరూపములగు ఐహికాముష్మికఫలములు స్తోతలకు, స్తోత్రపాఠకులకు లభించుటయే స్తోత్రముల పరమప్రయోజనము. లోకమున మానవులు తమ అభీప్సితములను సఫలమొనర్చుకొనుటకై తమ ఇష్టదేవతలపై స్తోత్రములను రచించుచుందురు. రచించినవానిని చదువు చుందురు. ఇతరులు చదువగా వినుచుందురు. ఈ స్తోత్రముల వలననే సగుణములు, నిర్గుణములు అగు ఉపాసనముల ప్రాముఖ్యము తెలియుచున్నది. భక్తియొక్క ప్రాధాన్యము ప్రకటితమగు చున్నది. స్తోత్రములు భక్తిమూలములు. భక్తి ఉపాసనామూలము. ఉపాసనచేతనే మానవుడు మోక్షపదమును పొందగలడు. అందువలన స్తోత్రము ఉపాసనయొక్క గొప్పతనమును ప్రకటించుచు మానవునికి పార్యన్తికఫలమగు మోక్షము నందించగలదనుట యథార్థము.

స్తోత్రవాఙ్మయమతి విస్తృతము. వేదములలోను, పురాణములలోను, కావ్యములలోను, తదితర ప్రక్రియలలోను వేలకొలదిగ స్తోత్రములున్నవి. సురేంద్రనారాయణ త్రిపాఠీ అభిప్రాయముననుసరించి సంస్కృతస్తోత్ర

వాఙ్మయము త్రివిధము. అవి, ఒకటి- వైదిక, పురాణ, రామాయణ, మహాభారత గ్రంథములలో కనబడుచున్నవి. రెండు- ఆయా సంప్రదాయ ప్రవర్తకులు, తదనుసారులు స్వతంత్రముగ అల్లినవి. మూడు- కావ్యాంతర్గతములు.

స్తోత్రవాఙ్మయమునకు మూలము వేదవే అని పూర్వవే చెప్పబడినది. 'ఋచ్యతే స్తూయతే అనయా' అను వ్యుత్పత్తి ననుసరించి ఋగ్వేదము మొట్టమొదటి స్తోత్రమగును. ఋగ్వేదమున స్తోత్రము సూక్తమను పేరుతో వ్యవహిరింపబడినది. ఋగ్వేదమునందలి దశమండల ములలో 1017 సూక్తములున్నవి. ఈ వేదములోని ఖిలసూక్తములైన వాలఖిల్యసూక్తములు 11 ఉన్నవి. ఋగ్వేదము ధార్మికస్తోత్రములకు నెలవు. అగ్ని, ఇంద్రుడు, సవితృ, పూషా, మిత్ర, విష్ణు, రుద్ర, మరుత్, పర్జన్యాదుల స్తుతులు వేదములో నున్నవి. దశమమండలములో అనేక ధార్శనిక సూక్తములున్నవి. అట్టి సూక్తములలో నాసదీయ, పురుషసూక్తములంతర్భ వించును. పురుషసూక్తములో సర్వేశ్వరవాదము ప్రతిపాదింపబడినది. సంవాదసూక్తములలో ప్రశ్నోత్తర రూపమున దార్శనికాంశములు ప్రస్తావింప బడినవి. ఇటి దార్శనిక సూక్తములు ఋగ్వేదమున ఇరువది వరకున్నవి. లౌకిక విషయ పరములగు సూక్తములలో సపత్నఘ్న - మన ఆవర్తనాది సూక్తములంతర్గములై యున్నవి. దార్శనిక సూక్తములలో హిరణ్యగర్భ- వాక్సూక్తములు గంభీరములు. శ్రద్ధా సూక్తములో శ్రద్ధలేని కర్మల నిష్ఫలత్వము చెప్పబడినది.

యజుర్వేదములో యజ్ఞయాగాది విషయములకే ప్రాధాన్యమున్నను, శతరుద్రీయములోని రుద్రస్తుతి విఖ్యాతము. యజుర్వేదమున కూడ పురుషసూక్త - హిరణ్యగర్భసూక్తములున్నవి.

ప్రగీతమంత్రసాధ్యములగు స్తుతులే ప్రధానముగాగల సామ వేదములోను అనేకస్తోత్రములున్నవి. దాదాపుగ ఋగ్వేదములోని సూక్తము

లన్నియు ఇచట కనబడును. సామవేదమునకు ఋగ్వేదమంత్రములే ఆధారములు. ఈవిషయమునే- 'ఋచి అధ్యూఢం సామ' అని ఛాందోగ్యోపనిషత్తు చెప్పుచున్నది.

'స్తోభః' అను పదము సామవేదములో స్తుతికి ప్రకారాంతరముగ చెప్పబడినది. యాగాదులలో స్తోభశబ్దము ప్రయుక్తము. ప్రస్తావోద్గీథ ప్రతీహారోపద్రవనిధానాత్మకమగు సామముయొక్క త్రివారగానవమే స్తోభమనబడును. ఈ స్తోభమే త్రివృత్ - పంచదశ - సప్తదశ - ఏకవింశ - త్రిణవ - త్రయస్త్రింశ - చతుర్వింశ - చతుశ్చత్వారింశ - అష్టచత్వారింశ భేదములతో తొమ్మిదివిధములు. ఇట్టి ఆవృత్తులతో కలుగు గానపద్ధతియే 'విష్టుతిః' (విశేషస్తుతి) అని పిలువబడును.

అథర్వవేదములో అనేకసూక్తములున్నవి. భైషజ్యసూక్తములు రుజాగ్రస్తులైనవారిని రోగములనుండి ఉపశమింపజేయు విధములను సూచించుచున్నవి. ఆయుష్యసూక్తములు దీర్ఘాయుష్కాముల ప్రార్థనలను వర్ణించుచున్నవి. పౌష్టికసూక్తములు దేవతలనుండి మానవకోటికి ఆశీర్వచనములను కోరుచున్నవి. వృష్టిసూక్తములో వర్షముయొక్క మహిమవర్ణితము. ఇంకను వివిధజ్ఞాతాజ్ఞాతదోషములకు ప్రాయశ్చిత్త విధానములను తెలుపుసూక్తము లెన్నోయున్నవి. దుందుభిసూక్తములో శత్రువులకు హానికలిగించునవియు, మోహమును కలిగించునవియు అగు మంత్రములున్నవి. పృథ్వీసూక్తములో మాతృరూపిణియగు భూమియొక్క మహిమ ప్రకటింపబడినది. 'మాతా భూమిః పుత్రోఽహం పృథివ్యాః' అను మంత్రములోని మాతృభూమివర్ణనము దేశభక్తి జనకము. పృథివియొక్క సర్వాంగీణమగు స్వరూపము ఈ సూక్తములో వర్ణింపబడి ఉన్నది. బ్రహ్మణ్యసూక్తములు ఆముష్మిక విషయ ప్రతిపాదకములు. గోమహిమను తెలుపు సూక్తములు కూడ కొన్ని కనబడును.

లౌకిక సాహిత్యమున స్తోత్రలక్షణమును ఆలంకారికులు స్పష్టముగ చెప్పలేదు. స్తోత్రమనగా సర్గబంధాదులులేని అనిబద్ధ కావ్యమనుకొన్నచో, ఇట్టి లక్షణమును తొలుత పేర్కొనిన ఆలంకారికుడు భామహుడు. క్రీ.శ. 6వ శతాబ్దికి చెందిన ఇతడు సర్గబంధాదులు లేని కావ్యమును అనిబద్ధకావ్యమని పేర్కొనెను. క్రీ.శ. 8వ శతాబ్దికి చెందిన వామనుడు, క్రీ.శ. 12వ శతాబ్దికి చెందిన హేమచంద్రుడు భామహుని అనుసరించిరి.

క్రీ.శ. 9వ శతాబ్దికి చెందిన అగ్నిపురాణములో 'ముక్తకం శ్లోక ఏకైక శ్చమత్కార క్షమస్సతామ్' అనిచెప్పబడుటచే ముక్తకము మరొకటియే అగును.

క్రీ.శ. 14వ శతాబ్దివాడైన విద్యానాథుడు అసర్గబంధకావ్యము లన్నియు ఉపకావ్యములగునని చెప్పెను. ప్రతాపరుద్రయశోభూషణమునకు వ్యాఖ్యానమును రచించిన కుమారస్వామి సోమపీథి అసర్గబంధ కావ్యమునకు ఉదాహరణముగ సూర్యశతకాదులను పేర్కొనెను.

క్రీ.శ. 13వ శతాబ్దిలో రచింపబడిన అలంకార సంగ్రహమున తత్కర్తయగు అమృతానందయోగి సంఖ్యామూలకములైన పద్యకావ్య భేదములను ప్రతిపాదించెను. వానిలో ఏక - ద్వి - త్రి - పంచ - అష్ట - షోడశ - సప్త వింశతి - త్రింశతి - పంచాశత్ - శత - అష్టోత్తరశత పద్యసంఖ్యాత్మకములైన కావ్యములనిట్లు పేర్కొనెను. -

**'ముక్తకం పద్యమేకం స్యాత్ ద్వికం పద్యద్వయం మతమ్**
**త్రికం త్రయేణ పద్యానాం పంచరత్నాని పంచకమ్**
**అష్టకం గజమాలా స్యాత్ షోడశేందుకలా మతా**
**సప్తవింశతి పద్యాని నామ్నా తారావలీ మతా**
**త్రింశతా త్రింశికా పంచాశతా పంచాశికేష్యతే**
**శతేన శతకం ప్రోక్తమష్టోత్తరశతం పరమ్**

ఈ ప్రమాణములచే స్తోత్రము అనిబద్ధ - ఉపకావ్య - సంఖ్యా మూలక కావ్యముగ వ్యవహరింపబడెననుట స్పష్టము.

లౌకిక సాహిత్యమునందు పురాణములలో వివిధ దేవతల స్తోత్రము లనేకముగ నున్నవి. స్తోత్రసాహిత్యముయొక్క విశ్వరూపము పురాణములలో చూడనగును. సంగ్రహముగ కొన్ని పౌరాణిక స్తోత్రములను మాత్రమిచట ఉదాహరింతును.

**శివస్తోత్రములు :-**

సౌర - బ్రహ్మ - బ్రహ్మవైవర్త - లింగ - శైవ - మత్స్య - హరివంశ పురాణములలోని శివస్తోత్రములు, లింగ - నారదపురాణము లలోని మహేశ్వర స్తోత్రములు, లింగపురాణములోని రుద్రసహస్రనామ స్తోత్రము, శివ పురాణములోని ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రము, బ్రహ్మవైవర్త - స్కాందపురాణములలోని శివకవచ స్తోత్రములు, వాయు - లింగ - సౌర - శివపురాణములలోని శివసహస్రనామస్తోత్రములు, వాయు పురాణములోని శార్వస్తవము, లింగపురాణములోని శివనామాష్టకము, శివపురాణములోని శివ మహాస్తోత్రము, లింగపురాణములో శివస్తవరాజము మొదలగునవి ప్రసిద్ధములు.

**విష్ణుస్తోత్రములు :-**

బ్రహ్మపురాణములో కృష్ణకవచము, బ్రహ్మవైవర్తపురాణములోని విష్ణు కవచము, కృష్ణస్తోత్రరాజము, వరాహపురాణములోని పుండరీకాక్షస్తోత్రము, విష్ణుపురాణములోని వరాహస్తోత్రము, గరుడపురాణములోని విష్ణుపంజర స్తోత్రము, విష్ణుసహస్రనామస్తోత్రము, బ్రహ్మవైవర్తపురాణములోని శ్రీకృష్ణస్తోత్రము మొదలైనవి ప్రసిద్ధములు.

**శక్తిస్తోత్రములు :-**

శివ - మార్కండేయపురాణములలోని దేవీస్తోత్రములు, సౌర -

బ్రహ్మ వైవర్త - వరాహ - బ్రహ్మపురాణములలోని దుర్గాస్తోత్రములు, బ్రహ్మవైవర్త - విష్ణుపురాణములలోని లక్ష్మీస్తోత్రము, హరివంశములోని ఆర్యాస్తవము, బ్రహ్మ వైవర్తపురాణములోని దుర్గాకవచము, వరాహపురాణము లోని దుర్గాకవచము, బ్రహ్మవైవర్తపురాణములోని దుర్గాస్తవరాజము, సర్వమంగళాస్తోత్రము, కూర్మపురాణములో దేవీ సహస్రనామస్తోత్రము, మత్స్యపురాణములో దేవ్యష్టోత్తర శతనామస్తోత్రము, బ్రహ్మవైవర్త పురాణములో పార్వతీస్తోత్రము, మార్కండేయపురాణములో నారాయణీ స్తోత్రము, పద్మపురాణములో క్షేమకరీ, కోటరాక్షీస్తోత్రములు, స్కాంద పురాణములో కళంకేశ్వరీస్తోత్రము, బ్రహ్మాండ పురాణములో శ్రీలలితాసహస్రనామస్తోత్రము, శ్రీలలితాత్రిశతి ఇత్యాదులు ప్రసిద్ధములు.

**గణేశస్తోత్రములు :-**

వరాహ, బ్రహ్మ, బ్రహ్మవైవర్తపురాణములలో గణేశస్తోత్రములు; భవిష్య, గణేశపురాణములలో గణేశస్తవరాజములు; నారద, గారుడ, పద్మపురాణములలో సంకష్టహరణగణేశస్తోత్రములు; స్కాందపురాణములో ఋణహరణగణపతి స్తోత్రము; పద్మపురాణములో గణేశసహస్రనాములు; గణేశపురాణములో గణేశకవచము; గరుడపురాణములో గణేశపూజా స్తోత్రము; పద్మపురాణములో గణేశాష్టకము; స్కాందపురాణములో డుంఢిస్తోత్రము; పద్మపురాణములో గణేశాష్టోత్తర దివ్యనామస్తోత్రములు ముఖ్యములు.

**ఆదిత్యస్తోత్రములు :-**

మార్కండేయ, బ్రహ్మపురాణములలో ఆదిత్యస్తోత్రములు; భవిష్య, సాంబ, బ్రహ్మవైవర్త, భవిష్యపురాణములలో సూర్యస్తోత్రములు; కూర్మ, భవిష్యోత్తరపురాణములలో ఆదిత్యహృదయములు; సాంబ, భవిష్య పురాణములలో సూర్యస్తవరాజములు; మార్కండేయపురాణములో

దివాకరస్తోత్రము, భానుస్తోత్రములు; సాంబపురాణములో బ్రహ్మభాషిత స్తవము, విష్ణుపురాణములో సవితృస్తోత్రము; బ్రహ్మవైవర్తపురాణములో సూర్యకవచము; బ్రహ్మపురాణములో సూర్యనామాష్టోత్తరశతము; భవిష్యపురాణములో సూర్య సహస్రనామస్తోత్రము ప్రముఖములు. ఇంకను ఇతరదేవతాస్తుతులు పురాణములలో అవిరళములు.

దేవీభాగవతములోని తృతీయస్కంధములో నృసింహస్తోత్రము, చతుర్థ స్కంధములో శక్తిస్తవము, దేవీస్తవములు, పంచమస్కంధములో దేవీస్తోత్రము, మహాదేవీస్తోత్రము, షష్ఠమస్కంధములో దేవీస్తుతి, గాయత్రీసహస్రనామ స్తోత్రము, దశమస్కంధములో మహావిష్ణుస్తోత్రము, ద్వాదశస్కంధములో జగన్మాతృకవచము, గాయత్రీస్తోత్రము, గాయత్రీ నామసహస్రములు ప్రసిద్ధములు.

వాల్మీకిరామాయణములో ఆదిత్యహృదయము, అహల్యాకృతరామ స్తవములు ప్రముఖములు. మహాభారతములోని వనపర్వమునందు సూర్యాష్టోత్తరశతనామస్తోత్రము, విరాటపర్వములో దుర్గాస్తుతి, ప్రజాగర పర్వములో సనత్సుజాతీయము, దుర్గాస్తోత్రము; భీష్మపర్వములో భగవద్గీత, ద్రోణపర్వములో వ్యాసకృతకృష్ణస్తుతి, శతరుద్రీయము; శాంతిపర్వములో యుధిష్ఠిరకృతకృష్ణస్తుతి, విష్ణుశతనామస్తోత్రము, భీష్మకృతవిష్ణుస్తుతి, శ్వేతద్వీప నారాయణస్తుతి, తండికృతశివసహస్రనామస్తోత్రము, భీష్మకృత శ్రీకృష్ణస్తోత్రము, దక్షకృతశివసహస్రనామస్తోత్రము, నారదకృతశ్వేతద్వీప భగవత్ స్తుతి; ఆనుశాసనిక పర్వములో శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రము, తండికృత శివస్తుతి, ఉపమన్యుకృత శివసహస్రనామస్తోత్రములు ప్రసిద్ధములు. వీనిలో భగవద్గీత, సనత్సుజాతీయము, విష్ణుసహస్రనామ స్తోత్రములకు ఆదిశంకరాచార్యుల వ్యాఖ్యానములున్నవి.

శ్రీమద్భాగవతములోని ప్రథమస్కంధములో భీష్మకృతకృష్ణస్తుతి, తృతీయస్కంధములో బ్రహ్మాదికృతయజ్ఞవరాహమూర్తిస్తుతి, బ్రహ్మకృత

కపిలావతారస్తుతి, చతుర్థస్కంధమున బ్రహ్మాదికృతదక్షిణామూర్తిస్తుతి, దక్షాది కృతశ్రీమన్నారాయణస్తుతి, ధృవకృతభగవత్స్తుతి, షష్ఠస్కంధములో దక్షకృత హంసగుహ్యాఖ్యస్తోత్రము, సప్తమస్కంధములో బ్రహ్మాదికృతశ్రీనృసింహ స్తవము, ప్రహ్లాదకృతనృసింహస్తుతి, దశమస్కంధములో బ్రహ్మాదికృత బ్రహ్మాదికృత శ్రీకృష్ణస్తుతులు, దేవక్యాదికృతభగవత్స్తుతులు ప్రధానములు.

ఇట్లే శైవశాక్తాదితంత్రములలోను స్తోత్రములసంఖ్య అధికముగ కనబడును. కావ్యగతములైన స్తోత్రములకు ప్రత్యేకప్రతిపత్తి లేకపోవుటచే వానిని పేర్కొనుటలేదు. ఇవిగాక, ప్రస్థానభేదములచేత ఆయా మతముల ననుసరించి, తత్తదాచార్యులు ప్రవచించిన స్తోత్రములు బహుళముగనున్నవి.

బౌద్ధ, జైనవాఙ్మయములలోను స్తోత్రములు కనబడును. జైనస్తోత్రములలో మానతుంగాచార్యుని భక్తామరస్తోత్రము, సిద్ధసేనుని కళ్యాణ మందిరాస్తోత్రము, వాదిరాజకృతమగు ఏకీభావస్తోత్రము, జంబూ గురుకృత జినశతకము, సోమప్రభాచార్యుని సూక్తిముక్తావళి, హేమచంద్రుని అన్యయోగ వ్యవచ్ఛేదిక ప్రముఖములు. బౌద్ధస్తోత్రములలో ఆచార్య నాగార్జునుడు రచించిన నాలుగుస్తోత్రముల సంకలనమగు 'చతుఃస్తవము' ప్రశస్తము. అట్లే నిరాపమ్య స్తవము, అచింత్యస్తవము, బోధిసత్త్వ స్తోత్రములు మరికొన్ని.

మహాకవి కాళిదాసుని శ్యామలాదండకము, అశ్వఘోషుని జ్ఞానదీస్తోత్ర గాథ, మాతృచేటుని చతుశ్శతకము, అర్ధశతకము, సిద్ధసేన దివాకరుని కల్యాణ మందార స్తోత్రము, భట్టబాణుని చండీశతకము, మయూరుని సూర్యశతకము, మూకుని పంచశతి, పుష్పదంతాచార్యుని శివమహిమ్నస్తోత్రము, ఆదిశంకరుల స్తోత్రములు, కులశేఖరుని ముకుందమాల, యామునాచార్యుని చతుఃశ్లోకి, రామానుజాచార్యుని గద్యత్రయము, శ్రీవత్సాంకుని శ్రీస్తవాది స్తోత్ర పంచకము, వేదాంతదేశికుని పాదుకాసహస్రము, గరుడగంకము, రఘువీరగద్య, అచ్యుత శతకాదులగు

ముప్పదికిపైగా స్తోత్రములు, అప్పయ్యదీక్షితుని శ్రీకృష్ణ లీలాస్తవము, వరదరాజస్తవము, నారాయణభట్టు నారాయణీయము, జీవగోస్వామి స్తోత్రములు, మధుసూదనసరస్వతి ఆనందమందాకినీస్తోత్రము, రూపగోస్వామి గంధర్వప్రార్థనాష్టకము, జగన్నాథపండితరాయల పంచ లహరులు, నీలకంఠదీక్షితుని శివలీలార్ణవము, వేంకటాధ్వరికృత లక్ష్మీసహస్రము, వేదాంతదేశికుల శ్రీస్తుతి, వసిష్ఠగణపతిముని ఉమాసహస్రము, జగద్ధరుని ముప్పది ఎనిమిది స్తోత్రముల కుసుమాంజలి మొదలైనవి సంస్కృత స్తోత్ర సాహిత్యములో విశిష్టస్థానమున లంకరించుచున్నవి.

నేటికిని ఎందరో కవులు తమతమ ఆరాధ్యదేవతలపై స్తోత్రములను రచించుచుండుట సంస్కృతస్తోత్రసాహిత్య వికాసమును సూచించుచున్నది. ఈ పరంపర ఇట్లే కొనసాగుట ఆస్తికలోకమునకు ప్రమోదావహము.

## 3. స్తోత్ర సాహిత్యము – సౌందర్యలహరి

లౌకికస్తోత్రసాహిత్యమున శివ, విష్ణు శక్త్యాది దేవతా భేదములతో ఆయా దేవతల స్తోత్రములు విరాజిల్లుచున్నవని పూర్వమే పేర్కొనబడినది. విశేషించి శక్తిస్తోత్రములలో సుభగోదయము, శ్యామలాదండకము, మూకపంచశతి, లక్ష్మీసహస్రము, అన్నపూర్ణాస్తోత్రము, ఆనందలహరి, కనకధారాస్తవము, కల్యాణవృష్టిస్తవము, దేవీచతుఃషష్ట్యుపచారస్తోత్రము, దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రము, మీనాక్షీపంచరత్నము, శ్రీలలితా పంచరత్నము, సౌందర్యలహరి ఇత్యాదులు ప్రసిద్ధములు.

వీనిలో 'సౌందర్యలహరి' అనర్ఘమగు స్తోత్రరత్నము. అలంకారశాస్త్ర దృష్టిచేతను, కావ్యశిల్పదృష్టిచేతను రమణీయమగు ఈస్తుతి తంత్ర యోగాద్యంశములను కూడ ప్రతిపాదించుచున్నదై శక్తిని ఉపాసించువారికి

శిరోరత్నమై అలరారుచున్నది. ఉపాసనామార్గములోని భక్తివిశిష్టతను కూడ ఈ స్తోత్రము ప్రకటించుచున్నది.

శాక్తతంత్రములలోని శ్రీవిద్యాసంప్రదాయమునకు పరమ ప్రమాణమగు ఈస్తోత్రములో శ్రీచక్రోద్ధారము, షట్చక్రనిరూపణము, కుండలినీశక్తి, సమయాచారము మొదలైన అంశములు శిఖరిణీవృత్తబద్ధము లగు శ్లోకములలో ప్రతిపాదింపబడినవి. శాక్త సంప్రదాయజ్ఞులు నిత్యపారాయణముచేయు ఈ స్తోత్రములోని ఒక్కొక్కశ్లోకమునకు ఒక్కొక్కఫలము చెప్పబడినది. ఈ స్తోత్రశైలి లలితమనోహరముగ నుండును.

ఈస్తోత్రము కేవలము శాక్తలోకమునకే గాక, సకల భక్తులకు హృదయాహ్లాదకరమై స్తోత్రసాహిత్యమున విశిష్టస్థానమునలంకరించుచున్నది.

## 4. సౌందర్యలహరీ కర్తృత్వ విచారము

అలౌకికాద్భుతమగు కవితాసౌందర్యముగల ఈ స్తోత్రముయొక్క కర్తృత్వ విషయమునగూడ కొన్ని పారంపరికములగు గాథలుగలవు. అట్టివానిలో పరమేశ్వర కర్తృకమనునది యొకటి. శ్రీశంకరులు కైలాసమునకేగి నపుడు పరమేశ్వరుడు లోకానుగ్రహేచ్ఛచే శంకరులకు సౌందర్యలహరీస్తవమును, అయిదు స్ఫటిక లింగములను ప్రసాదించెనట. సర్వపరుషార్థసాధకమగు ఈ స్తోత్రము మందాధికారులగు మానవులకు లభింపగూడదను అభిప్రాయముతో నందికేశ్వరుడు ఈ స్తోత్రమును శంకరుని నుండి లాగుకొనిరట. ఆ పెనుగులాటలో శంకరాచార్యులకు 41 శ్లోకములు మాత్రమే దక్కెనట. మిగిలిన 59 శ్లోకములను శ్రీశంకరులే పూరించిరని ఒక ఐతిహ్యము.

ఈ శ్లోకములను మేరుపర్వతముపై పుష్పదంతుడను యక్షుడు

చెప్పగా శ్రీగౌడపాదులు వానిని ధారణచేసి, శంకరులకిచ్చిరని యొక గాథ. శ్రీగణేశ్వరుడే ఈ శ్లోకములను చెప్పిరని మరియొక సంప్రదాయము.

ద్రవిడశిశువను పేరుగల యొక్క సిద్ధుడీ శ్లోకములను రచించి కైలాస గిరిపై చెక్కించెననియు, శంకరుడు కైలాసముకేగినపుడు వీనిని చదువుచుండగా పరమేశ్వరి యాజ్ఞచే ఆ సిద్ధుడు ఈ వ్రాతలను చెరిపివేయగా ఆలోపున శంకరాచార్యులవారు 41శ్లోకములను మాత్రమే చదివి, ధారణచేసి, తక్కిన శ్లోకములను పూరించిరని యొకగాథ. దీనిని కంతియూరు మహదేవశాస్త్రిగారు మళయాళమున ప్రకటించిన సౌందర్యలహరిలో పేర్కొనిరి.

'సుధావిద్యోతిని' అనునొక అముద్రితవ్యాఖ్య ఈ గ్రంథకర్తృత్వమును గూర్చి వేరొకగాథను పేర్కొన్నది. – ద్రావిడదేశమును పాలించు ద్రవిడుడనురాజునకు కుమారుడు జన్మింపగా, అతని జననకాలదోషముచే రాజవంశమునకాపత్తి కలుగునని పండితులు చెప్పగా, రాజు ఆ కుమారుని అరణ్యములో విడిచెనట. ఒకపులి యాబాలుని తనగుహకు తీసికొని పోయెనట. ఆబాలుడు ఆకలిగొని పూర్వజన్మ సంస్కారముచే పరమేశ్వరుని స్తుతింపగా, దేవి దయతో అతనికి స్తన్యమునిచ్చెనట. పిమ్మట ఆబాలుడు పెరిగి పెద్దవాడై దేవి అనుగ్రహముచే రాజయ్యెనట. ప్రవరసేనుడను ఈరాజు సౌందర్యలహరి స్తోత్రమును రచించి, కుమారుడగు తనకు శ్రీవిద్యనుపదేశించి, ఈస్తోత్రమునకు వ్యాఖ్య రచింపుమని ఆదేశించినట్లు సుధావిద్యోతినీ కారుడగు అరిజిత్ (లేక అరిచిత్) పేర్కొనెను. కాని ప్రవరసేనుని కర్తృత్వమును ఇతరవ్యాఖ్యాతలు గాని, సంప్రదాయముగాని, విమర్శకులుగాని ఆమోదించుటలేదు.

మొదటి 41 శ్లోకములు తంత్రవిషయ ప్రధానమైనవి. తక్కిన 59 శ్లోకములు దేవీ సౌందర్య వర్ణన ప్రధానములు. ఈ కారణముచే మొదటి

41 శ్లోకములకు పరమేశ్వరకర్తృత్వమాపాదింపబడియుండును. పరమేశ్వరునిపై అత్యద్భుతమగు శివమహిమ్నమును రచించిన పుష్పదంతుడను గంధర్వునకీ సౌందర్యలహరీ కర్తృత్వమాపాదించుటకు కారణము. బహుశః రెండు స్తోత్రములును శిఖరిణీ వృత్తములో నుండుటయు, రెండును అద్భుతమగు కవితాధార కలిగియుండుటయు కారణము కావచ్చును.

ఈ స్తోత్రము శివకర్తృకమనుటయు, సిద్ధకర్తృకమనుటయు, యక్షకృత మనుటయు దివ్యమగు నిందలి కవితాసౌందర్య గాంభీర్యములను బట్టి ప్రచలితమైన గాథలేగాని, ఈస్తవము ఘనకర్తృకముకాదనుటకెట్టి నిర్దుష్టమునగు ఆధారములేదు. ప్రామాణిలగు లక్ష్మీధరాదివ్యాఖ్యాత లెవ్వరును ఈ స్తోత్రము యొక్క శంకరకర్తృత్వమును శంకింపలేదు.

గౌడపాదాచార్యుల ప్రశిష్యులగు శ్రీశంకరులు ఈస్తోత్రమును రచించియుండుటలోని సామంజస్యము 'సౌందర్యలహరి' నామౌచిత్యమున సూచింపబడుచున్నది.

## 5. శ్రీశంకరాచార్యుల జీవిత చరిత్ర

శ్రీశంకరుల జీవితచరిత్రను వర్ణించు గ్రంథములు సంస్కృతములో అనేకములుగలవు. వీనిలో కొన్నిప్రాచీనములే అయినను శంకరులకు సమ కాలీనములుకాని, సమీపకాలీనములుకాని కావు. ఈ రచనలన్నియు శంకరుల కైలాసగమనము తరువాత చిరకాలమునకు వెలువడినవి. అనగా నివి పరంపరా శ్రుతవిశేషముల ఆధారముగా రచింపబడినవి. కనుకనే ఈ గ్రంథములలో యథార్థవిషయములతోబాటు కొన్ని కల్పనలు కూడ చోటుచేసుకొన్నవి. 'కొన్ని విశేషములు యథార్థములైనను, కాకున్నను ఆధునికవిమర్శకులకు విశ్వసనీయములుగా కనిపింపవు. ఈ గ్రంథములలో

కొన్ని మౌలికాంశములలోనే ఏకవాక్యతలేదు. శంకరుల తల్లిదండ్రులపేర్లు, జన్మస్థలము, జననకాలము, ఆయుఃప్రమాణమువంటి ప్రధానవిషయము లలో కూడ ఈజీవితచరిత్రలలో భిన్నత్వమున్నది.

శంకరుల జీవితచరిత్రను వర్ణించు సంస్కృత గ్రంథములు 13 కలవు. ఇవిగాక ఇతర విషయములతోబాటు శంకరుని జీవితచరిత్రనుకూడ పేర్కొన్న గ్రంథములు 16 కలవు. ఇట్టివి మరికొన్నియున్నను, వానిని చాలామంది పండితులు వానిని ప్రామాణికముగా భావించుటలేదు. ఇంతేగాక మార్కండేయ స్కాంద కూర్మ సౌర భవిష్య భవిష్యోత్తర వాయు శివపురాణములలో పరమేశ్వరుడే వైదికధర్మోద్ధరణకొరకు ఆదిశంకరులుగా అవతరించునని చెప్పినవి. శంకర జీవితచరిత్రలలో కూడా చాలా గ్రంథములు ఈ ఆచార్యుని శివావతారముగా పేర్కొనినవి.

శంకరజీవితచరిత్ర గ్రంథములలో పలువురు ప్రామాణికముగా భావించునది - మాధవకృతమగు శంకరవిజయము. ఈ మాధవుడు మాధవవిద్యారణ్యులని సంప్రదాయికుల విశ్వాసము, కాని పరిశోధకులు దీనిని అంగీకరింపక శంకరవిజయకర్త యగు మాధవుడు మాధవ విద్యారణ్యులకన్న భిన్నుడనియు, 17వ శతాబ్దమువాడని విమర్శకులు భావించుచున్నారు.

మాధవుని శంకరవిజయముకంటె ప్రాచీనమైనది వ్యాసాచలుని శంకర విజయము. వ్యాసాచలుడు అద్వైతసంప్రదాయమునకు చెందిన ఒక మఠాధిపతి. మాధవశంకరవిజయము వ్యాసాచలుని గ్రంథమును చాలావరకు అనుకరింపబడినది. పెక్కు శ్లోకములు యథాతథముగా మాధవుని రచనలో కెక్కినవి. ఈ శ్లోకములను తొలగించినచో మాధవుని గ్రంథమునకు అస్తిత్వములేదు.

ఈ వ్యాసములో శంకరుల జీవితవిశేషములు పైరెండు గ్రంథముల ఆధారముగా పేర్కొనబడుచున్నవి. తక్కినవారి రచనలో కనిపించు ప్రధానభేదములు సూచింపబడుచున్నవి.

కేరళదేశములోని 'కాలడి'యను గ్రామమున ఆర్యాంబాశివ గురువులను నంబూద్రి బ్రాహ్మణదంపతులుగలరు. వైశాఖ శుద్ధపంచమినాడు ఆర్ద్రా నక్షత్రమున ఈదంపతులకు శివావతారమగు శంకరులు జన్మించిరి.

శంకరులు మూడవ సంవత్సరము నాటికే కావ్య పురాణములను గ్రహించెను. మూడవ ఏట తండ్రి అతనికి చూడాకర్మచేసెను. ఉపనయనము చేయకయే మరణించెను. ఐదవయేట తల్లి శంకరునికి ఉపనయనము గావించెను. శంకరులు గురువులయొద్ద ఐదు సంవత్సరముల వయస్సుననే చతుర్వేదములను, షడంగములను సమగ్రముగా గ్రహించి, తన పాండిత్యముచే జనులను ఆశ్చర్యపరచెను.

ఎనిమిదవయేట నదీస్నానమునకేగిన శంకరుని మొసలి పట్టుకొనగా తల్లి అనుమతిచే శంకరులు మనసా సన్యసించి, పిమ్మట తగిన గురువు నన్వేషించుచు నర్మదాతీరమునగల శ్రీగోవిందభగవత్పాదుల నాశ్రయించి, విధియుక్తముగ సన్యాసాశ్రమమును స్వీకరించిరి. రెండు సంవత్సరములు గురువు కడనుండి పిమ్మట ఆయన ఆజ్ఞచే కాశినిచేరిరి. అచ్చటనే శంకరులకు పద్మపాదాదులు శిష్యులైరి. కాశియందు శంకరులకు శివసాక్షాత్కారము లభించెను. శంకరులు కాశిలోనుండగనే శివాజ్ఞచే ప్రస్థానత్రయాదులకు భాష్యమును, ఉపదేశసాహస్రి మున్నగు వానిని రచించి, శిష్యులకు చెప్పిరి. పిమ్మట శంకరులు కాశినుండి హరిద్వారము, హృషీకేశములను, బదరికాశ్రమును దర్శించిరి. బదరికాశ్రమము కొంతకాలముండి భాష్యరచనలు చేసినట్లు, శిష్యులకుపదేశము చేసినట్లు సంప్రదాయము

చెప్పుచున్నది. శంకరులు మరల కాశిని చేరిరి. శంకరుడు శిష్యులకు బోధించుచుండగా వ్యాసుడు వృద్ధబ్రాహ్మణ రూపమున వచ్చి, శంకరులను పరీక్షించి, సంతృప్తుడై మరి పదునారేండ్ల ఆయువును అనుగ్రహించెనట. వస్తుతః 8 ఏండ్ల ఆయుర్దాయముగల శంకరులు తన తపస్సుచే మరియొక్క ఎనిమిది ఏండ్లును, వ్యాసునివలన మరి 16 సంవత్సరముకు ఆయువును పొందెను.

తరువాత శంకరులు కుమారిలుని దర్శించి, ఆయన ఆదేశముచే మండనమిశ్రుని కలిసికొని వాదమున జయించి ఆతనిని శిష్యునిగ చేసికొని ఆతనికి సురేశ్వరుడను దీక్షానామమునొసంగెను.

తదుపరి శంకరులు దిగ్విజయయాత్ర చేసిరి. బౌద్ధ జైన కాపాలిక పాషండాదులను జయించి, అద్వైతమతమును ప్రచలితము చేసిరి. తూర్పున (పూరీ) గోవర్ధనపీఠమును, దక్షిణమున శృంగేరీపీఠమును, పశ్చిమమున (ద్వారకా) శారదాపీఠము, ఉత్తరమున (బదరీ) జ్యోతిర్మఠ పీఠములను స్థాపించిరి. వరుసగా పద్మపాద, సురేశ్వర, హస్తామలక, తోటకులను ఆచార్యులుగా నియమించిరి.

శంకరులు తమ ముప్పదిరెండవయేట హిమాలములలోని బదరికేదార ప్రాంతమున బ్రాహ్మీభూతులైనట్లు వ్యాసాచలీయ మాధవీయాదులు పేర్కొనుచున్నవి.

నేటికిని కేదారనాథమందిరమునకు వెనుకగల ఒక చతుష్కోణవేదిక నడుమ పన్నెండడుగుల చతురస్రముగల రేకు కప్పబడియుండును. దీనిని శంకరుల సమాధియని చూపుదురు.

శంకరుల జన్మస్థలముగా పలువురు 'కాలడి' గ్రామమునే పేర్కొన్నారు. మాణిక్యవిజయము, శివరహస్యము అను గ్రంథములు

శశలగ్రామమని పేర్కొన్నవి. అనంతానంగిరి చిదంబరమనినాడు. కాలడియే బహుజనాంగీ కృతమైనది.

శంకరుల తల్లి విశిష్ట అని ఆనందగిరి చెప్పగా, ఆర్యాంబ అని మరికొందరనిరి. ఏమైనను శంకరుల జననీజనకుల పేర్లు పౌరుషనామముల గనే కనిపించును.

శంకరుల ఉపనయనానంతరమే తండ్రి మరణించినట్లు చిద్విలాసుడు చెప్పెను.

శంకరులు 32 సంవత్సరములే జీవించిరనుట బహుజన సమ్మతము. సంప్రదాయసిద్ధముగా మాణిక్యవిజయమున 30 సంవత్సర ములే పేర్కొనబడినది. ఆనందగిరి శంకరుడు బ్రహ్మస్వచ్ఛందమరణమును అనుగ్రహించెనని ఒక్కచోటను, వ్యాసుడు నూరేండ్లు ఆయువునిచ్చినట్లు తరువాతి ప్రకరణములోను చెప్పినాడు.

శంకరుల జన్మనక్షత్రము ఆర్ద్ర అనియు, మాసము వైశాఖమనియు చాలమంది అంగీకరించగా, జన్మతిథిని శుద్ధ పంచమి, దశములను రెండు అభిప్రాయములున్నవి. ఆర్ద్ర నక్షత్రమగుటచే పంచమి అగుటయే సంగతము. సంవత్సరము విషయమున నంద, విభవ, సర్వజిత్ అని వానిని వేర్వేరు కర్తలు పేర్కొనిరి.

కంచిపీఠపరంపరను అనుసరించువారెల్లరును శంకరులు శిష్యులు నలువురకు నాల్గు పీఠములనొసగి తాము కంచిలో నొక పీఠమును నెలకొల్పుకొని, అచటనే తిరోధానమునొందిరని చెప్పుదురు. కేరళ పరంపరలో ఆచార్యులు కేరళదేశములోని త్రిచూరులో బ్రాహ్మీభూతులైనట్లు పేర్కొనెదరు.

ఇట్లు కొన్ని యంశములు విభేదించుచున్నను శంకరుల జీవితచరిత్రను పేర్కొన్న గ్రంథములన్నియు, ఆయన రచనల విషయమునను, దిగ్విజయ విషయమునను ఏకవాక్యతనే ప్రకటించినవి.

# 6. శ్రీశంకరాచార్యుల కృతులు - సమీక్ష

శ్రీశంకరభగవత్పాదులు భారతీయ తత్త్వశాస్త్రమునకు, అద్వైతమత వ్యాప్తికి అందించిన అనర్ఘ రత్నములెన్నియో కలవు. ముప్పది రెండేండ్ల స్వల్ప జీవితకాలములోనే ఆయన వేదవేదాంగములను, సకలశాస్త్రములను కూలంకషముగ అధ్యయనముచేసి లోకానుగ్రహదృష్టితో అద్వైత సంప్రదాయ ప్రతిష్ఠాపకములగు పెక్కు ప్రామాణికగ్రంథములను రచించిరి. వానిలో కొన్ని వ్యాఖ్యానరూపములు, కొన్ని ఉపదేశాత్మకములగు ప్రకరణ గ్రంథములు, కొన్ని స్తోత్రరూపకములు.

శంకరులొనరించిన ఈ అపారకృషిలో తొలుత పేర్కొనదగినది ప్రస్థాన త్రయభాష్యము. అనగా- వ్యాసప్రోక్త బ్రహ్మసూత్రములు, ఈశాది ద్వాదశోపనిషత్తులు, మహాభారతాంతర్గతమగు భగవద్గీత. శంకరాచార్యులు మహాభారతములోని ప్రజాగరపర్వమున ధృతరాష్ట్రుని మోహమును తొలగించుటకై సనత్సుజాతర్షి బోధించిన ఆధ్యాత్మికోపదేశమగు సనత్సుజాతీయమునకుగూడ వ్యాఖ్యానమును రచించిరి. సనత్సుజాతీయమునకు వేదాంతగ్రంథములలో భగవద్గీతతో తుల్యమగు స్థానముగలదు.

ప్రాచీన స్తోత్రవాఙ్మయమున ఎందరికో నిత్యపారాయణయోగ్యమై సర్వార్థదముగా భావింపబడునది- మహాభారతములోని భీష్మపర్వాంతర్గత మగు విష్ణుసహస్రనామస్తోత్రము. దీనిపై శంకరులు భాష్యమును రచించిరి.

శాక్తులకు శిరోధార్యమగు 'లలితాత్రిశతి'కినీ శంకరులు భాష్యమును రచించిరి. లలితాత్రిశతి పంచదశీవిద్యాత్మకమై బ్రహ్మాండపూరాణాంతర్గత మగు లలితోపాఖ్యానమున నున్నది. ఈ నామములు పరమేశ్వరీపరమేశ్వర ప్రోక్తము లని బ్రహ్మాండపురాణము చెప్పుచున్నది.

గౌడపాదుల మాండూక్యకారికలకు శంకరులు భాష్యమును రచించిరి. కాని కొందరు దీని కర్తృత్వమును సందేహించుచున్నారు. ఇది శ్రీశంకర కృతముగనే శ్రీ బలదేవ ఉపాధ్యాయ మున్నగు పరిశోధకులు భావించుచున్నారు.

శ్రీశంకరుల శిష్యుడగు హస్తామలకుడు రచించిన ద్వాదశ పద్యాత్మకమగు స్తోత్రమునకొక వ్యాఖ్యగలదు. ఇది శ్రీశంకరకృతమే అని సాంప్రదాయికుల విశ్వాసము. ఆధునిక విమర్శకులు దీని నంగీకరించుట లేదు.

కౌషీతకి, మైత్రాయణీయ, కైవల్య, మహానారాయణోపనిషత్తుల భాష్యములు, అధ్యాత్మపటలభాష్యము, గాయత్రీభాష్యము, సంధ్యాభాష్యము కూడ శంకరకర్తృకములను వాడుకయున్నది. కాని ఇది సందేహాస్పదము.

శంకరుల ప్రకరణగ్రంథములగు అధ్యాత్మబోధ మున్నగు వానికిగల వ్యాఖ్యలు కొన్ని శంకరకర్తృకములను అభిప్రాయమున్నది. కాని అది విశ్వసనీయము కాదు.

శంకరుల వేదాంతోపదేశములకై పెక్కు ప్రకరణగ్రంథములను వెలయించిరి. ఇవి పరిమాణమున చిన్నవేగాని గుణమున గొప్పవి.

1) అపరోక్షానుభూతి, 2) ఆత్మబోధ, 3) ఉపదేశసాహస్రి, 4) పంచీ కరణప్రకరణం, 5) ప్రబోధసుధాకరః, 6) లఘువాక్యవృత్తిః, 7) వాక్యకృత్తిః, 8) వివేకచూడామణిః, 9) శతశ్లోకి ఇట్టివి.

1) అద్వైతపంచరత్నమ్, 2) అద్వైతానుభూతిః, 3) అనాత్మశ్రీవిగర్హణమ్, 4) ఉపదేశపంచకమ్ ... అనునవి శంకరులు రచనలుగనే భావింపబడుచున్నవి.

శ్రీశంకరకర్తృకములుగా ద్విశతాధికములగు స్తోత్రములు లభించుచున్నవి. వీనిలో 64 మాత్రమే శంకరకృతములుగా భావించి

శ్రీశృంగేరి పీఠమువారు 'శ్రీశంకరగ్రంథావళి'లో ప్రకటించిరి. శ్రీశివభుజంగ ప్రయాతము, దక్షిణామూర్తిస్తోత్రము, గోపాలాష్టకము, షట్పదీ, దశశ్లోకీ అనునవి నిస్సందిగ్ధముగా శంకరకర్తృకములు.

ఆనందలహరి (దేవీస్తోత్రము), గోవిందాష్టకము, చర్పటపంజరికా, ద్వాదశపంజరికా, హరిమీడేస్తోత్రము, మనీషాపంచకము, సోపానపంచకం అనునవియు శంకరకర్తృకములే.

శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారాస్తవము, శ్రీలక్ష్మీనృసింహ కరావలంబస్తోత్రము మున్నగునవియు శంకరకర్తృకములుగా పరంపరాగతముగా అంగీకరింపబడుచున్నవి.

శంకరకర్తృకములుగా చెప్పబడుచున్న కొన్నిగ్రంథములు ఆది శంకరులవి గాక, అనంతరపీఠాధిపతులెవరైనను రచించియుండుటకు అవకాశమున్నది.

శంకరులకుగల తంత్రశాస్త్రపరిచయ మనల్పమైనది. అది శ్రీలలితా త్రిశతి భాష్యమునందును, సౌందర్యలహరీస్తవమునందును సువ్యక్తమగును. శంకరుల తంత్రశాస్త్రపారదర్శిత ప్రపంచసారతంత్రగ్రంథమున వెల్లడియగును. దీనికర్తృత్వమును కొందరు సందేహించిరిగాని శంకరుల శిష్యులగు పద్మపాదులు దీనికి వ్యాఖ్యానమును రచించుట శంకరకర్తృకమును సమర్థించుచున్నది.

శంకరుల గ్రంథరత్నములలో సౌందర్యలహరికొక విశిష్టమగు స్థానమున్నది. ఇది భక్తిభావబంధురము, కవితాపీయూషపేశలము మాత్రమే గాక, తంత్ర, యోగ విశేషములనుగూడ సర్వాంగీణపరిష్వంగము గావించుకొని భక్తులకు, అందులోను శాక్తులకు పూజాస్థానమై పారాయణముచే సర్వ కామదముగ ప్రశస్తిపొందియున్నది.

ఈ గ్రంథమున కొంతభాగము సాక్షాత్తుగ పరమేశ్వరకర్తృకమను సాంప్రదాయిక విశ్వాసము ఈ గ్రంథప్రశస్తికి నికషోపలము.

# 7. శ్రీశంకరాచార్యుల కాలనిర్ణయము

శ్రీశంకరభగవత్పాదుల కాలనిర్ణయము పరిశోధకులకు జటిల సమస్యగా నున్నది. పలువురు పాశ్చాత్యులు, భారతీయపండితులు కూడ శంకరుల కాల విషయమున పెక్కు వాదములనవలంభించిరి. శంకరామ్నాయపీఠ పరంపరలో చెప్పబడుచున్న శంకరుల కాలము విషయమునగాడ ఒక పీఠమునకు మరియొక పీఠమునకు సంవాదము కుదురుటలేదు. శంకరుల కాలము క్రీ.పూ.5వ శతాబ్ది యని క్రీ.శ.9వ శతాబ్ది ప్రథమపాదమువరకు ఆయా వాదములలో పేర్కొనబడినది. కంచిపీఠమువారు శంకరులకాలము క్రీ.పూ. 508–476 అనిరి. ద్వారకాపీఠము వారి పరంపరలో చెప్పబడిన కాలముకూడా ఇంచుమించు ఇట్లేయున్నది.(క్రీ.పూ. 502–470). కేరళోత్పత్తియను గ్రంథములో శంకరులు క్రీ.శ.400లో జన్మించినట్లు (కలి.3501) పేర్కొనబడినది.

శృంగేరిపీఠమువారి పరంపరలో శంకరులు విక్రమశకము 14–46 నడుమ జీవించిరని చెప్పబడినది. ఈ విక్రమశకము మాళవరాజగు విక్రముని శకము కాదనియు, చాళుక్య విక్రమునకు సంబంధించినదనియు బలదేవ ఉపాధ్యాయ మున్నగువారు భావించిరి.

పై వివిధవాదములలోని సామంజస్యమును చర్చించుటలోగల ప్రధానమగు అవరోధము ఆయా వాదములలో పేర్కొనబడిన పలువులు వ్యక్తుల కాలములు పరస్పరసాపేక్షములుగ నుండుటయే. ఆయా సంబంధిత వ్యక్తుల కాలములను నిర్ణయించుటకు నిర్దుష్టములగు ఆధారములు మృగ్యములు. పూర్వ పూర్వులయొక్కగాని, ఉత్తరోత్తరులయొక్కగాని తరముల అంతరములను పరిగణించి కాలనిర్ణయము చేయుటలోగూడ ప్రమాదముకవకాశము కలదు. ఉన్నంతవరకు ఆధారములతో

శంకరులకాలమునుగూర్చి ప్రస్తావించుటకు ఈ వ్యాసభాగమున ప్రయత్నము చేసితిని.

శంకరులు తమ గ్రంథములలో దిఙ్నాగుడు మున్నగు బౌద్ధదార్శనికుల వాక్యములను ప్రస్తావించిరి. శంకరులుదాహరించిన పై దార్శనికులు క్రీస్తునకు తరువాతివారేగాని పూర్వులుగారు. కనుక శంకరులు క్రీస్తునకు పూర్వులన్న వాదము విశ్వసనీయముకాదు.

పాశ్చాత్యపండితులును, వారి అనుయాయులగు భారతీయ పరిశోధకులు కూడ శంకరులకాలమును క్రీ.శ. 788 - 820గా నిర్ణయించిరి. ఇటీవల శంకరులకాలముపైగల వివిధ వాదములను క్రోడీకరించి, పరిశోధనాత్మకముగ 'Date of Sankara' అను గ్రంథమును ప్రకటించిన శ్రీ ఉమేష్‌గారు కూడ ఈయభిప్రాయమునే నిర్ధారించిరట.[1]

శంకరుల బృహదారణ్యక భాష్యముపై వార్తికములు వ్రాసిన సురేశ్వరాచార్యులు ధర్మకీర్తిని ఉదాహరించిరి. ఈ ధర్మకీర్తి దిఙ్నాగునకు అర్వాచీనుడు. ఇతడు ఏడవశతాబ్ది మధ్యభాగమునకు తర్వాత ఉండుట కవకాశము లేదు. బలదేవఉపాధ్యాయ ధర్మకీర్తికాలమును క్రీ.శ. 635-650 ప్రాంతముగా భావించిరి. ఈ ధర్మకీర్తి క్రీ.శ. 390-470 మధ్యకాలము వాడని డా॥ పిఎస్ శాస్త్రిగారు భావించిరి. శంకరులు ధర్మకీర్తికి అనంతరుడని చెప్పుటకు అవకాశములేవు. అంతేగాక శంకరులు ప్రతిపాదించిన అపరోక్షానుభూతినికూడ విమర్శించెను. శంకరులు ఛాందోగ్యభాష్యములో స్త్రుఘ్ననగరమును ప్రస్తావించెను. ఈ నగరము క్రీ.శ. 756లో వరదలలో నిర్మూలమైనది. కనుక శంకరులు క్రీ.శ 788-820 మధ్యకాలమున

---

1. శ్రీతుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారి 'సౌందర్యలహరి' (బాలసరస్వతి-మదరాసు ప్రచురణ-1987) పీఠికలో ఈ గ్రంథమును పేర్కొనిరి. నాకిది లభింపలేదు.

నుండిరను వాదము పరాస్తమైనది. క్రీ.శ. 700 ప్రాంతములోగల శాంతరక్షితుడు బృహదారణ్యక వార్తికమును ప్రస్తావించెను. దీనినిబట్టి శంకరులు క్రీ.శ. 700కు పూర్వుడనుట నిశ్చయము.

క్రీ.శ. 450 ప్రాంతమువాడగు భావవివేకునకు శంకరాద్వైతముతో పరిచయమున్నదనియు; కనుక క్రీ.శ.4వ శతాబ్దము చివర శంకరులు జన్మించి ఉండవచ్చుననియు డా॥ పిఎస్ శాస్త్రిగారు భావించుచున్నారు.

ఇట్లు వివిధ వాదములు శంకరుల జన్మ సమయమును స్పష్టముగా, నిర్దుష్టముగా నిర్దేశించుటలో సమర్థవంతములు కాలేక పోయినవి. ఉన్న ఆధారములనుబట్టి శంకరుల జననము క్రీ.శ. 4-5 శతాబ్దముల నడుమ జరిగి ఉండునని ఊహింపవచ్చును.

# ద్వితీయతరంగము

## 1. నామౌచిత్యవృత్త్యౌచిత్యములు

సౌందర్యలహరీ స్తవమెంత మనోహరమైనదో ఆ స్తవములకు శంకరు లుంచిన పేరుకూడ అంతే మనోహరమైనది. మొత్తము స్తోత్రములో ఆచార్యులు 'తవ వదన సౌందర్యలహరీపరీవాహః' (శ్లో:44) అని ఒక్కసారిమాత్రమే సౌందర్యలహరీ శబ్దమునుపయోగించిరి.

సౌందర్యశబ్దము విశిష్టార్థప్రతిపాదకము. సుందర లేక సుందరీ శబ్దముల భావార్థకము సౌందర్యశబ్దము. విష్ణుసహస్రనామభాష్యమున శ్రీశంకరులు సుందరశబ్దమును వ్యాఖ్యానించుచు– "విశ్వాతిశాయి సౌభాగ్య శాలిత్వాత్ సుందరః, సుష్ఠు ఉనత్తీతి సుందః. ఉందీక్లేదనే ఇతిధాతోః పచాద్యచ్. ఆర్ద్రీభావస్య వాచకః. కరుణాకర ఇత్యర్థః". దీనినిబట్టి సుందరీ శబ్దమునకు 'కరుణాకర'యని శంకరుల అభిమతమని స్పష్టమగుచున్నది. సుందరినుద్దేశించి చెప్పిన స్తోత్రలహరి గావున ఇది 'సౌందర్యలహరి'.

లోకమున సౌందర్యము కామోద్దీపకముగదా! కరుణకది ఎట్లు సమన్యయించునను శంక కలుగును. వాస్తవమునకు కారుణ్యమే అంతస్సౌందర్యము. బాహ్యసౌందర్యము యౌవనలక్షణము. యౌవనము మాతృత్వసిద్ధికి హేతువు. మాతృత్వము కరుణాస్పదము. ఇట్లు సౌందర్య మనునది పరమేశ్వరి బహిరంతర్లక్షణములగు తారుణకారుణ్యములను వ్యక్తమొనర్చును.

యౌవనారంభము షోడశవర్షదేశీయమనుట అభియుక్తోక్తి. మాతృత్వ యోగ్యమగు తొలివయసు అదియే. పరమేశ్వరి షోడశి. మంత్రరూపమున గూడ పరమేశ్వరి షోడశీ విద్యారూపిణి యనుట ఈనామమున స్ఫురించును.

శంకరులు తమ ఈ స్తవమును పరమాచార్యులగు శ్రీగౌడపాదుల సుభగోదయమును ఆకళించుకొని, అందలి విశేషములను పెక్కింటిని పొందుపరచి రచించినట్లు స్పష్టమగును.[1] శ్రీగౌడపాదులు తాము చెప్పిన స్తవమునకు సుభగోదయమను పేరుంచుటకును, ఆనుపూర్వికసంబంధము కలదు.

పంచదశీ విద్యారూపిణియగు పరమేశ్వరికి గల అనంతనామములలో దేవికత్యంతప్రీతికరములుగ పంచదశ నామములు త్రిపురోపనిషత్తునందు ఈ విధముగ పేర్కొనబడినవి –

**"మదంతికా మానినీ మంగళాచ సుభగా చ సా సుందరీ సిద్ధిమత్తా।**
**లజ్జామతిస్తుష్టి రిష్టాచ పుష్టా లక్ష్మీరుమా లలితా లాలపన్తీ॥"**

(త్రిపురోపనిషత్తు–శ్లో: 6)

పైనామములను గమనించినచో వీనిలో నాలుగవదియగు 'సుభగా'శబ్దమును గౌడపాదులు గ్రహింపగా ఐదవదియగు సుందరీశబ్దమును పురస్కరించుకొని శంకరు లీ స్తోత్రమును సౌందర్యలహరి యనిరని స్పష్టమగును.

ఇట్లీస్తోత్రమునకు సౌందర్యలహరీనామము పరమౌచిత్యభాజనమై విశిష్టార్థప్రతిపాదకమూకాగా, ఈస్తోత్రమున శంకరులుపయోగించిన శిఖరిణీ వృత్తముకూడ సముచితమైనది.

సంస్కృతస్తోత్రసాహిత్యమున శిఖరిణీవృత్తమును ప్రచురముగా ప్రయోగించుట కనబడుచున్నది. భక్తిభావమును ప్రకటించుట కీ వృత్తము అనుకూలముగ నుండుటయే ఇందుకు హేతువు.

సుప్రసిద్ధమగు శివమహిమ్నస్తోత్రము, గౌడపాదుల సుభగోదయ స్తవము శిఖరిణీవృత్తములలోనే నిబంధింపబడినది.

---

1. ఈవిషయము "సౌందర్యలహరిపై సుభగోదయప్రభావము' అను వ్యాస భాగమున చర్చింపబడును.

పరమేశ్వరి పంచదశీ విద్యాస్వరూపిణి. దేవియొక్క యంత్రమంత్ర స్వరూపముల కభిన్నత చెప్పుట తంత్రశాస్త్రసంప్రదాయము. దేవీపంచదశీ మంత్రము త్రికూటాత్మకము. వాగ్భవకామరాజశక్తి కూటములని మూడు కూటములుగ పంచదశీవిద్య పేర్కొనబడియున్నది. దేవీస్వరూపమని లలితా సహస్రనామస్తోత్ర మిట్లు ప్రతిపాదించుచున్నది.

**"శ్రీమద్వాగ్భవకూటైక స్వరూపముఖపంకజా ।**
**కంఠాధః కటిపర్యన్త మధ్యకూటస్వరూపిణీ ॥**
**శక్తికూటైకతాపన్న కట్యధోభాగధారిణీ ।**
**మూలమంత్రాత్మికా మూలకూటత్రయకళేబరా॥"**

(ల.స.నా. 85-89)

అంతేగాక పరమేశ్వరి, త్రికూట(588), కూటస్థ (896) అనియు పేర్కొనబడినది. కూట, శిఖరశబ్దములు సమానార్థకములు. కనుక మూలకూట త్రమకళేబరయగు దేవి శిఖరిణి యగుట సముపపన్నము. ఇట్లు శిఖరిణియగు పరమేశ్వరియొక్క స్తోత్రమును శిఖరిణీ వృత్తమున నిబంధించుట పరమౌచిత్యరమణీయము.

## 2. సౌందర్యలహరి శ్లోకసంఖ్యా విచారము

సౌందర్యలహరీ శ్లోకసంఖ్య భిన్నభిన్నప్రతులలో భిన్నభిన్నముగ నున్నది. అన్ని ప్రతులలో సమానముగా కనిపించు నూరు శ్లోకములుగాక, కొన్ని ప్రతులలో 'సమానీతః పద్భ్యాం' (101) 'సముద్భూతస్థూల' (102), 'నిధే! నిత్యస్మేరే!' (103) అను మూడు శ్లోకములు అదనముగా కనిపించుచున్నవి. కొన్ని ప్రతులలో 1, 2 మాత్రమే చేరియున్నవి.

కంచికామకోటి పీఠమువారు ప్రకటించిన పదివ్యాఖ్యలలో పరమ ప్రామాణికముగా పండితులచే అంగీకరింపబడుచున్నది లక్ష్మీధరవ్యాఖ్య.

ఇందు లక్ష్మీధరులు సౌందర్యలహరిలోని చివరి శ్లోకమగు 'ప్రదీపజ్వాలాభిః' అనుదానిని వ్యాఖ్యానించిన తరువాత సమానీతః పద్భ్యాం, సముద్భూతస్థూల, నిధేనిత్యస్మేరే అను మూడు శ్లోకములు శ్రీశంకరాచార్యకృతములు కావనియు, ప్రక్షిప్తము లనియు, కనుక వానిని వ్యాఖ్యానించుట లేదనియు పేర్కొనిరి.

సౌభాగ్యవర్ధనీ వ్యాఖ్యాతయగు కైవల్యాశ్రములు పై మూడు శ్లోకములను కూడ చేర్చి వ్యాఖ్యానించెను.

అరుణామోదినీకారుడు 'నిధే నిత్యస్మేరే' అను శ్లోకమునొక్కదానినే అధికముగా తనవ్యాఖ్యానమున చేర్చెను.

ఆనందిగిరీయవ్యాఖ్యలోను, త్తాపర్యదీపిని, కైవల్యవర్ధని వ్యాఖ్యలలో పై మూడు శ్లోకములు కూడ కలవు. పదార్థచంద్రికాకారుడును, డిండిమ భాష్యకారుడును, గోపాలసుందరీవ్యాఖ్యాతయు, ఆనందలహరీ వ్యాఖ్యాతయగు గౌరీకాంత సార్వభౌముడును 'సమానీతం పద్భ్యాం' అనుశ్లోకమును మాత్రము విడిచి, తక్కిన రెండు అధికశ్లోకములను వ్యాఖ్యానించిరి.

103 శ్లోకములను వ్యాఖ్యానించిన వారిలో ఆనందగిరి వ్యాఖ్యాంతమున 'శ్లోకశతి' అని పేర్కొనెను. కనుక పై మూడు శ్లోకములు వ్యాఖ్యయు ప్రక్షిప్తమేమో అని అనుమానించు కవకాశమున్నది కాని, తక్కిన శ్లోకములలో వలె వీనిలోను రహస్యార్థము చెప్పియుండుటచే ఆనందగిరియే పై మూడింటిని వ్యాఖ్యానించెనని భావింపవచ్చును.

తాత్పర్యదీపినీకారుడు వ్యాఖ్యారంభమున శ్లోకశతమని పేర్కొనెను. అదనపు మూడు శ్లోకముల వ్యాఖ్యలోను డిండిమవ్యాఖ్యానపంక్తులు పెక్కు యథాతథముగనున్నవి. కనుక పై మూడు శ్లోకముల వ్యాఖ్య తాత్పర్యదీపినిలో ప్రక్షిప్తమని శంకించుటకవకాశమున్నది.

# 3. సౌందర్యలహరి విభాగము

పెక్కు ప్రతులలో సౌందర్యలహరిలోని మొదటి 41 శ్లోకములను ఆనందలహరియను పేరను, తక్కినవానిని సౌందర్యలహరి యని పేర్కొనుట కనబడుచున్నది. ముద్రితమగు దశవ్యాఖ్యలలో లక్ష్మీధరులు, సౌభాగ్యవర్ధనీ, అరుణామోదినీ, కైవల్యవర్ధనీ కారులు 41వ శ్లోకము చివర ఆనందలహరిలో విభాగమును పేర్కొనిరి. ఆనందగిరీయవ్యాఖ్యలో 'సౌందర్యలహర్యాం మంత్రోద్ధారః' అని రెండు విభాగముల చివర పేర్కొనబడియున్నది. తాత్పర్య దీపినిలోను, పదార్థచంద్రికలోను ఎట్టి విభాగమును లేదు. డిండిమ భాష్యకారుడు ప్రథమోన్మీలనం, ద్వితీయోన్మీలనం అని పేర్కొనెను గాని, రెండు విభాగములను 'ఆనందలహరి' అనియే పేర్కొనెను గాని, 'సౌందర్యలహరి' అను నామమును పేర్కొనలేదు. వ్యాఖ్యారంభముకూడ ఈ స్తోత్రమును ఆనందలహరీ వ్యాఖ్యానమనియే పేర్కొనెను.

గోపాలసుందరీకారుడు, ఆనందలహరీవ్యాఖ్యాకారుడును మొత్తము గ్రంథమును 'సౌందర్యలహర్యాం పూర్వోభాగః', '- - - ఉత్తరోభాగః అని విభజించిరి.

ఈ విభాగమున పూర్వభాగశ్లోకసంఖ్యలో కూడ మతభేదములున్నవి. ముద్రితవ్యాఖ్యాతలందరును 41శ్లోకములనే పూర్వభాగముగ పేర్కొనిరి కాని, కొందరు తొలి 35శ్లోకములనే ఆనందలహరియని వ్యవహరింపగా, మరికొందరు 30వరకే ఆనందలహరిగా పరిగణించిరి. సుదావిద్యోతనీ కారుడు 1,2,8,9,10,11,14,21,26,27,31,41 సంఖ్యగల పన్నెండు శ్లోకములకు మాత్రమే ఆనందలహరీ' విషయముగలవని పేర్కొనెనట.

బహుజనసమ్మతిని బట్టి, తొలి 41శ్లోకములు ఆనందలహరి యను విభాగముగను, తక్కిన 59శ్లోకములు సౌందర్యలహరి విభాగముగను,

సౌందర్య లహరిలో చేరిన అధికశ్లోకములు మూడింటి ప్రక్షిప్తముగ భావింపవచ్చును.

# 4. సౌందర్యలహరి - పాఠభేదములు

శంకరుల కాలమునుండి నేటివరకు విస్తృత ప్రచారములో నున్న సౌందర్యలహరియందు లేఖక పాఠక ప్రవాచకాదులవలనను, తత్తద్గురు సంప్రదాయభేదముల వలనను పెక్కు పాఠభేదము లేర్పడినవి. ఇంచుమించు ప్రతిశ్లోకములోను ఇట్టి పాఠ భేదములు కనిపించును.

సౌందర్యలహరీ గ్రంథ శ్లోకసంఖ్యావిచారమున అధికపాఠములగు శ్లోకములను గూర్తి పూర్వవ్యాసభాగములో పేర్కొనబడినది. తక్కిన శ్లోకములలో ఒక్కదానియందు మాత్రము శ్లోకము యొక్కపూర్వోత్తరార్ధముల వ్యత్యయము కలదు.

**'తనోతుక్షేమం నస్తవ వదన సౌందర్యలహరీ**
**పరీవాహస్రోత్రస్సరణిరివ సీమన్తసరణిః ।**
**వహన్తీసిందూరం ప్రబలకబరీభారతిమిర**
**ద్విషాం బృందైర్బందీకృతమివ నవీనార్కకిరణమ్ ॥'** (సౌ.ల.శ్లో. 44)

అని లక్ష్మీధరాదుల పాఠము. ఈ శ్లోకములోని పూర్వోత్తరార్ధముల వ్యత్యయము అనగా 'వహన్తీసిందూరం' అనునది శ్లోకారంభముగా, సీమన్త సరణిః అనునది శ్లోకాంతముగా కొందరి పాఠము. రెండు పాఠములలోను అర్థభేదమేమియు గోచరింపదు గాని, క్రియాపదముతో ప్రారంభమగు లక్ష్మీధరాద్యనుసృతమగు పాఠమే కవితా ప్రౌఢిని సూచించు సుందరమగు పాఠము. గ్రంథనామమగు 'సౌందర్యలహరీ' అను శబ్దము ఈ శ్లోకమునందు మాత్రమే ప్రయుక్తమైనది. ఈ శబ్దము ప్రథమ పాదములో నుండుటయే సమంజసమని లక్ష్మీధరాదుల అభిప్రాయము కావచ్చును.

కొన్ని పాఠభేదములు కేవలము కించిద్రూపభేదము కలిగినవి. విరించాదిభిరపి–విరిఞ్చ్యాదిభిరపి (శ్లో. 1); మకుట – ముకుట (శ్లో. 15/23); తటిల్లేఖా – తడిల్లేఖా (శ్లో. 21); క్ష్వేళం – క్ష్వేడం (శ్లో. ); శీర్షాణాం – శీర్ష్ణాం (శ్లో. 70); నమోవాకం – నమోవాచం (శ్లో. 85); జలమయం–జడమయం (శ్లో. 94) ; వితంద్రీ – వితన్ద్రా (శ్లో. 26); హరిణీం – హరణీం (శ్లో. 28) వంటివి ఇట్టివి.

మరికొన్ని తాత్పర్యభేదమును కలిగింపని పదముల మార్పులు మాత్రమే. పురరిపుమపి – స్మరరిపుమపి (శ్లో. 5); తృప్తేన –తృష్టేన (శ్లో. 23); శివయువతి –పురవిజయినః (శ్లో. 35); కరికలభకుంభస్తననతా – కరికలభకుంభ స్తనభరా (శ్లో. 7); పంచభిరపి – పంచభిరథ (శ్లో. 11); పుస్తకకరాం – పుస్తకధరాం (శ్లో. 15); కథమివ – కథమపి(శ్లో. 15/62); సతాం రంజనం – సభారంజనం (శ్లో. 16). ఒక్క సందర్భమున మాత్రము ఒకే పదమునకుగల అర్థవైరుధ్యముచే పాఠభేదము ఏర్పడినది. భ్రువౌ భుగ్నె (శ్లో. 47) ఇత్యాది శ్లోకమున 'సవ్యేతరకరగృహీతం' అనుచోట కొందరు 'అసవ్యేతరకరగృహీతం' అను అకార ప్రశ్లేషచే విచ్ఛేదమును చూపిరి. సవ్యేతరశబ్దమునకు వామమను అర్థమును లక్ష్మీధరాదులు పేర్కొనిరి. సవ్యశబ్దమునే వామముగా కొందరు గుర్తించిరి. సవ్యశబ్దమునకు వామదక్షిణార్థములు రెండును నిఘంటు సిద్ధములు (చూ. శ. ర) కనుక ఏ యర్థము చెప్పదలచినను 'అసవ్యేతర' అనుపాఠమును గ్రహింపనక్కరలేదు.

కొన్నిచోట్ల ధాతుభేదమున్నను అర్థమున సామ్యమున్నది. భజన్తి – జపన్తి(శ్లో. 8/33); మన్యే – వందే (శ్లో. 34/41/59/75); దృశ్యన్తే – లక్ష్యన్తే (శ్లో. 53). కొన్నిచోట్ల విభక్తిభేదముచే ఆపదములనన్వయించుకొనుటలో భేదమేర్పడినను శ్లోకముయొక్క ప్రధానార్థమునకు క్షతి కలుగదు. రసామ్నాయమహసః – రసామ్నాయమహసా (శ్లో. 10); చారుచరితే – చారుచరితం (శ్లో. 91) వంటివి ఇట్టివి.

వచనభేదముకూడ ఇట్టిదే. లోకానవికలం –లోకానవికలాన్ (శ్లో. 2); జరప్లుష్టాన్ – జ్వరప్లుష్టం (శ్లో. ) వంటివి ఇట్టివి.

కొన్నిచోట్ల లింగభేదము, పురషభేదముకూడ కన్పించును. ముద్రావిరచనా – ముద్రావిరచనం (శ్లో. ); రచయతి – రచయసి (శ్లో. 2/30/39); పురుషభేదమేర్పడినపుడు అన్వయభేదము మాత్రమేర్పడుచున్నది. ఒక్కొక్కచో ఒక పాఠములోని ఉపసర్గ మరియొకపాఠమున లేకపోవుటయో, వేరుగా నుండుటయో; ఒకపాఠములోలేని విసర్గ ఇతరపాఠములలో కన్పించుటయో గోచరించును. మిహిరద్వీపనగరీ – మిహిరోద్దీపనగరీ (శ్లో. 3); సకలమతిసంధాయ – సకలమభిసంధాయ (శ్లో. 31); నిబధ్నాతి – బధ్నాతి(శ్లో. 42) వంటివి ఇట్టివి.

సంప్రదాయభేదమునుబట్టి అర్థభేదమును తాత్పర్యభేదమును కలిగించు పాఠములు కొన్నిమాత్రమే ఉన్నవి. 'మహీంమూలాధారే ...' (శ్లో. 9) ఇత్యాది శ్లోకములో భిత్వాకులపథం – జిత్వా కులపథం, భిత్వాఽఽకులపథం అని పాఠాంతరములు. మొదటి రెండుపాఠములకు తాత్పర్యభేదములేదు. కులపథమును కుండలిని అధిగమించుటయే ప్రధానము. కుండలినీ మార్గమును కులపథమనియే ఉభయపాఠములు పేర్కొనుచున్నవి. 'ఆకులపథం అను పాఠము 'విషయపథం' అను అర్థమున ప్రయోగింపబడినది. పారిభాషిక పదమగు కులపథశబ్దమునకిందు స్థానము లేదు. కనుక మొదటి రెండు పాఠములు దీనికంటె మేలైనవి. కులపథమును అనగా షట్చక్రమార్గమును భేదించుటనే తంత్రయోగగ్రంథములు పేర్కొనుచున్నవి గనుక 'భిత్వా కులపథం' అను పాఠము శ్రేష్ఠతమము.

'చతుర్భిః శ్రీకంఠైః...' (శ్లో. 11) ఇత్యాది శ్లోకమున 'చతుశ్చత్వారింశత్' – త్రయశ్చత్వారింశత్' అను రెండుపాఠములున్నవి. శ్రీచక్రమునందలి కోణములు త్రయశ్చత్వారింశత్సంఖ్యాకములే. కాని 'తవ శరణకోణాః' అనుచోట శరణశబ్దమునకు బిందువను అర్థము చెప్పి,

శరణకోణములకు ద్వంద్వ సమాసమును గ్రహించి మొత్తముసంఖ్యను 44గా 'చతుశ్చత్వారింశత్' పాఠమును లక్ష్మీధరులు స్వీకరించిరి. శరణశబ్దమునకు నవయోన్యాత్మకమగు శ్రీచక్రమను అర్థమును గ్రహించి, శరణకోణాః అను సమాసమును షష్ఠీతత్పురుషముగా చెప్పినచో 'త్రయశ్చత్వారింశత్' అను పాఠముకూడ ఉపాదేయమే. దీనినికూడ లక్ష్మీధరులు సూచించిరి. ఈ శ్లోకములోని శరణశబ్ద స్థానములో భవన, చరణ శబ్దముల కొన్ని పాఠములలో కన్పించును. శరణభవనశబ్దములకు అర్థభేదము లేదు. చరణశబ్దమిచట సుసంగతముగ కన్పింపదు.

'ముఖం బిందుం కృత్వా...' (శ్లో. 19) ఇత్యాది శ్లోకమున హరార్ధం ధ్యాయేద్యః – హకారార్ధం ధ్యాయేద్యః అను రెండుపాదములు గలవు. హరార్ధమనకు శక్తిరూపమగు త్రికోణమని వ్యాఖ్యాతలు అర్థముచెప్పిరి. హకార్ధమను పాఠమును గ్రహించినవారిలో నాగరిలిపిలోని హకార లేఖన రూపమునందలి ఊర్ధ్వభాగమును వదలి అధోభాగమునగలఅర్ధము అను అర్థమును చెప్పి త్రికోణరూపమనియే తాత్పర్యమును చెప్పిరి. ఈ పాఠమును గ్రహించినవారిలో నొకరు హకారమును బీజముగా గ్రహించి, దానికి శివుడని అర్థము చెప్పి తదర్ధమగు శక్తి అనగా యోని (త్రికోణం) అని అర్థము చెప్పిరి. ఈ రెండును దూరాన్వయము కలిగినవి. కనుక హరార్ధం అను పాఠము మేలైనది. వ్యాఖ్యాతలలో అధికులు దీనినే గ్రహించిరి.

'శరీరం త్వం శంభోః ...' (శ్లో. 34) ఇత్యాది శ్లోకమునందు 'తవాత్మానం మన్యే భగవతి! నవాత్మానమనఘమ్' అనుపాదమున నవాత్మానం అను పదమునకు భవాత్మానం అను పాఠాంతరముగలదు. కౌలాచారసిద్ధమగు ఆనందభైరవీ ఆనందభైరవుల నవవ్యూహాత్మకత్వము ఈ శ్లోకమున ప్రతిపాదింప బడినట్లు లక్ష్మీధరాదులు భావించిరి. భవాత్మానం అను పాఠమును గ్రహించిన వ్యాఖ్యాతలు పరమేశ్వరిని భవస్వరూపిణిగా అనగా శివస్వరూపిణిగా వ్యాఖ్యానించిరి. ఈ పాఠాంతరమున విశేష

మేదియును లేదు. తదనంతరముగల 'మనస్త్వం వ్యోమత్వం...'(శ్లో. 35) ఇత్యాది శ్లోకమున ఉత్తరకౌలసంప్రదాయము కన్పించును. కనుక ఈ శ్లోకమున పూర్వకౌలము ప్రతిపాదింపబడినదను లక్ష్మీధరుల అభిప్రాయము తదనుగుణముగ తదాత్మానం అను పాఠము అర్థవంతముగా తోచును.

'తవాధారేమూలే...' (శ్లో. 41) ఇత్యాది శ్లోకమునగూడ తవాత్మానం అను పదమునకు పాఠాంతరములుగా భవాత్మానం, శివాత్మానం, తవాత్మానం అను పాఠములు కన్పించుచున్నవి. ఈ శ్లోకమున నవాత్మాకమనునది నవరస మహాతాండవనటమ్' అనుదానికి విశేషణము గనుక తక్కిన పాఠములకన్న మెరుగైనది. ఈ శ్లోకమునందే ఉభయమిదం, ఉభయవిధం అను పాఠములు గలవు. కౌలానుసారమున ఆనందభైరవీ ఆనందభైరవుల నాట్యమే జగదుత్పత్తి హేతువు. నాట్యావసానమే ప్రళయము. త్రికోణాకృతియగు మూలాధారమే సృష్టిహేతువు కనుక ఇచట జగత్ సృష్టియను నర్థమున ఉదయవిధం అను పాఠమే అర్థపుష్టిగలిగినది.

'రణేజిత్వాదైత్యాన్...' (శ్లో. 65) ఇత్యాది శ్లోకమున చండాంశ త్రిపురహర - చండాంశుత్రిపురహర - చంద్రాంశుత్రిపరహర అను పాఠత్రయము కన్పించును. వ్యాఖ్యాతలలో అధిక సంఖ్యాకులు చండాంశ అను పాఠమునే స్వీకరించిరి. శివనిర్మాల్యము స్వీకరించుటకు అధికారి చండుడను ప్రమథుడు మాత్రమేననియు, తదితరులకది నిషిద్ధమనియు బహు పురాణాది ప్రసిద్ధము. కనుక ఈ పాఠమే యుక్తము. దూరాన్వయము గల తక్కిన రెండుపాఠములలో అర్థపుష్టి కన్పింపదు.

కొన్ని పాఠములు కేవలము శబ్దసౌందర్యమునుబట్టి శంకరులశైలికి ఏది అనుగుణమేనదో ఊహించుటకు మాత్రమే అవకాశముగలవి. ఇట్టి వానిలో అభిప్రాయభేదమునకు అవకాశమున్నది. సుధాధారసిరయా - సుధాదార రసయా - సుధాసారసిరయా (శ్లో. 20); మకరందస్రుతిఝరీ -

స్రుతిసిరా – స్రుతిశిరా – స్రుతిసృతిః, స్రుతినదీ (శ్లో. 3); మిహిరద్వీపనగరీ – మిహిరోద్దీపనగరీ – మిహిరోద్దీపనకరీ (శ్లో. 3) వంటివి ఇట్టివి.

ఈ పరిశోదనావ్యాస సందర్భమున సౌందర్యలహరీ వ్యాఖ్యాతలలో పరమప్రామాణికడుగా విద్వాంసులచేతను, శ్రీవిద్యాసంప్రదాయాభిజ్ఞులగు భాస్కరరాయాదులచేతను ఆమోదింపబడిన లక్ష్మీధరులు పేర్కొనిన పాఠములే ప్రధానముగా స్వీకరింపబడుచున్నవి.

# తృతీయతరంగము

## తంత్రము

భారతీయజీవన విధానము చతుర్విధ పురుషార్థములను నిర్దేశించు చున్నది. సనాతనములగు వేదవేదాంగ, పురాణాది విజ్ఞానమంతయు తదనుగుణమైనది. ఆర్షమగు కావ్యవాఙ్మయము సైతము చతుర్విధ పురుషార్థ ప్రతిపాదకమే. సర్వ పురుషార్థములలో శ్రేష్ఠముగా, మానవజీవిత పరమావధిగా నిశ్చప్రచమైనది మోక్షము. ఈ ఫలమును సాధించుటకై ఏర్పడిన కర్మోపాసనా జ్ఞానమార్గములు సనాతనము శ్రుతిప్రతిపాదితములు.

ఉపాసనామార్గములలో తంత్రమొకటి. తంత్రశబ్దము అనేకార్థములలో నున్నది. (తంత్రం ప్రధానే సిద్ధాంతే సూత్రనాయే పరిచ్ఛదే–). ప్రకృతార్థము మంత్రోపాసనాదులను బోధించు రహస్యవిద్య అనియే. లోకమున వైదికము, తాంత్రికము అను భేదద్వయకల్పనచే తంత్ర మవైదికమను భావనకలుగును. ఇది వాస్తముగాదు. క్షుద్రఫలసాధన కుపకరించునవియు, క్రూరాచార బహుళములను నగు అవైదికతంత్రములు కొన్నియున్నను ప్రధానములగు శైవవైష్ణవశాక్తతంత్రములు వేదప్రామాణ్యము గలవియే. అతిప్రాచీనములగు తంత్రములలో శాక్తతంత్రములు గణనీయములు. ఇవి పరమేశ్వరప్రోక్తములుగా పేర్కొనబడినవి. కనుక ఇవియును వేదములవలె ప్రామాణికములే. కాని, వీనియందును తరతమభేదము కలదు. శాక్తతంత్రము స్థూలముగా వామాచార మన్నను ఇందు మరల వామ, సిద్ధాంత, కౌలములను మూడు భేదములున్నవి. కౌలము మరల పూర్వోత్తరమని ద్వివిధము. సామాన్య దృష్టితో వామాచార కౌలశబ్దములు పర్యాయములుగ లోకమున రూఢమైయున్నవి.

దక్షిణమార్గమునకే సమయాచారమనిపేరు. ఇది సాత్త్వికము, వేదప్రతిపాదితము.

పరమేశ్వరుడు లోకులు ఆయాపురుషార్థములు సాధించుకొనుటకు చతుఃషష్టితంత్రములను నిర్మించెనట. ఇవి అర్థకామసాధకములు మాత్రమే. పరమేశ్వరీ నిర్బంధముచే పిమ్మట పరమేశ్వరుడు అఖిల పురుషార్థైక ఘటనమూ, అన్యతంత్రనిరపేక్షమునగు శ్రీవిద్యాతంత్రమును లోకము కనుగ్రహించెనని తంత్రగ్రంథములు పేర్కొనుచున్నవి. (ఈ అంశము 'శ్రీవిద్య–వేద ప్రతిపాదిత్వము' అనువ్యాసభాగమున ప్రస్తావింపబడును).

శ్రీవిద్యాతంత్రము అఖిలపరుషార్థైకఘటనమనుటచే పురుషార్థ శ్రేష్ఠమగు మోక్షమునకిది సాధనమని స్పష్టము. చతుష్షష్టి తంత్రములకే శక్తిలేకపోవుటయు స్పష్టమే. పరమేశ్వర నిర్మితమగు ఈ తంత్రము వేదప్రతిపాదితమునై యున్నది.

శ్రీవిద్యామూలమంత్రము తత్ప్రతిరూపమగు శ్రీచక్రము తదధిష్ఠాత్రియగు శ్రీమహాత్రిపురసుందరి – పైమూడిటి ఏకరూపత, బాహ్యాంతర జగదేకరూపత, ఉపాసకునకు ఈ మూడింటితోను ఐక్యాను సంధానము ఈ విజ్ఞానమంతయు శ్రీవిద్యాతంత్రము. ఈ సంప్రదాయమున కుండలిని, షట్చక్రములు మున్నగువాని ప్రస్తావన ఉండుటచే యోగముతో గూడ సంబంధము కలిగియున్నది. శుద్ధబ్రహ్మతత్త్వము శివాశివరూపమునగు సాదాఖ్య కళయొక్క ఉపాసనయు ఉపాసకుడు ఉపాస్యదేవతతో అభిన్న భావాను సంధానము జేయుటయు కల ఈ విద్య అద్వైతసంప్రదాయమున కభిన్నమైనది. తత్త్వమసీత్యాది మహావాక్యార్థమునకు అనుసంధాన రూపమైనది.

పరమేశ్వరప్రోక్తమగు శ్రీవిద్యాతంత్రము పంచదశీమంత్రరూపము. పరమేశ్వరప్రోక్తమైనది తొలుత కాదివిద్య. అనగా కకారము ఆదిబీజముగా

గల పంచదశీరూపము. దీనికి ప్రథమప్రవర్తకుడు మన్మథుడగుటచే దీనినే కామవిద్య యనియు, కందర్పవిద్యయనియు పేర్కొందురు. మూల మంత్రమున పదునైదుబీజములు మూడుకూటములుగా విభక్తమైయుండును. ప్రతికూటము చివర హృల్లేఖయుండును. ఈ విద్యాస్వరూపమును శ్రుతులిట్లు పేర్కొనుచున్నవి.

**“కామోయోనిః కమలా వజ్రపాణి ర్గుహా హసా మాతరిశ్వాభ్రమింద్రః।**
**పునర్గుహా సకలా మాయయాచ పురుచ్యేషా విశ్వమాతాది విద్యా ॥**

(త్రిపురోపనిషత్ -8 ; దేవ్యథర్వణశీర్షమ్ - 14)

కామః= కకారము; యోనిః=ఏ;కమలా=ఈ; వజ్రపాణిః= ల; గుహా=హ్రీం; హ; స; మాతరిశ్వా= క; అభ్రం=హ; ఇంద్రః= ల; గుహా= హ్రీం; సజ; క; ల; మాయయా=హ్రీం అనునది పై మంత్రోద్ధారసంకేతముల కర్థము. ఇందు మొదటి కూటమిలోని తొలిమూడు బీజముల స్థానములో హకార, సకార, కకారములను ఉంచినచో లోపాముద్రోపాసితమగు విద్యయగును. ఆది బీజము హకారమగుటచే దీనికి హాదివిద్యయని పేరు.

ప్రథమకూటమునందు ఆదిబీజము సకారముగా గలిగినది ‘సాదివిద్య’. ఇది నందీశ్వరోపాసితమగుటచే నందివిద్య అనియు పేర్కొనబడును. ఇందు మొదటి మూడుబీజములకు వరుసగా సకార,కకార, హకారములు.

కామరాజవిద్యయందలి త్రికూటములలోని హృల్లేఖాబీజములకు బదులు తృతీయకూటాంతమున మాత్రమే హృల్లేకనుంచినచో త్రయోదశాక్షరీ విద్యయగును. ఇది దౌర్వాససీవిద్య. దుర్వాసోపాసితము.

వీరుగాక ఈ విద్యాసంప్రదాయప్రవక్తలలో మరికొందరును ప్రసిద్ధులు - మనుశ్చంద్రకుబేరశ్చ లోపాముద్రాచ మన్మథః । అగస్తి రగ్ని స్సూర్యశ్చ ఇంద్ర స్స్కంద శ్శివస్తథా । క్రోధభట్టారకో దేవా ద్వాదశాదో ఉపాసకాః ॥ అని ‘వరివస్యారహస్యము’ వీరిని పేర్కొనుచున్నది.

పంచదశీమంత్రమునకు చివర శ్రీబీజమును చేర్చిన రూపమును శ్రీవిద్యయనియు, షోడశీవిద్యయనియు అందురు. ఈ బీజమును ప్రత్యేకముగా చేర్చనక్కరలేదనియు, దీని సూక్ష్మరూపము పంచదశీవిద్య యందే ఇమిడి ఉన్నది గనుక అదియే శ్రీవిద్యయు, షోడశీవిద్యయగుననియు కొందరి మతము.

ఈ విద్యాస్వరూపములో ఇంకను ఆదిమధ్యాంతములలో కొన్నికొన్ని బీజముల చేర్పులతో భిన్నభిన్న విద్యాసంప్రదాయము లేర్పడుచున్నవి.

పంచదశీమంత్రము వలెనే శ్రీచక్రముకూడ శక్తిస్వరూపము. ఇది కేవలము శక్తిస్వరూపమేగాక శివశక్త్యైక్యరూపము. శ్రీచక్రలేఖనమున భిన్నభిన్న సంప్రదాయములున్నను, శ్రీచక్రస్వరూపము మాత్రమొకటియే. శ్రీచక్రస్వరూపము వేదప్రతిపాదితము. ఈ క్రింది-

అష్టాచక్రా నవద్వారా దేవానాం పూరయోద్యా

తస్యాం హిరణ్మయః కోశః స్వర్గలోకో జ్యోతిషాదృతః ॥ (ఆనందోపనిషత్తు). ఇందు శ్రీచక్రమునందు అష్టచక్రములు, నవద్వారములుండునని వర్ణింపబడినది.

**బిందు త్రికోణవసుకోణ దశారయుగ్మ**
**మన్వస్ర నాగదళ షోడశపద్మయుక్తమ్ ।**
**వృత్తత్రయంచ ధరణీసదనత్రయంచ**
**శ్రీచక్రరాజ ఉదితః పరదేవతాయాః ॥**

(ల.ధ.వ్యా. శ్రీవిద్యారత్నాకరము) అని శ్రీచక్రస్వరూపము ప్రాచీనాచార్యులచే పేర్కొనబడినది.

శ్రీచక్రమునగల కోణములలో నాలుగు ఊర్ధ్వముఖములు, అయిదు అధోముఖములు. ఊర్ధ్వముఖకోణచతుష్కము శివాత్మకము. అధోముఖ కోణపంచకము శక్త్యాత్మకు. అధోముఖమనగా త్రికోణాగ్రము సాధకునకు

అభిముఖముగ నుండుట. (కౌలసంప్రదాయమున శివకోణములు నాలుగు అధోముఖముగను, శక్తికోణములు ఊర్ధ్వముఖముగను ఉండును.) ఇంతేగాక శ్రీచక్రమునందలి నవావరణశ్రీస్త్రులలో (త్రికోణ, వసుకోణ, దశారయుగ్మ, చతుర్దశారకోణ, అష్టదళ, షోడశదళ, వృత్తత్రయ, భూపురములలో) బిందువునావరించియున్నత్రికోణ, వసుకోణ, దశారయుగ్మ, చతుర్దశ కోణములు శక్తిస్వరూపములు. వీనికి పైనున్న అష్టదళ, షోడశదళములు, వృత్తత్రయ, భూపురములు శివస్వరూపములు. పరబ్రహ్మతత్త్వము మాయావరణమును పొందుటయే సహజముగాని మాయను పరబ్రహ్మ తత్త్వమావరించుట జరుగదు. కనుక, మాయావరణములలో ప్రథమమగు త్రికోణమధ్యమున పరబ్రహ్మ రూపమగు బిందువు లిఖింపబడును.

శ్రీచక్రము సృష్టిస్థితి లయాత్మకము. బిందు త్రికోణ, అష్టారములు సృష్టిచక్రములు. దశారయుగ్మ చతుర్దశారములు స్థితిచక్రములు. అష్టదళ, షోడశదళ, భూపురములు సంహారచక్రము. ('త్రిఖండం తే చక్రం. . .')

శ్రీచక్రమును త్రిఖండములుగా పేర్కొనుటయు కలదు. బిందుత్రికోణ అష్టదళములు ఆగ్నేయఖండము. దశారద్వయం, చతురస్రములు సౌరఖండము. చతుర్దశార, షోడశారదళములు చంద్రఖండము. ఇట్లు శ్రీచక్రము సోమ సూర్యానలాత్మకమైనట్లే పంచదశీ మంత్రమునందలి త్రిఖండములను గూడ వరుసగా సోమసూర్యానలాత్మక ములందురు. ఇట్లీ రెంటికినీ ఐక్యము. దేవీ స్వరూపముకూడ మంత్రమునకభిన్నమే. మంత్రమున ప్రథమకూటమగు వాగ్భవ కూటము దేవీముఖముగను, రెండవదైన కామరాజకూటము కంఠము మొదలు కటివరకుగల దేవీశరీరముగను, తృతీయమగు శక్తికూడము కట్యధో భాగమును చెప్పబడును. (శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా, కంఠాధః కటిపర్యంత మధ్యకూట స్వరూపిణీ, శక్తికూటైకతాపన్న కట్యధో

భాగధారిణీ, మూలమంత్రాత్మికా మూలకూటత్రయకళేబరా" (శ్రీల.స.నా శ్లో. 34,35&36)

శ్రీచక్రమును మానవదేహమున భావించుటను భావనోపనిషత్తు విశదీకంచినది. ("To add latter from Seperate Sheet enclosed at teh ending of this essay" - దొరకలేదు. చూడాలి) షట్చక్రాత్మకమగు మానవశరీరమున సోమసూర్యానలాత్మక ఖండములు నిరూపింపబడినవి. షట్చక్రములకూర్ధ్వభాగమునగల సహస్రారచక్రమే బైందవస్థానము. ఇదియే దేవీ నివాసము. దీనిని సరఘా, సుధాసింధువు, యావకాబ్ధి, అనునామములతో శ్రుతులును, తంత్రశాస్త్రగ్రంథములును వర్ణించినవి. ఈ యంశము ఈ వ్యాసములోని అనంతరభాగములలో వివరింపబడుచున్నది.

సౌందర్యలహరీ స్తవమునగల శ్రీవిద్యాసంప్రదాయమును లక్ష్మీధరాది వ్యాఖ్యాతలు సమయమతానుగుణముగ వివరించిరి. ప్రస్తావనవశముల విషయ స్పష్టతకై సమయమతమునకు భిన్నమగు కౌలసంప్రదాయమెట్లుండునోగూడ లక్ష్మీధరులు పేర్కొనిరి. సమయమత సంప్రదాయమును వివరించు గ్రంథములుగా శుభాగమపంచకము (వశిష్ఠ, సనక, శుక, సనందన, సనత్కుమార కృతములగు అయిదు ఆగమములు.), రుద్రయామళమునందలి దశమపటలములు, గౌడపాదుల సుభగోదయస్తవము ప్రసిద్ధములు. వీనిలో శుభాగమపంచకము అలభ్యము. (ఈ ఆగమవచనములను లక్ష్మీధరులు ఉద్ధరించుటచే, అవి లక్ష్మీధరులకాలము నాటికి లిఖితముగనో, గురుపరంపరా- గతముగ మౌఖికముగనో నిలిచియుండెనని నిర్ణయింపవచ్చును). తక్కిన రెండును వ్యాఖ్యానసాపేక్షములు. రుద్రయామళమునకు ప్రాచీనమగు విపుమగు వ్యాఖ్యానము కనిపించుటలేదు. సుభగోదయస్తవమునకు లక్ష్మీధరులు రచించిన వ్యాఖ్య లభించుటలేదు. సౌందర్యలహరీ వ్యాఖ్యానమునందు

లక్ష్మీధరులు సమయమతమును సందర్భానుగుణము వివరించి, వివరములకు తమ సుభగోదయవ్యాఖ్యను చూడుడని పేర్కొనిరి. అది అలభ్యమగుటచే సమయసంప్రదాయమును స్పష్టీకరించుటకు గల ఏకైక ఆధారము లక్ష్మీధరుల సౌందర్యలహరీ వ్యాఖ్యయే. ఈ విషయమును బలదేవ ఉపాధ్యాయ మున్నగు విమర్శకులందరును అంగీకరించిరి. బ్రహ్మసూత్రశక్తి భాష్యమునందును, భాస్కరరాయాచార్యుల లలితాసహస్రనామ భాష్యమునందును కూడ సమయమతము వివరింపబడినది. వీనికిని లక్ష్మీధరుల సౌందర్యలహరీ వ్యాఖ్యయే ఆధారము.

**సమయాచారము:**

సమయ శబ్దము అనేక విధములుగ నిర్వచింపబడినది. 'సమ్ – అయః శుభావహోవిధిః' అనగా శుభావహమగు సంప్రదాయము సమ్యగయనముచే సహస్రారమును చేరుటచే కుండలిని 'సమయ'. 'సమం యాతీతి సమయా' పరమేశ్వరి, పరమేశ్వరునితో సామ్యమును పొందుచున్నది గనుక ఆమె సమయాఖ్య. ఈ సమయాచార తత్పరులను సమయిశబ్దముచే పేర్కొందురు.

సమయాచారమున పంచవిధసామ్యములకు ప్రముఖస్థానము గలదు. ప్రతి చక్రమునందును శివాశివులకు పంచవిధసామ్యములు నిరూపింపబడునవి. అధిష్ఠాన, అవస్థాన, అనుష్ఠాన, నామ, రూప పంచవిధ సామ్యములనబడును. సమయమతమున చతుర్విధ, షడ్విధైక్యములుకూడ పేర్కొనబడినవి. మూలాధారాది షట్చక్రములకు త్రికోణాది షట్చక్రముల తోను, బిందువునకు చతురశ్ర సహస్రకమలములతోను, శివాశివులతోను తాదాత్మ్యమును అనుసంధానము చేయుట త్రివిధతాదాత్మ్యము, శ్రీచక్రమునకు, శ్రీవిద్యా మంత్రమునకు తాదాత్మ్యము నాలుగవది. ఇవి నాలుగు చతుర్విధైక్యము లు అనబడును. కొందరి మతమున

షడ్విధైక్యముకూడ చెప్పబడినది. నాద బిందు కళల పరస్పరైక్యానుసంధానము షడ్విధైక్యము.

సమయమతమున ప్రాచీనాచార్యుల అభిప్రాయమున షట్చక్రముల బాహ్యపూజకాదు. సహస్రారమున మాత్రమే పూజ ఉండును. కాలక్రమమున సమయాచారమున నాలుగు విధానములేర్పడినవి. (బాహిరేవ కేచిదపరే – సుభగోదయః) వైదిక మార్గమున బాహ్యమున శ్రీచక్రమునర్చించుట మొదటిది. వైదికమార్గమున బాహ్యముగ శ్రీచక్రమునర్చించుటతోబాటు; దహరంతర విశుద్ధమున శ్రీచక్రమునర్చించుట (అంతర్యాగము) రెండవది. కేవలమంతర్యాగము మూడవది. తురీయమగు దశలో అర్చనముండదు. మంత్రపురశ్చరాదులుండవు. కేవలము సాధకుడు తనకును, పరబ్రహ్మతత్త్వమునకును ఐక్యానుసంధానము గావించుటయే ఉండును. ఈ నాలుగును ఉత్తరోత్తరముగ ఉత్కృష్టములు. ప్రాచీనుల మతమున ఈ నాలుగవ దశయే సమయాచారులకు పరమగమ్యము. ప్రత్యక్షములగు పంచమకారములతో చేయు పూజకు భిన్నమై వైదికసంప్రదాయ బద్ధమగు బాహ్య శ్రీచక్రపూజనము సమయాచారమే యగును. సాధకుల తరతమ భేదములనుబట్టి ఈ నాలుగు దశలును ఏర్పడినవి. పూర్వపూర్వదశలు, ఉత్తరోత్తర దశలకు కారణములై సాధకునకు సిద్ధిదాయకములగుచున్నవి.

## కౌలాచారము

మూలాధారములోని కులకుండమునందు కుండలినీశక్తి సర్పాకారమున నిద్రించుచుండును. (అవాప్య స్వాంభూమిం...) కులకుండమున కుండలినీరూపమగు పరాదేవిని అర్చించువారు కౌలులు. కౌలులచే అనుష్ఠింపబడు మార్గము కౌలము. (కౌలైః మృగ్యతే అవలంబ్యత ఇతి కౌలమార్గః, కౌలమతమే, కర్మణి ఘఞ్ (ల.ధ.వా. పుట : 269) కౌలమార్గము అవైదికమనియు, కనుక అది సామయికులగు వైదికాచార తత్పరులకు గాదనియు లక్ష్మీధరులు

పేర్కొనిరి. కౌలము బాహ్యాపూజావిధానము. బాహ్యాకాశమున శ్రీచక్రమునర్చించుటయే కౌలసంప్రదాయము. కౌలుల పూజా విధానమున పంచమకారములు (మద్య మత్స్య మాంస ముద్రా మైథునములు) ప్రత్యక్ష రూపమున వినియోగింపబడును. కౌలుల అర్చన అంతయు మూలాధారముననే సాగును. కులకుండమున సుషుప్త్యవస్థలో నున్న కుండలినీ శక్తిని జాగృతమొనర్చుటయే వారికి ముక్తి. కనుకనే "క్షణ ముక్తాః కౌలాః" అని వ్యవహారము. (ల.ధ.వ్యా. పుట:352) కౌలమతమున త్రికోణమే బిందుస్థానము. ఈ త్రికోణము ద్వివిధము. శ్రీచక్రాంతర్గతనవయోనిమధ్య వర్తినియగు త్రికోణము నర్చించుట యొక మార్గము. సుందరియగు తరుణి యొక్క ప్రత్యక్ష యోని పూజనము రెండవది. మొదటిది పూర్వకౌలుల మార్గము. రెండవది ఉత్తర కౌలుల సంప్రదాయము. ఆధారచక్రగతమగు కుండలినీశక్తియే కౌలిని. అచట ఆదేవి నర్చించు కౌలులు త్రికోణపూజకు లనుటయే కౌలమతరహస్యము. ఈ పూజ తమోగుణప్రధానము. షట్చక్రములలో ఆజ్ఞా విశుద్ధి చక్రములు జ్యోతిర్లోకములు. అనాహతమణి పూరములు మిశ్రములు. స్వాధిష్ఠానాధారములు తమోలోకములు. కౌలుల అర్చన తమోమయమగు ఆధారచక్రమున జరుగును. కనుక వారి పూజ తామిస్రము.

## సమయ - కౌల సంప్రదాయ భేదములు

వైదికాచరముననుసరించి శ్రీచక్రము నర్చించువారికిని, కౌలులకును కొన్ని ప్రధానభేదములు గలవు. సమయమతానుయాయుల అర్చనలో శ్రీచక్ర మధ్యమునగల త్రికోణము అధోముఖముగ అనగా సాధకునకభిముఖముగ నుండును. కౌలుల అర్చనలో ఊర్ధ్వముగనుండును. అనగా నవయోన్యాత్మక మగు శ్రీచక్రమున శక్తికోణములైదును అధోముఖములుగ, శివకోణములు నాలుగు ఊర్ధ్వముఖలుగా నుండుట సమయసంప్రదాయముకాగా, శివకోణములధోములుగను,

శక్తికోణములూర్ధ్వముఖముగను ఉండుట కౌల సంప్రదాయము. కౌలులకు బిందువు త్రికోణాంతర్గతముకాగా, సమయులకు చతుష్కోణాంతర్గము. (త్రికోణం తే కౌలాః కులగృహమితి ప్రాహురపరే చతుష్కోణం ప్రాహుః సమయిన ఇమే బైందవవ్యూహమ్. సుభగోదయ పూర్వపీఠికా. పుట 19) సహస్రారపద్మమందు గల చతురస్రాకృతియగు చిచ్చంద్రమండలమున పరదేవిని అర్చించుట సమయాచారము. కౌలులకు సహస్రామందు అర్చనలేదు. అచట దేవీపాదములనుండి అమృతము స్రవించుట, అది సాయుజ్యముక్తిని గూర్చుట సమయసంప్రదాయ సిద్ధమేగాని, కౌలులకు వాని ప్రసక్తిలేదు. కౌలులు మద్య, మత్స్య, మాంస, ముద్రా, మైథునములతోచేయు అర్చనయందు ప్రత్యక్ష పదార్థములనే వినియోగింతురు. అర్థాంతరములను కల్పించి సమయాచారమునకు ఉపయోగపడునట్లు పంచమకారములను కొందరు వ్యాఖ్యానించిరి.

"దక్షిణామూర్తి సంప్రదాయే బిందుమారభ్య భూపురపర్యంతం సృష్టిక్రమేణార్చనం; భూపురమారభ్య అష్టదళపర్యంతం (అష్టారపర్యంతం) పునశ్చ బిందుమారభ్య చతుర్దశారపర్యంతం పూజనం స్థితిక్రమే; భూపురమారభ్య బిందుపర్యంతమర్చనం సంహారక్రమే" (శ్రీవిద్యారత్నాకరః పుట: 200) అని శ్రీచక్రార్చనా విధానమున బిందువుతో నారంభించి వరుసగా చక్రనవకము నర్చించి, మరల బిందువునర్చించుట సృష్టిక్రమము యనబడును. బిందువు నర్చించిన తరువాత భూపురము మొదలు బిందువువరకు అర్చించుట సంహార క్రమము. సృష్టిక్రమము అర్చన సమయాచారవిహితమనియు, సంహారక్రమమున పూజావిధానము కౌలపద్ధతి యనియు లక్ష్మీధరులు పేర్కొనిరి. ఇవిగాక స్థితిక్రమమున శ్రీచక్రమునర్చించు సంప్రదాయముకూడ కలదు. (బిందువు నర్చించిన తరువాత అష్టదళపద్మముతో నారంభించి భూపురమువరకు అర్చించి, తరువాత మన్వస్రమునుండి వరుసగా బిందువు వరకు అర్చించుట

స్థితిక్రమము.) సంహారక్రమము యతులకు సృష్టిక్రమము గృహస్థులకు స్థితిక్రమము బ్రహ్మచారులకును, స్త్రీలకును విహితమని సంప్రదాయవచనము.

షోడశనిత్యలకు శ్రీచక్రమునగల వివిధకోణములలలో తాదాత్మ్యమును నిరూపించి, చక్రవిద్యకును చంద్రకళావిద్యకును అంగభూత ములుగ ఆగమములు ప్రతిపాదించినవి. వసిష్ఠ సనందన సనత్కుమార సంహితలు వరుసగా మేరు, కైలాస, భూ ప్రస్తారములను నిరూపించినవి.

శ్రీచక్రనిర్మాణమునందు గూడ మేరు, కైలాస, భూ ప్రస్తారములు పేర్కొనబడినవి. శ్రీచక్రమును బీజయుక్తముగను, బీజరహితముగను నిర్మించుట కలదు. బీజాత్మకమగు శ్రీచక్రము తురీయాశ్రమమును స్వీకరించినవారికినీ, ఇతరులకు బీజాక్షరరహితమగు శ్రీచక్రమును అర్చనీయముగా సంప్రదాయము ప్రతిపాదించుచున్నది.

## 2. సౌందర్యలహరి - తంత్రము

సౌందర్యలహరిలోగల తంత్రము అఖిలపురుషార్థములను ప్రసాదించు స్వతంత్రమగు తంత్రమనియు, దీనిని సాక్షాత్తు పరమేశ్వరి సృష్టించి లోకమునకు ప్రసాదించెననియు ఆదిశంకరులు (శ్లో.సం. 31)లో విశదము చేసిరి. అనగా సౌందర్యలహరిలో భగవతి చెప్పిన తంత్రము శ్రీవిద్యాతంత్రము. ఇది సమయాచారప్రధానము. సమయాచారము వేదమార్గమననుసరించునది.

భారతీయుల జీవనసరళి ధర్మార్థకామమోక్షములనెడు నాలుగు మార్గములతో సాగును. దానికి అనుగణమగు శృతి, స్మృతి, ఇతిహాస, పురాణ, శాస్త్ర, కావ్యాదుల రూపములో వెలసియున్నది. వివిధ తాత్త్వికమార్గములలో తంత్రమార్గమొకటి.

తంత్రశబ్దము 'తన' ధాతువుపై 'ష్ట్రన్' ప్రత్యయము చేయగా నిష్పన్నమగును. మంత్రోపాసన సదాచారాది రూపములలో ఏది లోకమును కాపాడునో అది తంత్రము. ఈ విషయమే క్రముకాగమములో ఇట్లు చెప్పబడినది. –

**'తనోతి విపులానర్థాన్ తంత్రమంత్రసమన్వితాన్**
**త్రాణం చ కురుతే యస్మాత్తస్మాత్తంత్రమితీర్యతే'**

తంత్రవాఙ్మయమునకు మూలములు వేదములలోనే ఉన్నవి. సాంకేతికపదాల రూపములో గాయత్రి మొదలగు మంత్రములు, త్రిపురోపనిషత్తులో పంచదశి మొదలగు మంత్రములు కర్మ, ఉపాసన, జ్ఞాన మార్గములకు ఉపబలకము.

వేదాలలో పుట్టిన ఈ తంత్రమార్గము క్రమముగ శైవ, వైష్ణవ, శాక్త, జైన, బౌద్ధాది దర్శనములలోను కనిపించును.

శాక్తతంత్రములలో వామ–దక్షిణ పద్ధతులున్నవి. వామాచారములో వామ, కౌలములను భేదములు కనబడుచున్నవి. కౌలాచారములోను పూర్వకౌలమనియు, ఉత్తరకౌలమనియు భేదములున్నవి.

దక్షిణమార్గమును సమయాచారమందురు. ఇది సాత్త్వికమై వేదములకు అనుగుణమైయుండును. శక్తి ఉత్కృష్టతను తెలుపునవి శాక్తతంత్రములు. ఇందులో శక్తియే ప్రధానము. శివుడు అప్రధానము. శాక్తతంత్రములను పరమేశ్వరుడు పరమేశ్వరి కోరికపై లోకమున వ్యాప్తిచేసెను.

చతుష్షష్ట్యాతంత్రైః (శ్లో.31)లోని సారాంశమేమనగా ఈశ్వరుడు ఈ లోకమును మోహపరచుటకు 64 తంత్రములను లోకమునకు అందించెను. ఆ తరువాత పరమేశ్వరికోరికపై ఈ శాక్తతంత్రమును చెప్పెను. అనగా 64 తంత్రములతోబాటు, 65వ తంత్రమైన శ్రీవిద్యాతంత్రమును

సైతము పరమేశ్వరుడే లోకమునకు ప్రసాదించెను. పరమేశ్వరుడు చెప్పిన 64 తంత్రములు వేదవిరోధులుగ కనిపించును. కాని, సాధకులను పరీక్షించుటకు పరమశివుడే ఇట్లు చెప్పెననుట యథార్థము. ఈ సందర్భమున శివుడు చెప్పిన 64 తంత్రముల నామములను స్మరింపవలెను.

1. మహామాయాశాంబరము, 2. యోగినీజాల శాంబరము, 3. తత్త్వ శాంబరము, 4. సిద్ధభైరవము, 5. వటుకభైరవము, 6. కంకాళభైరవము, 7. కాలభైరవము, 8. కాలాగ్నిభైరవము, 9. యోగినీభైరవము, 10. మహాభైరవము, 11. శాక్తభైరవము, 12. బ్రాహ్మీ, 13. మాహేశ్వరీ, 14. కౌమారీ, 15. వైష్ణవి, 16. వారాహీ, 17. మాహేంద్రీ, 18. చాముండా, 19. శివదూతీ, 20. యమలాష్టకము, 21.యమలాష్టకము, 22. యమలాష్టకము, 23. యమలాష్టకము, 24. యమలాష్టకము, 25. యమలాష్టకము, 26, యమలాష్టకము, 27. యమలాష్టకము, 28. యమలాష్టకము, 29. చంద్రజ్ఞానము, 30. మాలినీ, 31. మహాసమ్మోనము, 32. వామజుష్టము, 33. మహాదేవము, 34. వాతులమ్, 35. తాతులోత్తరం, 36. కామికం, 37. హృద్భేదతంత్రము, 38. తంత్రభేదము, 39. గుహ్యాతంత్రము, 40. కళావాదము, 41. కాలసారమ్, 42. కుండికామతము, 43. మతోత్తరమతము, 44. వీణాతంత్రము, 45. త్రోతలము, 46. త్రోతలోత్తరము, 47. పంచామృతము, 48. రసభేదతంత్రము, 49. రసభేదతంత్రము, 50. రసభేద తంత్రము, 51. రసభేదతంత్రము, 52. రసభేదతంత్రము, 53. సర్వజ్ఞాన తంత్రము, 54. సర్వజ్ఞానతంత్రము, 55. సర్వజ్ఞానతంత్రము, 56. సర్వజ్ఞాన తంత్రము, 57. సర్వజ్ఞానతంత్రము, 58. పూర్వతంత్రము, 59. పూర్వతంత్రము, 60. పూర్వతంత్రము, 61. పూర్వతంత్రము, 62. పూర్వతంత్రము, 63. పూర్వ తంత్రము, 64. పూర్వతంత్రము.

# 3. యోగము

మానవజీవితపరమార్థమగు జీవబ్రహ్మైక్యమును సాధించుటకు ప్రాచీనమహర్షులు ప్రతిపాదించిన మార్గము యోగదర్శనము.[1] ఇది వేదప్రతిపాదితము. యోగమనగా చిత్తవృత్తినిరోధమని పతంజలి నిర్వచించెను.[2] యోగసిద్ధికి యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధులను అష్టాంగములను కూడ ఆయన నిరూపించెను.

శ్రీవిద్యాసంప్రదాయమున తంత్రయోగములు రెండును ఓతప్రోతములుగ కలిసిపోయినవి. గురుకృపాలబ్ధమగు మంత్రపురశ్చరణాదులచే మూలాధార చక్రమున సుషుప్త్యవస్థలోనున్న కుండలినీశక్తిని మేల్కొలిపి సహస్రారమును చేర్చి షట్చక్రములను సుధాప్లావితమొనర్చుటయే తాంత్రికులు ప్రతిపాదించిన యోగము.

శ్రీవిద్యాసంప్రదాయమున మానవదేహము నందలి మూలాధారాది షట్చక్రములలో, బాహ్యప్రపంచమంతయు సూక్ష్మరూపమున నిమిడియున్నది. బాహ్యప్రపంచము అండాండము. మానవదేహము పిండాండము. వీని ఐక్యమునే యోగము ప్రతిపాదించుచున్నది. మూలాధార స్వాధిష్ఠానమణి పూరానాహత విశుద్ధ్యాజ్ఞాచక్రములు వరుసగా పృథివ్యాపస్తేజోవాయురాకాశ మనస్తత్వాత్మకములు.

మూలాధారచక్రము గుదస్థానమునకు రెండంగుళములపైన చతుర్దళపద్మాకృతిలో నుండును. లింగమూలమున స్వాధిష్ఠానము, షడ్దళ పద్మాకృతియగు నాభిమూలమున మణిపూరము దశదళపద్మాకృతిలోను,

---

1. ఐక్యం జీవత్మనోరాహుః యోగం యోగవిదోవిదుః – శ్రీదేవీభాగవతము, సప్తమస్కంధం, అధ్యా. శ్లో.

2. యోగశ్చిత్తవృత్తినిరోధః – (పా.యో.సూ. 1)

హృదయమున అనాహతము ద్వాదశదళకమలాకృతిలోను, కంఠమున విశుద్ధచక్రము షోడదళపద్మాకృతిలోను, భ్రూమధ్యమున ఆజ్ఞాచక్రము ద్విదళాకాకృతి లోను, తొలి అయిదుచక్రములలోను పృథివ్యాదితత్త్వ పంచకము వరుసగా గంధ రస రూప శబ్ద స్పర్శ పంచతన్మాత్రల రూపమునుండును. మనస్తత్త్వాత్మకమగు ఆజ్ఞాచక్రమున కూర్ధ్వముగా బ్రహ్మరంధ్రసమీపమున నిర్వాణ చక్రమనబడు సహస్రదళపద్మముండును. తొలి ఆరుచక్రముల సమూహము కులపథ మనబడును. సహస్రారమునకు అకులపద్మమనియు పరిభాష. సాధారణస్థితిలో అధోముఖములుగ నుండును. యోగసాధకుడు సాధనలో దీనిని ఊర్ధ్వ ముఖములుగా చేసి, సహస్రారమునుండి స్రవించు సుధావర్షముచే ఆప్లావితము చేయుటచే తత్తత్పూర్వములను జయించి, వశముచేసికొని, ముక్తుడగును. ఇదియే పరబ్రహ్మనివాసముగ యోగులును, తాంత్రికులును చెప్పుదురు. మూలాధారము ఊర్ధ్వముఖముగ నుండు పద్మము. సహస్రారము అధోముఖమగు పద్మము. స్వాధిష్ఠానమణిపూర అనాహత ఆజ్ఞా విశుద్ధి చక్రములైదును, పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, మనస్సు, మాయ, శుద్ధవిద్య, మహేశ్వర, సదాశివతత్త్వములు పంచవింశతి తత్త్వములు.[1] మాయ వరకు గల తత్త్వములన్నియు మాయాసంబంధములగుటచే ప్రాకృతికములు. మాయ మహేశ్వర తత్త్వముతో చేరి మహేశ్వరతత్త్వమునకు జీవభావమును కల్పించును. ఆ జీవుడును ప్రాకృతుడే. శుద్ధవిద్య సదాశివునితో కూడినదై సాదాఖ్యకళయని వ్యవహరింపబడును. అందుచే భగవతి చతుర్వింశతి తత్త్వముల నతిక్రమించినదై 25వ తత్త్వమగు సదాశివునితోకూడి విహరించు 26వ తత్త్వమై పరమాత్మయని కీర్తింపబడుచున్నది. ఇది నాదబిందు

---

1. తత్త్వసంఖ్యావిషయమున ఆయా దర్శనములలో మతభేదము కలదు.

కళాత్మకమైనది. పరబ్రహ్మ తత్త్వమను ఈ సాదాఖ్యకళ సహస్రారకమల కర్ణికాంతర్గతమగు బైందవస్థానమున చతుష్కోణమధ్యవర్తియై యుండును. ఈ బైందవ స్థానమే సుధాబింధువు. సరఘా యావకాబ్ధి అని సంకేత నామములతో వ్యవహరింపబడుచున్నది. ఆధారాది కమలములలో పృథివ్యాది తత్త్వములకు సంకేతములుగా ల, వ, ర, య్ర, య, హ బీజములుండును. ఈ ఆరు చక్రములలోను ఆజ్ఞాది మూలాధార పర్యంతము మూడుజంటలుగా సోమసూర్యానలాత్మకములను, మూడు మండల ములగును. అగ్నిమండలముకడ బ్రహ్మగ్రంథియు, సూర్యమండలముకడ విష్ణుగ్రంథియు, సోమమండలముకడ రుద్రగ్రంథియు ఉండును. ఈ గ్రంథిత్రయమును భేదించి కుండలిని సహస్రారమును జేరును.

మూలాధారాద్యాజ్ఞాంతమగు ఆరుచక్రముల యందును వరుసగా 56, 52, 62 54 72, 64 మయూఖములు కలిసి మొత్తము 360 మయూఖములు చెప్పబడినవి. మూలాధారపద్మమునందలి ఇరువది యెనిమిది తత్త్వములతో పంచతన్మాత్రలు, జ్ఞానేంద్రియపంచకము, కర్మేంద్రియపంచకము, మనోబుద్ధి చిత్తాహంకార కాల ప్రకృతి పురుష మహత్తులు మొత్త మీ ఇరువది యెనిమిది. స్వాధిష్ఠామున పంచభూతములు, జానేంద్రియ కర్మేంద్రియపంచకములు, ఇంద్రియ దశకముచేత జ్ఞేయములు పదియును కలిసి ఇరువదియారు. తైజస తత్త్వాత్మకమగు మూడవ చక్రమున ఈ ఇరువదియారు తత్త్వములకును పంచ తన్మాత్రలు చేరి, ముప్పదియొకటి అగును. నాలుగవదియగు అనాహత చక్రమున మూలాధారములోని ఇరువదియెనిమిదింటిలో మహత్తుతప్ప తక్కిన ఇరువదియేడును ఉండును. ఆకాశతత్త్వాత్మకమగు విశుద్ధిచక్రమున జ్ఞానేంద్రియ కర్మేంద్రియ పంచకములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, శివశక్తి, సదాశివ, ఈశ్వర, శుద్ధవిద్యా, మాయా, కళా, విద్యా, రాగ, కాల, నియతి, పురుష,

ప్రకృతి, అహంకార, మనోబుద్ధులు కలిసి మొత్తము ముప్పదియారు, మనస్తత్త్వాకమగు ఆజ్ఞాచక్రమున పరా, పశ్యన్తీ, మధ్యమా, వైఖరీ అను వాక్చతుష్టయము పంచవిధములగు ఇచ్ఛాశక్తులు, చతుర్విధజ్ఞానములు, సప్తవిధ క్రియాశక్తులు, కుండలినియొక్క భూమికాచతుష్టయము, మాతృకావర్ణముల ఎనిమిదివర్గములు మొత్తము ముప్పదిరెండు తత్త్వములు. కామేశ్వరసూరి మతమున ఆజ్ఞాచక్రమునందలి ముప్పది రెండు తత్త్వములు, విశుద్ధిచక్రములోని ముప్పదియారింటిలో శివ, శక్తి, సదాశివ ఈశ్వరతత్త్వములుకాక మిగిలినవి ముప్పదిరెండని చెప్పబడెను.[1] (అరుణామోదినీ వ్యాఖ్య: శ్లో.వ్యా.పు.) ఇవి మూలాధారము నందలి నాలుగు దళములలో ఒక్కొక్కదానిలో ఏడింటి వంతున ఇరువది యెనిమిదియు, షడ్దళాత్మకమగు జలచక్రమున 4, 4, 6, 4, 5, 3 సంఖ్యలుగా విభక్తమై ఇరువదియారును, ఆగ్నేయమగు మూడవచక్రములగల పది దళములలో తొమ్మిదింటిలో మూడేసియు, పదవదానిలో నాలుగును మొత్తము ముప్పదియొక్క తత్త్వములు. అనాహత చక్రమునందలి పన్నెండు దళములలో ఒకటవ, ఆరవ, తొమ్మిదవచక్రములలో మూడేసియు, తక్కిన తొమ్మిదింటిలో ఒక్కొక్కదానియందు రెండును మొత్తము ఇరువదియేడు తత్త్వములు. విశుద్ధి చక్రమున ఒకటవ, పదమూడవ దళములలో నాలుగేసియు, తక్కిన పదునాలుగు దళములలో రెండేసియు మొత్తము ముప్పదియారును తత్త్వములుండును. ఆజ్ఞాచక్రమున రెండుదళములలో ఒక్కొక్కదానియందు నాలుగింటి సమూహముగల నాలుగుభాగములుగా ముప్పదిరెండు తత్త్వములు ఉండును. ఈమొత్తము నూటయెనుబదియును, శివశక్తి, సంబంధిభేదముచే రెండింతలై మొత్తము మున్నూటరువది మయూఖములగును. అంతర్యాగ విధానమున వీనిని మాతృకాబీజ రూపమున భావించుటయున్నది. అకారాది హకారాంతమగు 50 వర్ణములు మాతృకావర్ణములు. వీనికి శక్తిబీజత్రయము, బాలాబీజత్రయము చేర్చి 56

మూలాధారమున భావింపబడును. రెండవ చక్రమున మాతృకా వర్ణములకు అమృతబీజము, శ్రీబీజము చేర్చి భావింపబడును. మూడవ చక్రమున మాతృకావర్ణములకు ఔకారము హంసబీజ ద్వయము అనుమూడును నాలుగుమారులు ఆవృత్తములై చేర్చబడి, 62 వర్ణములుగా ధ్యానింపబడును. అనాహతచక్రమున మాతృకావర్ణములకు పృథివ్యాపస్తేజోవాయుబీజములు చేర్చి 54 భావింపబడును. విశుద్ధిచక్రమున బిందు విసర్గముతప్ప తక్కిన పదునాలుగు స్వరములు అయిదుమార్లు ఆవృత్తములై వాగ్భవశక్తిబీజములతో కూడి 72 వర్ణములుగా భావింపబడును. ఆజ్ఞాచక్రమున షోడశస్వరములు నాలుగుమార్లు ఆవృత్తములై 64 వర్ణములుగా ధ్యానింపబడును. ఇవి మొత్తము అన్ని చక్రములలోను కలిసి 360 అగును. ఈ మున్నూటరువది మయూఖములును మూలాధారాద్యాజ్ఞాంతమగు షట్చక్రములకు సంబంధించినవి. ఈ 360 మయూఖములకు ఊర్ధ్వముగా చిచ్ఛక్తియగు దేవి సహస్రారమునందలి జ్యోత్స్నాలోకమున నుండి తన చరణ కిరణములచే సోమ సూర్యానలాత్మకములగు షట్చక్రములను భాసింపజేయును. అనగా పరమేశ్వరీచరణకిరణములే 360 మయూఖములు. ఈ 360 మయూఖ సంఘము 360 దినాత్మకమగు సంవత్సరకాలమునకు సంకేతము. వీనికి ఊర్ధ్వమున నుండునవి పరమేశ్వరీచరణములు గనుక పరమేశ్వరి కాలాతీత.

మూలాధారాది షట్చక్రములలో పరమేశ్వరీ పరమేశ్వరులు పంచవిధ సామ్యములను పొంది ఉందురనుట తంత్రవిషయమున ప్రస్తావింపబడినది. సృష్టిస్థితిలయములు షట్కమలములలోని శివాశివుల అనుష్ఠానరూపములే.

ఇట్టి మహత్తరమగు యోగమును గురుకృపాలబ్ధమగు పరమేశ్వరీ ప్రసాదమున పొందగలిగిన సాధకుడు కూడ పరతత్త్వముచే అభేదాను-సంధానము వలన సాయుజ్యముక్తిని పొందగలుగును. ఇది యోగరహస్యము.

మానవ శరీరమునందలి త్వగసృఙ్మాంసమేధోస్తి, త్వక్, సృక్, మాంస, మేధో, అస్తితత్త్వములు ఐదును శక్తి చక్రములగు త్రికోణ, వసుకోణ, దశారయుగ్మ, మన్వస్రములుగను; మజ్జా శుక్ల ప్రాణాదివాయు పంచక, జీవతత్త్వములు నాలుగు అష్టదళ, షోడశదళ పద్మములును, మేఖలాత్రయ, భూపురత్రయములనబడు శివచక్రములుగను పరిణమించును. దశమయగు పరాశక్తి పదియవ ధాతువు ఇట్లు ధాతువులకును, శ్రీచక్రమునకు ఐక్యము చెప్పబడినది.

మూలాధారాది షట్చక్రముందుగల పరమేశ్వరీ రూపములకును, పై తత్త్వములతో సంబంధము చెప్పబడినది. విశుద్ధిచక్రమునగల దేవి త్వక్స్థ; అనాహత చక్రమున రుధిరసంస్థిత, మణిపూరచక్రమున మాంసనిష్ఠ, స్వాధిష్ఠానమున మేదోనిష్ఠ; మూలాధారమున అస్థిసంస్థిత. ఆజ్ఞాచక్రమున మజ్జాసంస్థ, సహస్రదళపద్మస్థయగు పరతత్త్వాత్మిక శుక్లసంస్థిత. ఇట్లు ధాతుసప్తకమునకు షట్చక్రసహస్రారములతో సంబంధము చెప్పబడినది.

## 4. తంత్ర-యోగ సమన్వయము

శ్రీశంకరభగవత్పాదుల పరమాచార్యులగు శ్రీగౌడపాదచార్యులు రచించిన సుభగోదయస్తుతిని ఆయన స్తోత్రముగా పేర్కొనలేదు. శ్రీచక్రమునకు, శ్రీవిద్యకు, పరమేశ్వరికి అభిన్నతను ప్రతిపాదించుచు చక్రాదిస్వరూపణముచేసి, కౌలసమయ సంప్రదాయముల తారతమ్యములను నిరూపించుచు శాస్త్రముగ గౌడపాదులు సుభగోదయస్తుతిని పేర్కొనిరి.[1] ('ఇదం శాస్త్రముదితమ్ - సుభగోదయము: శ్లో50)

శ్రీశంకరులు పరమాచార్యుల భావములనే ప్రవచించినను, వాటిని మరింత కవితాత్మకముగ తీర్చి సౌందర్యలహరిని స్తోత్రముగా నిర్మించిరను విషయము పూర్వమే ప్రతిపాదింపబడినది. సౌందర్యలహరి స్తవమునందు

ప్రధానముగా ఆనందలహరీ విభాగముగా పలువురు పేర్కొన్న తొలి 41 శ్లోకములలో ఈ తాంత్రిక విషయప్రతిపాదనము సుస్పష్టముగ గోచరించును. ఇందు ఒకటి–రెండు దేవీమహిమను వర్ణించినవియు, కొన్ని ప్రత్యేకమగు దేవతా స్వరూప ప్రభావములను ప్రకటించుచున్నను, పెక్కు శ్లోకములలో శ్రీవిద్యా సంబంధులగు వివిధాంశములు ప్రస్తావింపబడినవి. ఆయా శ్లోకములను కూర్చుటలో శ్రీశంకరులు చక్కని ప్రణాళికను అనుసరించిరి.

స్తోత్ర ప్రారంభశ్లోకమునందే శ్రీశంకరులు శ్రీవిద్యాప్రభావము, దేవీమహిమ, శ్రీచక్రస్వరూపము, శివశక్త్యైక్యము మున్నగు పెక్కు శాస్త్రీయాంశములను సూచించిరి. తరువాతి శ్లోకములలో ఇవి మరింత వివరణాత్మకముగ కన్పించును.

**శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం**
**నచేదేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి ।**

అను రెండుపాదములలో పెక్కు అంశములను వ్యాఖ్యాతలు వివరించిరి. వానిని సంగ్రహముగ నిట్లు పేర్కొనవచ్చును. –

కేవల పరబ్రహ్మస్వరూపము అఖండ సచ్చిదానందఘనము స్పందన రహితము, ప్రకాశాత్మకమునైనది. దీనినుండి ఉత్పన్నమైన మాయ శక్తి స్వరూపము. ఇది విమర్శాత్మకము. ఇట్లు పరబ్రహ్మతత్త్వము ప్రకాశ విమర్శరూపకమైనప్పుడే స్పందనసహితమగును. సృష్టిస్థితిలయాది కార్యకరణ సమర్థమగును. శుద్ధ బ్రహ్మతత్త్వము స్వసంకల్పముచే మాయ(శక్తి) సహితమైనప్పుడే సృష్ట్యాదులు జరుగును. దీనినే 'సోకామయత బహుస్యాం ప్రజాయేతి' ఇత్యాది శ్రుతి మంత్రము బోధించుచున్నది. ఇట్లు శివుడు శక్తి యుక్తుడైనపుడే స్పందనమునకు జగత్సర్జనాది కార్యక్రమమును నిర్వహించుటకు సమర్థుడగును.

మాతృకావర్ణములలో కకారాదులగు హల్లులు శివరూపములు. అకారాదులగు అచ్చులు శక్త్యాత్మకములు. అచ్చుల సంయోగములేని కేవల హల్లులు శబ్దప్రపంచనిర్మాణముననకు సమర్థములుకావు. ఇట్లును శక్తియుక్తుడు గాని శివుడు స్పందనరహితుడే. పంచదశీవిద్యయందలి కొన్ని బీజములు శివాత్మకములు. కొన్ని శక్త్యాత్మకములు. శక్త్యాత్మకములగు బీజములు చేరనిదే పంచదశీవిద్యకు పరిపూర్ణతలేదు. పంచదశీమంత్రముతో అభిన్నమగు శ్రీచక్రము నందలి నవకోణములలో నాలుగు శివాత్మకములు, అయిదు శక్త్యాత్మకములు. ఈరెండించి సమ్మేళనముచేగాని శ్రీచక్రమేర్పడదు. శ్రీచక్రమునందలి నవ చక్రములలో అష్టదళపద్మ, షోడశదళపద్మ, భూపురములు నాలుగు శివాత్మకములు. త్రికోణ, వసుకోణ, అంతర్దశారబహిర్దశార చతుర్దశకోణములు శక్త్యాత్మకములు. ఈతొమ్మిది ఆవరణముల సమాహారమే శ్రీచక్రము. శివ స్వరూపచక్రములు చేరనిదే ప్రపంచస్వరూపమగు శ్రీచక్రమేర్పడదు. శుద్ధబ్రహ్మ తత్త్వమునకు ప్రతీకయగు బిందువు(మాయ) లేక శక్తితత్త్వమునకు ప్రతీకయగు త్రికోణము బంధించినపుడే జగత్సృష్టి ఏర్పడును. ఈ త్రికోణము ప్రాతిపదికగనే నవయోన్యాత్మకమగు శ్రీచక్రముగూడ ఏర్పడును. ఇట్లును శివాశివైక్యము ఇందు ప్రతిపాదింపబడినది.

పంచవింశతి తత్త్వములలో మాయ మహేశ్వర తత్త్వముతో చేరును. శుద్ధవిద్య సదాశివ తత్త్వముతో చేరును. పరమేశ్వరీస్వరూపమగు సాదాఖ్యకళ పంచవింశతితత్త్వములకతీతమై షడ్వింశతితమ తత్త్వమగుచున్నది. పరబ్రహ్మ స్వరూపమగు సదాశివతత్త్వము పరమేశ్వరీస్వరూపమను సాదాఖ్యకళతో చేరినపుడే జగత్సర్జనాదులను చేయుసమర్థమగును. ఇట్లును శివశక్త్యైక్యమిందు ప్రతిపాదింపబడినది.

'శివ' అను అక్షరములలోని హల్మాత్రములగు శవర్ణ వకారములు ఉచ్చారణాయోగ్యములుగావు. పరమేశ్వరీరూపమగు ఇకార అకారములు

చేరి నపుడే శివశబ్దమేర్పడును. ఇట్లును శక్తియుక్తుడుగాని శివుడు స్పందన రహితుడే.

కొందరు వ్యాఖ్యాతలు ఈ శ్లోకమున మాతృకా - విద్యాప్రాసాద - అనుత్తర - వాగ్వాదినీ - శైవపంచాక్షరీ - పాశాదిత్ర్యక్షరీ - నవార్ణ మేరుమంత్ర - పంచదశీ - గోపాలాష్టాదశాది మంత్రములున్నట్లు సూచించిరి. లక్ష్మీధరులు మాత్రము ఇట్టి మంత్రోద్ధారము పేర్కొనలేదు.

'సుధాసింధోర్మధ్యే' అను శ్లోకమున పేర్కొనబడిన సుధాసింధువు, సురవిటపివాటి, నీపోపవనము, చింతామణిగృహము మున్నగున వన్నియు సాంకేతికముగ భావనోపనిషత్తు మున్నగు వానిలో వివరింపబడినవి. సహస్రార చక్రమందలి బైందవస్థానమే సుధాసింధువు. ఇదియే యావకాబ్ధి యనియు పేర్కొనబడుచున్నది. వేదమీ బైందవస్థానమునే 'సరఘ' అని పేర్కొన్నది. (ఇయం వాసరఘా - భావనోపనిషత్తు). ఇచట పరమేశ్వరి అధివసించిన మంచమునకు పాదములుగా బ్రహ్మ విష్ణు రుద్ర ఈశ్వరులును, మంచఫలకముగా అధివసించిన సదాశివుడును పరమేశ్వరిని సేవింతురు. పరమేశ్వరియే జీవశక్తి. నిర్జీవమగు శరీరము ప్రేతము. పంచప్రేతము లధివసించి, వానికి జీవత్వమును ప్రసాదించుచున్న పరమేశ్వరి పంచప్రేత మంచాధిశాయిని. ద్రుహిణహరి రుద్రేశ్వర సదాశివులలోని శక్తి పరమేశ్వరియే. కనుక సృష్టిస్థితిలయ తిరోధాన అనుగ్రహశక్తులు పరమేశ్వరియే. కనుకనే లలితాసహస్రనామములందు పరమేశ్వరి సృష్టికర్త్రీ, బ్రహ్మరూపా ఇత్యాదినామములతో కీర్తింపబడినది. ఈ పంచబ్రహ్మాసన స్థితయగు పరమేశ్వరీ స్వరూపము 'క్వణత్కాంచీదామా –' ఇత్యాది శ్లోకమున వర్ణింపబడినది. 'పురమథితురాహోపురుషికా' అని పేర్కొనబడుటచే పరమేశ్వరుని అహంకారశక్తిగా పరమేశ్వరి పేర్కొనబడినది. ప్రకాశాత్మక మగు శుద్ధపరబ్రహ్మతత్త్వముయొక్క అహంకారరూపమే విమర్శాత్మకమగు పరమేశ్వరీ తత్త్వము.

శ్రీచక్రమునందలి బైందవస్థానమే సుధాసింధువనియు, నవయోన్యాత్మకమగు శ్రీచక్రమే సురవిటపివాటియనియు భైరవ యామల వామకేశ్వర తంత్రములు పేర్కొన్నవి. (బిందుస్థానం సుధాసింధుః ...– పుట: 95)

'చతుర్భిః శ్రీకంఠైః ...' ఇత్యాది శ్లోకమున శ్రీచక్రోద్ధారము వర్ణింపబడినది. నవయోన్యాత్మకమగు శ్రీచక్రమున అధోముఖములగు పంచ త్రికోణములు శక్తిస్వరూపములనియు, ఊర్ధ్వముఖములగు నాలుగు శివస్వరూపములనియు ప్రతిపాదింపబడినది. ఇది తంత్రశాస్త్రసిద్ధము. ఈ తొమ్మిది త్రికోణముల కలయిచే నలుబదిమూడు త్రికోణములేర్పడును. 'శరణకోణాః' అనుచోట ద్వంద్వసమాసము చెప్పి, శరణ శబ్దమునకు బిందువు అర్థమును పేర్కొని, బిందువు నలుబదిమూడు కోణములు కలిసి నలుబదినాలుగు అనుభావమున చతుశ్చత్వారింశత్ అను పాఠమును లక్ష్మీధరులు వ్యాఖ్యానించిరి. శరణ శబ్దమునకు నివాసము అనగా శ్రీచక్రమను అర్థమును గ్రహించి, షష్ఠీతత్పురుషము చెప్పి, 'త్రయశ్చత్వారింశత్' అనుపాఠమున వ్యాఖ్యానించిరి. కోణములు నలుబదిమూడే అని లక్ష్మీధరుల సిద్ధాంతము.

శ్రీచక్రము అష్టదళపద్మము, షోడశదళపద్మము, త్రివలయ త్రిరేఖములను నాలుగు శివచక్రములతో త్రికోణవసుకోణదశారయుగ్మ చతుర్దశారములను అయిదు శక్తిచక్రములు చేరుటచే ఏర్పడుననియు పేర్కొనబడినది. 'శివశ్శక్త్యాయుక్తో ...' అను శ్లోకములోని సూచనకిది వివరణ ప్రాయము.

'శరజ్జ్యోత్స్నా శుద్ధాం ...' అనే పదునైదవ శ్లోకమునందు వర్ణింపబడిన దేవీస్వరూపము ఉపాసకులకు సర్వవిద్యాప్రదాయకమైనది. ఈ శ్లోకమునందు సారస్వతప్రయోగము శ్రీశంకరభగవత్పాదులచే ప్రతిపాదింపబడినదని వ్యాఖ్యాతలు పేర్కొనిరి. 'కవీంద్రాణాం చేతః ',

'సవిత్రీభిర్వాచాం' అను అనంతర శ్లోకములు రెండింటిలోకూడా ఇట్టి సారస్వత ప్రయోగములనే వ్యాఖ్యాతలు గుర్తించిరి.

'తనుచ్ఛాయాభిస్తే తరుణతర శృంగారలహరీ ...' ఇత్యాది శ్లోకమున స్త్రీవశీకరణప్రయోగము సూచింపబడినది. 'ముఖం బిందుం కృత్వా ...' అను తరువాతి శ్లోకమునందు వర్ణితమైన మాదనప్రయోగము మరింత స్పష్టముగా నున్నది. మాదనబీజమునందు వశీకరింపదలచిన స్త్రీ అవయములను భావించుటను కొందరు వ్యాఖ్యాతలు భావింపగా, శక్తిబీజము ఇట్టి భావనను ప్రయోగస్వరూపముగా మరికొందరు పేర్కొనిరి. ఇది సంప్రదాయభేదము మాత్రమే.

'కిరంతీమంగేభ్యః ...' ఇత్యాది శ్లోకమున(20) విషహరమగు గారుడ ప్రయోగమేగాక, జ్వరహరణప్రయోగముకూడ పేర్కొనబడినది. వరుసగా పై మూడు విధములగు ప్రయోగములును పంచదశీమంత్రమునందలి మూడు కూటములకు సంబంధము కలిగియున్నవి. మూలవిద్యయఃదు వాగ్భవ, కామరాజ, శక్తికూటములు మూడు కలవు. మూడవదియగు శక్తికూటమును అమృతాంశువగు చంద్రునకు సంబంధించినదిగా సంప్రదాయము పేర్కొనుచున్నది. పరమేశ్వరిని తదంగదేవతలను ఆయా రూపములతో తదనుగుణమగు బీజాక్షరములతో ఉపాసించినపుడు తత్తత్ప్రయోజనములు సిద్ధించును.

'శివశ్శక్తిః కామః ...' అను శ్లోకమున శ్రీవిద్యామూల మంత్రమగు పంచదశి ఉద్ధరింపబడినది. ఈ వ్యాసపు పూర్వభాములో పేర్కొన్నట్లు పంచదశీ విద్యా సంప్రదాయములలో మన్మథోపాసితయగు కాదివిద్యయు, లోపాముద్రోపాసితయగు హాదివిద్యయు ప్రధానమైనవి. ప్రకృతశ్లోకములో లక్ష్మీధరులు 'శివ, శక్తి, కామ' అను సంకేతములకు వరుసగా కకార, ఏకార, ఈకారములను చెప్పి ఇది కాదివిద్యాస్వరూపమనిరి.

అనంతరశ్లోకమగు 'స్మరం యోనిం లక్ష్మీం' అనుదానిలో స్మరయోని, లక్ష్మీశబ్దములకు కామరాజ, భువనేశ్వరీ, శ్రీబీజములను అర్థము చెప్పిరి. సౌభాగ్యవర్ధినీ వ్యాఖ్యాతయగు కైవల్యాశ్రములు శివశ్శక్తిఃకామః అను సంకేతములకు హసక అను బీజములను వరుసగా పేర్కొని హాదివిద్య యనిరి. స్మరం యోనిం లక్ష్మీం అనుసంకేతములకు కకార, ఏకార, ఈకారములను అర్థము చెప్పి ఆశ్లోకమున ఉద్ధరింపబడినది కాది విద్య యనిరి. శివశ్శక్తిః కామః అనుశ్లోకములోనే కైవల్యాశ్రములు దౌర్వాససీ విద్యను కూడా ఉద్ధరించెను. ఇట్లీ రెండుశ్లోకములలోను వ్యాఖ్యాన భేదముచే అనేక విద్యాసంప్రదాయములు సిద్ధించుచున్నవి. పరమాచార్యులగు శ్రీగౌడపాదులు శ్రీవిద్యామంత్రమునుద్ధరించిన శ్లోకము మరింత జటిలముగా నుండుట గమనార్హము. (సుభగోదయము –'స్మరోమారో మారః'). త్రిపురోపనిషత్తు మున్నగు శ్రుతుల మంత్రోద్ధారములకంటే శంకరుల శ్లోకము శబ్దసౌందర్యముతో విరాజిల్లుటయు గమనింపవచ్చును. (త్రిపురోపనిషత్తు – 'కామోయోనిఃకమలా...'; అథర్వవేదసౌభాగ్యఖండేపి. –పుట 297)

పై శ్లోకములన్నింటిలోను శ్రీశంకరులు సమయసంప్రదాయము ననుసరించి ఆయా విశేషములను ఉద్ధరించిరి. సౌందర్యలహరీ వ్యాఖ్యాతలలో ఆనందగిరి ఇంచుమించు ప్రతిశ్లోకమునందును ఏదో యొక మంత్రరహస్యము నుద్ధరించి చూపెను. గోపాలసుందరీ వ్యాఖ్యాతయగు నృసింహస్వామి సుందర గోపాల మంత్రము, గోపాలాష్టాక్షరీ మున్నగు మంత్రముల నుద్ధరించి చూపెను. ఆయా వ్యాఖ్యాతలు వేర్వేరు శ్లోకములలో నిగూఢముగా నున్నట్లు భావించిన మంత్రోద్ధారములు అనుబంధమున సూచింపబడుచున్నవి.

ఇట్లు వ్యాఖ్యాతలు పేర్కొన్నవే గాక, సౌందర్యలహరియందలి ప్రతి

శ్లోకమునకును, బీజసమన్వితమగు నొక యంత్రమును, తదుపాసనాపద్ధతి, శ్లోక జపసంఖ్య, ఫలము కూడ వివిధ సంప్రదాయములు పేర్కొనుచున్నవి. ఇవి పరస్పరభిన్నములుగ కూడ కనిపించును. ప్రధానముగా నిట్టివి మూడు సంప్రదాయభేదము లున్నవని శ్రీకుప్పుస్వామిగారు పేర్కొనిరి. మొత్తముపై వ్యాఖ్యాతలును, శ్రీవిద్యాసంప్రదాయజ్ఞులునుకూడ ఈ స్తోత్రమును శ్రీమంత్రముగ భావించుటయు మొత్తము శతకమును మాలా మంత్రముగ భావించి, అంగన్యాస కరన్యాసాదులతో కూడ జపించుటయు గోచరించును.

శంకరభగవత్పాదులీ స్తోత్రమున సమయాచారమునేగాక, ప్రాస్తావికముగ కౌల సంప్రదాయములను కొన్నింటిని పేర్కొనిరి.

'శరీరం త్వంశంభోః –' ఇత్యాది శ్లోకమున నవవ్యూహాత్మకత పేర్కొనబడినది. చంద్రకళావిద్య నవయోన్యాత్మకముగనుక పరమేశ్వరియు నవయోనిమతి. ఈ చంద్రకళావిద్య పూర్వకాలమునకు సంబంధించినది. ఈ విషయము సిద్ధాంతపరిచయావసరమున పూర్వమే వివరింపబడినది.

'మనస్త్వం వ్యోమత్వం ...' ఇత్యాది శ్లోకములో పరమేశ్వరి అష్టమూర్తిగా వర్ణింపబడినది. జగత్కర్తృకారణభూతయగు పరమేశ్వరియే శేషి. ఉత్తరకౌలమతమున శివాభావముచే పరమేశ్వరికి శేషత్వములేదు. ఇట్లీశ్లోకమున ఉత్తరకౌలము సూచింపబడినది.

## 5. సమయాచారము – వేదమూలకత్వము

వేదములకు విరుద్ధముకాని సమయాచారము అనుసరింపదగినదని లక్ష్మీధరుడు పేర్కొనెను. సమయాచారమునకే దక్షిణమార్గమని మరొకపేరు. వేదములలోని తైత్తిరీయ బ్రాహ్మణములోను, ఆరణ్యకములోను, అరుణోపనిషత్తు లోను, బహుబుచోపనిషత్తులోను, త్రిపురోపనిషత్తులోను, భావనోపనిషత్తు మొదలగు అనేకములగు ఉపనిషత్తులలోను

శ్రీవిద్యాధిదేవతయగు త్రిపురసుందరి, శ్రీవిద్యా మంత్రస్వరూపము, దేవిచరణారవిందములు, దేవీనివాసస్థానమగు శ్రీచక్రముయొక్క వర్ణన, షోడశనిత్యాత్మకత్వము అనేకపర్యాయములు వర్ణింపబడినది. గాయత్రీ బ్రహ్మవిద్య వేదములలో రెండు విధములుగ నున్నదని, ఒకటి ప్రకటితరూప, రెండవది గుప్తరూప అని చెప్పబడినది. వైదిక సంధ్యావందనాదులలో ఉపాసింపబడునది ప్రకటిత రూప అనియు, సాంకేతిక పదముల రూపములో నున్నది గుప్తరూప అనియు వరివస్యారహస్యములో ఈ విధముగ నున్నది.

**'తస్యాః రూపద్వితయం తత్రైకం యత్ర్పపఠ్యతే స్పష్టమ్ ।**
**వేదేషు చతర్ష్వపి పరమత్యంతం గోపనీయమితరమ్ ॥**

## 6. శ్రీవిద్యామూలబీజము

శ్రీవిద్యామూలబీజమగు ఈంకారవర్ణనము 'చత్వార ఈం బిభ్రతి క్షేమ యంతః' – 'తాం పద్మినీమీం శరణమహం ప్రపద్యే' అను వేదవాక్యముల ఆధారముగా చెప్పబడినది. సౌందర్యలహరీలో ఈ శ్లోకమున ఈంకారము ప్రస్తుతము –

**'హరిస్త్వామారాధ్య ప్రణత జనసౌభాగ్యజననీమ్**
**పురానారీభూత్వా పరరిపుమపి క్షోభమనయత్ ।**
**స్మరోపిత్వాం నత్వా రతినయనలేహ్యేన వపుషా**
**మునీనామప్యంతః ప్రభవతి హిమోహాయ మహతామ్ ॥'** (శ్లో. 5)

ఈ శ్లోకమున హరిశబ్దమున త్రిపురసుందరీ ప్రస్తారములలోని విష్ణువు చెప్పబడెను. దీనినే పంచదశాక్షరీ విద్య అని పిలువడం సంప్రదాయమని లక్ష్మీధరుడు చెప్పెను. ఈ పంచదశాక్షరీవిద్య వామకేశ్వరమహాతంత్రములోని చతుశ్శతిలో చెప్పబడినది. దాని ప్రస్తావన ఈ క్రింది శ్లోకములలో స్పష్టము.

**"ఏతామేవ పురారాధ్య విద్యాం త్రైలోక్యమోహినీమ్**
**త్రైలోక్యం మోహయామాస కౌమారిం భగవాన్ హరిః**
**కామదేవోపి దేవేశీం దేవీం త్రిపుసుందరీమ్**
**సమారాధ్యాభవన్ లోకే సర్వసౌభాగ్యసుందరః"**

## 7. శ్రీవిద్యామంత్రము

త్రిపురోపనిషత్తులో శ్రీవిద్యామంత్రస్వరూపము ఇట్లు చెప్పబడినది. –

**"కామోయోనిః కమలా వజ్రపాణిః గుహాహసా మాతరిశ్వాభ్రమింద్రః।**
**పుర్గుహా సకలా మాయయాచ పురుచ్యేషా విశ్వమాతాదివిద్యా ॥"**

బీజాక్షరనిఘంటు సహాయముతో ఈ మంత్ర వివరణ ఇట్లు చేయవలెను. కామః అంటే కకారము, యోనిః అనగా ఏకారము, కమలా అనగా ఈకారము, వజ్రపాణిః అనగా లకారము. గుహాఅనగా హ్రీంకారము. హ, స, మాతరిశ్వా అనగా కకారము. అభ్రం అనగా హకారము, ఇంద్రః అనగా లకారము. గుహా అనగా హ్రీంకారము. స.క.ల. మాయా అనగా హ్రీంకారము.

సౌందర్యలహరిలో శ్రీవిద్యామంత్రము రెండు శ్లోకములలో నున్నది. –

**"శివశ్శక్తిః కామః క్షితిరథ రవిశ్శీతకిరణః**
**స్మరో హంసశ్శక్రో తదనుచ పరామారహరయః**
**అమీ హృల్లేఖాభి స్తిసృభి రవసానేషు ఘటితాః**
**భజన్తే వర్ణాస్తే తవ జనని! నామాయవతామ్ ॥"** (శ్లో. 32)

**స్మరం యోనిం లక్ష్మీం త్రితయ మిదమాదౌ తవమనోః**
**నిధాయైకే నిత్యే నిరవధిమహాభోగరసికాః**
**భజంతి త్వాం చింతామణి గుణ నిబద్ధాక్షవలయాః**
**శివాగ్నౌజుహ్వాన్తః సురభిఘృతధారాహుతిశతైః ॥** (శ్లో. 33)

## 8. కాదివిద్య

'శివశ్శక్తిఃకామః' (శ్లో32) అనుశ్లోకములో ప్రతిపాదింపబడిన పంచదశీమంత్రమునకే కాది విద్య అనిపేరు. కకారము మొదటి బీజాక్షరమమై నందున దీని కాదివిద్య అనే పేరు సార్థకము. ఈ విద్యను మొదట దర్శించినవాడు మన్మథుడు. ఆకారణముచేతనే ఈ విద్యకామవిద్య అనియు, కందర్పవిద్య అనియు ప్రసిద్ధము. వేదములో 'జనకోహవైదేహః అహోరాత్రై స్సమాజగామ ... సతం మణిమవిందత్' జనకుడు శ్రీవిద్యామహర్షి. విదేహుడే వైదేహుడు మన్మథుడు. అహోరాత్రములనగా పంచదశాక్షరీమంత్ర వర్ణములు, దర్శాదిపూర్ణిమాంతకళాత్మకములను సంపాదించెను. ఎవరు మంత్రము ధరించెదరో వారు ఋషియై రాజిల్లగలరు. అనంగుడైన మన్మథుడు ప్రసిద్ధమగు మంత్రరూపమగు మణినిపొందెను, అందుకే పరచిత్కళయగు త్రిపురసుందరి మంత్రమునకు మన్మథుడు ఋషియయ్యెను. సౌందర్యలహరిలోని 'స్మరోపిత్వాం నత్వా (శ్లో.5) అను శ్లోకమున ఈ విషయము స్పష్టముగ చెప్పబడినది.

## 9. హాదివిద్య

పంచదశాక్షరిలోని ప్రథమకూటములోని మొదటిమూడు బీజముల స్థానములో హకార, సకార, కకారములను ఉంచినచో అదియే హాదివిద్య.

ఈ విద్యను లోపాముద్ర ఉపాసించినందువలన ఆమెపేరుతో ప్రసిద్ధము. హకారము ఆద్యక్షరమైయున్నందున దీనిని హాదివిద్య అందురు.

## 10. సాదివిద్య

సాదివిద్యలో పంచదశాక్షరీ మంత్రములోని ఆది బీజముగ సకారము నుంచినచో అది సాదివిద్య ఈ విద్యను నందీశ్వరులు ఉపాసించి నందువలన నందివిద్య అనే ప్రశస్తిని పొందినది. సకారము ఆద్యక్షరమై యున్నందువలన ఇది సాదివిద్య.

## 11. దౌర్వాససీ విద్య

దౌర్వాససీ విద్యలో పంచదశీ మంత్రములోని కూటత్రయములో మూడు హృల్లేఖ లుండును. కాని ఈవిద్యలో తృతీయకూటము చివర మాత్రమే హృల్లేఖ ఉండును. కనుక ఈవిద్య త్రయోదశాక్షరి. దూర్వాసోమహర్షి ఉ పాసించినందు వలన ఇది దౌర్వాససీవిద్య అనిరూఢమైనది.

సౌందర్యలహరిలో 'శివశ్శక్తిః కామః (శ్లో. 32) అను శ్లోకమున లక్ష్మీధరుడు కాది విద్యను, కైవల్యాశ్రముడు హాదివిద్యను, దౌర్వాససీవిద్యను ఉద్ధరించిరి.

'స్మరం యోనిం లక్ష్మీం' (శ్లో.33) అను శ్లోకమున లక్ష్మీధరుడు స్మర, యోని, లక్ష్మీశబ్దములను కామరాజ, భువనేశ్వరి, శ్రీబీజములను అర్థమును చెప్పెను. కైవల్యాశ్రముడు కకార, ఏకార, ఈకార రూపముల అర్థములను చెప్పి ఇది కాది విద్య యనెను.

సుభగోదయస్తవములో గౌడపాదాచార్యులు కూడ ఈ విద్యను ఒక శ్లోకమున ఉద్ధరించి చెప్పెను. కానీ ఆ శ్లోకము అన్వయము క్లిష్టముగ నున్నది.

సౌందర్యలహరిలో పంచదశీమంత్రోద్ధారకమగు 'శివశ్శక్తిః కామః' (శ్లో.32) సుబోధకమై లలితమై యలరారుచున్నది.

# 12. షోడశీ విద్య

పంచదశీమంత్రము చివర సబిందుకమగు శ్రీబీజమును ఉంచుటవలన ఉద్భవించు విద్యయే శ్రీవిద్యయని షోడశీవిద్యయని స్తుతింపబడినది. పంచదశీ మంత్రము చివర శ్రీబీజమునుంచుట ఆవశ్యకము కాదని, పంచదశీవిద్యలోనే సూక్ష్మరూపమున శ్రీబీజమంతర్భ వించినదని, అందుకే పంచదశియే శ్రీవిద్యయని, షోడశీవిద్యయని కొందరి అభిప్రాయము.

పంచదశీమంత్రములో మొదట, మధ్య, చివర వివిధ బీజముల సంయోజనమువలన విభిన్నములగు శ్రీవిద్యాసంప్రదాయములు ప్రవర్తిల్లునని సంప్రదాయము.

# 13. శ్రీవిద్యామూర్తి వర్ణనము

సమయాచారములో చతుర్విధైక్యానుసంధాన మహిమచే మణిపూరచక్రమున భగవతియగు శ్రీవిద్యామూర్తి ప్రత్యక్షమగునని సంప్రదాయ వచనము. ఈ రూపమునే సౌందర్యలహరిలో శంకరులు వర్ణించిరి.

**"క్వణత్కాంచీదామా కరికలభకుంభస్తననతా**
**పరిక్షీణామధ్యే పరిణతశరచ్చంద్రవదనా**
**ధనుర్బాణాన్ పాశం సృణిమపి దధానా కరతలైః**
**పురస్తాదాస్తాం నః పురమథితు రాహోపురుషికా ॥** (శ్లో. 7)

శంకరభగవత్పాదులకు ఈ రూపమే ప్రత్యక్షమైనదని లక్ష్మీధరుడు ఇట్లు చెప్పెను. 'శంకరులు భగవతి స్వరూపమును పై శ్లోకమున ధనుర్బాణపాశాంకుశయుక్త హస్తముగా' వర్ణించుట జరిగినది. ఇదే రూపము శంకరమతా వలంబులకు కూడా ప్రత్యక్షమగునని చెప్పెను. లక్ష్మీధరుడు తన మతమును సమ్మతమనియే చెప్పెను.

"మాకు షడ్విధైక్యానుసంధానానంతరము మూలాధారద్వికమును వదిలి, మణిపూరమున ప్రసన్నురాలై దశభుజ, ధనుర్బాణపాశాంకుశ వరదాభయ పుస్తకాక్షమాలాహస్తయై కనబడెను. పాశాంకుశేక్షుచాప పుష్పబాణ జపమాలికా శుకాభయ వరదకరయై, కరద్వయ వక్షఃస్థల స్థాపితవీణయై కనబడెను.'

ఇచట 'అహోపురుషికా' అనుపదము అహంకారరూపిణి అను అర్థములో ప్రయోగించుట సంప్రదాయము.

## 14. భగవతీచరణవైభవము

**భగవతీపాదపాంసువులవర్ణనము :-** భగవతీ పదపాంసువుల మహిమ సౌందర్యలహరిలో రెండు శ్లోకములలో చెప్పబడినది.

'అవిద్యానామంతస్తిమిరమిహిరద్వీపనగరీ' (శ్లో. 3) అను శ్లోకములో భగవతి పాదరేణువులు అవిద్యులకు (అక్షరజ్ఞానంకూడా లేనివారికి) అంతరంగములో చుట్టూ సూర్యుడు ప్రకాశించే ద్వీపనగరము వంటివని, మంద బుద్ధులకు చైతన్యమకరందాలను అందించే ప్రవాహమువంటివని, దరిద్రుల పాలిట చింతామణులవంటివని, ఈ సంసారమనెడు కడలిలో మునిగితేలుతున్నవారిని వరాహస్వామి పంటికోరవలె రక్షించునవి అని వర్ణించుట కనబడును.

'తనీయాంసం పాంసుం' (శ్లో. 2) అను మరొక శ్లోకములో భగవతి పాదములయందలి అతిసూక్ష్మరేణువును స్వీకరించి బ్రహ్మదేవుడు లోకములను సృష్టించుచున్నాడనియు, ఈ పాదరేణువునే విష్ణువు వేయితలలుగల ఆదిశేషుని రూపమునెత్తి తలపై మోయుచున్నాడనియు ఈ పాదరేణువునే ప్రళయకారకుడైన శివుడు ప్రళయవేళలో మర్దించి భస్మముచేసి, శరీరమున దాల్చుచున్నాడనియు రమణీయముగ చెప్పబడినది.

## 15. భగవతీచరణమహిమ

భగవతి చరణముల మహిమ వేదములలోను, తంత్రములోను అనేకవిధములుగ వర్ణితము. సౌందర్యలహరిలో చరణమహిమ 'త్వదన్యః పాణిభ్యాం' (శ్లో. 4) అను శ్లోకములో వర్ణింపబడినది. "ఓ తల్లీ! ఇతరదేవతలందరు తమ రెండు చేతులతో అభయ, వరదముద్రలనుదాల్చి, రెండుహస్తములను వాడుచున్నారు. కాని నీవొక్కదానవే వరములను, అభయమును, ఇష్టఫలములను నీ ఒక్క కాలితోనే ప్రసాదించుచున్నావు. ఇదియే నీ గొప్పతనము" అని ఎంతో నేర్పుగచెప్పెను.

## 16. భగవతీచరణమయూఖములు

భగవతీచరణములనుండి వెలువడు కిరణములు మున్నూట అరవై అనియు, అవి సంవత్సర కాలానికి సంబంధించిన దినములకు సంకేతములని సౌందర్యలహరిలో 'క్షితౌ షట్పంచాశత్...' (శ్లో. 14) అను శ్లోకములో చక్కగ చెప్పబడినవి. వాని వివరణ ఇట్లున్నది.

భూమిలో వెలుగునవి - 56 కిరణములు

జలములో వెలుగునవి - 52 కిరణములు

అగ్నిలో వెలుగునవి - 62 కిరణములు

వాయువులో వెలుగునవి - 54 కిరణములు

ఆకాశములో వెలుగునవి - 72 కిరణములు

మనస్సులో వెలుగునవి - 64 కిరణములు

మొత్తము 360

ఈ మున్నూట అరువది కిరణములకు అతీతముగ, వీనికి ఊర్ధ్వ భాగములో భగవతి చరణమయూఖములు వెలుగుచుండును. కావున ఇవి కాలమునకు అతీతములు.

## 17. భగవతీచరణనిర్ణేజనజలమహిమ

నిర్ణేజనమనగా శుద్ధి. భగవతి పాదములను జలములతో అభిషేకించునప్పుడు ఆమె పాదములను కడుగగా, వెలువడు పవిత్రజలములు త్రాగినవారు మూగవారైనచో, చక్కని వాక్శక్తిని పొందెదరనియు, కవిత్వరచనాశక్తిని కోరువారికి మూకమహాకవివలె అద్భుత కవితాశక్తి స్వాధీనమగునని 'కదాకాలే మాతః. . .' (శ్లో.98) అను శ్లోకమున చక్కగ చెప్పబడినది. పాదాభిషేకము కొరకు జలములను వాడుట సమయమతమనియు, కౌలమతములో జలాభిషేకము లేదనియు లక్ష్మీధరుడు వివరించెను. కనుక పాదాభిషేకములు సమయాచారములోనివే అని తెలియవలెను.

# 18. భగవత్యపాంగమహిమ

భగవతి కడగంటిచూపుతో ఎంతటి బలహీనులైనను, జగదేకవీరులు కాగలరు. ఇందుకు ఉదాహరణ మన్మథుడే. ఈ విషయమును సౌందర్యలహరిలో శంకరులు అద్భుతముగ వర్ణించిరి. 'ఓ భగవతీ! మన్మథుని విల్లు పూలతో అల్లినది అనగా అది ఎంతో సుకుమారము. మెత్తనైనది. ఆ వింటికి కట్టిన అల్లెత్రాడు తుమ్మెదల పంక్తియే. అదియు నిశ్చలముగ నుండదు. చంచలముగ తిరుగాడుచుండును. బాణములా పరిమితముగా అయిదే. మన్మథునికి సహాయముచేయు సఖుడు వసంతుడు. అతడుకూడ సుకుమారుడే. మెత్తని మనస్సుగలవాడు. మన్మథుడు అధివసించు రథము మలయమారుతము. అది ఎటువైపువీచునో, ఎటు పరుగులు తీయునో ఊహింపరాదు. అయినను మన్మథుడు నీ కృపాదృష్టి సోకినందువలన ఈ సమస్త ప్రపంచమును తనవశముచేసికొని, జైత్రయాత్రలు చేయుచున్నాడు. కావున నీ కరుణామయదృష్టి పడినచో ఎంతటి బలహీనుడైనను మహావీరుడగును.' ఈ భావమంతయు 'ధనుఃపౌష్పం మౌర్వీ. . .' (శ్లో.6) అను శ్లోకములో శంకరులు ఎంతో రమణీయముగ వర్ణించిరి.

# 19. భగవతి-అనేకరూపములు

భగవతి లోకమునను(గహించుటకు ఎన్నో అవతారములను, రూపములను ఎత్తుచుండును. సౌందర్యలహరిలో ఈ విషయము 'గిరామాహుర్దేవీం...' (శ్లో.97) అనుశ్లోకములో స్పష్టముగ పేర్కొనబడినది. 'ఓ భగవతీ! నిన్ను బ్రహ్మదేవుని శక్తియగు సరస్వతిగా కొందరు తలచెదరు.

మరికొందరు విష్ణుపత్నియగు లక్ష్మీదేవిగా భావించెదరు. ఇంకొందరు పరమేశ్వరుని పట్టపురాణియగు పార్వతీదేవిగా తలచెదరు. ఇట్లు నీవెన్ని రూపముల నెత్తినావో తెలిసికొనుట దుర్లభము. మహామాయవై ఈ సమస్త విశ్వమును పాలించుదానవు నీవే' అని శంకరులు ఎంతో అద్భుతముగ నుడివిరి.

## 20. భగవతీసేవాఫలము

భగవతిని సేవించుటవలన ఐహిక, ఆముష్మిక ఫలములు లభ్యమగునని శాక్తతంత్రములు ఘోషించుచున్నవి. ఈ విషయమునే ఈ క్రింది శ్లోకము చక్కగ వివరించినది.

**"యత్రాస్తిభోగో న హి తత్ర మోక్షః**
**యత్రాస్తి మోక్షో న హి తత్ర భోగః**
**శ్రీసుందరీ సేవన తత్పరాణాం**
**భోగశ్చ మోక్షశ్చ కరస్థ ఏవ"**

ఈ శ్లోకభావమిది. – 'ఎక్కడ భోగముండునో అక్కడ మోక్షము లభింపదు. ఎక్కడ మోక్షముండునో అక్కడ భోగము లభించుట శూన్యము. కానీ, భగవతి సేవలో నిమగ్నులైన సాధకులకు భోగమోక్షములు రెండును కరతలామలకముల వలె స్వాధీనమై యుండును.

ఈ విధముగ భగవతీకృపాకటాక్షములున్నచో ఏదియు అసాధ్యము కాదను విషయము స్పష్టముగ చెప్పబడినది.

# 21. వివిధ ప్రయోగములు

## సారస్వత ప్రయోగము

సారస్వతప్రయోగములలో కవిత్వబీజభూత సంస్కారోత్పాదన రూపము, శృంగార వాగ్విలాస సిద్ధిరూపము, మహాకవిత్వ రూపమునగు ఫలము సౌందర్య లహరిలో చెప్పబడినది. –

**'శరజ్జ్యోత్స్నాశుద్ధాం శశియుత జటాజూటమకుటాం**
**వరత్రాసత్రాణ స్ఫటిక ఘుటికాపుస్తకకరామ్**
**సకృన్నత్వా నత్వా కథమివసతాం సన్నిదధతే**
**మధుక్షీరద్రాక్షామధురిమ ధురీణా ఫణితయః'** (శ్లో. 15)

మహాకవిత్వరూపఫలము. –

**"సవిత్రీభిరావాచాం శశిమణిశిలాభంగి రుచిభిః**
**వశిన్యాద్యాభిస్త్వాం సహజనని సంచింతయతి యః**
**సకర్తా కావ్యానాం భవతి మహతాం భంగిరుచిభిః**
**వచోభిర్వాగ్దేవీ వదన కమలామోదమధురైః"** (శ్లో.17)

## మాదన ప్రయోగము

వనితావశీకరణరూపములగు మాదన ప్రయోగములు పలు విధములుగ చెప్పబడినవి. ఈ ప్రయోగములు 'తనుచ్ఛాయాభిస్తే' (శ్లో. 18), 'ముఖం బిందుం కృత్వా' (శ్లో. 19), 'నరం వర్షీయాంసం' (శ్లో. 13) అను మూడుశ్లోకములలో చెప్పబడినవి త్రైలోక్యమోహనాత్మకమగు మాదన ప్రయోగము ఈ శ్లోకమున నిర్దిష్టము–

**"ముఖం బిందుం కృత్వా కుచయుగమధస్తస్య తదధో**
**హరార్థం ధ్యాయేద్యో హరమహిషి తే మన్మథకళామ్**
**స సద్యః సంక్షోభం నయతి వనితా ఇత్యతి లఘు**
**త్రిలోకీ మప్యాశు భ్రమయతి రవీన్దుస్తన యుగామ్ ॥"** (శ్లో. 19)

దేవి కడగంటి చూపు ప్రసరించినప్పుడు సాధకుడు ఎంతటి వృద్ధుడైనను అతని వెంట యువతులు మోహముతో వెంటాడెదరని మాదనప్రయోగము చక్కగా చెప్పబడినది.

## 22. గారుడ ప్రయోగము

విషహరములు, జ్వరహరములునగు గారుడ ప్రయోగములు సౌందర్యలహరిలో చెప్పబడినవి. –

**కిరన్తీమంగేభ్యః కిరణనికురుంబామృతరసం**
**హృదిత్వా మాధత్తే హిమకరశిలామూర్తి మివ యః**
**స సర్వాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ**
**జ్వరప్లుష్టాన్ దృష్ట్వా సుఖయతి సుధాధార సిరయా ॥** (శ్లో. 20)

ఈ విధముగ సౌందర్యలహరిలో మూడు ప్రయోగములు చెప్పబడినవి.

## 23. శ్రీచక్రము

పంచదశీమంత్రము ఏ విధముగ భగవతీ స్వరూపమో అట్లే శ్రీచక్రము కూడ పరమేశ్వరీ రూపము శ్రీచక్రము కేవలము భగవతీరూపమే కాదు. అది శివశక్తుల స్వరూపము. ఈ విషయము శ్రీవిద్యా సంప్రదాయములో స్పష్టముగ నున్నది. –

**"చతుర్భిః శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః**
**శివశక్త్యాత్మకం జ్ఞేయం శ్రీచక్రం శివయోర్వపుః ॥"**

## 24. శివచక్రములు - శక్తిచక్రములు

**శివచక్రములు:-** శ్రీచక్రములోని కోణములలో నాలుగు ఊర్ధ్వ ముఖములుగ నున్నవి శివచక్రములు.

**శివచక్రములు:-** శ్రీచక్రములోని కోణములలో అయిదు అధోముఖములుగ నున్నవి శక్తిచక్రములు.

శ్రీచక్రములో అష్టచక్రములు, నవద్వారములు వేదోక్తములైయున్నవి. "అష్టాచక్రానవద్వారా దేవానాం పూరయోధ్యా । తస్యాం హిరణ్మయఃకోశః స్వర్గలోకో జ్యోతిషాదృతః" - (అరుణోపనిషత్)

ప్రాచీనాచార్యులు శ్రీచక్రమునిట్లు వర్ణించిరి. -

**"బిందుత్రికోణవసుకోణ దశారయుగ్మ**
**మన్వస్రనాగదళ షోడశ పద్మయుక్తమ్**
**వృత్తత్రయంచ ధరణీ సదన త్రయంచ**
**శ్రీచక్రమేతదుదితం పరదేవతాయాః ॥"**

సౌందర్యలహరిలో శ్రీచక్రమును వివరించిన శ్లోకం ఇది-

**"చతుర్భిః శ్రీకంఠైః శివయువతిభిః పంచభిరపి**
**ప్రభిన్నాభిః శంభోర్నవభిరపి మూలప్రకృతిభిః**
**చతుశ్చత్వారింశ ద్వసుదళ కళాశ్రత్రివలయ**
**త్రిరేఖాభిస్సార్ధం తవ శరణకోణాః పరిణతాః ॥** (శ్లో. 11)

ఈ శ్లోకమున శ్రీకంఠపదముచే శివుడును, శివయువతి పదముచే శక్తియును పేర్కొనబడినది. శ్రీచక్రములోని నవావరణములో నాలుగు శివచక్రములు కాగా మిగిలిన అయిదు శక్తిచక్రములు నవమూలప్రకృతులు ప్రపంచానికి మూలకారణములు.

నవసంఖ్యాత్మకత్రికోణముల మేళనమువలన నలుబదిమూడు త్రికోణములు సంభవించును శరణశబ్దమునకు నివాసరూపార్థమును స్వీకరించి, షష్ఠీ తత్పురుషముచే సమాసము చెప్పగా ఏర్పడు అర్థము స్వీకార్యము.

# 25. శ్రీచక్రలేఖనపద్ధతులు

శ్రీచక్రలేఖనము సృష్టిక్రమముగను, సంహారక్రమమగు రెండు విధములు. సృష్టిక్రమము సమయమార్గము. సంహారక్రమము కౌలమార్గము అని సంప్రదాయవచనము. ఈ రెండు పద్ధతులను లక్ష్మీధరుడు వివరించి చెప్పెను.

## కౌలమార్గములో శ్రీచక్ర లేఖనము

ఎదుట వృత్తమును లిఖించి, వృత్త మధ్యములో తొమ్మిదిరేఖలు వ్రాసి, పశ్చిమోత్తర రేఖాప్రాంతాలతో త్రికోణమును సృష్టించి, తనవైపుగల ఆరవ రేఖతో కలుపవలెను. ఈ విధముగ ప్రాగ్రేఖా ప్రాంతముల నుండి త్రికోణమును సృష్టించి, తనవైపు ఎనిమిదవరేఖతో సంయోజించవలెను. షట్కోణములకు మధ్యనగల మూడు హ్రస్వరేఖలయందు పశ్చిమరేఖా ప్రాంతములతో త్రికోణమును సృష్టించి, తనవైపునకు అయిదవ దానితో కలుపవలెను. ఈ విధముగ ప్రాగ్రేఖా ప్రాంతాలచేత త్రికోణమును సృష్టించి, తనవైపు అయిదవరేఖతో సంయోజించవలెను. మధ్యనగల అతి హ్రస్వరేఖా

ప్రాంతాలచో త్రికోణమును తనవైపునకు మూడవరేఖతో కలుపవలెను. ఈ విధముగ 24 సంధులు, నవయోని చక్రముగ రూపొందును. ఇది కౌలమత రహస్యము.



## సమయమార్గములో శ్రీచక్ర లేఖనము

మొదట త్రికోణమును లిఖించి, మధ్యలో బిందువును ఉంచి, బిందువుపైన త్రికోణమును విభజించి, త్రికోణము తరువాత ప్రాగగ్రమును వ్రాసి, ప్రథమ త్రికోణాగ్రమునుండి పశ్చిమాభిముఖముగ మరొక త్రికోణమును రచింపవలెను. ఈవిధముగ అష్టకోణచక్రమేర్పడును. దీనినుండియే దశారయుగ్మమును సృష్టింపవలెను.



## సమయమార్గములో శ్రీచక్ర లేఖనములో కౌల - సమయ మార్గములలో ప్రధాన భేదములు

సమయమార్గములో త్రికోణము ఊర్ధ్వముఖముగ వ్రాయవలెను. కౌలమార్గములో త్రికోణ మధ్యగతముగ బిందువుండును. సమయచక్రములో చతుష్కోణముల మధ్యలో బిందువుండును. షట్కోణమధ్య గతముగ బిందువుండునను సంప్రదాయమొకటియున్నది. కౌల చక్రములో కోణసంఖ్యలేదు. నవత్రికోణాత్మకమైనందువలన ఈ మార్పు. తొమ్మిది త్రికోణములను చేర్చుటచే మర్మసంధులే ఉత్పన్నములగును అనునది రహస్యము. ఉభయచక్రసాధారణగతమై ఊర్ధ్వముఖమున అష్టదళపద్మ ముండును. ఇదియే మేఖలాత్రితయమనబడును. దానిపై చతుర్ద్వారములతో కూడిన భూపురత్రయముండును.

ఈ విధముగ కౌల-సమయ సంప్రదాయములలో శ్రీచక్రలేఖన పద్ధతులు భిన్నములై యున్నవి.

# 26. సమయాచారము

## సమయశబ్దనిర్వచనము

'సమ్' అనే ఉపసర్గపూర్వకమైన 'అయః'శబ్దము సమీచీనమైన 'శుభమయవిధి' అను అర్థమును బోధించును. సౌందర్యలహరీ వ్యాఖ్యానములో లక్ష్మీధరుడు సమయశబ్దమునకు 'శివునితో శక్తి పంచవిధములగు సామ్యములను పొందునను 'అర్థములో సమయుడనగా శివుడని చెప్పెను. భాస్కరాచార్యుడుకూడ 'సమయరూపిణి యగు శక్తితో సామ్యమును పొందువాడు సమయుడు(శివుడు)' అని చెప్పెను. దీనివలన శివునితో పంచవిధ సామ్యములను పొందుశక్తియే సమయ అని తేలినది.

## సమయాచారమూలము

సమయాచారమునకు మూలము వేదమే అని లక్ష్మీధరుడు చెప్పెను. 'శుభాగమపంచకములో వైదికమార్గము తోనే అనుష్ఠానకలాపము చెప్పబడినది. శుభాగమపంచకములో నిరూపితమైన మార్గము వశిష్ఠ, సనక, శుక, సనందన, సనత్కుమారులనెడి అయిదుగురు మునులచే ప్రోక్తమైనది. దీనినే సమయాచారము' అని పిలిచెదరు. భాస్కరరాయలు కూడ 'సమయ సంకేతప్రతిపాదక వశిష్ఠ, శుక, సనక, సనందన, సనత్కుమారుల అయిదు తంత్రములందలి విషయమును ప్రతిపాదించునది సమయాచారమని పలికెను. ఈ విధముగ వైదికమార్గానుసారియగు శుభాగమ పంచకమే సమయాచారమని తెలియుచున్నది. కాని, ఈ శుభాగమ పంచకము నేడు అలభ్యము. శుభాగమ పంచకములో చెప్పబడిన సమయాచారములను తెలుపునవి లక్ష్మీధరుని వ్యాఖ్యానము, భాస్కరరాయలవ్యాఖ్యానము మాత్రమే అని సర్వసమ్మతాభిప్రాయము. సంస్కృత సాహిత్యవిమర్శక శ్రేష్ఠులైన బలదేవోపాధ్యాయ, రుద్రదేవత్రిపాఠి మహోదయులు సైతము ఈ విషయమునే సమర్థించిరి.

## 27. శివ శక్తి సామ్యాది భేదములు

శివునితో శక్తి పంచవిధములగు సామ్యములను త్రివిధములగు తాదాత్మ్యములను, చతుర్విధములు, షడ్విధములునగు ఐక్యములను పొందుటయే సమయాచార ప్రధానలక్షణము. వీటితోబాటు షట్చక్రభేదనము, సహస్రకమలములపూజ, కుండలినీ సిద్ధి అనునవి ప్రధానాంశములు.

# 28. పంచవిధసామ్యములు

శివశక్తుల పంచవిధసామ్యము సమయాచారమున ప్రధానాంశము. పంచవిధ సామ్యములనగా - 1) అధిష్ఠాన సామ్యము, 2) అవస్థాన సామ్యము, 3) అనుష్ఠాన సామ్యము, 4) రూప సామ్యము, 5) నామ సామ్యము.

సౌందర్యలహరిలో ఈ పంచవిధ సామ్యములు సోదాహరణముగ చెప్పబడినవి. శివశక్తులు మూలాధారచక్రములో కలిసియుండుట **అధిష్ఠాన సామ్యము**. ("తవాధారే మూలే..." శ్లో. 41)

శివశక్తులు ఈ జగత్తునకే తల్లిదండ్రులై వ్యాపించి యున్నందువలన **అనుష్ఠాన సామ్యము**. ('...జనకజననీమజ్జగదిదమ్." శ్లో. 41)

శివశక్తులు లాస్యతాండవములందు సామ్యావస్థను పొందుటయే అవస్థాన సామ్యము. (తవాధారే ... నవరస మహాతాండవనటమ్..." శ్లో. 41)

శివశక్తులు అరుణవర్ణసామ్యమును పొందియుండుట వలన **రూపసామ్యము** స్పష్టము. ఇందుకు ప్రమాణము.

**'జపాకుసుమసంకాశౌ మదఘూర్ణితలోచనౌ**
**జగతః పితరౌ వందే భైరవీభైరవాత్మకౌ"**

శివశక్తులను నవాత్ములందురు. కావున నామసామ్యము దీనితో స్పష్టము. 'తవాధారే మూలే (శ్లో. 41) అను శ్లోకములో శివశక్తుల **నామరూపసామ్యములు** చెప్పబడినవి. 'తటిత్వన్తం శక్త్యా...' (శ్లో. 40) అను శ్లోకములో 'తటిత్'శబ్దముచే శివశక్తుల **నామరూప సామ్యములు** చెప్పబడినవి. ఇదే శ్లోకమున శివశక్తుల మణిపూరచక్రస్థితి **అధిష్ఠాన**

**సామ్యము**ను సూచించును. 'తటిత్వన్తం శక్త్యా' (శ్లో. 40) అను శ్లోకమున 'స్ఫురన్నానా రత్నాభరణ పరిణద్ధేంద్రధనుషమ్' అను వాక్యము చేతను, 'తటిత్వన్తం' అను పదము చేతను **ప్రావృషేణ్యావస్థాన సామ్యము** చెప్పబడినది. 'తవస్వాధిష్ఠానే' (శ్లో. 39) అను శ్లోకమున శివశక్తుల **అధిష్ఠానసామ్యము** చెప్పబడినది. స్వాధిష్ఠానము వీరిరువురికిని అధిష్ఠానమైయున్నది. ఇదే శ్లోకమున 'మహతీం' అను పదముచే **మహాసంవర్తకరూపనామసామ్యము** చెప్పబడినది. ఇచట స్వాధిష్ఠానగతమగు అగ్నిసంశ్రయణము **అవస్థాన సామ్యము** సూచించును. 'లోకాన్ దహతి' అనువాక్యముచే **అనుష్ఠాన సామ్యము** స్పష్టము. అనాహత చక్రమున, ఆచక్రమునందే శివశక్తుల అధిష్ఠానము చెప్పబడుటచే **అధిష్ఠానసామ్యము**, 'హుతభుక్ కణిక' రూపముతో **రూపసామ్యము, నామసామ్యము** విదితము. నివాతదీపమనెడు మాటచే **అవస్థానసామ్యము**, వాయుతత్త్వోత్పాదకత్వము **అనుష్ఠానసామ్యము**. 'విశుద్ధౌ తే శుద్ధ. . .' (శ్లో. 37) అను శ్లోకములో విశుద్ధి చక్రాధిష్ఠానముచే శివశక్తుల **అధిష్ఠానసామ్యము**, 'వ్యోమజనకం' అనుటచే **అనుష్ఠాన సామ్యము**, 'శివంసేవే' అనుటచే నామసామ్యము, 'శశికిరణసారూప్యసరణేః' అనుటచే **అవస్థానసామ్యము**, 'తవాజ్ఞాచక్రస్థం' అను శ్లోకమున **అధిష్ఠానసామ్యము**, 'తపనశశికోటిద్యుతిధరం' అనుటచే **రూపసామ్యము**, 'పరంశంభుం' అనుటచే **నామసామ్యము**, 'యమారాధ్యన్' అనుటచే అవస్థాన సామ్యము, ముక్తిప్రదత్వమనుటచే **అనుష్ఠాన సామ్యము** ఈవిధముగ సామ్యపంచకము ప్రతిపాదితము.

ఈ విషయములన్నియు ఈక్రింది పట్టికలో విశదముగ నున్నవి.

| **అధిష్ఠాన సామ్యము** | **అవస్థాన సామ్యము** | **అనుష్ఠాన సామ్యము** | **రూప సామ్యము** | **నామ సామ్యము** |
|---|---|---|---|---|
| మూలాధర చక్రం (శ్లో. 41) | లాస్యతాండవే (శ్లో. 41) | జనకజననీ మజ్జగదిదమ్ (శ్లో. 41) | ఆరుణ్యం నవాత్మత్వం (శ్లో. 41) | నవాత్మత్వమ్ (శ్లో. 41) |
| మణిపూర చక్రం (శ్లో. 40) | స్ఫురన్నానా రత్నాభరణ పరిణద్ధేంద్ర ధనుషమ్ (శ్లో. 40) | - - | తటిత్వన్తం (శ్లో. 40 | తటిత్వాన్ తటిత్వతీ (శ్లో. 40) |
| స్వాధిష్ఠాన చక్రం (శ్లో. 39) | అగ్ని సంశ్రయణం (శ్లో. 39) | లోకాన్ దహతి (శ్లో. 39) | మహాసంవర్తా త్మకత్వమ్ (శ్లో. 39) | మహతీ మహాసంవర్తకః (శ్లో. 39) |
| అనాహత చక్రం (శ్లో. 38) | నివాత దీపత్వోక్తిః (శ్లో. 38) | వాయుతత్త్వో త్పాదకత్వమ్ (శ్లో. 38) | హుతభుక్ కణికారూపమ్ (శ్లో. 38) | హుతబుక్ - కణికా (శ్లో. 38) |
| విశుద్ధి చక్రం (శ్లో. 37) | శశికిరణ సారూప్య సరణిః (శ్లో. 37) | వ్యోమ జనకత్వం (శ్లో. 37) | శుద్ధస్ఫటిక విశదత్వమ్ (శ్లో. 37) | శివః-శివా (శ్లో. 37) |
| ఆజ్ఞాచక్రం (శ్లో. 36) | యమారాధ్యన్ (శ్లో. 36) | ముక్తి ప్రదత్వమ్ (శ్లో. 36) | తపనశశి కోటిద్యుతి ధరత్వమ్ (శ్లో. 36) | పరశంభునాథః పరచిత్కళా (శ్లో. 36) |

ఈ విధముగ షట్చక్రములలో శివశక్తుల పంచవిధసామ్యములు చెప్పబడినవి.

## 29. త్రివిధతాదాత్మ్యములు

సమయాచరములో శివశక్తులకు త్రివిధతాదాత్మ్యములు చెప్పబడినవి.

1) మూలాధారాదిషట్చక్రములలో త్రికోణాది షట్చక్రములతో తాదాత్మ్యము.

2) బిందుస్థానముయొక్క చతురస్రకమలత్వతాదాత్మ్యము.

3) బిందు–శక్తుల తాదాత్మ్యము.

## 30. చతుర్విధైక్యములు

ఇంతకుముందు చెప్పిన త్రివిధ తాదాత్మ్యములతోబాటు చక్ర మంత్రముల తాదాత్మ్యము కలిసి చతుర్విధైక్యములుగా చెప్పబడినవి. ఈ విధముగ చతుర్విధైక్యానుసంధానమే భగవతికి చేసే ఆరాధనము.

## 31. షడ్విధైక్యములు

నాద, బిందు, కళల పరస్పరానుసంధానమే షడ్విధైక్యమనబడును.

**నాదము:–** పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి రూపముగ చతుర్విధము. పరానాదము త్రికోణాత్మకము. పశ్యంతీనాదము అష్టకోణ చక్రరూపము. మధ్యమనాదము ద్విదశారరూపము. వైఖరీనాదము. చతుర్దశార రూపము. శివచక్రములు అంతర్భవించుట ఇచటనే జరుగును.

**బిందువు :–** బిందువులనగా మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధి, ఆజ్ఞాచక్రములు.

**కళలు :-** ఏబదికాని, మున్నూట అరువదికాని కళలుండును. నాదబిందుకళల పరస్పరైక్యానుసంధానమే షడ్విధైక్యము.

ఈ విధముగ చతుర్విధ, షడ్విధ, ఐక్యానుసంధానముతో శక్తిని భావించి, సాధకుడు సాదాఖ్యకళలో లీనము కావలెనని సంప్రదాయోక్తి.

## 32. సాదాఖ్యకళ

ఆజ్ఞాచక్రములో నున్న సహస్రకమలము జ్యోత్స్నామయము. అచటగల చంద్రుడు నిత్యకళాశోభితుడు. శ్రీచక్రమే చంద్రబింబము. చంద్రకళయే సాదాఖ్యగా పిలువబడును. ఆ కళయే చిన్మయి. ఆనందరూప ఆత్మ అని స్తుతింపబడినది. ఆమెయే త్రిపురసుందరి. భగవతిని ప్రత్యక్షీకరించుకొనుటకు మహావేధతో కూడిన షట్చక్రభేదనమావశ్యకము. ఈవిషయమే లక్ష్మీధరులు ఇట్లు చెప్పిరి. -

'భగవతిని షడ్విధైక్యములతో సంభావించి, పూజించి, సాదాఖ్య కళలో లీనము కావలెను. ఆ తరువాత షడ్విధైక్య సంధానమహిమచేతను, గురు కటాక్షసంజాతమగు మహావేధమహిమచేతను భగవతి మూలాధార, స్వాధిష్ఠాన చక్రద్వయమును భేదించుకొని మణిపూరచక్రమునందు ప్రత్యక్షమగును.

## 33. మహావేధప్రకారము

మొదట అభ్యాసదశలో గురువు మార్గదర్శనము ఆవశ్యకము. మహావిద్యను గురుముఖముగానే స్వీకరించి, ఋషి ఛందో దేవతా పూర్వకమగు మూలమంత్రము శుష్కజపమును గురువుచెప్పిన మార్గములో ఆచరించుచు, ఆశ్వయుజ శుక్లపక్షములో మహానవమిగా పిలువబడే

పుణ్యదినమున రాత్రివేళ గురువులకు పాదాభివందనము చేయవలెను. ఆ మహిమచే గురువుగారి హస్తమస్తక సంయోగముతో మరల మంత్రోపదేశమును పొందవలెను. పిమ్మట షట్చక్ర పూజాప్రకారోపదేశ షడ్విధైక్యానుసంధానోపదేశవశమున శైవమగు మహావేధ సాదాఖ్య ప్రకాశరూపమగు దివ్యమగు తేజోరూపముకలుగునని గురురహస్యము. ఈవిధముగ మహావేధ లభింపగా, భగవతి మణిపూరమున ప్రత్యక్షమగును. ఆమెను అర్చింపవలెను. అర్ఘ్యపాద్యాదిభూషణప్రతిపాదనము వరకు మణిపూరమున పూజాకలాపమును నిర్వర్తించి, భగవతిని అనాహత మందిరమునకు చేర్చి, దూపదీపాది నైవేద్య హస్తప్రక్షాళన పర్యంతము కర్మకలాపమును ముగించి, విశుద్ధిచక్రములో సింహాసనాసీనయగు భగవతిని శుద్ధస్ఫటికమణులచే పూజింపవలెను. శుద్ధస్ఫటికమణులు మౌక్తికాదులు కాదు. కాని, షోడశదళములయందు ప్రకాశించు చంద్రకళలే అనిరహస్యము. ఈ విధముగా పూజించి, ఆజ్ఞాచక్రమునకు చేర్చి కామేశ్వరీ దేవిని నీరాజనవిధితో అర్చింపవలెను.

పిమ్మట విద్యుల్లతవలె సహస్రకమలములయందు ప్రవేశించినదై, సుధాసింధువులో పంచకల్పవృక్షములనీడలో మణిద్వీపములో సరఘా మధ్యమున సదాశివునితో కలిసి దేవి విహరించును. అప్పుడు తిరస్కరిణిని ప్రయోగించి, సమీప మందిరమున స్వయముగ నివసింపవలెను. ఎప్పటివరకు దేవి బయటికి వెడలి, మూలాధారకుండమును ప్రవేశించునో, అప్పటివరకు నిలిచి యుండవలెనని సమయమతరహస్యము.

ఇంతకుముందు చెప్పిన చతుర్విధ షడ్విధైక్యానుసంధానమహిచే, మహావేధ సంస్కారమహిమచే మూలాధార, స్వాధిష్ఠాన చక్రద్వయమును భేదించి, మణిపూరచక్రమున ప్రత్యక్షమగు భగవతి స్వరూపమును సౌందర్యలహరి ఇట్లు వర్ణించెను.

**"క్వణత్కాంచీదామా కరికలభకుంభస్తననతా**
**పరిక్షీణామధ్యే పరిణత శరచ్చంద్రవదనా**
**ధనుర్బాణాన్ పాశం సృణిమపి దధానా కరతలైః**
**పురస్తాదాస్తాం నః పురమథితు రా హెూ పురుషికా ॥"** (శ్లో. 7)

ఆజ్ఞాచక్రమున సహస్రారకమలమును ప్రవేశించిన భగవతీవర్ణన సౌందర్యలహరిలో ఇట్లు వర్ణింపబడినది.

**"సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీ పరివృతే**
**మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే**
**శివాకారే మంచే పరమశివపర్యంక నిలాయాం**
**భజన్తి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీమ్ ॥"** (శ్లో. 8)

వామకేశ్వర మహాతంత్రములో ఈ వర్ణన ఇట్లున్నది.-

**"బిందుస్థానం సుధాసింధుః పంచయోన్యస్సురద్రుమాః**
**తత్రైవ నీపశ్రేశీచ తన్మధ్యే మణిమంటపమ్**
**తంత్రచింతామణికృతం దేవ్యామందిరముత్తమమ్**
**శివాత్మకే మహామంచే మహేశానోపబర్హణే**
**అతిరమ్యతరే తత్ర కశిపుశ్చ సదాశివః**
**భూతకాశ్చ చతుష్పాదాః మహేంద్రశ్చ పతత్గ్రహః**
**తత్రాస్తే పరమేశానీ మహాత్రిపురసుందరీ ॥"**

ఈశ్లోకములలో ప్రస్తావింపబడిన సుధాసిందు - సురవిటపివాటీ - నీపోపవన - చింతామణి గృహాదులు సంకేతరూపముగ భావనోపనిషదాది గ్రంథములలో విస్తరింపబడినవి. సహస్రారచక్రములోని బైందవస్థానమే సుధాసింధువు. దీనినే యావకాబ్ధి, సరఘా అనుపేర్లతో పిలిచెదరు. ఇచట పరమేశ్వరి అధిష్ఠించిన మంచములోని పాదములుగ బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వరులును, మంచముపై పలక రూపములో సదాశివుడు పరమేశ్వరిని

సేవింతురు. భగవతి చైతన్య రూపిణి. బ్రహ్మాదులు నిర్జీవులగుటవలన ప్రేతరూపులు. అందుకే ఈ శ్లోకమున పరమశివుడు పర్యంకముగ వర్ణింపబడెను.

'గతాస్తే మంచత్వం...' (శ్లో. 92) అను శ్లోకములో బ్రహ్మాదులకు పంచ ప్రేతత్వము చెప్పబడినది. ఈ విధముగ పంచప్రేతాధిష్ఠాత్రియగు భగవతి, వారికి జీవకళను ప్రసాదించునని 'పంచప్రేతమంచాధిశాయినీ' అనునామముచే స్తుతింపబడినది.

శ్రీచక్రమునగల బైందవస్థానమే సుధాసింధువనియు నవయోన్యాత్మక మగు శ్రీచక్రమే సురవిటపివాటీ రూపమనియు తంత్రములు ఘోషించుచున్నవి.

## 34. సౌందర్యలహరి – షట్చక్రపూజాక్రమము

సౌందర్యలహరిలో 'తవాజ్ఞాచక్రస్థం...' (శ్లో. 36) అను శ్లోకము మొదలుకొని 'తవాధారేమూలే...' (శ్లో. 41) అనుశ్లోకమువరకు ఆరు శ్లోకములలో షట్కమతాలలో వరుసగా షట్చక్రములు వర్ణింపబడినవి. ఇవి ఆజ్ఞాచక్రమునుండి మూలాధారచక్రమువరకు చెప్పబడినవి. సాధారణముగ తంత్రసంప్రదాయములో సర్వత్ర మూలాధారచక్రమునుండి ఆజ్ఞాచక్ర పర్యంతము షట్చక్రములను చెప్పుట కనబడును. మూలాధారానంతరము స్వాధిష్ఠానమును చెప్పి, ఆ తరువాత మణిపూరమును చెప్పుట సంప్రదాయము కాని, సౌందర్యలహరిలో మూలాధారానంతరము మణిపూరమును చెప్పెను. ఈ విధముగ తంత్రసంప్రదాయమునకు, సౌందర్యలహరికిని మధ్యభేదము కనబడుటకు కారణమును లక్ష్మీధరుడు విశదపరచెను.

'ఇచ్చట భగవత్పాదులు ఆధారకమలాదిక్రమమును వదిలి, ఆజ్ఞాచక్రాది క్రమముగ అవరోహణపద్ధతిలో పూజాక్రమమును చెప్పెను. భగవత్పాదుల ఆశయానుసారము ఆత్మనుండి ఆకాశము, ఆకాశమునుండి వాయు, వాయువు నుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుండి పృథివి జన్మించినవి. ఇది వేదసమ్మతమగు వరుస. అందుకే స్వాధిష్ఠానానంతరము చెప్పవలసిన మణిపూర చక్రమును, దాని క్రింద చెప్పుట సమంజసమే. ఆధార స్వాధిష్ఠానముల తరువాత, మణిపూరచక్రావస్థానమని సర్వయోగ శాస్త్రసిద్ధము. అదియును సంవర్తాగ్నిచే దగ్ధమైన జగత్తును సృష్టింపజేయుటకు అని తెలియవలెను.

ఈ విషయము శుకసంహితలో 'శ్రుణుదేవి ప్రవక్ష్యామి' అను వాక్యములలో 91వ శ్లోకములచేత శ్రీచక్రములోని షట్చక్రములను ప్రస్తావించి 'ఇదానీం ప్రవక్ష్యామి...' అను వాక్యారంభముతో 150 శ్లోకములలో వివరముగ చెప్పబడినది.

ఈ వాక్యములచే సౌందర్యలహరిలో సౌందర్యవర్ణనము కూడ శ్రౌత క్రమమును అనుసరించి, ఆజ్ఞాచక్రాదిక్రమములో, అవరోహణక్రమములో 'గతై ర్మాణిక్యత్వం. . .' (శ్లో. 42) ఇత్యాది శ్లోకములచేత కిరీటాది పాదాంతము వర్ణన కలదని చెప్పవలెను. శ్రీలలితా సహస్రనామ స్తోత్రమునందును 'చంపకాశోక పున్నాగసౌగంధికలసత్కచా' (శ్లో. 4) అను శ్లోకమునారంభించి 'శింజానమణిమంజీర మండితశ్రీపదాంబుజా' (శ్లో. 20) అను శ్లోకమువరకు కేశాది పాదాంతవర్ణనమే కనబడును.

## 35. తాంత్రికుల యోగము – కుండలినీ యోగము

శ్రీవిద్యాతంత్రమునందు కుండలినీ యోగము ఓతప్రోతములుగా కలిసి యున్నవి. కుండలినీశక్తి పరమేశ్వరీ స్వరూపిణిగా తాంత్రికులు

భావింతురు. లలితా సహస్రనామములందు కూడ కులకుండాలయా మున్నగు నామములు ఈ అంశమును నిరూపించుచున్నవి. మంత్రపురశ్చరణద్వారా కుండలినీశక్తిని జాగృతమొనర్చుట తాంత్రికయోగము. ఈ మూలాధారమున సర్పాకృతిలో రెండున్నరచుట్టు చుట్టుకొని నిద్రించియున్న కండలినీ శక్తిని మేల్కొల్పుటయే కౌలులకు ముక్తికాగా, ఈ కుండలినీశక్తి షట్కమలములును, గ్రంధిత్రయమును దాటి సహస్రారపద్మమును చేరుట సమయాచారుల మతమున యోగసిద్ధి.

'మహీంమూలాధారే' ఇత్యాదిశ్లోకమున శ్రీశంకరులు సమయ సంప్రదాయానుగుణముగ షట్చక్రములను దాటి సహస్రారమునుచేరి, అచట పరమేశ్వరునితో సంయోగమును పొందుటను ఈ శ్లోకమునందు శంకరులు స్వాధిష్ఠానమణిపూరముల పరస్పరవ్యత్యయమొనర్చుటనుగూర్చి పూర్వ వ్యాస భాగములోనే చర్చింపబడియున్నది. శంకరులు ఆతరువాతిశ్లోకములలో గూడ ఈ శ్లోకమునందు పాటించిన వరుసలోనే షట్చక్రములను పేర్కొనెను. వీని తరువాతి శ్లోకమగు 'సుధాధారాసారైః' అను శ్లోకమున కుండలినీశక్తి సహస్రదళ కమలమునందలి చిచ్చంద్రమండలమును ద్రవింపజేసి అచటనుండి స్రవించు అమృతముచే షట్చక్రములను ఆప్లావితమొనర్చి, మరల కులకుండమును (మూలాధార కమల కర్ణికయందలి రంధ్రము)ను చేరి అధ్యుష్ట వలయాకృతిలో నిద్రించుట వర్ణించబడినది. చిచ్చంద్ర మండలమునుండి స్రవించు అమృత ద్రవమును పరమేశ్వరీపరమేశ్వరుల పాదయుగ్మమునుండి (శుక్ల రక్త చరణముల నుండి) స్రవించు అమృతముగా వేదముకూడ అభివర్ణించినది. శంకరులు పేర్కొన్న చరణయుగములు నివియే. 'లోకస్య ద్వారమ్...' ఇత్యాది శ్రుతులలో ఈ రహస్యమే వర్ణింపబడుట వ్యాసాంతరమున ప్రస్తావింపబడుచున్నది. (సౌందర్యలహరి – వైదికత)

కుండలినీశక్తిని మూలాధరమున అర్చించుట కౌలుల సంప్రదాయము గనుక సమయాచారమును, 'సుధాధారాసారైః' అను శ్లోకమున కౌలుల సంప్రదాయమును శంకరభగవత్పాదులు పేర్కొనినట్లు వ్యాఖ్యాతల అభిప్రాయము.

'క్షితౌ షట్పంచాశత్' ఇత్యాది శ్లోకమునందు మూలాధారాది కమలములలోని మయూఖాత్మకములగు తత్త్వముల సంఖ్య వర్ణింపబడినది. ఆయా కమలములలోని తత్త్వములు సంకేతమాతృకావర్ణములు సిద్ధాంత పరిచయావసరమున పూర్వమే వివరింపబడినవి. ఆయా తత్త్వములన్నియు మున్నూటరువది అహోరాత్రముల స్వరూపమగు సంవత్సరమునకు, కాలమునకు సంకేతములు. కనుక వీనికి పైనున్న పరమేశ్వరి చరణారవిందములు, కాలాతీతములని, కాలనియామకములనియు ఈ అభివర్ణనలో రహస్యార్థము.

ఆజ్ఞాచక్రమునకంటె ఊర్ధ్వముననున్న సహస్రకమలమున సాదాఖ్య కళారూపయగు దేవి సదాశివతత్త్వముతో చేరియుండును. అచటి దేవీ స్వరూపమున 'తటిల్లేఖాతన్వీం' అనుశ్లోకమున శంకరులు వర్ణించిరి. ఇచట పరమేశ్వరి తటిల్లేఖాతన్వి- అనగా కుండలినీ స్వరూపిణి. తపన శశి వైశ్వానరమయి- అనగా సోమసూర్యానలాత్మిక. పంచదశీమంత్ర స్వరూపిణి. ఈ పరమేశ్వరి పరమానందలహరి. అనగా పరబ్రహ్మతత్త్వము. ఇది పరిపూర్ణయోగసాధకులు మాత్రమే దర్శించి, అనుభూతిని పొందగలుగు స్థితి.

ముప్పదియారవ శ్లోకమునుండి నలుబదియొకటవ శ్లోకము వరకుగల ఆరు శ్లోకములలో శంకరులు ఆజ్ఞాచక్రము మొదలు మూలాధారాంతము వరకుగల షట్కమలములను నిరూపించిరి.

ఆజ్ఞాచక్రము జ్యోతిర్లోకము. ఇచ్చట పరమేశ్వరీ పరమేశ్వరులు జ్యోతి ర్మయాకృతులగుట రూపసామ్యము. పరశబ్దవాచ్యులగుట

నామసామ్యము. సాధకులచే ఆరాధింపబడుట అవస్థానసామ్యము. ముక్తిప్రదులగుట అనుష్ఠానసామ్యము. ఇట్లీ చక్రమున సమయేశ్వరీ, సమయేశ్వరులకు పంచవిధ సామ్యములు ప్రతిపాదింపబడినవి. విశుద్ధిచక్రమున నుండుట ఉభయులకు అధిష్ఠానసామ్యము. శుద్ధస్ఫటిక విశదత్వము రూపసామ్యము. వ్యోమజనకత్వమనుష్ఠానవాచ్యము. ఉభయులు శివశబ్ద వాచ్యులగుటచే నామ సామ్యము. శశికిరణ సామీప్యసరణిచే అవస్థానసామ్యము. అంతర్ధ్వాంతమును తొలగించుట అవస్థాసామ్యము.

సంవిత్ చక్రమున హంసేశ్వరీ హంసేశ్వరరూపమున నుండుట నామసామ్యము. శిఖిజ్వాలారూపముననుందురని శంకరభగవత్పాదులు శ్రీగౌడ పాదుల సుభగోదయమును వ్యాఖ్యానించుచు పేర్కొనిరని లక్ష్మీధరోక్తి. (శ్లో. 38 వ్యాఖ్య). ఇది రూపసామ్యము. వాయుసంశ్రయణము అవస్థానసామ్యము. యదాలాపాత్ అనుటచే అనుష్ఠానసామ్యము. చక్రస్థితి అధిష్ఠానసామ్యము.

స్వాధిష్ఠానచక్రమున మహాసంవర్తేశ్వర మహాసంవర్తేశ్వరీ నాములతో నుండుట నామసామ్యము. మహతీశబ్దముచే మహాసంవర్తాగ్నికాత్మకమగు రూపసామ్యము. స్వాధిష్ఠానగతమగు అగ్ని సంశ్రయణము అవస్థాసామ్యము. లోకములనుదహించుట అనుష్ఠానసామ్యము. స్వాధిష్ఠానస్థితి అధిష్ఠాన సామ్యము.

జలతత్త్వాత్మకమగు మణిపూరచక్రమున మేఘేశ్వరీమేఘేశ్వర రూపమున నుండుట నామరూపసామ్యము. మణిపూరమున నుండుట అధిష్ఠానసామ్యము. 'వర్షణం' ఇత్యాదులచే అనుష్ఠానసామ్యము. 'స్ఫురన్నానారత్న...' ఇత్యాదులచే అవస్థానసానమ్యము.

మూలాధారచక్రమున ఉభయులస్థితి అధిష్ఠానసామ్యము. జనకజననీ మజ్జగదిదమ్ అనుటచే అనుష్ఠానసామ్యము. లాస్యతాండవములచే అవస్థాన

సామ్యము, సమయేశ్వరీసమయేశ్వరులనుట నామసామ్యము. ఆనందభైరవీ ఆనందభైరవులని కౌలమతమున నామసామ్యము. ఆరుణ్యము రూప సామ్యము. ఇది తంత్రాంతరసిద్ధము. ('జపాకుసుమసంకాశే – (ల.ధ.వ్యా. పుట: 353)

ఇట్లు షట్చక్రములందును శివాశివులకు పంచవిధసామ్యములు నిరూపింపబడినవి.

సౌందర్యలహరీస్తవమునందు తాంత్రికసంప్రదాయ సిద్ధమగు యోగ పద్ధతిలో షట్చక్రనిరూపణము ఆయాచక్రములలో శివాశివుల సామ్యస్థితి, కుండలినీయోగము మున్నగు నంశములు ప్రస్తావితములై ఈ స్తోత్రము తంత్ర యోగములకును విహారరంగముగ విరాజిల్లుచున్నది.

## 36. కుండలిని

శ్రీవిద్యామంత్రము, కుండలినీయోగము ఓతప్రోతములుగా సమ్మిళితములైనవి. తాంత్రికుల కుండలినీ స్వరూపము ఈవిధముగ నుండును.

**"భుజంగాకారరూపేణ మూలాధారం సమాశ్రితా**
**శక్తిః కుండలినీ నామబిసతంతు నిభాఽఽశుభా**
**గుదలింగాంతరే చక్రమాధారాఖ్యం చతుర్దలమ్**
**అస్తికుండలినీ బ్రహ్మశక్తి రాధార సంపుటే"**

శాక్తతంత్రములలో మూలాధారస్థిత కుండలిని జాగృతి, గ్రంథి త్రయభేదముతో షట్చక్రభేదనములవలన శిరఃస్థిత సహస్రకమలముయొక్క దశనం (స్పృశించుట), తదుపరి సుధావర్షము సాధకునికి నివృత్తికారణమని చెప్పబడెను. –

**మూలకందం ఫణాగ్రేణ దృష్ట్వాకమలకందవత్**
**ముఖేన పుచ్ఛం సంగృహ్య బ్రహ్మరంధ్రం సమాశ్రితా**
**పద్మాసనగతః స్వస్థః గుమమాచంచ్యసాధకః**
**వాయుమూర్ధ్వగతిం కుర్వన్ కుంభకావిష్టమానసః**
**వాయ్వాఘాత వశాదగ్నిః స్వాధిష్ఠానగతో జ్వలన్**
**జ్వలనాఘాత పవనాఘాతై రున్నిద్రితోఽహిరాట్**
**రుద్రగ్రంథిం తతోభిత్వా విష్ణుగ్రంథిం భినత్త్యతః**
**బ్రహ్మగ్రంథిం చ భిత్త్వైవ కమలానిభినత్తిషట్**
**సహస్రకమలే శక్తిః శివేన సహమోదతే**
**స చావస్థా పరాజ్ఞేయా సైవ నిర్వృత్తికారణమ్' –**

(వామకేశ్వరీతంత్రము)

సౌందర్యలహరిలో ఈ విషయమే స్పష్టముగా చెప్పబడినది. –

**'మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం**
**స్థితం స్వాధిష్ఠానే హృదిమరుతమాకాశముపరి**
**మనోపి భ్రూమధ్యే సకలమపి భిత్త్వా కులపథం**
**సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసే** (శ్లో.9)

'మూలాధారాది షట్చక్రాలలో నున్న మహ్యాది తత్త్వము సుషుమ్నామార్గ రూపమగు కులపథమును భేదించుకొని సహస్రదళకమలములో పతియగు సదాశివునిచే క్రీడింతువు' అని షట్చక్రభేదనము చెప్పబడినది. ఈ శ్లోకమున మూలాధారము తరువాత మణిపూరచక్రమును చెప్పుట వేదమూలకము. వేదములో చెప్పిన ఆకాశాది తత్త్వోత్పత్తి క్రమమును అనుసరించి చెప్పబడినదని లక్ష్మీధరుడు చెప్పిన విషయము యుక్తిసమ్మతము.

కుండలిని సహస్రారకమలమును స్పృశించి సుధావర్షణము జరిగిన తరువాత మరల కుండలిని మూలాధారమునకు చేరుకొని నిద్రించునని తంత్ర శాస్త్రవచనము. –

**"శివార్కమండలం భిత్త్వా ద్రావయంతీందుమండలమ్**
**తదుద్భూతామృతస్యంది పరమానందనందితా**
**కులయోషిత్కులం త్యక్త్వా పరం వర్షణమేత్యసా" –**

(వామకేశ్వరతంత్రము)

శివాయనగా శక్తి. కుండలిని ఆమె హృదయకమలముపైనున్న అర్కమండలమును భేదించి, అర్కమండలముపైనున్న బ్రహ్మద్వారమును మూసి, సహస్రారకమలాంతఃస్థితయగు ఇందుమండలమును ద్రవింప జేయును. అందుకే కుండలినిని కులయోషిత అందురు. ఆ కుండలినీ శక్తి సుషుమ్నా రూపమగు కులమార్గమును వదలి, 72 వేలనాడులయందు వర్షించి, తిరిగి స్వస్థానమును చేరుకొని, అచట నిద్రించునను విషయము స్పష్టమైనది.

ఈ అంశమే సౌందర్యలహరిలో ఇట్లు వర్ణితము. –

**"సుధాధారాసారైశ్చరణయుగళాంతర్విగళితైః**
**ప్రపంచం సించంతీ పునరపి రసామ్నాయమహసః**
**అవాప్యస్వాం భూమిం భుజగనిభమధ్యుష్టవలయం**
**స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుండే కుహరిణి !** (శ్లో. 10)

శిరస్సులోనున్న సహస్రారకమలాంతర్గమగు శ్రీచక్రాత్మక శశిబింబ మధ్యములోనుండు భగవతి యొక్క చరణ కమలముల నిర్ణేజనజలముచే సాధకుని శరీరమును తడిపివేసి, మరల భుజంగాకృతిలో ఆధారకుండమును ప్రవేశించి, సుషుమ్నను భేదించి భగవతి నిద్రించును. అను తాంత్రికుల యోగము ఈ శ్లోకములో వర్ణింపబడినది. 'లోకస్య దావరమర్ప్మమత్పవిత్రమ్' అను వేదవాక్కుననుసరించి, భగవతి చరణాంబుజముల సుధాధారలచే ప్రపంచసేచనమును కుండలినీ యోగముగా వర్ణించుట జరిగినది.

ఈ విధముగ సౌందర్యలహరిలో తంత్రయోగాద్యంశములు చెప్పబడినవి.

# చతుర్థతరంగము

## 1. సౌందర్యలహరి-శతకత్వ విచారము

సౌందర్యలహరి శతశ్లోకాత్మకమని ముందే పేరొంచిని. కనుక ఈ స్తోత్రము శతకమనుట స్పష్టము. కావ్యశాస్త్రములో ప్రాచీనాలంకారికులు శతక స్వరూపాన్ని స్పష్టంగా పేర్కొనలేదు. కానీ స్తోత్రములను అనిబద్ధ కావ్యములని చెప్పిరి.

సంఖ్యామూలకములైన పద్యకావ్యముల స్వరూపమును మొదట క్రీ.శ. 13వ శతాబ్దికి చెందిన అమృతానందయోగి చెప్పెను. ఇతడు రచించిన అలంకారసారసంగ్రహములో శతకమును చాటుప్రబంధమని వక్కాణించెను.

**"అథ చాటుప్రబంధానాం లక్షణం కథ్యతేధునా**
**ముక్తకం పద్యమేకం స్యాత్ ద్వికం పద్యద్వయం మతమ్**
**త్రికం త్రయేణపద్యానాం పంచరత్నాని పంచకమ్**
**అష్టకం గజమాలాస్యాత్ షోడశేందుకళాస్మృతా**
**సప్తవింశతి పద్యాని నామ్నా తారావళీ మతా**
**త్రింశతా త్రింశికా పంచాశతా పంచశికేష్యతే**
**శతేన శతకం ప్రోక్తం అష్టోత్తరశతం పరమ్ ။"**

అమృతానందయోగి చెప్పని త్రిశత - పంచశత - సహస్ర పద్యసంఖ్యాత్మకాలు కూడ కనబడుతున్నవి. శతకలక్షణమును ఇదమిత్థముగా ప్రాచీనాలంకారికులు చెప్పలేదు. అయినను సంస్కృతవాఙ్మయములో శత శ్లోకాత్మక స్తోత్రాలను పరిశీలించినప్పుడు వానిలక్షణమును ఈ విధముగా చెప్పవచ్చును.

**శతకముల సాధారణ ధర్మాలు :**

1. సంఖ్యానియమము.
2. నియతం కాని మకుట నియమము
3. నియత ఛందోనియమము
4. నియత రసనియమము
5. అనియతమగు ఆత్మాశ్రయకవితాధర్మము.

ఇన్నికారణములచే సౌందర్యలహరి శతకమనుట సరియైనది.

## 2. మంగళాచరణము

'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రతన్తే' అని పాతంజల మహాభాష్యమున పేర్కొనబడినది.[1] కావ్యలక్షణకారులును దీనిని కావ్యముల కన్వయించిరి. సాధారణముగా భారతీయకావ్యములు మంగళాచరణ పూర్వకములుగ నుండును. ఇష్టదేవతాస్తుతిగాని, లోకమునకో, కృతిపతికో, కృతికర్తకో శుభము కలుగవలెనను ఆశంసతోగాని కృతిప్రారంభముండును. మంగళాస్పదములగు అక్షరములతోడను, పదములతోడను కావ్యారంభము జరుగును.

భగవన్నుతి ప్రధానమగు స్తోత్రవాఙ్మయము సర్వాంగీణముగా మంగళాస్పదమే. సర్వమంగళయగు పరమేశ్వరిని స్తుతించు శ్రీ సౌందర్యలహరీ స్తవమున పై లక్షణమును అన్వేషింపనక్కరలేదు. మంగళాస్పదత్వము గ్రంథమంతటను పర్యాప్తమై యున్నది. పరమేశ్వరీ సమర్చనమునకు నిర్దేశించిన సర్వవర్ణములు పదములు శ్రేయోదాయకములే.

---

1. పతంజలి మహాభాష్యమ్ – పశ్పశాహ్నికము.

అయినను శాస్త్రనిర్దేశమును దృష్టిలోనుంచుకొని శంకరభగవత్పాదులు స్తోత్రారంభమున మంగళాస్పదమును, శ్రేయఃపర్యాయవాచకమును[1] నగు శివశబ్దమును ప్రయోగించిరి. వర్ణదృష్టితో చూచినపుడు ప్రథమోష్మము మంగళాస్పదమైనది. పరమేశ్వర సంకేతముగ బీజాక్షరనిఘంటువులలో పేర్కొనబడినది.[2] ఇది సుధాబీజము. దీనిపై చేరిన ఇకారము పరమేశ్వరీ బీజముగా వేదములలో కీర్తితమైనది. ఇది లక్ష్మీబీజము.[3] శివశక్తుల నుభయులను గ్రంథారంభమున స్మరించుటయు జయమంగళాఽ స్పదము.[4]

లాక్షణిక దృష్టితో కావ్యారంభమున కొన్ని గణములు మంగళా స్పదములుగా పేర్కొనబడినవి. యగణమట్టివానిలో నొకటి. ఇది వరుణ దైవతాధిపత్యముగలది. సంపత్ప్రదమైనది. ఇట్లు యగణారంభముచేగూడ భగవత్పాదులు గ్రంథారంభమున మంగళాచరణ లక్షణమును సమగ్రముగ పాటించిరి.

ప్రథమభాగమగు ఆనందలహరి చివరి శ్లోకమగు 'తవాధారమూలే' అను శ్లోకమున 'జనకజననీమజ్జగదిదమ్' అని శ్రీశంకరులు జనకజననీ మంతముగ పేర్కొని మంగళమును సూచించిరి. గ్రంథ పరిసమాప్తి యందు 'తవజనని వాచాం స్తుతిరియమ్' అని ఈ స్తోత్రమును 'నీవాక్కులే అను మంగళార్థముతో ముగించిరి. తత్పూర్వ శ్లోకమగు 'సరస్వత్యాలక్ష్మ్యా' అను దానిలో చిరంజీవన్నేక్షపిత పశుపాశవ్యతికరః' 'పపానందాభిఖ్యం రసయతి రసంత్వద్భజనవాన్' అని సమగ్రమగు మంగళనిర్దేశమును గావించిరి.

---

1. అమరము సశ్రేయసం శివం భద్రం
2. లక్షణదీపిక (ఉద్ధృతము – ల.ధ)
3. తాం పద్మినీమీం ; య ఈం శృణోతి; చత్వా రీం
4. యశ్శివో నామరూపాభ్యాం ...

స్తోత్రమధ్యమున కూడ సర్వత్ర మంగళాస్పదములగు భగవతీ నామములును, బహిరంతస్సౌందర్య పర్యాప్తముగ నున్నవి. భావములును జగత్ శ్రేయస్కారకములు.

ఇట్లీస్తోత్రమున ఆదిమధ్యాంత మంగళాస్పదత్వమను కావ్యశాస్త్ర లక్షణము సమగ్రముగ పరిపాటింపబడినది.

## 3. సౌందర్యలహరి - రసము

### శంకరులు - రస సమీకరణము

భరతముని మతమున రససంఖ్య ఎనిమిదియనియా, తొమ్మిదియా అను విషయమును ఆలంకారికులు విస్తృతముగా చర్చించిరి. శాంతమునకు రసత్వమంగీకరింపని వారును, పాక్షికముగ అనగా శ్రవ్యకావ్యములలో మాత్రమంగీకరించినవారును కూడ కలరు. శాంతమునకు రసత్వము భరత సమ్మతమేయని తొలుత ప్రతిపాదించినవారు - వాసుకి, కోహలులను ఆలంకారికులు. ఈ చర్చ ఆనందవర్ధనాచార్యులు ధ్వన్యాలోకము శ్రీమహా భారతమును శాంతరసప్రధానముగా నిరూపించుటచే ఆలంకారికులలో వాదోపవాదములకు దారితీసినది. అభినవగుప్తపాదులు సోపపత్తికముగ శాంతమునకు రసత్వమును నిరూపించిరి. శాంతము భరతముని సమ్మతమే అని నిరూపించుచు కూడ భరతులు రసనిర్దేశము చేసిన శ్లోకములోగాని, స్థాయిభావమును నిర్దేశించు శ్లోకములోగాని శాంత శమ శబ్దములున్న పాఠములను ప్రమాణీకరింపలేదు. భంగ్యంతరముగ శమమునకు స్థాయిత్వమును, శాంతమునకు రసత్వమును భరతులంగీకరించినట్లు మాత్రమే నిరూపించిరి.

శ్రీశంకరుల ప్రధానరంగము అలంకారశాస్త్రము కాదు. కనుక ఆయన వీనిని గూర్చి ప్రత్యేకముగ చర్చించునవకాశములేదు. సూక్ష్మముగ

తన యభిప్రాయమును సూచించుటయే జరిగినది. 'నవరస మహాతాండ వనటమ్...' (శ్లో.41) అని ప్రయోగించుటచే శంకరులకు తొమ్మిదవ రసముగా శాంతము అంగీకార్యమే యని స్పష్టమగుచున్నది. ఈ తొమ్మిదవ రసము శాంతముగాక, భక్తియో? మరియొకటియో ఏల కారాదను సందేహము కలుగవచ్చును. 'గతే కర్ణాభ్యార్ణం' (శ్లో. 52) అనుశ్లోకములో దీనికి సమాధానమున్నది. 'చిత్తప్రశమ రస' మనుమాటచే శాంతమునకు రసత్వము శంకరులకు సమ్మతమే యని స్పష్టమగుచున్నది.

అంతే గాక శ్రీవిద్యాసంప్రదాయమున నవావరణాత్మకమగు శ్రీచక్రమున ఒక్కొక్క ఆవరణమునందొక్కొక్క రసమును భావించు సంప్రదాయమున్నది. బిందువున భావింపబడునది శాంతము. ఇట్లు శాంతమునకు రసత్వము శ్రీవిద్యాసంప్రదాయసిద్ధము. అష్టరసవాదము ఆలంకారిక చర్చలకు మాత్రమే పరిమితము. సౌందర్యలహరీ వ్యాఖ్యాతయగు శ్రీలక్ష్మీధరులును, లలితాసహస్రనామ భాష్యకర్తలగు భాస్కరరాయాచార్యులును అష్టరసవాదము వైపే మొగ్గుచూపినను అది వారి యాలంకారిక దృక్పథమునే సూచించును గాని శంకరులు స్పష్టముగా నవరస శబ్దముచే సూచించిన అభిప్రాయమునకు భంజకముగాదు. 'నవరసమహాతాండవ నటమ్' (శ్లో. 41) అనుచోట నవరసములనే శంకరులు ప్రస్తావించినట్లు లక్ష్మీధరులు వ్యాఖ్యానించుట గమనింపదగినది. ("నవరస మహాతాండవనటం - నవభిః, శృంగారాదిభిః రసైః, మహత్ అద్భుతం, తాండవమ్ పుం కర్తృకం నృత్యం తాండవమిత్యుచ్యతే..." - ల.ధ. వ్యా.శ్లో.41). డిండిమ వ్యాఖ్యానమున నవరసాదులనగా నవతాళములను అర్థము చెప్పబడినది. ఇది అర్థ పుష్టిలేనిదియు, కవి ఆశయమునకు విరుద్ధమునునగు వ్యాఖ్యా. ఇతర వ్యాఖ్యాత లందరును శాంతమును రసముగా శంకరులు పేర్కొనినట్లే ప్రశమరస శబ్దమును వ్యాఖ్యానించిరి.

శ్రీశంకరభగవత్పాదులకు నవరసవాదమే సమ్మతమనియు శాంతమునకు రసత్వమాయన అంగీకరించిరనియు, భక్త్యాదులకు ప్రత్యేక రసములుగా భావింపలేదనియు ఈ చర్చ ఫలితార్థము.

## సౌందర్యలహరి - రసము

సౌందర్యలహరీ స్తవము భక్తిప్రధానమైనదనుట నిర్వివాదము. ఒక్క సౌందర్యలహరియేగాక ప్రాయికముగా స్తోత్రవాఙ్మయ మెల్లను భక్తిమయమే. కాని, భక్తి రసమగునా? కాదా? అనునది ఆలంకారికులచే బహుధా చర్చింపబడినది. రససమీకరణ విషయమున కూడ వివిధవాదములున్నవి. శాంతమునకు రసత్వము భరతసమ్మతముకాదను వాదము మొదలు, శాంతముకూడ భరతసమ్మతమేయను నవరస వాదమేగాక, భక్తి ప్రేయో వత్సల మాయాది భావములకు రసత్వమును ప్రతిపాదించినవారును గలరు. ఈచర్చను మరింత పొడిగించి 'అనంతావై రసాః' అని ప్రతిపాదించిన లాక్షణికులును, రసమొక్కటియే యనియు, అది ఉపాధిభేదముచే శృంగారాది రూపములను దాల్చుచున్నదను ఏకరసవాదులును గలరు.

సౌందర్యలహరీస్తవమున రసము భక్తియా అను విషయమును పరిశీలించినచో భక్తిని పదవరసముగా అంగీకరించినచో సౌందర్యలహరీ స్తవమున భక్తియే రసమని చెప్పకతప్పదు. ఈ స్తోత్రములో ప్రధానముగ ఉత్తరభాగమున పాదాదిచూడాంతముగ పరమేశ్వరీ సౌందర్యము వర్ణింపబడినది. సౌందర్యవర్ణనాత్మకముగటచే ఇది శృంగార రసాత్మకమనుటకును అవకాశమున్నది. భావ వైవిధ్యముగల ముక్తకములతో కూర్పబడిన శతకములలో రసచర్చకు అవకాశము తక్కువ. ఇట్టి వానిలో విభావానుభావవ్యభిచారి రససామగ్రిని ఋజుమార్గమున నిరూపించుట కవకాశము తక్కువ. ఇట్టి నిరూపణలో వాదిబలమేగాని, వాదబలము స్వల్పమగు నుండును. అట్టివానికన్న భిన్నముగ పరమేశ్వరీ సౌందర్య

వర్ణనమును పరమపురుషార్థ ప్రతిపాదనమును కూడ సర్వాంగీణముగా ప్రతిపాదింపబడిన సౌందర్యలహరీస్తవమున రసచర్చకు అవకాశము పుష్కలముగ నున్నది. పరమేశ్వరి ఆలంబనవిభావము. తత్సౌందర్య మహిమాదులు ఉద్దీపన విభావములు. పరమేశ్వరీప్రభావాది స్మరణచే కలుగు అశ్రురోమాంచాదులు అనుభావములు. నిర్వేదాదులు వ్యభిచారి భావములు. ఇట్లీ స్తోత్రమున రససామగ్రి పుష్కలముగ నున్నది.

భగవద్విషయగమగు రతిని శృంగారరసమునకు స్థాయీభావమగు రతియంతే ఒకభేదముగ అంతర్భవింపజేయు పక్షమున, అనగా భక్తికి ప్రత్యేక రసత్వము నంగీకరిపని మతమున శ్రీసౌందర్యలహరీస్తవము శృంగారరస ప్రధానమైనదని చెప్పవలెను. అట్లుగాక భగవద్విషయకరతిని సాధారణరతికంటె భిన్నమగు స్థాయీభావముగ అంగీకరించినపుడీ స్తోత్రము భక్తిరసప్రధానమే యగును.

ఇంతకును శ్రీశంకరులకు భక్తిరసవాదము అభిమతమగునా కాదా యనుటయు వివేచింపదగినది. శ్రీశంకరులెచటను రసవిషయముగ నిట్టివాదము చేయలేదు. ఆయన రంగమదికాదు. కాని సౌందర్యలహరీ స్తవమున భగవత్పాదులు 'నవరస' శబ్దమును వాడిరి.(శ్లో. 41) అంతేగాక పరమేశ్వరిని వివిధరస స్వరూపిణిగ వర్ణించు 'శివేశృంగారార్ద్రా' (శ్లో.51) అను శ్లోకమున శృంగారాద్యష్టరసములను, 'ప్రశమరస విద్రావణఫలే' (శ్లో.52) అని తరువాతి శ్లోకములో శాంతరసప్రస్తావనమును చేయుటను బట్టి, భక్తిని రసముగా నిర్దేశింపకపోవుటనుబట్టి శ్రీసౌందర్యలహరీ స్తవమునందలి భక్తిని భావముగనే పరిగణించి శృంగారరసమునందే అంతర్భవింపజేయుట భగవత్పాదాభిమతమని భావింపవలసియున్నది.

శృంగారమును ప్రధానరసమని పేర్కొన్నప్పుడు ఆనుషంగికముగ అంగ రసములున్నవా యను ప్రశ్న ఉదయించును. 'శివేశృంగారార్ద్రా'

(శ్లో.51) ఇత్యాది శ్లోకమున భగవత్పాదులు శృంగార కరుణాశబ్దములను మాత్రమే రసవాచకములగు వానిని ప్రయోగించిరి. తక్కినవన్నియు స్థాయీభావములో, లేక వాని పర్యాయములు మాత్రమే. అనంతర శ్లోకమున ప్రశమశబ్దమును వాడినను, ప్రశమరసశబ్దముచే రసనిర్దేశమును చేసిరి. శివునకు పరమేశ్వరి ప్రశమరస విద్రావణఫలయగుటచే తదితరులను ప్రశమరసకారియనుటయు పరిశేషన్యాయమున సిద్ధించి, శాంతమును గూడ ఈ స్తోత్రమున అంగరసముగా భగవత్పాదులు భావించినట్లు తోచును. ఇట్లు శాంతమునకు సౌందర్యలహరీ స్తవమున అంగరసత్వము శంకరభగవత్పాదాభిప్రేతమని భావింపవచ్చును.

రసము కింనిష్ఠమను చర్చకు చరమవాక్యముగా ఆలంకారికులు సహృదయనిష్ఠమనియే నిర్ధారణచేసిరి. సహృదయ పక్షమున వివేచించినచో సౌందర్యలహరీ పఠనము వలన కలుగునది పరమేశ్వరియందు పరానురక్తియే. దీనిని భక్తియనుట శాస్త్రసిద్ధము. ("సా పరానురక్తిరీశ్వరే. . ." - నారదభక్తి సూత్రములు). భగవద్విషయకమైన ఈ అనురక్తిని స్థాయీభావత్వముగాని, భక్తిని రసత్వముగాని శంకరులు నిర్దేశింపలేదనుట ముందే పేర్కొనబడినది. కనుక దీని శృంగారరసస్థాయి యగు రతియందే ఒక భేదముగ పరిగణింపవలసి యున్నది. కనుక సౌందర్యలహరి స్తవమున అంగిరసము శృంగారమనుటయే సమంజసము.

## 4. సౌందర్యలహరి-అలంకారసౌందర్యము

అలంకారములు కావ్యసుందరికలంకారములు. కవి ప్రతిభ అనంతమైనది, నిత్యనూతనమైనది. కనుక ఉక్తి వైచిత్రియు అనంతమే. అందుచే వాగ్వికల్ప విశేషములగు అలంకారములును అనంతములే యని చెప్పుట సముచితము. ఈ యభిప్రాయమునే ఆనందవర్ధనాచార్యులు

'వాగ్వికల్పానామానంత్యాత్' ఇత్యాది వచనముచే సూచించిరి. ఈ కారణము చేతనే భరతముని పేర్కొన్నవి ఉపమ, రూపక, దీపకములు మూడే అర్థాలం కారములుకాగా, కువలయానందము నాటికి వానిసంఖ్య పరశ్శతముగ విస్తరించినది. కవివాక్కులలోని వైచిత్రీ విశేషములన్నియు లాక్షణికులు పేర్కొన్న పరిమిత సంఖ్యాకములగు ఈ అలంకారభేదములలో ఒదిగి పోవునని చెప్పలేము. అయినను నేటిదనుక లాక్షణికుల అలంకారభేదముల పరిధిలోనే ఏ కావ్యములోని అలంకారములనైనను సమన్వియింపక తప్పదు. ఈ దృష్టితోనే శ్రీశంకరభగత్పాదుల సౌందర్యలహరీ స్తవమునందలి అలంకారవిశేషములు నిరూపింపబడుచున్నవి. 'అలంకారశ్చమత్కారః' అను నిర్వచనమునునసరించి ఉక్తి చమత్కారమున్నచోట్లనెల్ల అలంకారమున్నదని చెప్పక తప్పదు. కాని ఆ చమత్కారము ప్రత్యేకముగ అలంకారముగ పేర్కొనబడని సందర్భమున సౌందర్యలహరి విషయమున అట్టివానిని ప్రస్తావించుటలేదు.

సౌందర్యలహరీగతములగు అలంకార విశేషములను వ్యాఖ్యాతలు తత్తత్ శ్లోకముల వ్యాఖ్యానములలో నిరూపించిరి. కొన్ని శ్లోకములలో ముఖ్యముగా తంత్రప్రధానమగు అనందలహరీవిభాగములో వ్యాఖ్యాతలు అలంకార నిరూపణము చేయని శ్లోకములు పెక్కుగలవు. అట్టి వానిలోని అలంకారవిశేషము ఈ వ్యాసమున ప్రస్తావింపబడుచున్నది. కొన్నిశ్లోకములలో అలంకారవిషయమున వ్యాఖ్యాతలలో ఏకవాక్యతలేదు. అట్టిసందర్భములలో ఆ శ్లోకమునందలి అలంకార విశేషమును నిరూపించుటకును ఈవ్యాస భాగమున ప్రయత్నింపబడుచున్నది. ఈ నిరూపణములో కువలయానందోక్తి లక్షణములు ప్రమాణములుగ స్వీకరింపబడుచున్నవి. వ్యాఖ్యాతలలో అలంకారవిషయమున భేదము కన్పించుటకాని, ఈ వ్యాసములో నిరూపింపబడు అలంకారము వ్యాఖ్యాతలు చెప్పినదానితో సంవదింపకుండుటకుగాని కొంతవరకు కారణము

కావచ్చును. శంకరులశ్లోకమునందలి పంక్తులను, వాని అన్వయక్రమమును బట్టిగాక, తమతమ వ్యాఖ్యానపంక్తులను దృష్టిలోనుంచుకొని అలంకార నిరూపణము చేయుటకు వ్యాఖ్యాతలు కొన్నిచోట్ల ప్రయత్నించిరి. ఇదికూడ అభిప్రాయభేదమునకొక కారణము.

వ్యాఖ్యాతలు అలంకారవిషయమున ఏకాభిప్రాయమును వ్యక్తపరచిన ఈ వ్యాసకర్తకుకూడ వారితో ఏకీభవించు సందర్భములలోగల అలంకార విశేషములు కేవలము నామమాత్రముగ ప్రస్తావింపబడుచున్నవి. గ్రంథవిస్తర భీతిచే వ్యాఖ్యాతలు సమన్వయించిన వానినే పునరుక్తము చేయుటకు ఇచట ప్రయత్నించుటలేదు.

అర్థాలంకారములలో ప్రథమగణ్యమైనదియు, సర్వాలంకారములకు బీజభూతమైనదియు ఉపమ. శంకరులు మనోహరములగు ఉపమానములను చెప్పిరి. సవిత్రీభిర్వాచాం (17) అనుశ్లోకమున 'శశిమణి శిలాభంగిరుచిభిః' అనుచోట సాదృశ్యవాచకములోపించుటే లుప్తోపమ.

కిరంతీమంగేభ్యః (20) ఇత్యాది శ్లోకమున 'హిమకరశిలామూర్తిమివ త్వామాధత్తే' అనుటచే ఉపమాలంకారము. అట్లే తటిల్లేఖాతన్వీం (2) అను శ్లోకమునందును 'తటిల్లేఖాతన్వీం' అనుచోట ఉపమావాచకము పేర్కొనబడక పోవుటచే లుప్తోపమ.

విశుద్ధౌ తే శుద్ధ (37) అను శ్లోకమునందు 'స్ఫటికవిశదం' అనుచోట లుప్తోపమయు, 'విలసతి చకోరీర జగతీ' అనుటచే పూర్ణోపమయు గలవు.

ఉపమ తరువాత భరతముని పేర్కొన్నది రూపకము. సవిత్రీభిర్వాచాం (17) అను శ్లోకమున వాగ్దేవీవదన కమలామోదమధురైః అనుటచే వాక్కులకు ఆమోదమాధుర్యమను అన్యధర్మము ఆరోపింపబడుటచే రూపకము.

ముఖం బిందుం కృత్వా (19) ఇత్యాది శ్లోకమున 'త్రిలోకీ' అనుదానికి విశేషణముగ రవీందుస్తనయుగావ్ అను రవీందులయందు స్తనత్వారోపణము చేయబడుటచే రూపకము.

"సమున్మలత్సంవిత్..." (38) ఇత్యాది శ్లోకమున ప్రకృత విషయములగు శివాశివులను వాచ్యముచేయక, హంసద్వంద్వం అనిచెప్పి విషయనిగరణము చేయుటచే రూపకాతిశయోక్తి. ఇది 'మానసచరమ్' అనుచోట మానస శబ్దమునందు మనస్సనియు, మానససరోవరమనియు శ్లేష. 'యదాదత్తే... పయ ఇవ' అనుచోట ఉపమ. ఇట్లీ రూపకాతిశయోక్తి శ్లేషచేతను, ఉపమ చేతను అనుప్రాణితమైనది.

'తటిత్త్వన్తం శక్త్యా...'(40) నందు విషయమగు శివుని మరుగుపరచి విషయవాచకమగు మేఘశబ్దమును చెప్పుటచే రూపకాతిశయోక్తి. ఈ శ్లోకము నందే 'హరమిహిరతప్తం' అను పదమునకు 'హర ఏవ మిహిరః' అను అర్థమును కొందరు వ్యాఖ్యాతలు చెప్పిరి. వారిచట అలంకారమును పేర్కొనకున్నను పై వివరణనుబట్టి ఇచట రూపకాలంకారము చెప్పవలసి యున్నది. ఆ పక్షమున ఈ శ్లోకమునందలి రూపకాతిశయోక్తి రూపకముచే అనుప్రాణితమైనది.

'చతుర్భిః శ్రీకంఠైః...' (11) శ్లోకమున వసుకళాశబ్దములచే అష్టషోడశ సంఖ్యలు బోధింపబడినవి. అట్లే 'శివశ్శక్తిః కామః...' (32) శ్లోకమునందు పంచదశీవర్ణములు శివాదిపదములచే సంకేతితములు. అనంతర శ్లోకము కూడ 'స్మరం యోనిం ...' (శ్లో. 33) ఇత్యాది పదములచే తత్తద్బీజాక్షరములు సూచింప బడినవి. కనుక ఈ పై మూడు శ్లోకములలోను గూఢోక్త్యలంకారము గలదు. అంతే గాక, 'చతుర్భిః శ్రీకంఠైః ...' (శ్లో. 11) శ్లోకమున శ్రీచక్రమునందలి వసుదళ కళాశ్రత్రివలయి ఇత్యాదిగా ఆవరణముల క్రమము సూచింపబడినది. అట్లే 'శివశ్శక్తిః కామః...' (32) శ్లోకమునందును పంచదశీవర్ణములకు చెప్పిన సంకేతములు

క్రమానుగుణముగ నున్నవి. 'స్మరం యోనిం లక్ష్మీం...' (శ్లో.33) అను శ్లోకములోని బీజత్రయముగూడ యథా సంఖ్యమే. కనుక పై మూడింటిలోను క్రమాలంకారము కూడ నున్నది. ఇచట పై రెండలంకారములకును సమప్రాధాన్య సాంకర్యముకలదు.

'మహీం మూలాధారే...' (9) శ్లోకమున పృథివ్యాదిభూతములు ఆధారచక్రములు క్రమముగా వర్ణింపబడినవి. కనుక క్రమాలంకారము.

'ముఖం బిందుం కృత్వా...' (19) శ్లోకమున 'త్రిలోకీ' అను శబ్దము నందలి స్త్రీలింగ స్వారస్యముచేతను, తత్పూర్వము చెప్పిన 'రవీందుస్తనయుగాం' అను విశేషణముచేతను నాయకాత్వప్రతీతి కలుగుచున్నది. కనుక ఇచట సమాసోక్తి.

'భవాని త్వం దాసే...' (22) ఇత్యాది శ్లోకమున 'భవాని' అను శబ్దము సంబుద్ధిగను; 'లోట్' ఉత్తమపురుషైకవచనముగను శ్లేషించుచున్నది. రెండు పక్షములందును ప్రకృతార్థమే గావున ఇది ప్రకృతశ్లేష.

'శరీరం త్వం శంభోః ...' (34) ఇత్యాది శ్లోకమున ఉభయ సాధారణముగా శేషశేషిత్వము చెప్పబడినది. కనుక అన్యోన్యాలంకారము.

'సమృద్ధిమద్వస్తు వర్ణనము ఉదాత్తాలంకార లక్షణము. ఈ గ్రంథమునందంతయు పరమేశ్వరీ సౌందర్యము, వైభవము, కృప మున్నగువాని ఆధిక్యము వర్ణింపబడుటచే గ్రంథమునందంతయు ఉదాత్తాలంకారము వ్యంజిత మగుచున్నది. అయినను, కొన్ని శ్లోకములలో స్పష్టముగ ఉదాత్తాలంకారమును పేర్కొనవచ్చును. 'భవాని త్వం దాసే...' (22) ఇత్యాది శ్లోకమున పరమేశ్వరి కృపాసమృద్ధి వర్ణింపబడినది. 'త్రయాణాం దేవానాం...' (25) ఇత్యాదిశ్లోకమున పరమేశ్వరి పాదోద్వహన మణి పీఠ సమాసమున త్రిగుణ జనితులగు దేవతలు నిలిచియుందురనుటచే పరమేశ్వరీ వైభవము వ్యక్తమగుచున్నది. అట్లే 'స్మరం యోనిం లక్ష్మీం...'

(శ్లో. 33) ఇత్యాది శ్లోకమున తన్మంత్ర జపఫలము పరమోత్కృష్టముగా వర్ణింపబడినది. ఇట్టి శ్లోకములలో ఉదాత్తాలంకారము స్పష్టము.

భూతభావ్యర్థ ప్రత్యక్షీకరణము భావికాలంకార లక్షణము. 'సుధాసింధో ర్మధ్యే...' (8) ఇత్యాది శ్లోకమున పరమేశ్వరీ నివాసము వర్ణనామూలమున ప్రత్యక్షీకరింపబడినది. 'విరించిః పంచత్వం వ్రజతి...' (26) ఇత్యాది శ్లోకము నందు మహాసంహారకాలమునందలి స్థితి అభివర్ణింపబడినది. 'స్వదేహోద్భూతాభి. . .'(30) అను శ్లోకములో మహా సంవర్తాగ్నిర్విరచయతి నీరాజనవిధిమ్' అనుచోట భావ్యర్థవర్ణనమున్నది. ఇట్లు వీనియందు భావికాలంకారము గోచరించును.

ప్రకృతవస్తువును నిసర్గమనోహరముగ వర్ణించుట స్వభావోక్తి. పరమేశ్వరీ స్వరూపము పలుతావులలో పరమరమణీయముగ వర్ణింపబడినది. 'క్వణత్కాంచీదామా...' (7) ఇత్యాది శ్లోకమునందు పరమేశ్వరీ స్వరూపము, సుధాధారాసారైః...' (10) ఇత్యాది శ్లోకమునందు కుండలినీ స్వరూపిణియగు భగవతి సహస్రారమునుండి మూలాధారమును చేరుట సహజసుందరముగ వర్ణింపబడుటచే స్వభావోక్తి.

'అవిద్యానామంతస్తిమిర...' (3) ఇత్యాది శ్లోకమునందు లక్ష్మీధరులు పరిణామ – ఉల్లేఖ – రూపకములను అలంకారములను సమన్వయించిరి. కామేశ్వరసూరి మాలాపరంపరిత రూపకమనెను. లక్ష్మీధరులు చెప్పిన వానిలో పరిణామాలంకారము ఇచట పొసగదు. ప్రకృతోపయోగిత్వము లేకపోవుటచే పరిణామముకాదు. కాని, ఉల్లేఖాలంకారము లేదనుటకు కామేశ్వరసూరి చూపిన ఉపపత్తి సమంజసము గాదు. అవిద్యులు, జడులు, దరిద్రులు మున్నగువారు భిన్నులుకారని కామేశ్వరసూరి అభిప్రాయము సరికాదు. కనుక ఉల్లేఖాలంకారమీ శ్లోకమున సమన్వితమగును. రూపకాలంకారముగూడ స్పష్టమే.

'కవీంద్రాణాం చేతః...' (16) అను శ్లోకమున చేతస్సునందు కమలత్వము నారోపించుటకు హేతువు పరమేశ్వరియందు బాలాతప రుచిత్వారోపణము. కనుక పరంపరితరూపకమలంకారమని లక్ష్మీధరుల సమన్వయము సమంజసమే. ఇందలి పరంపరితరూపకము కొంత అర్వాచీనము. సౌభాగ్యవర్ధినీకారుడు హేత్వలంకారమును చెప్పుట అతని ప్రాచీనతను ప్రకటించుచున్నది. అతని కాలమునకు పారంపరిత రూపకాలంకారము లక్షణగ్రంథసిద్ధముకాకపోవచ్చును.

'త్వయాహృత్వావామం...' (23) అను శ్లోకమున కావ్యలింగాను ప్రాణితమగు ఉత్ప్రేక్షయని అరుణామోదినీకర్త పేర్కొనగా, అపహ్నుతి యని ఆనందగిరియు, అపహ్నుత్యలంకారము వ్యంజితమని సౌభాగ్యవర్ధినీ, కైవల్యవర్ధినీ వ్యాఖ్యాకారులును పేర్కొనిరి. ఇచట ప్రకృత వస్తు నిషేధము లేదు. కనుక అపహ్నుతి చెప్పుట కవకాశము లేదు. 'శంకే' అను పదముచే ఉత్ప్రేక్షాలంకారము స్పష్టమగుచున్నది. 'యదేతత్త్వద్రూపం' ఇత్యాది సమర్థనచే కావ్యలింగము స్పష్టము. కనుక కామేశ్వరసూరి మతము సమంజసము.

'తనోతుక్షేమం నః...' (44) ఇత్యాదిశ్లోకమున పూర్వార్ధమునందొక ఉపమను, ఉత్తరార్థమునందొక ఉపమను భావించి, సౌభాగ్యవర్ధిని, ఆనందగిరియు ఉపమాద్వయమును చెప్పిరి. ఉపమానములు స్వతః సిద్ధములు గాక కవిప్రౌఢోక్తి సిద్ధములగుటచే ఇవి ఉపమాలంకారముగావు. ఇత్ప్రేక్షలు మాత్రమే కనుక లక్ష్మీధరులు మున్నగువారి అభిప్రాయమే సమంజసము.

ఇట్లే ఇంకను కొన్నిచోట్ల వ్యాఖ్యాతలు అలంకారవిషయమున భిన్నాభిప్రాయములను ప్రకటించిరి. వ్యాఖ్యాతల అభిప్రాయములను పరిశీలించుటగాక శంకరుల రచనలోని అలంకార సౌందర్యమును నిరూపించుటయే ఈ వ్యాస లక్ష్యముగనుక వానిని గూర్చిన సుదీర్ఘచర్చను ఈ వ్యాసమున చేయుటలేదు. ఇందరిన్ని అలంకారములను పేర్కొనుటను

బట్టి శంకరుల వాగ్వైచిత్రి బహ్వలంకారవిశేషశోభితమని గుర్తింప గలుగుటయే పరమార్థము. ఆయా అలంకారములను ప్రయోగించుటలోని శంకరుల నైపుణ్యము పరమరమణీయమైనది. స్వతఃస్సిద్ధోపమానములతో ఉపమాలంకారములు చెప్పినను, కవిప్రౌఢోక్తి సిద్ధోపమలతో ఉత్ప్రేక్షలు చెప్పినను అన్యధర్మారోపణమనే రూపకములు కూర్చినను అవి యన్నియు శంకరుల సౌందర్యాత్మక భావనకు మణిదీపములే యగును.

అర్థాలంకారములు అర్థస్ఫురణానంతరము తదధికారియగు సహృదయునకు మాత్రమే ఆనందము కలిగించునవి. శబ్దాలంకారములట్లు గాక శ్రవణమాత్రముచేతనే భాషాపరిచయము లేనివానికి గూడ ఆహ్లాదము కలిగింప సామర్థ్యమునుగలవి. సౌందర్యలహరియందు శంకరులశైలి శబ్దాలంకార బంధురమై అలరారును. కొన్నికొన్ని సందర్భములలో నివి అర్థాతిశాయియగు శబ్దసౌందర్యమును స్ఫురింపజేసి, అర్థగ్రహణ క్లేశము సైతము ప్రచ్ఛాదించును. ఒక్కొక్కచో పద్యార్థము బోధపడినపిమ్మట ప్రతీయమానము కావలసిన రసము శబ్దశ్రవణమాత్రముచేతనే స్ఫురింపచునట్లు చేయును. శబ్దాలంకార సంఘటనము శంకరులవాక్కునకు నైసర్గికము. ఉదాహరణ ప్రాయముగ కొన్ని మాత్రమిచట ప్రదర్శింప బడుచున్నవి.

'తనీయాంసం పాంసుం (2), విరించిస్సంచిన్వన్ (2) వంటి వృత్యనుప్రాసలును, నిషణ్ణాం షణ్ణాం (21), సపర్యాపర్యాయః (27), సకృన్నత్వా నత్వా(15) వంటి ఛేకానుప్రాసలును; స్వతంత్రం తే తంత్రం (31), కథయ కథయామః కథమమే (71) వంటి యమకములును; భావగాంభీర్యమేగాని సౌందర్యమంతగాలేని సందర్భములలోగూడ శ్లోకమును లేదా శ్లోకభాగమును రుచిరమొనర్చినవి. యయోః కాన్త్యాయాన్త్యా (37), దహతిమహతిక్రోధకలితే (39), అమందం సౌందర్యప్రకర మకరందం వికిరతి (90) ఇత్యాది వృత్త్యనుప్రాసలు తత్తద్రసవ్యంజకములై

అర్థావబోధనకు పూర్వమే రసస్ఫూర్తిని కలిగించును. ద్వీపనగరీ, శ్రుతిఝరీ (3) వంటి అంత్యానుప్రాసలు శబ్దమాధుర్యముచేతనే ఉదాత్తతను స్ఫురింపజేయును. ఇట్లు శంకరుల శబ్దానుప్రాసలు సప్రయోజనములై కవితాసౌందర్యమునకు పరిపోషకములైనవి.

## 5. వర్ణనలు

కవిత్వము - కావ్యము అను శబ్దములలోనే వాని వర్ణనాత్మకత ధాత్వర్థమును బట్టి స్పష్టమగును. (క వృ వర్ణనే అని ధాత్వర్థము. కవయతి వర్ణయతీతి కవిః, కవేః కర్మకావ్యమ్). ఆంతరప్రపంచమున దర్శించినదానిని వర్ణించుటయే కవిత్వము. అయినను, సాధారణముగ వర్ణనమను శబ్దము కావ్యములోని చరాచరసౌందర్యమును కథాంశమునకంటె భిన్నముగ తదుపస్కారకముగ వర్ణించునప్పుడే వాడబడుచున్నది. మహాకావ్య లక్షణములలో పేర్కొనబడిన అష్టాదశవర్ణనలు ఇట్టివే. వీని సంఖ్యయు కాలక్రమము పెరిగినది. స్త్రీపురుషాది బాహ్యసౌందర్యవర్ణనము ఇట్టిదే. ఇది అష్టాదశవర్ణనల పట్టికలో పేర్కొనబడనిది. అయినను శారీరక సౌందర్యవర్ణనముకూడ కవి ప్రతిభకు నికషోపలముగనే రాణించుచున్నది.

సౌందర్యలహరీస్తవమంతయు పరమేశ్వరియొక్క బహిరంత స్సౌందర్య వర్ణనాత్మకము. గ్రంథనామమునందే ఈ అభిప్రాయము ఇమిడి ఉన్నది. ఈ స్తోత్రములోని ఆనందలహరీ విభాగము తంత్రయోగాది ప్రధానమైనను ఎడనెడ దేవీమూర్తి వర్ణనమున్నది. సాధారణముగ ఉపాస్య దేవతారూపముయొక్క స్థూల వర్ణనము ఈ విభాగమున కన్పించును. ద్వితీయభాగమున పరమేశ్వరి అంగ ప్రత్యంగవర్ణనము కిరీటాది పాదాంతముగ నున్నది. ఆయా వర్ణనలలో శంకర భగవత్పాదులు చూపిన నైపుణ్యము పరమరమణీయమైనది.

శంకరులు తమ ఉపాస్యదేవతామూర్తి నిట్లు వర్ణించిరి. –

**"క్వణత్కాంచీదామా కరికలభకుంభస్తననతా**
**పరిక్షీణామధ్యే పరిణతశరచ్చంద్రవదనా ।**
**ధనుర్బాణాన్ పాశం సృశిమపి దధానా కరతలైః**
**పురస్తాదాస్తాం నః పురమథితురాహోపురుషికాః ॥"** (శ్లో. 7)

కాంచీదామము, ఉత్తుంగస్తనయుగము, సూక్ష్మమధ్యము, పార్వణేందు సదృశవదనము ఇవియన్నియు స్త్రీసౌందర్యవర్ణనమున సాధారణములే. ధనుర్బాణాదులను పేర్కొనుట, తదుపాస్యరూపమున సాంప్రదాయికములే. కాని, పరమేశ్వరిని కేవలము కాంచీదామభూషితగా కాక, క్వణత్కాంచీదామగా పేర్కొనుట విశేషము. పరమేశ్వరి నడయాడినపుడే కాంచీదామము శబ్దించును. ఉపాసకునిపై అనుగ్రహముతో పరమేశ్వరి శ్రీచక్రరాజ సింహాసనమునుండి లేచి నడచివచ్చుట 'క్వణత్' శబ్దమున సూచితము. పరమేశ్వరుని ఇల్లాలనుట సాధారణము. 'పురమథితురాహోపురుషికా' అనుట విశేషము. పురమథనుని అహంకారరూపిణిదేవి. ఇందు శివాశివులయొక్క ఉభయసాధారణ శేషశేషిత్వము వ్యంజితమగుచున్నది. బ్రహ్మసూత్రాదులచే నిరూపితమగు శివాశివాద్వైత భావన అంతయు ఈ ప్రయోగములో ఇమిడియున్నది.

సౌందర్యలహరీపూర్వభాగమునందంతయు వర్ణనలు తంత్రశాస్త్రరహస్య సమన్వితములై యుండును. కేవల కవితా సౌందర్యదృష్టితో తంత్రాదివిశేషములు ఆనుషంగికముగా ద్వితీయభాగమున పరమేశ్వరి అంగప్రత్యంగ వర్ణనమునందే కన్పించును. ఈ శ్లోకములన్నియు దేనికదియొక అద్భుతవర్ణనము. ప్రబంధశతాయమానము. ఇందు కొన్నింటిలోని వర్ణనా సౌందర్యమును మాత్రమే దిఙ్మాత్రముగ ఇచట వివరింపబడుచున్నది. కొన్నింటిని మాత్రమే పేర్కొనుట గ్రంథ విస్తర భీతిచేతనే గాని తారతమ్యవివక్షచే గాదు.

పరమేశ్వరి సీమంతరేఖను వదనసౌందర్యలహరీపరీవాహ స్రోతస్సరణిగా అభివర్ణించుట మనోహరమగు భావన. వదనమునకు ఊర్ధ్వ భాగమున సీమంతసరణియుండును. సౌందర్యాతిశయముచే ఆ ప్రవాహము ఊర్ధ్వగామియైనదని సూచన. ఈ సీమంతసరణియందు సౌభాగ్యచిహ్నమగు సిందూరరేఖయున్నది. ఎఱ్ఱని సిందూరమును ఉదయసూర్యునితోగాని, ఉదయ సూర్యకిరణములతోగాని ఉపమించుటయు, నల్లనికురులను చీకట్లతో పోల్చుటయు సాధారణమే. ఈ రెంటిని మేళవించి, సీమంతసిందూరరేఖను నల్లని చీకట్లచే బంధింపబడిన నవీనార్కకిరణముగా అభివర్ణించుట శంకరుల ప్రత్యేకత.

సౌందర్యవతుల లలాటమును అర్ధచంద్రునితో పోల్చుట కవిసమయ సిద్ధము. పరమేశ్వరి చంద్రరేఖా విభూషిత యనుట సంప్రదాయమే. ఈ రెండింటిని మేళవించి లలాటం లావణ్యద్యుతి (శ్లో. 46) ఇత్యాది శ్లోకమున శంకరులు కోటీరమునందలి చంద్రశకలము, చంద్రుని మరియొక సగము పరమేశ్వరీలలాటము కలిసి రాకా హిమకరమూర్తిగా పరిణమించినదని వర్ణించిరి. సాధారణములగు ఉపమానములను భావములను మేళవించి అపురూపములగు వర్ణనలను చేయుటలో శంకరులకుగల నేర్పునకిది నిదర్శనము.

పరమేశ్వరి గండస్థలములు దర్పణములు. కర్ణాభరణములగు తాటంకములు ఆ దర్పణమునందు ప్రకాశించుచున్నవి. మనోజ్ఞమగు పరమేశ్వరీ ముఖము పరమేశ్వరుని మానసమును లోబరచుకొనుచున్నది. ఇట్లు చెప్పుట సాధారణమేగాని, పరమేశ్వరిముఖమునకు మన్మథుని రథముగ తాటంకయుగళము చెక్కిళ్లలో వాని ప్రతిబింబము ఈ నాలుగును ఆ రథమునకు చక్రములని, సూర్యచంద్రులే రథచక్రముగాగల శివుని జయించుటకు మన్మథుడీ రథమునారోహించెననియు చెప్పుట వినూత్నభావము.

పరమేశ్వరి నాసిక వంశదండము. శ్రేష్ఠమగు వంశదండములలో ముక్తములుండునుట శాస్త్రసిద్ధము. 1(–) పరమేశ్వరి నాసాభరణమౌక్తికము చల్లని నిశ్శ్వాసములవెంట బహిర్గమించిన ఈ వంశమౌక్తికమని శ్రీశంకరుల ఉత్ప్రేక్ష. ఇట్లు ఆమె నాసావంశము బహిరంతర్ముఖమణిధరమైనదని శంకరుల కమనీయవర్ణనము.

పరమేశ్వరి చుబుకము సాదృశ్యరహితమని శ్రీలలితాసహస్రనామ స్తోత్రము పేర్కొనుచున్నది. (ల.స.నా. 29, శ్లో. 12) కాని ఆ చుబుకమునకొక ఔపమ్యము స్ఫురించుచుండుటచే దానిని ఔపమ్యరహితమని చెప్పుట ఎట్లని శంకరులకు సంశయముకలిగి 'కథంకారం బ్రూమస్తవ చుబుకమౌపమ్య రహితమ్' అని (శ్లో. 67) పరమేశ్వరినే ప్రశ్నించిరి. పరమేశ్వరికి అత్యంత సన్నిహితలగు వశిన్యాదులు చుబుకమునకు ఔపమ్యరాహిత్యమును చెప్పగా దానిని అంగీకరింపకపోవుట ఎట్లు? ఉపమానము కన్పించుచుండగా సహస్రనామోక్తి అంగీకరించుట ఎట్లు? ఈ సందేహమును తీర్పవలసినది పరమేశ్వరియే. భగవత్పాదులకు స్ఫురించిన ఉపమానము అపూర్వమైనది. గుండ్రని పరమేశ్వరి ముఖము ముకురము. దాని వృంతము ఆమె చుబుకము. ఇది శంభునకు కరగ్రాహ్యము. ఈ వర్ణనలో నొక విశేషమున్నది. శంభుడు పరమేశ్వరి ముఖముకురమున తన్నుతాను దర్శించుకొనును. ప్రకృతియందు బ్రహ్మము ప్రతిఫలించును అను తాత్త్వికరహస్యమును శంకరు లీ వర్ణనలో మనోజ్ఞముగా నలంకరించిరి.

పరమేశ్వరి మధ్యమును, త్రివళులను శంకరులు 'నిసర్గక్షీణస్య' (శ్లో. 79), 'కుచౌ సద్యః స్విద్యత్తటఘటిత' (శ్లో. 80) అను రెండు శ్లోకములలో వర్ణించిరి. పరమేశ్వరి నడుము సహజముగనే సన్ననిది. స్తనయుగపు బరువుచే మరింతకృశించినది. ఈబరువుచే నడుమెప్పుడు ఏమగునో అను సంశయము కలిగించుచు, నదీతీరమునందలి వృక్షమువలెనున్నది. ఇట్టి ఈ నడుమును కాపాడుటకై మన్మథుడు త్రివళులను తీగెలతో దానిని

బంధించెనట. ఈ వర్ణనలో స్తనభారము వలగ్నకార్శ్యము పరస్పరము చక్కగా అనుసంధానము చేయబడినవి. ఈ యనుసంధానమునకు త్రివళులు సాధకములైనవి. ఒక్క తీగెతోకట్టినచో పటిష్టముగనుండదుగనుకనే మూడుతీగెలతో కట్టుట సముచితము.

'కరీంద్రాణాం శుండాన్కనకకదలీకాండపటలీ' అను (శ్లో. 82) శ్లోకమున పరమేశ్వరి ఊరుద్వయము కరీంద్రశుడాదండములను, కనక కదలీకాండపటలిని జయించినవి. ఊరుద్వయము ఉపమానద్వయమును జయించినదని చెప్పుట చమత్కారము. పరమేశ్వరి యూరువులను వర్ణించుచు కాళిదాసమహాకవి 'నాగేంద్రహస్తములు, కదళీవిశేషములు వాని అవగుణములచే పరమేశ్వరి యూరువులకు ఉపమానములు కాలేకపోయినవని వర్ణించెను. ("నాగేంద్రహస్తాత్త్వచికర్కశత్వాత్ - కుమారసంభవము, ప్రథమసర్గ- శ్లో. 36) ఉపమానబాహ్యతకు కవికులగురువు హేతువులను పేర్కొనగా శంకరులు ఉపమాన ద్వయమును ఊరుద్వయము జయించెనని వర్ణించిరి. కాళిదాస వర్ణనము ఊరువులను మాత్రమే ప్రస్తావింపగా ఈ (82) శ్లోకముననే శంకరులు జానుద్వయమును కూడ ఐరావతకుంభద్వయముతో నుపమించి వర్ణనకు సమగ్రతను కల్పించిరి.

పరమేశ్వరి అంగాంగ వర్ణనావసరమున చివర వర్ణింపబడినవి పాదములు. పరమేశ్వరీ పాదములను శంకరులు పెక్కుశ్లోకములలో వర్ణించిరి. (83-91). అందొకటి మాత్రము ఇచట ప్రస్తావింపబడుచున్నది. -

'శ్రుతీనాం మూర్ధానో' అను (శ్లో. 83) శ్లోకమున శంకరులు శ్రుతుల మూర్ధములకు అలంకారములగు పరమేశ్వరీచరణములు తన శిరస్సునందుంచుమని ప్రార్థించుచు, ఆ చరణముల ఉత్కృష్టతను అద్భుతముగ శ్లోకార్ధము వర్ణించిరి. పశుపతి జటాజూటము నందలి గంగ

ఆ పాదములకు ప్రక్షాళనజలము. ఎఱ్ఱనగు హరిణచూడామణిరుచి వానికి లాక్షారాగశోభ. ఈ వర్ణనచే ప్రణయముతో పరమేశ్వరుడును, భక్తిచే హరియును ఆమె పాదములకు నమస్కరించుచుందురని ధ్వని హరిహరులకే వందనార్హములగు ఆ పాదముల మహిమను అంతకన్న వర్ణించుట కే ఔపమ్యము సరితూగును? ఆ పాదములు నిరుపమానులని శంకరుల తాత్పర్యము. కనుకనే తరువాతగల ప్రపదవర్ణనమున దేవి ప్రపదములను కూర్మపృష్ఠములతో ఉపమించుటను శంకరులు కథం నీతం సద్భిః కఠినకమఠీకర్పరతులాం?' (శ్లో. 88) అని ప్రశ్నించిరి. దేవి ప్రపదముల కీ యౌపమ్యము వశిన్యాది వాగ్దేవీ ప్రోక్తమగు లలితాసహస్రనామ స్తోత్రము (ల.స.నా. 43, శ్లో. 18) లోనిది. అంతేగాక, అంతమృదువైన ఆ ప్రపదమును వివాహసమయమున పరమేశ్వరుడెట్లు అశ్మారోపణము చేయించెనోగదా? అని ఆశ్చర్య విచారములను వ్యక్తపరచెను. ఇది అత్యంత సుకుమారమగు భావన.

ఇట్లు శంకరులు పరమేశ్వరీ సౌందర్యవర్ణనమున అచుంబితములును, నిసర్గమనోహరములును అగు పెక్కు భావములను ప్రకటించిరి. వర్ణనమును ప్రస్తావించి నపుడు తత్సౌందర్యహేతువులగు అలంకారములను, వ్యంగ్యములను ప్రస్తావింపక తప్పదు. కాని, వానిని ఈ వ్యాసములోని వేరు భాగములలో వివరించుట జరిగినది కనుక, ఈ భాగములో వానిని వివరింపలేదు.

## 6. ధ్వని

ఆనందవర్ధనాచార్యుల తరువాత కావ్య స్వరూపాదులను వివరించిన లాక్షణికులు పలువురు ధ్వనికావ్యమును ఉత్తమకావ్యముగ వర్గీకరించిరి. ఈ కారణము చేతనే గాథాసప్తశతి, అమరుకము వంటివి అనిబద్ధరచన

లైనను ఉత్తమ శ్రేణి కావ్యములుగ లాక్షణికుల ప్రశంసలనందుకొన్నవి. అవి శృంగార ప్రధానములు. భక్తిభావభరితమగు సౌందర్యలహరియు ధ్వని వైభవముచే అట్టి ఉత్తమకావ్యముగనే పేర్కొనదగియున్నది.

సౌందర్యలహరియందు నిరూపింపబడిన తంత్రయోగాది విశేషములు వాచ్యార్థములు గానే పరిగణింపదగినవి తద్భిన్నమగు వ్యంగ్య వైభవముకూడ పెక్కు శ్లోకములలో కన్పించును. కొన్నిసందర్భములలోని వస్త్వలంకార రస వ్యంగ్యములను వ్యాఖ్యాతలు నిరూపించిరి. మరికొన్ని ఈ వ్యాసములో దిక్ప్రదర్శకముగా వివరింపబడుచున్నవి.

**త్వదన్యః పాణిభ్యామభయవరదో దైవతగణః**
**త్వమేకా నైవాసి ప్రకటితవరాభీత్యభినయా ।**
**భయాత్త్రాతుం దాతుం ఫలమపి చ వాంఛాసమధికం**
**శరణ్యేలోకానాం తవ హి చరణావేవనిపుణౌ ॥** (శ్లో. 4)

ఇతర దేవతలు వరదాభయముద్రలను ధరింపగా, పరమేశ్వరి అట్లు ధరింపలేదనియు ఆమె పాదయుగళమే వరదాభయదమనియు వాచ్యార్థము. ఇందలి 'ప్రకటిత వరాభీత్యభినయా' అను పదముచే అన్యదేవతలది అభినయమాత్రమే ననియు, నిజముగా వారు వరాభయదాన సమర్థులు కారనియు వ్యంగ్యము. సాధారణ మానవునకు సైతము తన్నాశ్రయించినవానికి ఏదోకొంత యుపకారము చేయుటకును, లౌకికములగు కొన్ని భయములనుండి రక్షణ యొసంగుటకును సామర్థ్యముండును. దైవతాగణమునకు గల సామర్థ్యము అంతకంటె అధికముగావచ్చును. కాని అత్యుత్కృష్టమగు కైవల్యవరదాన మొనర్చుటకు గాని, జననమరణాది భయమునుండి రక్షణ నొసంగుటకుగాని వారికి సామర్థ్యములేదు. అట్టి సామర్థ్యము పరమేశ్వరికి మాత్రమే ఉన్నది. కనుక వారి వరాభయముద్రాధారణము అభినయము మాత్రమే. వాస్తవముగ

సామర్థ్యము లేనప్పుడే అభినయమావశ్యకమగును అని ఇందలి ధ్వని. ఇది అర్థశక్తి మూలకము. ఇది వస్తుకృత వస్తుధ్వని.

పరమేశ్వరి నేత్రములను శంకరులిట్లు వర్ణించిరి. –

**గతే కర్ణాభ్యర్ణం గరుత ఇవ పక్ష్మాణి దధతీ**
**పురాం భేత్తుశ్చిత్తప్రశమరసవిద్రావణఫలే ।**
**ఇమే నేత్రే గోత్రాధరపతి కులోత్తంసకలికే**
**తవాకర్ణాకృష్టం స్మరశరవిలాసం కలయతః ॥** (శ్లో. 52)

పరమేశ్వరి నేత్రములు శివుని చిత్తప్రశమరసమును అనగా శాంతమును విద్రావణము చేయునవి అనగా ఆయన చిత్తమును శృంగారతరంగితము చేయునవని తాత్పర్యము. ఈ నేత్రములు పరమేశ్వరునకు మాత్రమే ప్రశమరసవిద్రావణఫలములనియు, భక్తజనులకు ప్రశమరస పరిపోషకములనియు వ్యంగ్యము. భక్తహృదయములు శమసమన్వితములై కైవల్యమునందుకొనుటకు పరమేశ్వరి నేత్రములు అనగా ఆమె కరుణావలోకనములు కారణములని వ్యంగ్యము. ఇచట వాచ్యార్థమే వ్యంగ్యమునకన్న రమణీయముగనున్నది. కనుక గుణీభూతవ్యంగ్యము.

పరమేశ్వరి ముఖమును గండములందు ప్రతిఫలించు తాటంక యుగళమును శంకరులిట్లు ఉత్ప్రేక్షించిరి. –

**స్ఫురద్గండాభోగప్రతిఫలిత తాటంకయుగలమ్**
**చతుశ్చక్రం మన్యే తవ ముఖమిదం మన్మథరథమ్ ।**
**యమారుహ్య ద్రుహ్యత్యవనిరథ మర్కేందుచరణమ్**
**మహావీరో మారః ప్రమథపతయే సజ్జితవతే ॥** (శ్లో. 59)

పరమేశ్వరి గండద్వయము దర్పణములవలె నున్నవి. వానియందామె తాటంకములు ప్రతిఫలించినవి. తాటంకయుగళము, వాని

ప్రతిబింబము కలసి చతుశ్చక్రమగు మన్మథరథముగా పరమేశ్వరి ముఖము భాసించినది. అర్కేందు చరణమగు అవనిరథమునెక్కు పరమేశ్వరుని జయించుటకు మన్మథుడీ రథము నధిరోహించినాడని వాచ్యార్థము. పరమేశ్వరుని రథమగు అవనియు తచ్చక్రద్వయమగు సూర్యచంద్రులనును, మహాసంవర్తమున నశించునవియే. కాని పరమేశ్వరి ముఖమునకును, తత్తాటంకయుగళమునకును వాని ప్రతిబింబమునకును ప్రళయభీతిలేదు. ఈ తాటంకమహిమయే మహా ప్రళయమున హాలాహలమును గ్రోలియు శివుడు విపత్తునొందకపోవుటకు హేతువుగదా. ఇట్లు మన్మథుని రథము పరమేశ్వరుని రథమునకంటె ఉత్కృష్టమైన దని వ్యంగ్యము.

పరమేశ్వరి చుబుకమును శంకరులిట్లు వర్ణించిరి. –

**"కరాగ్రేణ స్పృష్టం తుహినగిరిణా వత్సలతయా**
**గిరీశేనోదస్తం ముహురధరపానాఽకులతయా ।**
**కరగ్రాహ్యం శంభోర్ముఖముకురవృంతం గిరిసుతే**
**కథంకారం బ్రూమస్తవ చుబుకమౌపమ్యరహితమ్ ॥"** (శ్లో. 67)

పరమేశ్వరి ముఖమనెడు ముకురమునకు వృంతముగా నున్న చుబుకమునకు ఔపమ్యరహితత్వమును చెప్పుట ఎట్లని శంకరుల సంశయము. ఔపమ్యరహితమని ఎవ్వరు శంకరులకుపదేశించిరను ప్రశ్న ఉదయించును. అనాకలిత సాదృశ్యచుబుకశ్రీవిరాజితా (ల.స.నా. 29. శ్లో. 12) అని లలితా సహస్రనామస్తోత్రమునందు పరమేశ్వరి వర్ణింపబడినది. పై వర్ణన మిచట అనుసంధేయము. అంతేగాక పరమేశ్వరి ముఖము శంభునకు తనముఖమును వీక్షించుకొను అద్దము. అనిచెప్పుటలో దేవి ప్రకృతిస్వరూపిణి గావున ప్రకాశాత్మకుడగు పరమేశ్వరుడు విమర్శాత్మికయగు శక్తియందు ప్రతిబింబించుట యను వేదాంతభావన ఇందు వ్యంజిత మగుచున్నది. ఇది పరమరణీయమగు వ్యంగ్యము. అయినను నిగూఢమైనదిగనుక గుణీభూతమనియే చెప్పవలెను.

పరమేశ్వరి పదములను శంకరులిట్లు వర్ణించిరి. –

**"పదంతే కీర్తీనాం ప్రపదమపదం దేవి! విపదామ్**
**కథం నీతం సద్భిః కఠిన కమఠీ కర్పర తులామ్ ।**
**కథంచిత్పాణిభ్యా ముపయమనకాలే పురభిదా**
**యదాదాయ న్యస్తం దృషది దయమానేన మనసా ॥"** (శ్లో. 88)

పరమేశ్వరీ ప్రపదములను కఠినమైన కమఠీకర్పరముతో సజ్జనులెట్లు పోల్చిరని శంకరుల సందేహము. వశిన్యాది వాగ్దేవతా ప్రోక్తమై, హయగ్రీవాచార్యులచే అగస్త్యమునికి ఉపదేశింపబడిన లలితా సహస్ర నామ స్తోత్రములోనిదీ పోలిక. 'కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా' (ల.స.నా. 43. శ్లో. 18) అని పరమేశ్వరీ నామము. పై నామములో పరమేశ్వరీ ప్రపదములకు సౌందర్యాధిక్యము చెప్పినను ఉపమ యొకటి చెప్పబడినదిగదా. అంతమాత్రము తౌల్యము చెప్పుట కూడ న్యాయ్యము కాదని శంకరుల భావన. శ్రీ లలితా సహస్ర నామోక్తిపై అపరితుష్టి వ్యంగ్యము.

ఇట్లు పెక్కుశ్లోకములు వ్యంగ్యార్థ వైభవముతో ప్రకాశించుచు సౌందర్యలహరి ఉత్తమ శ్రేణికి చెందిన కావ్యమని నిరూపించుచున్నవి.

## 7. కవిసమయములు

సాధారణముగా కవులెల్లరును కొన్ని ప్రసిద్ధౌపమ్యములను స్వీకరించుటయేగాక, వర్ణరహితములగు చూపులు, చిరునగవు, క్రోధము మున్నగు వానికి వర్ణనను ఆపాదించుట సాంప్రదాయికముగ కన్పించును. చిరునగవును ఏకవి చెప్పినను శ్వేతవర్ణమునే చెప్పును. కోపమునకు ఆరుణ్యమును చెప్పును. శ్వేతనైల్యములు రెండింటిని ఆపాదించుట పరిపాటి. ఇట్టిచోట్ల ఏకవియు స్వతంత్రించి సంప్రదాయభిన్నముగ చెప్పడు. ఇట్టివి స్థూలముగ కవిసమయములలో చేరును. ఒకొక్కప్పుడీ కవిసమయములు

శాస్త్రసిద్ధములుగ కూడ ఉండవచ్చును. కొన్నికేవలము కవికల్పనలు. శంకరుల సౌందర్యలహరిలో కూడ ఇట్టి కవిసమయములు పెక్కు కన్పించును.

పరమేశ్వరి చిరునవ్వులను, ముఖకాంతిని చంద్రజ్యోత్స్నతో పోల్చుట; బాహువులను మృణాళములతోను; హస్తములను పల్లవములతోను; నేత్రములను, చూపులను కలువలతోను, తామరలతోను పోల్చుట ఇట్టివే. మన్మథునకు పుష్పధనువు, మధుకరమౌర్వి ఇత్యాదులు కవిసమయసిద్ధములు కాని శంకరులు పుష్పధనువునే పేర్కొనిరి.

గంగా, శోణ, కాళిందీ నదుల యందు శ్వేతరక్తనైల్యములను వరుసగా చెప్పుటయు కవిసమయసిద్ధమే. 'పవిత్రీకర్తుం నః . . .' (54) ఇత్యాదిశ్లోకమున శంకరులీ కవిసమయమునుపయోగించుకొనిరి.

వంశ, గజ, కుంభములు ముత్యములజన్మస్థానములలో పేర్కొనుబడినవి. ఇది శాస్త్రసిద్ధమగు కవిసమయము. దీనిని శంకరులు 'అసౌనాసావంశః...' (61), 'వహత్యంబస్తంబేరమ...' (74) అను శ్లోకములలో ఉపయోగించిరి.

కొన్ని వృక్షములు అకాలమున పల్లవించుటకు, పుష్పించుటకు ఉత్తమజాతి స్త్రీల పరిష్వంగము, పాదహతి మున్నగునవి దోహదక్రియలుగా చెప్పబడినవి. ప్రమదవన కంకేళి తరువులు (రక్తాశోకవృక్షములు) దేవి పాదహతిచే దోహమునందుటయు, ఆమె పరిష్వంగము లీలోద్యానవనములోని కురవక తరువులకు కూడ అసులభమగుటయు 'నమోవాకం' (85), కలత్రం (97) అను శ్లోకములలో శంకరులచే వర్ణింపబడినది.

ఇట్లు కవిసమయములనేకములు పలుతావులలో శంకరులచే యథోచితముగ వినియోగించుకొనబడినవి.

# 8. కవితాశైలి

'శైలి' అను శబ్దము సాహిత్యవిమర్శలో ఆధునికముగ ప్రచారములోనికి వచ్చినది. ప్రాచీనులు దీనిని నాట్యవిషయమున ప్రయోగించిరి గాని, సాహిత్యపరముగా ప్రస్తావించినట్లు కనబడదు. పాశ్చాత్యవిమర్శకులు పేర్కొను 'Style' అనుదానికి సమానార్థకముగా ఇది ప్రచారములోనికి వచ్చినది.

పాశ్చాత్యుల దృష్టిలో శైలియనగా పదప్రయోగము, శబ్దార్థ సంయోజనములోని గాంభీర్యము, మార్దవము లేదా కాఠిన్యము మున్నగు అంశములన్నియు చేరును. ఇవియన్నియు మన ఆలంకారికులు పేర్కొన్న వృత్తులు, రీతులు, గుణములు మున్నగువానిలో గతార్థములు అగును. స్థూలముగ పదసంయోజనము, పదప్రయోగవైచిత్రి, రసభావానుగణముగ పదములను ప్రయోగించుట, భాషాసంప్రదాయములను నుడికారములను చక్కగా ఉపయోగించుకొనుట, సమాసరచనావిధానము మున్నగువానిని ఈ శీర్షిక క్రింద చర్చింపవచ్చును.

శ్రీశంకరుల కవిత్వము ప్రౌఢగంభీరమైనది. స్తోత్రములలోనే గాక వేదాంతాది శాస్త్రాంశములను బోధించు సందర్భములోగూడ ఆచార్యపాదుల విషయమెంత దుర్బోధముగానుండునో, పదములనంత సుబోధకముగ ప్రయోగించుట పరిపాటి. సాధారణముగ వ్యస్తపదములతోను, అల్పసమాసములతోను, అక్లిష్టమగు అన్వయముతోను, శ్లోకరచనచేయుట శంకరుల మార్గము. విషయము గంభీరమగుటచే భాషయందు సారళ్యము తప్పనిసరియైనది. రెండును దుర్బోధములే యైనచో, అది సాధారణ పండితులకు కూడ దుర్భేద్యమగును. ఈ సారళ్యము సౌందర్యలహరీ స్తవమునందుగూడ ప్రస్ఫుటముగ కన్పించును.

శంకరులు సాధారణముగ సుబోధకములగు పదములే ప్రయోగింతురు. నిఘంటువుల మూలలలో దాగియున్న అప్రయుక్త పదములను సాధారణముగ ప్రయోగింపలేదు. సౌందర్యలహరీస్తవము మొత్తముపై సామాన్యమగు సంస్కృత భాషాజ్ఞానము కలవానికి నిఘంటు సహాయము లేకుండ బోధపడని పదములు వ్రేళ్లపై లెక్కింపదగియున్నవి. శంకరులు ప్రయోగించిన కృత్తద్ధితరూపములు గూడ సుబోధకములే. సమాస రచనయందును శంకరులిట్టి సారళ్యమునే పాటించిరి. అర్థగాంభీర్యమున కావశ్యకమగుచోట తప్ప రెండుమూడు పదములకు మించిన పదములను సాధారణముగా శంకరులు ప్రయోగింపలేదు. శంకరుల సమాసములన్నియు అన్వయక్లేశములేనివి. పదవిచ్ఛేదమున ఎట్టి క్లేశమును కలిగింపనివియే. తత్పురుషమునందు శంకరులు సాధారణముగ సామాన్య జ్ఞానముగలవారన్వయించుకొనగల సమాసములనే ప్రయోగించిరి. బహువ్రీహియందును మతుబర్థములే కన్పించునుగాని, సామాన్యులకంతగా పరిచయములేని భేదములు కన్పింపవు.

సౌందర్యలహరియందు అక్కడక్కడ కన్పించు 'వదనసౌందర్యలహరీ పరీవాహస్రోతస్సరణిః...' (44), అంతస్తిమిరమిహిరద్వీపనగరీ (3), చైత్యన్యస్తబక మకరందస్రుతిర్ఝరీ' (3), వరత్రాసత్రాణస్ఫటికఘటికా పుస్తకకరామ్(15), మధక్షీర ద్రాక్షామధురిమధురీణాః (15), వాగ్దేవీవదన కమలామోదమధురైః (17), ముకుందబ్రహ్మేంద్రస్ఫుట ముకుట నీరాజితపదామ్ (22), అఖిలపురుషార్థైక ఘటనాస్వతంత్రమ్ (31), సమున్మీలత్సంవిక్కమల మకరందైకరసికం (38), స్ఫురన్నానారత్నాభరణ పరిణద్ధేంద్రధనుషమ్ (40), ప్రబలకబరీభార తిమిరద్విషాబృందైః (44), కనీవాం సందర్భస్తబక మకరందైక రసికం (50), పురాం భేత్తుశ్చిత్త ప్రసమరసవిద్రావణఫలే (52), కర్ణేజపనయన పైశున్యచకితాః (56), స్ఫురద్గండాభోగప్రతిఫలిత తాటంకయుగళం (59), వివాహవ్యానద్ధప్రగుణ

గుణ సంఖ్యాప్రతిభువః (69), సద్యస్స్విద్యత్తట ఘటిత కూర్పాసభిదురౌ (80), స్వచ్ఛచ్ఛాయా ఘటితకపట ప్రచ్ఛదపటః (92) వంటి సమాసములు కూడ సరళపదఘటితములై అన్వయక్లేశ రహితములై యున్నవి.

మన ఆలంకారికులు పేర్కొన్న రీతికిని, శైలికిని సామ్యము కలదు. రీతి యనగా 'విశిష్టపదరచన'. అనగా రసోచితమగు పదరచన. సౌందర్య లహరీ స్తవమునందలి అంగిరసము శృంగారమని పూర్వవ్యాసభాగములలో ప్రస్తావింపబడినది. శృంగారమునకు లలితపదరచనయే అనుగుణమైనది. కనుకనే సౌందర్యలహరీ స్తవమున పరుషాక్షరబంధమెచటను కన్పింపదు. వైదర్భీరీతియు, ప్రసాద మాధుర్యసౌకుమార్యాది గుణములును సౌందర్యలహరియందు పర్యాప్తములైయున్నవి.

పాకము అర్థధర్మము. సౌందర్యలహరీ స్తవమున అధికభాగము తంత్ర యోగశాస్త్రాంశప్రతిపాదకము. కావున వ్యాఖ్యాతలు ప్రతిభా పాటవముచే నిరూపించిన కొన్ని సందర్భములలో మాత్రము ఆ శాస్త్రీయాంశములకన్న భిన్నమై రసభావార్థమును పాఠకుల కందించు కొన్ని శ్లోకములు మాత్రమే బహిరంతస్స్ఫురద్రసమగు ద్రాక్షాపాకమునకు లక్ష్యభూతములు. తక్కినవి చాలవరకు కదలీపాకములే. కొన్ని శ్లోకములు మాత్రము స్పష్టముగా శాస్త్రీయాంశ ప్రతిపాదకములుగా భాసించుచునే, అందలి శాస్త్రాంశము నిగూఢమై, వ్యాఖ్యానసాపేక్షమైయుండును. ఇట్టివి నారికేళపాకములనవచ్చును.

ఇట్టి శాస్త్రీయాంశ విశేషములకును, కావ్యత్వమునకును సంబంధ మున్నదా? ఇవి రసోపస్కారకములా? కానిచో, పాకముల చర్చలో వీని ప్రస్తావన ఏల? అను ప్రశ్నలుదయించును. సౌందర్యలహరి యందు ప్రతిపాదింపబడిన శాస్త్రీయాంశములుగూడ పరతత్త్వసంబంధులేగనుక శివాశివపారమ్యమును ప్రతిపాదించుచు, ఉదాత్తాద్యలంకారములందు పర్యవసించును. అలంకారములు రసోపస్కారకములే, రసపరిపంథులైనచో

అలంకారవాచ్యములే కావు. ఇట్టీ శాస్త్రీయాంశములుగూడ సౌందర్యలహరి యందలి అంగిరసములకు పోషకములే యగుచున్నవి. కనుక నివి పాకాది చర్చయందు అప్రస్తుతములే. కామేశ్వరిసూరి తన వ్యాఖ్యానమునందు సౌందర్యలహరి స్తవమంతటికిని ద్రాక్షాపాకము, మాధుర్యగుణమును, వైదర్భీరీని, కైశికీవృత్తినీ పేర్కొనెనుగాని, వృత్తిరీతిపాక గుణములు ఏశ్లోకమునకాశ్లోకమున పరిశీలింపదగినవేకాని, మొత్తము శ్లోకములను ఏకరూపముగ చెప్పుట సముచితముగాదు. శృంగారమునకు ఆలంకారికులు నిర్దేశించిన వృత్తిరీత్యాదుల పట్టికనే కామేశ్వరసూరి పేర్కొనినట్లు భావింపవలసియుండును. ఒకానొకరసమునకు ఒకవృత్తియో, రీతియో అనుగుణమైనదని లాక్షణికులు పేర్కొన్నచో, అది మార్గదర్శకసూత్రమేగాని విధాయక సూత్రముగాదు. ప్రతిభావంతుడగు కవి తద్భిన్నమగు వృత్తిరీత్యాదులతో వ్యంజింపజేయవచ్చును. అవి పూర్తిగా విరుద్ధరసములకు సంబంధించినవి కాకున్నచాలును. ఒక శ్లోకమున ప్రధానరసభావమునకు పోషకములుగనే తద్విరుద్ధములగు భావముల స్పర్శయుండవచ్చును. అట్టిచోట్ల తత్తద్భానుగుణముగనే ఆయా భావవ్యంజక పదములను ప్రయోగించుట మహాకవి లక్షణము. కనుక ఏ శ్లోకమునకాశ్లోకమున, ఏశ్లోకాంశమున కాశ్లోకాంశమున భావచాలనమును బట్టి వృత్తిరీత్యాదుల పరివర్తనముండును. ప్రతిశ్లోకమునకు ఇట్లు సూక్ష్మాతిసూక్ష్మముగా వృత్తిరీత్యాదులను నిరూపించుట దుర్ఘటము. కనుక సమష్టిపై తత్తద్భావరసానుగుణముగ ఈ స్తవమున గుణవృత్తి రీత్యాదులు ఉన్నవనుట నిర్వివాదము. ప్రాధాన్యవివక్షచే సౌందర్యలహరీ స్తవమున ప్రసాదమాధుర్య గుణములు భారతీకైశికీవృత్తులు, వైదర్భీపాంచాలీ రీతులు కలవని చెప్పవచ్చును. భావానుగుణముగ ఏసమాసముననో, శ్లోకైకదేశముననో ఓజోగుణము, గౌడీరీతి కన్పించును. అవి సమష్టిపై గణనీయములు గావు. శబ్దార్థాలంకార బాహుళ్యమగూడ శైలీ విశేషముగనే ఆధునికులు

పరిగణింతురు. కాని, శంకరుల అలంకారప్రయోగ విశేషములు ప్రత్యేకముగ చర్చింపదగినవగుటచే మరియొక్క వ్యాసభాగమున విచారింపబడుచున్నవి.

శ్రీశంకరుల కవితాశైలియందు కనిపించు మరియొక విశేషము యత్తత్ప్రయోగాతిశయము. సంస్కృతమున రచనాప్రౌఢికై యత్తత్ప్రయోగములను చేయుట సంప్రదాయము. సౌందర్యలహరిలో ఇంచుమించు ప్రతినాలుగు శ్లోకములకొక యత్తత్ప్రయోగము కన్పించును. యత్తచ్ఛబ్దములలో ఒకదానిని మాత్రము ప్రయోగించుటచే అన్వయసందర్భమున రెండవది అధ్యాహార్యమగుట సంస్కృతవాక్యరచనా సంప్రదాయము. ఇట్టి ప్రయోగములు సౌందర్యలహరిలో కన్పించును. ఈ యత్తచ్ఛబ్దప్రయోగముల పట్టిక ఈ క్రింద చూపబడినది.

## యత్తచ్ఛబ్దప్రయోగముల పట్టిక

1. యదాలోకౌత్సుక్యాదమరలలనా యాంతి మనసా... (శ్లో. 12)
2. సహ జనని! సంచింతయతియః, సకర్తా కావ్యానాం భవతి (శ్లో. 17)
3. కథయతి భవాని! త్వమితి యః, తదైవ త్వం తస్మై ... (శ్లో. 22)
4. యదేతత్ త్వద్రూపం సకలమరుణాభం త్రినయనం ... (శ్లో. 23)
5. సదాభావయతి యః, కిమాశ్చర్యం తస్య ... (శ్లో. 30)
6. యమారాధ్యన్ భక్త్యా రవిశశిశుచీనామవిషయే ... (శ్లో. 36)
7. యదాలాపాదష్టాదశగుణిత విద్యాపరిణతిః ... (శ్లో. 38)
8. యదాలోకే లోకాన్ దహతి మహతి క్రోధకలితే ... (శ్లో. 39)
9. హిమగిరిసుతే! కీర్తయతి యః ... (శ్లో. 42)
10. యదీయం సౌరభ్య సహజముపలబ్ధుం సుమనసః ... (శ్లో. 43)

11. విమలమాభాతి తవయత్ ... (శ్లో. 46)
12. యదాలోక్యాశంకాకులితహృదయో హాసజనకః .. (శ్లో. 72)
13. ద్రవిడశిశురాస్వాద్యతవయత్ ... (శ్లో. 75)
14. యదేతత్కాలిందీతనుతరతరంగాకృతిశివే ... (శ్లో. 77)
15. యయోః పాద్యం పాథః పశుపతి జటాజూటతటినీ ... (శ్లో. 84)

'ప్రియతద్ధితాః దాక్షిణాత్యాః' అనునది అభియుక్తోక్తి. కాని దాక్షిణాత్యులగు శంకరుల ఈ స్తవములో అంతవిరివిగా తద్ధితప్రయోగములు కన్పింపవు. మొత్తము వంద శ్లోకములలో వాని సంఖ్య పదిపన్నెండు మాత్రమే. ప్రయోగించిన వాని సంఖ్య స్వల్పమైనను, అవి శంకరుల ప్రయోగనైపుణ్యమును సూచించును. పౌష్పం, శౌనాసీరం, ఆహోపురుషికా, వైధాత్రం వంటివి శంకరుల ప్రయోగవైచిత్రికి ఉదాహణములు.

నామపదమునందలి రెండవయవములనుశ్లోకమున వేర్వేరు చోట్ల ప్రయోగించుచు అందలి ప్రథమ భాగమునకు పూర్వశబ్దఘటితముచేయుట ఛందస్సునకనుగుణముగ చేసిన ప్రౌఢమగు కూర్పు. "సదాపూర్వస్సర్వం ... గృహ్ణాతి చ శివః" (24) అనుచోట సదాశివశబ్దము ఇట్టిది. ఒక లఘువు ఒకగురు, మరల లఘువు, మరల గురువుగల 'సదాశివః' అను శబ్దము శిఖరిణీ వృత్తమున ఇముడదు. కనుక ఇట్టి చమత్కారమార్గము శంకరులు అవలంబించిరి. అవశ్యప్రయోజ్యమగు శబ్దము ఛందోనుగుణము కానప్పుడు కవులిట్టి మార్గమును ఆశ్రయించుట సంస్కృతసాహిత్యములో ఇతరత్ర 'హిరణ్యపూర్వం కశిపుం ప్రచక్షతే' వంటిచోట్ల గమనింపవచ్చును. ఇవి అన్వయముయొక్క ఆర్జవమునకు భంజకములే యైనను అగతికములు. కనుకనే మహాకవుల రచనలలో క్వాచిత్కములు.

శంకరులు సాధారణముగ అప్రయుక్త పదములను స్వీకరింపరు. అరుదుగా అర్థగౌరవమునకై ఒకటిరెండిట్టివి ప్రయోగించినను, అవి సందర్భమునుబట్టి శ్లోకమునకు ఉత్కర్షాపాదకములే యగుచున్నవి. 'ఆహోపురుషికా', 'అధ్యుష్టవలయం' ఇట్టి ప్రయోగములు.

ఇట్లీ స్తోత్రమున శంకరులు మనోజ్ఞమగు శైలీవిన్యాసము ప్రదర్శించి, మహిమాస్పదమగు స్తోత్రముగనేగాక, రచనాసౌందర్యభాసురముగ ఈ స్తోత్రమును తీర్చిదిద్దిరి.

## 9. పూర్వగాథాచర్వణము

సౌందర్యరహరీ శ్లోకములలో ప్రస్తావనావశమున పెక్కు పురాణగాథలు స్మరింపబడినవి. ఈ వృత్తాంతముల స్మరణము శ్లోకభావమును అవగత మొనర్చుకొనుటకు ఆవశ్యకమైనది. 'అవిద్యానాం ...' (3) ఇత్యాదిశ్లోకమున శంకరులు పరమేశ్వరిని 'జన్మజలధౌ నిమగ్నానాం దంష్ట్రామురరిపువరాహస్య' అని వర్ణించిరి. హిరణ్యాక్షుడు భూదేవిని సముద్రములో ముంచివేయుట, విష్ణువు ఆదివరాహరూపమును దాల్చి తనకోరపై నిలిపి, భూదేవినుద్ధరించి హిరణ్యాక్షుని వధించుటయు పురాణప్రసిద్ధమగు కథ.

'హరిస్త్వామారాధ్య...' (5) ఇత్యాది శ్లోకమున విష్ణువు స్త్రీరూపమును ధరించి పరమేశ్వరుని మోహింపజేసిన వృత్తాంతము ప్రస్తావింపబడినది. దేవాసురులు క్షీరసాగరమథనజనితమగు అమృతమును పంచుకొనుటకై కలహించుకొనుచుండగా విష్ణువు మోహినీరూపమున అసురులను పరవశులను చేసి, దేవతలకమృతమునొసగెను. ఆ సమయమున కాలకూట సమ్మోహితుడైన పరమేశ్వరుడు అనంతరము ఆ మోహినీరూపమును తనకును చూపుమని విష్ణువును కోరగా, మరల విష్ణువు మోహినీరూపమును

దాల్చెను. పరమేశ్వరుడా రూపమును చూచి మోహపరశుడైనట్లు బహుపురాణాభివర్ణితము. ఈ సందర్భమున లక్ష్మీధరులు క్షీరసాగరమథన వృత్తాంతమును గాక మోహినీ రూపముదాల్చి విష్ణువు కనకస్వామియను వానిని వధించిన వృత్తాంతమును అనుసంధించుకొనవలెనని వ్యాఖ్యానించిరి. (ల.ధ.వ్యాఖ్యా. సౌ.ల. పు.22-24)

ఇదే శ్లోకమున పరమేశ్వరి యనుగ్రహముచే మన్మథుడు రతినయన లేహ్యమగు రూపముతో పునరుజ్జీవితుడైన వృత్తాంతము పేర్కొనబడినది. పార్వతిపై పరమేశ్వరునకనురాగము నుదయింపజేయు యత్నములో మన్మథుడు హరనేత్రాగ్నిజ్వాలలలో భస్మసాత్కృతుడగుటయు, పరమేశ్వరి అనుగ్రహముచే పార్వతీపరమేశ్వరుల కళ్యాణసమయమున పునరుజ్జీవితుడైన మన్మథుడు సర్వలోకమున కనంగుడే యైనను భార్యయగు రతీదేవికి మాత్రము సశరీరుడుగా నగుటయు కావ్యపురాణాది ప్రసిద్ధమగు వృత్తాంతము.

'శివే శృంగారార్ద్రా...' (51) ఇత్యాదిశ్లోకమునందు 'తదితర జనేకుత్సనపరా' అను దానిని వివరించుచు వ్యాఖ్యాతలు ఇతరజనులనగా బ్రహ్మావిష్ణ్వాదులని పేర్కొనిరి. కుబేరుని పూర్వవృత్తాంతమున అతడు ఘోరతపముచే శివుని మెప్పించి సాక్షాత్కరింపజేసికొనుటయు పరమేశ్వరుని వామాంగమునగల దేవిని కుబేరుడసూయాదృష్టితో చూచుటయు, దేవి యాగ్రహించి వానిని కుత్సితశరీరుడవు గమ్మని శపించుటయు, నాటినుండి అతడు కుబేరుడగుటయు కాశీఖండమున వర్ణింపబడినది. ఆ గాథ ఈ శ్లోక భాగమున స్మరింపదగినది. తిరస్కారపూర్వకమగు దేవీదృష్టులకు పాత్రుడైనవాడు కుబేరుడే. శ్లోకమునందలి బహువచన మౌపచారికము గావచ్చును. లేదా పరమేశ్వరియందు మోహమును పొంది, ఆమె యాగ్రహమునకు గురియైన భండాసురాదులను గూర్చియు కావచ్చును. వ్యాఖ్యాతలు హరి బ్రహ్మాదులను ప్రస్తావించుట చింత్యము.

'స్ఫురద్గండాభోగ...' (59) ఇత్యాది శ్లోకమున సూర్యచంద్రులు చరణములుగాగల అవనిరథము శివుని సాధనముగా ప్రస్తావింపబడినది. పరమేశ్వరుడు భూమి రథముగా, సూర్యచంద్రులు చక్రములుగా, వేదములు అశ్వములుగా, బ్రహ్మ సారథిగా, మేరువు చాపముగా, శేషుడు మౌర్విగా, నారాయణుడు శరముగా సమకూర్చుకొని త్రిపురములు దహించిన త్రిపుర దాహక వృత్తాంతమిచట సూచితము.

'మృణాళీ మృద్వీనాం...' (70) అను శ్లోకములో 'ప్రథమమథ నాదంధక రిపోః' అను మాటలలో శివుడు బ్రహ్మశిరమును ఖండించిన కథ ప్రస్తావించబడినది. శివుడు బ్రహ్మశిరస్సును నఖాగ్రముచే ఖండించుటకు కారణములు పురాణమలలో పలువిధములుగ పేర్కొనబడినది. పంచముఖుడగు బ్రహ్మ, పంచముఖుడేయగు శివుని యాధిక్యము నంగీకరింపకపోవుటచే కోపించిన శివుడు అతనియొక్క శిరస్సును త్రుంచి చతుర్ముఖుని చేసినట్లు ఆ వృత్తాంతము. బ్రహ్మవిష్ణువులు తమలో నెవరధికులని వాదించుకొనుచుండగా వారి యెదుట ఒక మహాలింగ రూపమున పరమేశ్వరుడావిర్భవించెననియు, దాని యాద్యంతములు తెలిసికొనుటకు వరాహరూపమున విష్ణువు అధోలోకములకు, హంసవాహనముపై బ్రహ్మయు నూర్ధ్వముఖమునకు పయనించి విఫలులై వచ్చిరనియు, విష్ణువుతన యశక్తత నంగీకరింప బ్రహ్మ తానాలింగము తుది చూచితినని అసత్యమాడుటచే ఆగ్రహించిన శివుడతని శిరస్సును త్రుంచెనని మరియొక వృత్తాంతము. బ్రహ్మ తన కుమార్తెనే మోహించినందుల కాగ్రహించి శివుడతని శిరస్సును ద్రుంచినట్లు ఇంకొక గాథ. ఈ గాథలు పై శ్లోక సందర్భమున స్మరణీయములు.

'వహత్యంబ స్తంబేరమదనుజ...' అను శ్లోకమున (74) పరమేశ్వరి కంఠమునగల హారములోని ముత్యములు గజాసురుని కుంభస్థలమునుండి

పుట్టినవను శంకరుల వర్ణనలో (శ్లో. ) గజాసురుని వధించిన వృత్తాంతము సూచించబడినది.

పరమేశ్వరీస్తన్యపానముచే ద్రవిడశిశువు మహాకవియయ్యెనని శంకరులు 'తవస్తన్యం మన్యే...' (శ్లో. 75) ఇత్యాది శ్లోకమున వర్ణించిరి. వ్యాఖ్యాతలచే ఇచట భిన్నకథలు ప్రస్తావించబడినవి. శంకరుల తల్లి యొకమారు జలాహరణార్థము నదికేగగా ఆసమయమున ఆకటిచే ఏడ్చుచున్న శంకరునిచూచి లోక సంచారము చేయుచున్న పరమేశ్వరి దయతో అతని తల్లిరూపమున వచ్చి స్తన్యము నిచ్చినట్లొక గాథ. పరమేశ్వరీ భక్తుడగు శంకరుని తండ్రి గ్రామాంతరమునకేగుచు బాలుడగు శంకరుని తనకుబదులుగా ఆలయమునందలి పరమేశ్వరిని అర్చించుమని ఆదేశించెననియు, శంకరులట్లే చేసి, క్షీరమును పరమేశ్వరికి నివేదించి, ప్రతిమారూపమున నున్న దేవి ఆ క్షీరమును స్వీకరింపకపోవుట తన పూజాలోపమని భావించి దుఃఖింపగా, పరమేశ్వరి ప్రత్యక్షమై, పాత్రములోని క్షీరము నంతటిని త్రాగినట్లును, ప్రతిదినము తండ్రి ప్రసాదరూపమగు క్షీరమును తనకిచ్చుటచే, ఈ దినము పరమేశ్వరి తనకు క్షీరమును మిగిలించలేదని శంకరులు మరల శోకింపగా దయార్ద్రహృదయయగు జగన్మాత తన స్తన్యముచే బాలశంకరుని సంతృప్తుని గావించినట్లు మరొకగాథ.

ఈ స్తన్య ప్రభావముచే శంకరులు మహాకవియైనట్లు ఈ గాథలు పేర్కొనుచున్నవి. ఇవే గాథలు ప్రసిద్ధతమిళ భక్తుడగు 'తిరుజ్ఞానసంబంధర్' పక్షమున కూడ వ్యవహారములో నుండుటచే, శ్లోకములో పేర్కొనబడిన ద్రవిడ శిశువు తిరుజ్ఞానసంబంధర్ అని కొందరు వ్యాఖ్యానించిరి.

పూర్వము ద్రవిడుడను రాజునకు పుత్రుడు జన్మింపగా అతడు నష్ట జాతకుడను కారణముచే తండ్రి యతనిని అరణ్యములో వదలివేసెననియు, ఆ బాలుని ఒక వ్యాఘ్రము పెంచి పోషించెననియు,

ఆకలితో ఏడ్చుచు పూర్వ జన్మసంస్కారబలముచే పరమేశ్వరిని ప్రార్థించిన ఆబాలునికి పరమేశ్వరి తన స్తన్యముచే సంతృప్తుని చేసెననియు, ఆ స్తన్యప్రభావముచే నతడు మహాకవియై సౌందర్యలహరీ స్తవమును చెప్పెననియు, ప్రవరసేనుడను పేర పైతృకమగు రాజ్యమునకు ఉత్తరాధికారియయ్యెననియు తన తండ్రియగు ఆ ప్రవరసేనుని ఆదేశముచే తాను సౌందర్యలహరికి వ్యాఖ్యానమును రచించితిననియు అముద్రిత వ్యాఖ్యానమగు సుధావిద్యోతినియందు తత్కర్త పేర్కొనెను. ఈ గాథ విశ్వసనీయముగాదని పలువురు పరిశోధకులు ఈ గాథను నిరాకరించిరి.

'కదాకాలే మాతః...' (98) ఇత్యాది శ్లోకమున శంకరులు పరమేశ్వరీ చరణ నిర్ణేజనజలము మూకత్వనివారకము, కవితాకారకమని స్తుతించిరి. శంకరులు కొందరు అనేకమూకులగు భక్తులపై అనుగ్రహదృష్టితో హస్తమస్తక సంయోగమున వారిచే లఘుచర్చాస్తవమును పలికించిరట. దేవి ప్రసన్నురాలై తనచరణ నిర్జేజనజలమును ప్రసాదింపగా, తత్పానప్రభావముచే వారు కవితా రచనాసామర్థ్యమును పొందిరని లక్ష్మీధరులు పేర్కొనిరి. దేవీవదన తాంబూల చర్వణముచే కాళిదాసాదులు మహాకవులైనట్లు మరికొందరు వ్యాఖ్యాతలు తెలిపిరి. సుప్రసిద్ధులు మూకార్భక శంకరులు (కంచికామకోటి పీఠాధిపతులలో 20వ ఆచార్యులు). వారు జన్మతః మూకులైయుండగా పరమేశ్వరీ వదన తాంబూలకబళమును చర్వణము చేయుటచే కవితాశక్తిని పొంది మూకపంచశతీ స్తోత్రముచే దేవిని స్తుతించిరని పీఠపరంపర చెప్పుకథ. కాని ఈ శ్లోకమున ప్రస్తావించుట పొసగదుగదా. పరమేశ్వరి యనుగ్రహము మూకులకు కవితాశక్తి నొసగుటకు నిదర్శనముగా ఈ గాథను గ్రహింపవచ్చును.

'త్వదన్యః పాణిభ్యాం...' (4) ఇత్యాది శ్లోకమున పరమేశ్వరీ చరణములే అభయవరదానదక్షములగుటచే అన్యదేవతలు దాల్చినట్లామె హస్తములచే వరదాభయ ముద్రాభినయముచేయుట లేదని శంకరులు

స్తుతించిరి. తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని ఆవడయార్ కోయిల్ అను దేవాలయమునందలి దేవి యోగాంబిక. ఈ యాలయము సుప్రసిద్ధతమిళ యోగియగు మాణిక్యవాచకర్‌చే ప్రతిష్ఠితమైనది. ఈ ఆలయములో దేవీమూర్తి ఏమియునుండదు. పూజాపీఠముపై కేవలమొక రాతిపై చెక్కబడిన చరణ యుగళము మాత్రమే కన్పించును. ఈ చరణములే సౌందర్యలహరీ స్తోత్రావసరమున శంకరుల హృదయకమలమున భాసించియుండవచ్చును.

ఇట్లీ స్తోత్రమున శంకరులు పెక్కు పూర్వగాథలను సముచిత సందర్భములలో ప్రస్తావించిరి.

## 10. యతినియమములు – వర్ణమైత్రి

సంస్కృత శ్లోకములలో నియతాక్షరసంఖ్యానంతరము యతినిర్దేశము చేయబడినది. సంస్కృతమున యతి విచ్ఛేదసంజ్ఞకము మాత్రమే. అనగా ఏడింటిపై యతియని లక్షణమున్నచో ఏడక్షరములకు తరవాత ఎనిమిదవ అక్షరము అన్యపదారంభముగనుండవలెనని తాత్పర్యము. ఆంధ్రభాషలో యతి స్వభావము ఇందుకు భిన్నమైనది. ఆంధ్రపద్యములలో సంస్కృతము నుండి స్వీకరించిన వృత్తములలో కూడ యతియనగా 'వర్ణమైత్రి'యేగాని విచ్ఛేద సంజ్ఞకముగాదు. ఏడవ అక్షరముపై యతి యనగా తరువాతదగు ఎనిమిదవ అక్షరమునందలి వర్ణమునకు ప్రథమాక్షరవర్ణముతో మైత్రి పాటింపబడవలెనని భావము. స్థానప్రయత్నసాదృశ్యముగల వర్ణములలో పరస్పరమైత్రిని తెలుగు లాక్షణికులు భావించిరి. ఇదియే యతియని వారి యభిప్రాయము. యతిపాటింపవలసిన అక్షరమునందలి స్వరవ్యంజనములు రెండును, పాదాద్యక్షరములోని స్వరవ్యంజనములతో స్థానప్రయత్నాత్మక సాదృశ్యముగ నుండవలెను. పాదాదియందు సంయుక్తాక్షరమున్నచో

యతిస్థానమున వానిలో ఏదో ఒక వ్యంజనమునకు మాత్రము సదృశవర్ణము ఉండవచ్చును. యతి స్థానమున సంయుక్తాక్షరమున్నచో అందులో ఏదో ఒకటి పాదాది వ్యంజనముతో సదృశమైయున్నచాలును. ఉభయత్ర సంయుక్తాక్షరములున్నను ఏదోయొకటి సదృశమైన చాలును. ఇట ఆంధ్రపద్యములలోని యతి సంప్రదాయము తమిళమున కూడ ఇట్టి వర్ణమైత్రీరూపయతియే యున్నది. కనుక విచ్ఛేదసంజ్ఞిక రూప యతికి భిన్నము.

సౌందర్యలహరియందలి వృత్తము 'శిఖరిణి'. దీనికి ఆరు, పదకొండు అక్షరముల తరువాత విచ్ఛేదరూపయతి యుండవలెను. అనగా ఆరక్షరముల పిమ్మట ఒకసారి, పదకొండక్షరములకు పిమ్మట మరియొకసారి విచ్ఛేదము నియతము. దాక్షిణాత్యసంప్రదాయమున ఏడవ వర్ణము, పన్నెండవవర్ణము ప్రథమాక్షరమునకు సదృశముగా నుండవలెను.

శంకరులు సంస్కృతసంప్రదాయమగు విచ్ఛేదమును అపరిహార్యముగ పాటించుచునే దాక్షిణాత్యసంప్రదాయమగు వర్ణమైత్రిరూప యతిని కూడ పెక్కు సందర్భములలో పాటించిరి. పాటించిరనుటకంటె దాక్షిణాత్యులగుటచే అప్రయత్నముగ వర్ణమైత్రియు సిద్ధించిదని చెప్పుట ఉచితము. కొన్నిశ్లోక పాదములలో రెండుయతిస్థానములలోను వర్ణమైత్రికన్పించును. కొన్ని పాదములలో వీనిలో ఏదో ఒకచోటమాత్రమే వర్ణమైత్రి కన్పించును.

ఆంధ్రపద్యములలో సంస్కృతవృత్తములందుగాక, దేశీయములగు ఆటవెలది, తేటగీతి మున్నగు పద్యభేదములలోను, మాత్రాచ్ఛందములలోను గూడ ప్రాసయతి కూడ యతిప్రత్యామ్నాయముగ నున్నది. అనగా ప్రథమాక్షరముతో యతిస్థానాక్షరమునకు వర్ణమైత్రి లేనప్పుడు పాదములందలి ద్వితీయాక్షరవ్యంజనమే యతిస్థానమునకు తరువాతి

అక్షరముననుండుట ప్రాసయతి. ఇచట సదృశవ్యంజనముగాక అదేవ్యంజన ముండుట నియమము. స్వరమైత్రి అక్కరలేదు.

సౌందర్యలహరియందు కొన్నిచోట్ల ఇట్టి ప్రాసయతులును కనిపించుచున్నవి. కొన్నిచోట్ల వర్ణమైత్రితోకూడిన యతిని పాటించుటయేగాక ప్రాసయతియు పాటింపబడినది. శంకరుల శ్లోకములలో దాక్షిణాత్యములగు ఈ యతిప్రాసములు సుభగసుందరముగ శోభించుచున్నవి. ఇట్టియతి ప్రాసనవలన పద్యమునకు సంగీత మాధుర్యము చేకూరినది.

## 11. సౌందర్యలహరి–శాస్త్రకావ్యత్వము

సౌందర్యలహరిలో ఎన్నో తంత్రయోగాది శాస్త్రీయాంశములు కనబడుతున్నందువలన ఈ స్తోత్రము శాస్త్రమేమో అనుసందేహము కలుగును. కొందరు విమర్శకులు ఈ స్తోత్రమును తంత్రగ్రంథములలో చేర్చుటవలన అనుమానము రాకమానదు. కాని ఈ స్తోత్రము తంత్రయోగాది శాస్త్రాంశములను కలిగిన గ్రంథము కాని, కేవల శాస్త్రగ్రంథము మాత్రము కాదు. పుష్పదంతుని శివమహిమ్నః స్తోత్రము సైతము వేదాంతస్పర్శగల స్తోత్రమే. కనుక సౌందర్య లహరి కూడా స్తోత్రమే. శాస్త్రములలో కావ్యాంశములు కానరావు. శ్రీగౌడపాదులు రచించిన సుభగోదయస్తవములో కేవల శాస్త్రాంశములే ఉన్నందువలన 'ఇదంశాస్త్రముదితమ్' అని పేర్కొనుట జరిగినది. సౌందర్యలహరిలో కావ్యాంగములు పుష్కలముగ నున్నవి. వర్ణనలకు కొదువలేదు. ఆద్యంతశ్లోకాలలో శ్రీశంకరులు దీనిని స్తోత్రమనియే చెప్పిరి. సౌందర్యలహరికి ప్రామాణిక వ్యాఖ్యాత అయిన లక్ష్మీధరుడు ఇది స్తోత్రమనియే చెప్పెను. శతశ్లోకనియమము సైతము ఇది స్తోత్రమనుటకు ఉదాహణము. కావ్యమీమాంసకర్తయగు రాజశేఖరుడు ప్రతిభావ్యుత్పత్తులు కవి మూడు విధములుగ ఉండునని చెప్పెను.

1. కేవలము శాస్త్రమునే వ్రాయువాడు,
2. శాస్త్రములో కావ్యాంశములను రచించువాడు,
3. కావ్యములలో శాస్త్రాంశములను రచించువాడు.

కనుక ప్రతిభావంతుడైన కవి కావ్యములో శాస్త్రాంశములను నిబంధించుట స్తోత్రకవుల సామాన్య లక్షణము.

కావున సౌందర్యలహరి స్తోత్రమే గాని, శాస్త్రకావ్యముకాదనుట స్పష్టము.

## 12. కవిశ్రేణిలో సౌందర్యలహరి-కర్తృత్వస్థానము

కవుల వివిధశ్రేణులను నిర్ణయించుచు కావ్యమీమాంసాకర్తయగు రాజశేఖరుడు కొన్ని అమూల్యాంశములను చెప్పెను. ఇతరాలంకారికు లెవరును ఈ విధమగు కవివిభాగములను చెప్పలేదు.

కవులలో కొందరు శాస్త్రకవులనియు, కొందరు కావ్యకవులనియు, కొందరు ఉభయకవులనియు మూడు విభాగములు చేసెను. శాస్త్రకవి కావ్యములలో రససంపదకు భంగముకలిగించును. కావ్యకవి కఠినమైన అంశములను సైతము సరళముగ చెప్పును. ఉభయకవి తనకత్తికి రెండువైపుల పదనువలె అన్నింటిని సమర్థవంతముగ చెప్పును. ఈ లక్షణములననుసరించి సౌందర్యలహరిలో కర్త ఎక్కడకూడా రసమునకు భంగములేని విధముగ మనోహరార్థములను చెప్పెను. సౌందర్యలహరీ కర్తకు కావ్యములలోను, శాస్త్రములలోను లోతైన అభినివేశము కలదు. కనుక అన్నింటినీ రసవంతముగ తీర్చిదిద్దెను. కనుక సౌందర్యలహరీకర్త ఉభయకవి శ్రేణిలోచేరును.

కావ్యకవి ఎనిమిది విధములుగ నుండును. శబ్దములలో రమణీయత తప్ప అర్థములలో రమణీయత లేనిచో అతడు కేవలము రచనాకవి.

నామాఖ్యాతములను మెండుగ చెప్పువాడు శబ్దకవి. అర్థరచనలో ప్రవీణుడు అర్థకవి. శబ్దార్థాలంకారములను విరివిగ నిబంధించువాడు అలంకారకవి. చిత్రవిచిత్రశైలులలో రచనలు చేయువాడు ఉక్తికవి. రసమునే ప్రధానము చూచువాడు రసకవి. రీతిని చూచువాడు మార్గకవి. శాస్త్రానుసారముగ రచనలు చేయువాడు శాస్త్రార్థకవి.

ఈ అష్టవిధగుణములలో రెండుమూడు మాత్రమే కలవాడు కనిష్ఠుడు. అయిదారు గుణములు గలవాడు మధ్యముడు. సమస్తగుణములుకలవాడు మహాకవి. సౌందర్యలహరిలో సంపూర్ణముగ గుణములున్నందున ఈ స్తోత్రకర్త మహాకవి.

ఈ ఉన్నతగుణములుగల కొన్ని శ్లోకములను ఉదాహరించెదను - క్వణత్కాంచీదామా (శ్లో. 7)లో రమణీయశబ్దముల సంయోజనమున్నది. మనస్త్వం వ్యోమత్వం (శ్లో. 35)లో నామవాచకపదముల ప్రయోగము విశిష్టము. 'శివశ్శక్తిఃకామః (శ్లో. 32)లో సంజ్ఞాపదము సంవిధానము రమణీయము. జగత్సూతే ధాతా (శ్లో. 24) అనుశ్లోకములో క్రియాపదముల బాహుళ్యము ఆకట్టుకొనును. 'అవిద్యానామంతస్తిమిర మిహిరద్వీపనగరీ (శ్లో. 3) లో అర్థ గాంభీర్యము హృదయార్జకము. తనీయాంసం పాంసుం (శ్లో. 2) లో శబ్దాలంకార వైచిత్రి స్పష్టము. సవిత్రీభిర్వాచాం (శ్లో. 17)లో అర్థాలంకారముల రమ్యత సుందరము. తనుచ్ఛాయాభిస్తే (శ్లో. 18)లో ఉక్తివైచిత్రి ఆకట్టుకొనును. కరాగ్రేణ స్పృష్టం (శ్లో. 67)లో రసావిష్కారము అమోఘము. తటిత్త్వన్తం శక్త్యా (శ్లో. 34)లో శాస్త్రవాక్యము నిబంధనము మనసునాకట్టుకొనును.

ఈ విధముగ కవిశ్రేణిలో సౌందర్యలహరీ కర్తృస్థానము అత్యున్నతమై భాసించుచున్నది.

# పంచమతరంగము

## 1. సౌందర్యలహరి - వ్యాఖ్యానములు

సౌందర్యలహరీ స్తోత్రమునకు వివిధభాషలలో ఎన్నో వ్యాఖ్యానములు వెలువడినవి. సంస్కృతభాషలో ముప్పదియారు వ్యాఖ్యానములున్నట్లు తెలియుచున్నది. అవి-

1. అచ్యుతానందవ్యాఖ్య, 2. అనామికావ్యాఖ్య, 3. అరుణామోదినీ వ్యాఖ్య, 4. ఆనందగిరీయవ్యాఖ్య, 5. ఆనందలహరీటీకా, 6. కవిరాజశర్మ వ్యాఖ్య, 7. కేశవభట్టవ్యాఖ్య, 8. కైవల్యవర్ధనీవ్యాఖ్య, 9. గంగాధరవ్యాఖ్య, 10. గోపాలసుందరీవ్యాఖ్య, 11. గోపీరమణ తర్కప్రవచన వ్యాఖ్య, 12. గోవింద తర్కవాగీశ వ్యాఖ్య, 13. చంద్రికావ్యాఖ్య, 14. జగదీశవ్యాఖ్య, 15. జగన్నాథ పంచాననవ్యాఖ్య, 16. డిండిమవ్యాఖ్య, 17. తత్త్వదీపికా వ్యాఖ్య, 18. తాత్పర్య దీపినీవ్యాఖ్య, 19. పదార్థచంద్రికావ్యాఖ్య, 23. మల్లభట్టవ్యాఖ్య, 24. మహాదేవ విద్యావాగీశవ్యాఖ్య, 25. రామచంద్ర వ్యాఖ్య, 26. రామచంద్రమిశ్రవ్యాఖ్య, 27. రామానందతీర్థవ్యాఖ్య, 28. రామసూరివ్యాఖ్య, 29.లక్ష్మీధరవ్యాఖ్య, 30. విశ్వంభరవ్యాఖ్య, 31. విష్ణుపక్షవ్యాఖ్య, 32. శ్రీకాంతభట్టవ్యాఖ్య, 33. శ్రీరంగదాసవ్యాఖ్య, 34. సదాశివవ్యాఖ్య, 35. సుధావిద్యోతినీవ్యాఖ్య, 36. సౌభాగ్యవర్ధినీవ్యాఖ్య.

# షష్ఠతరంగము

## 1. వైదికత

శ్రీవిద్యాతంత్రరహస్యములకు నిధానమైనది సౌందర్యలహరి. శ్రీవిద్య వేదప్రతిపాదితము. తైత్తరీయ బ్రాహ్మణమునందును, ఆరణ్యకమునందును, అరుణోపనిషత్తు, బహ్వృచోపనిషత్తు, త్రిపురోపనిషత్తు, భావనోపనిషత్తు మున్నగు పెక్కు ఉపనిషత్తులందును శ్రీవిద్యాధిదేవతయగు త్రిపురసుందరియు, శ్రీవిద్యా స్వరూపము, దేవీ చరణారవిందములు, శ్రీచక్రవర్ణనము, షోడశనిత్యాత్మకత, శ్రీవిద్యామంత్ర స్వరూపము బహుధా వర్ణింపబడినవి. గాయత్రీ బ్రహ్మవిద్య. వేదమున ద్వివిధముగా ఉన్నదనియు, అందొకటి ప్రకటరూపమనియు, మరియొకటి గుప్తరూపమనియు చెప్పబడినది. వైదిక సంధ్యావందనాదులలో నుపాసింపబడునది ప్రకట రూపమగు గాయత్రియనియు, వేదములందు సాంకేతికముగా చెప్పబడిన శ్రీవిద్య గుప్తరూపమనియు అభిజ్ఞులు తెలుపుదురు.

ఇట్లు శ్రీవిద్య వేదప్రతిపాదితమగుటయు సమయాచారమున శ్రీవిద్యోపాసనము వైదికమార్గపరినిష్ఠితమగుటయు, దీని వైదికతను చాటుతున్నది. శ్రీవిద్యా మూలమంత్రస్వరూపము, మంత్రద్రష్టలు, విద్యా సంప్రదాయకర్తలు, శ్రీచక్రస్వరూపము, దేవీయంత్రమంత్రములకైక్యము, అద్వైత సంప్రదాయమున సనాతనుడగు పరమేశ్వరునకును, జీవునకును ఐక్యము మున్నగు వివిధాంశములు వేదమూలకములే. శ్రీవిద్యారహస్య నిధానమగు సౌందర్యలహరీస్తవమున ఆయా వైదికాంశములన్నియు బహుధా సూచింపబడినవి.

ప్రథమశ్లోకమగు 'శివశ్శక్త్యాయుక్తః' అను దానిలో ప్రతిపాదింపబడిన శివశక్త్యైక్యము శ్రుతి ప్రసిద్ధము. శక్తి నిర్వికల్పుడగు పరమేశ్వరుని

యందుద్భవించిన మాయాస్వరూపమనియు, మాయావిశిష్టుడగు పరమేశ్వరుడే జగత్కారకుడనియు 'మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరమ్, తస్యావయవభూతైస్తు వ్యాప్తం సర్వమిదం జగత్' ఇత్యాది శ్రుతులు ఘోషించు చున్నవి. 'ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ' ఇత్యాది శ్రుతివాక్యము సదాశివుడు పరబ్రహ్మమని ప్రతిపాదించుచున్నది. 'ఉమాసహాయం పరమేశ్వరం విభుమ్' అను శ్రుతివాక్యము పరమేశ్వరుడు పరమేశ్వరీసహితుడుగానుండునని శివాశివైక్యమును ప్రతిపాదించుచున్నది. పరమేశ్వరీసహితుడగు పరమేశ్వరుడే తన క్రీడార్థము, భోగార్థము సృష్టికార్యములొనరించుచున్నాడని 'క్రీడార్థం సృష్టిరిత్యన్యే భోగార్థమితిచాపరే' అను శ్రుతి పేర్కొనుచున్నది. శివాశివుల సమ ప్రాధాన్యమును కూడ 'సమప్రధానౌ సమసత్త్వౌ సమౌజసౌ' అను శ్రుతి వాక్యము ప్రతిపాదించుచున్నది. శివాశివైక్యముతోబాటు చక్రైక్యముగూడ శ్రుతి సిద్ధమే. ద్వితీయశ్లోకమగు 'తనీయాంసం పాసుం'లో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు పరమేశ్వరీచరణరజోలేశమహిమచేతనే సృష్టిస్థితిలయ కారకులగుచున్నారని 'మరీచయః స్వయంభువాః' ఇత్యాదిశ్రుతులు ప్రతిపాదించు చున్నవి. పరబ్రహ్మతత్త్వమే సర్వకార్యసమర్థమనియు విరించాదులు కల్పనా మాత్రులనియు 'సఏవాయం పురుషః ప్రత్యక్షేణోపలభ్యతే' అను శ్రుతి వాక్యము తెలుపుచున్నది. ఈ శ్లోకమునందే 'వహత్యేనం శౌరిః కథమపి సహస్రేణ శిరసా' అని విష్ణువునకు సహస్రశీర్షములు చెప్పబడినవి. 'సహస్ర శీర్షాపురుషః' అను పురుషసూక్తమంత్రము 'సహస్రశీర్షందేవం' అను మంత్రము దీనినే ప్రతిపాదించుచున్నవి.

ఇట్లు ప్రతిశ్లోకమునందును శ్రుతిప్రమాణసహితమగు భావములనే శంకరులు ప్రకటించిరి. భావవైవిధ్యమునుబట్టి కొన్ని దిక్ప్రదర్శకముగా ఈ వ్యాసములో వివరింపబడుచున్నవి. పరమేశ్వరీచరణములనుండి వెలువడు మయూఖములు 'క్షితౌషట్పంచాశత్' ఇత్యాది శ్లోకమున

వర్ణింపబడినవి. పరమేశ్వరీచరణముల సర్వోత్కృష్టత 'త్వదన్యః పాణిభ్యాం' అను శ్లోకమున శంకరులు వర్ణించిరి. ఈ విషయమునే 'చరణం పవిత్రం వితతం పురాణమ్–' లోకస్యద్వార మర్చిమత్పవిత్రమ్', 'మరీచయః స్వయంభువా' అను శ్రుతి వాక్యములు ప్రతిపాదించుచున్నవి. పరమేశ్వరి ఇంద్రాదులచే ఆరాధింపబడు చున్నదనియు, సర్వదేవాత్మికయనియు– 'ఇంద్రశ్చవిశ్వేచదేవాః', 'ఇమానుకం భువనా సీషధేమ' అను శ్రుతిమంత్రములు నిరూపించుచున్నవి.

శ్రీవిద్యామూలబీజము ఈకారమని 'చత్వారఈంబిభ్రతి...', 'తాం పద్మినీమీం...' మున్నగు శ్రుతివాక్యములలో ప్రతిపాదింపబడినది. ఈ యంశమునే శంకరులు 'హరిస్త్వామారాధ్యప్రణతజనసౌభాగ్య జననీం' అను చోట 'జననీం' అనే పదమున ఈంకారమును ప్రశ్లేషించి, ప్రతిపాదించిరి.

శ్రీచక్రస్వరూపము, శ్రీచక్రవిద్యామహిమను 'ఇమానుకం భువనా సీషధేమ...', 'త్రిస్రః పురస్ర స్త్రిపథా...', 'సతద్వాట్టారగమం...' మున్నగు శ్రుతివాక్యములలో ప్రతిపాదింపబడినది. చక్రవిద్యాంతర్గతమగు చంద్రకళా విద్యనుగురించియు, దర్శాది పూర్ణిమాంతములగు పంచదశకళలను గూర్చియు, షోడశీకళ పరమేశ్వరిని గూర్చియు 'దర్శాద్యాః పూర్ణిమాన్తాశ్చ ...' 'దర్శాదృష్టాదర్శతా విశ్వరూపా...', 'యత్కుమారీమంద్రయతే...', 'అజామేకాం...' మున్నగు శ్రుతులు ప్రతిపాదించుచున్నవి. వీనినే శంకరులు మహీంమూలాధారే, చతుర్భిశ్రీకంఠైః, క్షితౌషట్పంచాశత్ మున్నగు శ్లోకములలో ప్రతిపాదించిరి.

శ్రీవిద్యామంత్ర స్వరూపమును శ్రీశంకరభగవత్పాదులు 'శివశ్శక్తిః కామః' అను శ్లోకమున బీజసంకేతములచే తెలిపిరి. 'స్వరంయోనింలక్ష్మీం' అను శ్లోకమునకూడ ఈ విద్యయొక్క రూపాంతరము ప్రతిపాదింపబడినది.

'కామోయోనిః కమలా' ఇత్యాది త్రిపురోపనిషన్మంత్రమునే ఈ శ్లోకము అనువదించుచున్నది. వ్యాఖ్యాంతరముచే ఈ శ్రుతివాక్యము

'స్మరంయోనిం లక్ష్మీం' అనుశ్లోకమునకు అన్వయింపబడినది. ఈ శ్రీవిద్యా తంత్రమునేగాక లౌకిక ప్రయోజనసాధ్యములగు చతుష్షష్టితంత్రములును పరమేశ్వర నిర్మితములేనని శంకరులు 'చతుష్షష్ట్యాతంత్రైః' అను శ్రుతి వాక్యముచే, అరుణోపనిషత్తు, త్రిపురోపనిషత్తు మున్నగు వానిలోని ప్రతిపాదనమునకు అనుగుణముగ శ్రీవిద్యాచార్యులలో ప్రధానుడు మన్మథుడు. తొలుత పరమేశ్వరుడు ప్రతిపాదించిన మూలవిద్య కాదివిద్యయే. ఈ విద్య తద్ద్రష్టయగు మన్మథునిపేర, కామరాజవిద్యగా ప్రసిద్ధము. ఈ యంశమునే శంకరులు 'స్మరోపిత్వాం నత్వా' అనుచోట పేర్కొనిరి. మన్మథుడు కాదివిద్యా ప్రవర్తకుడనుటకు 'జనకోహవైదేహః' ఇత్యాదిశ్రుతివాక్యములు పరమప్రమాణము లగుచున్నవి.

శ్రీవిద్యోపాసన వేదాధికారముగల త్రైవర్ణికులకేగాక అన్యులకును ఉపాదేయమగుటను 'అశ్రుతాసః శ్రుతాసశ్చ' ఇత్యాది శ్రుతిమంత్రము ప్రతిపాదించుచున్నది. దీనినే లక్ష్మీధరాది ప్రామాణికవ్యాఖ్యాతలుగూడ సప్రమాణముగ నిరూపించిరి.

ఆజ్ఞాచక్రము మొదలు మూలాధారమువరకు గల ఆయా చక్రములలోని శివాశివుల వర్ణనము 'తవాజ్ఞా చక్రస్థం' మున్నగు ఆరుశ్లోకములలో శంకరులు వివరించిరి. ఇందలి వర్ణనలన్నియు వేదప్రతిపాదితములే. షట్చక్రములకు ఊర్ధ్వముననున్న సహస్రారకమలము, భాలోకమనియు, అచటిప్రకాశము సూర్యచంద్రానల ప్రకాశముననతీతమైనదనియు శంకరులు వర్ణించిరి. 'న యత్ర సూర్యో నవిభాతి చంద్రమా', 'నతత్రసూర్యోభాతి నచంద్రతారకం', 'తత్ర న విభ్రాజతి చంద్రమా నాగ్నిః' ఇత్యాది శ్రుతివాక్యములు ప్రతిపాదించు చున్నవి.

షట్చక్రములు సోమసూర్యానల ఖండములుగా ఆజ్ఞాదిగా రెండేసి విభక్తములు. ఆజ్ఞాచక్రస్థుడగు చంద్రుడు మనస్తత్త్వమును పొందినవాడు.

'చంద్రమా మనసోజాతః' అనుశ్రుతి ఈ విషయమును తెలుపుచున్నది. ఈ చక్రమునతిక్రమించిన సాధకుడే సోమసూర్యానల ప్రకాశముగల భాలోకమగు సహస్రారపద్మమున పరమేశ్వరిని సేవింపగలడు. మనస్తత్త్వమునకు తరువాతగలది విశుద్ధిచక్రము. ప్రకాశతత్త్వాత్మకము 'ఆత్మన ఆకాశస్సంభూత' ఇత్యాది మంత్రము దీనిని ప్రతిపాదించుచున్నది. ఇదియు చంద్రఖండా తర్గతమే. ఈ విషయమునే 'విశుద్ధౌతే' ఇత్యాది శ్లోకమున శంకరులు 'వ్యోమజనకం', శశికిరణ సారూప్య సరణిం' అను పదములచే సూచించిరి. అనాహతచక్ర వర్ణనమున శంకరులు పేర్కొనిన హంసద్వంద్వము 'ద్వాసుపర్ణా సయుజా', 'హంసస్సోహం స్వాహా', 'యస్య నిశ్వసితమ్' ఇత్యాది శ్రు తివాక్యసిద్ధములు.

'తటిత్త్వన్తం శక్త్యా' అను మణిపూరచక్రవర్ణన శ్లోకమున స్ఫురన్నానా రత్నాభరణపరిణద్ధేంద్రధనుషమ్' అను శంకరుల వర్ణనము, 'తదింద్ర ధనురిత్యజమ్', 'సుత్రామాణం పృథివీం – పతద్రస్య ధనుః' ఇత్యాది శ్రుతి వాక్యములకు అనువాదమే

ఇట్లు తంత్రయోగప్రధానములగు శ్లోకములలోనే గాక, శ్రీదేవీ రూపవర్ణన సందర్భములలోకూడ శంకరుల వేదార్థభావన స్పష్టమగును. 'క్వణత్కాంచీదామా' అనుశ్లోకములో వర్ణింపబడిన ధనుర్బాణాన్ పాశం' ఇత్యాది వర్ణనము 'ఇషుభిః పంచభిర్ధనుషా' అను శ్రుతివాక్యము ననుసరించును. 'తయాహృత్వా వామం' అను శ్లోకములో శంకరులు పరమ శివుని అరుణవర్ణుడుగా అభివర్ణించిరి. ఇది పరమేశ్వరుని శుద్ధస్ఫటిక సంకాశుడుగ పేర్కొను స్తోత్ర వర్ణనలకును, కవిసమయమునకును భిన్నముగా గోచరించుచున్నను వేదప్రమాణవిలసితమైనది. యాజుష రుద్రాధ్యాయమున పరమేశ్వరుడు 'నమ స్తామ్రాయచారుణాయచ' అనివర్ణింపబడెను.

ఇట్లింకను పెక్కు వేదమంత్రముల అభిప్రాయము ఈస్తోత్రమున పర్యాప్తమైయున్నట్లు ఆయా శ్లోకవ్యాఖ్యానావసరమున లక్ష్మీధరాది ప్రామాణిక వ్యాఖ్యాతలు సోపపత్తికముగ నిరూపించిరి. (కామేశ్వరసూరి, లక్ష్మీధరులు). వానిని యథాతథముగ వివరించుట పునరుక్తియే యగునుగాన నీ వ్యాసములో దిఙ్మాత్రమున సూచింపబడినవి. ఇట్లు ఈ స్తోత్రమును శంకరులు వేదసారముగ నిర్మించిరని స్పష్టమగుచున్నది.

## 2. సౌందర్యలహరి-అద్వైతతత్త్వ ప్రతిఫలనము

నారాయణసమారంభమైన అద్వైతభావ పరంపరకు సునిశ్చిత రూపమునిచ్చి ప్రస్థానత్రయ భాష్యరచనచేతను, చతురామ్నాయ పీఠ స్థాపనచేతను అద్వైత సంప్రదాయమునకు విశేషప్రచారమును కల్పించిన మహనీయులు శ్రీమచ్ఛంకర భగవత్పాదులు.

స్థూలముగ శంకరుల ప్రధాన సిద్ధాంతమగు అద్వైతమునకును, తాంత్రికుల అభిప్రాయమునకును జగన్మిథ్యాత్వ విషయమున భేదము కన్పించును. సూక్ష్మదృష్టిచే ఇవి రెండును ఒక కూటమిలోనివే అని స్పష్టమగును. శ్రీవిద్యా సంప్రదాయ రహస్యములను ఇమిడించినట్లే సౌందర్యలహరీ స్తవమున శ్రీశంకరులు క్వాచిత్కముగ అద్వైతసిద్ధాంతమును గూడ వేళవించిరి. పరమార్థ దృష్టితో శ్రీవిద్యాసంప్రదాయమునకును, అద్వైతమునకును భిన్నత్వములేదు. బ్రహ్మపారమ్యము ఉభయసిద్ధాంతముల సామ్యము.

శంకరుల అద్వైతసిద్ధాంత సారాంశమగు శాంకరోక్తిగ ఈక్రింది శ్లోకమును సాంప్రదాయికులు చెప్పుదురు.

**‘శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।**

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవోబ్రహ్మైవ నాఽపరః ॥**

జీవుడు పరబ్రహ్మముతో తానభిన్నుడనను భావమును పొందుటయే అద్వైత పరమార్థము. పరమేశ్వరికంటె సాధకుడు అభిన్నతను పొందుటయే ఉపాసనకు చరమ గమ్యము. జీవుడు బ్రహ్మజ్ఞానముచే తానే బ్రహ్మమైభాసించు ఉపాసకుడు పరమేశ్వరియందు సాయుజ్యము నొందుట అద్వైతభావనా ఫలము. ఇచట సాధ్యము, సాధనము, సాధకుడు ఈ మూడింటికి భిన్నతలేదు. సర్వము పరమేశ్వరియే. ఇది పరమేశ్వరి కృపచే సాధ్యము. దీనినే శంకరులు సౌందర్యలహరిలోని ఈక్రింది శ్లోకములో ఇట్లు వివరించిరి. –

**భవాని! త్వం దాసే మయి వితర దృష్టిం సకరుణా**
**మితిస్తోతుం వాంఛన్ కథయతి భవాని త్వమితియః ।**
**తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్య పదవీం**
**ముకున్దబ్రహ్మేంద్ర స్ఫుటముకుట నీరాజితపదామ్ ॥ (సౌ.ల.శ్లో.22)**

దేవిని భక్తుడు 'భవాని!' అని సంబోధించి నీ దాసుడనగు నాయందు కరుణజూపు మని ప్రార్థింపబూని 'భవాని! త్వం' అని పలికినంతనే పరమేశ్వరి ఆ వాక్యార్థము అంతవరకే స్వీకరించి, 'నీవుగా అగుదును' అనగా నీయందే ఐక్యము నొందుదునని భక్తుని అభ్యర్థనగా స్వీకరించి అట్టి భక్తునకు నిజసాయుజ్యమును అనుగ్రహించును. భక్తుడు భగవత్తత్త్వములో సాయుజ్యమును పొందుట అద్వైత సంప్రదాయసిద్ధము. ద్వైత విశిష్టాద్వైత సంప్రదాయములందు 'పరమేశ్వరీ ప్రసక్తిలేదు. శ్రీవిద్యాసాంప్రదాయికమగు పరమేశ్వరీధ్యాన శ్లోకములో 'అహమిత్యేవ విభావయే భవానీమ్' అని పేర్కొనుట శ్రీవిద్యా సంప్రదాయము అద్వైతసంప్రదాయమున కభిన్నమగుటను నిరూపించును. ఈశ్లోకమునందు శంకరులు జీవబ్రహ్మైక్యముద్వారా సాయుజ్యపదముచే కైవల్య ముక్తిని సూచించిరి. సాయుజ్యము చతుర్విధముక్తులలో చివరిది. 'చరాచరాత్మకతనుధ్యానే భవానీపతే సాయుజ్యం మమ సిద్ధమంత్రభవతి' అని శివానందలహరిలో

(శ్లో. 28) శ్రీవారేవ్రాసిన శ్లోకములో చరాచరాత్మకతను అని చెప్పుటచే నిర్గుణ జీవబ్రహ్మైకాత్మక కైవల్యమునకు భిన్నమైన సాయుజ్యమును ప్రస్తావించినను ఇట 'త్వం భవాని' అని చెప్పుటచే జీవబ్రహ్మైక్యాత్మ కైవల్యమే ఇట సాయుజ్య శబ్దముచే గ్రహింపదగినది.

సాయుజ్యము ద్వివిధము. చరాచరాత్మకమగు జగత్తంతయు పరమేశ్వరీ శరీముగ భావించి, ఈ జగత్తునందు అభిన్నతను సాధకుడు పొందుట సాయుజ్యము. కేవల నిర్గుణబ్రహ్మమునందు సాధకుడైక్యమును పొందుట కైవల్య రూపమగు సాయుజ్యము.

బ్రహ్మసూత్రాది భాష్యములలో శంకరులు ప్రతిపాదించిన కైవల్య రూపమగు సాయుజ్య స్వరూపమును శాక్తసంప్రదాయమున గోచరించు సాయుజ్య స్వరూపము కొంత ఇచట వివరిపదగియున్నది.

బ్రహ్మసూత్రభాష్యాదిసిద్ధమగు అద్వైత సంప్రదాయమునందలి 'చిద్వివర్తః ప్రపంచోఽయం' అను వచనము ననుసరించి ఈ ప్రపంచ మంతయు చిత్తుయొక్క వివర్తము. అనగా మిథ్య. అనగా సత్యముకానిది. బ్రహ్మేతరమైన దంతయు అనగా జీవజగత్తులు అజ్ఞానము చేతనే భాసించుచున్నవి. 'రజ్జుసర్పభ్రాంతి'చే జగత్తు భాసించుచున్నదని భావము. 'రజ్జువును చూచి అజ్ఞానముచే అనగా అది రజ్జువను జ్ఞానము కలుగక పోవుటచే సర్పమను భ్రాంతి కలుగుచున్నది. సర్పము రజ్జ్వజ్ఞానజనితము. అనగా రజ్జువు యొక్క వివర్తము సర్పము. వాస్తవమునకచట సర్పములేదు. సర్పత్వ భ్రాంతిచే రజ్జు జ్ఞానముచేత సర్పము కనిపించుచున్నది. ఇట్లే సత్యమగు బ్రహ్మపదార్థముయొక్క అజ్ఞానముచేత జగత్తు తద్భిన్నముగ భాసించుచున్నది. సర్పమువలెనే జీవజగత్తులును మిథ్య. 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా' అను వాక్యములీ విషయమునే బోధించుచున్నవి.

శాక్తాద్వైతగ్రంథాదులందు ప్రతిపాదింపబడిన సిద్ధాంతసారమున 'చిద్విలాసః ప్రపంచోఽయం' అనునది చిత్పదార్థమొక్కటియే సత్యము. అయినను జీవజగత్తులు అసత్యములు కావు. అనగా మిథ్యలు కావు. మిథ్యలు కానప్పుడు అద్వైతతత్త్వమెట్లు పొసగునను ప్రశ్న కలుగును. ప్రపంచ మంతయు చిత్పదార్థముయొక్క విలాసమే కాని, వివర్తము కాదు. అనగా భేదరూపమైన మిథ్యాత్వము లేదు. జీవజగత్తులయందు భాసించు బ్రహ్మాభేదము మాత్రమే మిథ్య. జీవజగత్తులు బ్రహ్మాకభిన్నములు. సర్వమును బ్రహ్మామయమే. ఇదియే చిద్విలాసము. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అను మహావాక్యము ఈ అర్థమునే ప్రతిపాదించుచున్నది.

శాక్తాద్వైతమునందును మరల రెండు సిద్ధాంతములు గోచరించును. ఒకటి కేవల శాక్తాద్వైతము. ఇందు శివాశివ నామములచే వ్యవరింపబడు తత్త్వము శక్తియే. తద్భిన్నమగునదేదియులేదు. శక్తికే పారమ్యము. రెండవ సిద్ధాంతము శక్తి తొలుత జీవరూపిణి. అనగా సాధనదశయందు జీవరూపిణిగా నుండును సిద్ధియందు అనగా కుండలినీ రూపిణియగు సహస్రారమును చేరిన పిమ్మట శివునితో సామరస్యమును పొందును. అనగా భేదమును వీడును. అనగా జీవబ్రహ్మైక్యము సిద్ధించును. ఇదికూడ శాక్తాద్వైత భేదమే అయినను ఇందు ప్రాప్యుడు శివుడగుటచే శివపారమ్యము గోచరించును. ఈ సర్వవిధములగు అద్వైత సంప్రదాయములను శంకరులు సౌందర్యలహరి యందు ప్రస్తావించిరి.

'మనస్త్వం వ్యోమత్వం' అను (35) శ్లోకమున భగవత్పాదులు 'త్వమేవస్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా' అని చెప్పుటచే పరమేశ్వరి చిద్విలాసరూపిణి అను శాక్తాద్వైత సంప్రదాయమును సూచించిరి. తత్పూర్వ శ్లోకమగు 'శరీరం త్వం శంభోః' ఇత్యాది శ్లోకము 'అతశ్శేషశ్శేషీత్యయ ముభయ సాధారణతయా' అనుచోట పరమేశ్వరీపరమేశ్వరులకు శేషశేషీత్వము ఉభయ సాధారణముగ చెప్పబడినది. ఆనందభైరవి శేషి

య్యైనప్పుడు ఆనంద భైరవుడు శేషుడు. ఆనందభైరవుడు శేషియనప్పుడు ఆనందభైరవి శేషత్వము నందును. శేషిప్రాధాన్యము. కనుక ఒకప్పుడు శివప్రాధాన్యము, మరొకప్పుడు శివాప్రాధాన్యము. ఇట్లు శాక్తాద్వైతము నందలి ఉభయమతములను శంకరు లిచట ప్రస్తావించిరి.

పరమేశ్వరీ సౌందర్య వర్ణనావసరమున శివపత్నిగా పరమేశ్వరి పేర్కొనబడిన సందర్భములందెల్లెడ శివునకే పారమ్యము. శివపారమ్య రూపమగు అద్వైతమే సూచింపబడినది.

పరమేశ్వరీ సౌందర్యమును వర్ణించుచు శంకరులు 'త్వదీయం సౌందర్యం' ఇత్యాది(12) శ్లోకమున "యదాలోకౌత్సుక్యాదమర లలనా యాంతి మనసా తపోభిర్దుష్ప్రాపామపి గిరిశ సాయుజ్యపదవీమ్" అని వర్ణించుచు సాయుజ్య శబ్దమును ప్రయోగించిరి. ఈ సాయుజ్యము చిద్వివర్త సంప్రదాయమున పేర్కొనబడిన సాయుజ్యమే.

'స్వదేహోద్భూతాభిః' (30) అనుశ్లోకమున "త్వామహమితి సదా భావయతియః" అనుచోట తత్త్వమసీత్యాది మహావాక్య ప్రతిపాదితమగు అద్వైత భావనయే గోచరించును.

'గిరామాహుర్దేవీం' (97) అనుశ్లోకములో "తురీయా కాపిత్వం దురధిగమ నిస్సీమ మహిమా మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మ మహిషి' అనుచోట విశ్వభ్రమణకారిణియగు మహామాయకు తురీయాత్వము చెప్పుటచేత పరమేశ్వరీ పారమ్యము సూచితము. పరబ్రహ్మమహిషి అని చెప్పుటచే శివ పారమ్యము సూచితము. ఇట్లు శాక్తాద్వైతమునందలి ఉభయ సంప్రదాయములును ఇందు గోచరించును.

శంకరులు అద్వైతసిద్ధాంత ప్రతిష్ఠాపకాచార్యులగుచే అద్వైత సంప్రదాయ విశేషములిందు ప్రతిఫలించుట సహజమే. కాని, భక్తిప్రధానమగు నీ స్తోత్రమున ఇతరములగు శంకరభగవత్పాకృత స్తోత్రము

లోను కూడ దాసత్వ బుద్ధి, కించిద్‌జ్ఞత్వము మున్నగు భావములు కూడ కనిపించుచున్నవికదా. ఇవి శంకరాద్వైతమునకు భిన్నములు కావా? అను సంశయము కలుగును. అద్వైతభావన చరమగమ్యము. శంకరులదృష్టిలో ద్వైత, విశిష్టాద్వైత భావనలు తత్ప్రాప్తికి ప్రాణములు. శంకరులే సందర్భాంతర మున ఇట్లు పేర్కొనిరి.

**దేహబుద్ధ్యాతు దాసోహం జీవబుద్ధ్యా త్వదంశకః ।**
**ఆత్మబుద్ధ్యా త్వమేవాహం ఇతిమే నిశ్చయామతిః ॥**

అని ద్వైతవిశిష్టాద్వైత ద్వైత సంప్రదాయములను మూడింటిని క్రమశః పేర్కొనిరి. అట్లే శివానందలహరియందలి క్రిందిశ్లోకమున సారూప్య, సామీప్య, సాలోక్య, సాయుజ్య ముక్తులు నాలుగింటి సిద్ధిని శంకరులు పరమ రమణీయము వర్ణించిరి.

**సారూప్యం తవపూజనే శివమహాదేవేతి సంకీర్తనే**
**సామీప్యం, శివభక్తిధుర్యజనతా సాంగత్యసంభాషణే**
**సాలోక్యం, చ చరాచరాత్మకతనుధ్యానే భవానీపతే!**
**సాయుజ్యం మమ సిద్ధమత్ర భవతి స్వామిన్! కృతార్థోస్మ్యహమ్॥**
**(శ్లో. 28)**

ఈ శ్లోకము శివస్తుతి రూపమేయైనను ఇందుగల 'భవతి' యను పదమును పరమేశ్వరీ సంబుద్ధిగ భావించినపుడు ఇది శివాశివులు ఉభయులకును అన్వయించును. ఇందలి ఈ సాయుజ్యము ఇదివరకే ఈవ్యాసములో పేర్కొన్నట్లు శాక్తాద్వైత సంప్రదాయసిద్ధమే.

## 3. ఆచారములు - సంప్రదాయములు

విశ్వకల్యాణకారకమగు వేదధర్మమును, అద్వైత వేదాంతమును లోకమున స్థాపించుటకు అవతరించిన శ్రీశంకరభగవత్పాదుల రచనలలో

శ్రుతిస్మృత్యాదుల యొక్కయు, ఆర్షవాఙ్మయముయొక్కయు ప్రభావము ప్రసరించుట సహజము. సౌందర్యలహరియందు తైత్తరీయారణ్యకాది శ్రుతిమంత్రముల త్రిపురోపనిషత్తు, త్రిపురాతాపిన్యుపనిషదాదులయొక్కయు, వామకేశ్వరాది తంత్రగ్రంథములయొక్కయు ప్రభావము స్పష్టముగ గోచరించును. వీనినిగూర్చి లక్ష్మీధరాదివ్యాఖ్యాతలు విపులముగ చర్చించిరి.

సుధాస్వాదము చేసిన బ్రహ్మేంద్రాది దేవతలు విపత్తును పొందుచుండగా భయంకరమగు కాలకూటమును త్రాగిన శివుడు మాత్రము ఎట్టివిపత్తును పొందుటలేదు. ఇది పరమేశ్వరి తాటంకమహిమయని శంకరుల వర్ణన. (28). తాటంకమిట సౌమంగల్య చిహ్నము.

ఈ సౌమంగల్య చిహ్నములు ఆయా ప్రాంతములలో భిన్నభిన్నముగ నున్నవి. (డిండిమ భాష్యమ్. సౌ.ల. శ్లో. 28, పుట: 247). ఇవి వివాహకాలమున భర్తచే అలంకరింపబడి, భర్తృమరణపర్యంతము నిరంతరధారణ యోగ్యములుగ నుండును. తాటంకయుగళము కర్ణాటకదేశీయమగు దేశాచారసిద్ధమగు మాంగల్యసూచకము. ద్రవిడుడగు శంకరులు ఈ యాభరణమును మాంగల్య సూచకముగా పేర్కొనుట 'తాటంకయుగళీభూత తపనోడుప మండలా' (ల.స.నా.22. శ్లో.8) యను పరమేశ్వరికి అహోరాత్ర రూపకాల సూచకులగు సూర్యచంద్రులపై ఆధిపత్యమును; ఆమె కాలస్వరూప యగుటయు తత్కారణమున ఆమెభర్తయగు శివుడు కాలధర్మము నందకపోవుటయు వివక్షితము. ఈ కారణముచే ఇచట శంకరులు స్వదేశీయాచారమునుగాక, అన్యదేశీయాచారమును పేర్కొనిరి. వర్ణితయగు పరమేశ్వరికి కాలావధిలేనట్లే దేశావధియులేదుకదా. ('దేశకాలపరిచ్ఛిన్నా'- ల.స.నా.701. శ్లో. 137)

'గళేరేఖాస్తిస్రో...' (28) అనుశ్లోకమున శంకరులు పరమేశ్వరి కంఠమునగల రేఖాత్రయము వివాహకాలమున పరమేశ్వరునిచే బద్ధమైన త్రిగుణ గుణసంఖ్యాప్రతిభువమనెను. త్రిగుణమనగా బహుతంతువులతో

కూడిన సూత్రము. ఇది త్రిసరముగా కంఠమున భర్తచే వివాహకాలమున కట్టబడును. ఇదియు వైవాహికాచారమే.

– "మాంగల్యతంతునానేన బద్ధ్వా మంగలసూత్రకమ్ । వామహస్తే సరంబద్ధ్వా కంఠేచ త్రిసరం తథా॥" అని గృహ్యసూత్ర వచనమిచట అనుసంధేయము.

వివాహసమయమున సప్తపద్యనంతరము వరుడు వధువు పాదమును పట్టుకొని, ఆ పాదమును పాత్రస్థానీయమగు శిలపై నుంచును. ఇది అశ్మారోపణవిధి. గృహ నిర్వహణ భారమును వరుడు వధువుపై నుంచుటనిది సూచించును. ఈ లౌకికాచారమే 'అలౌకిక కన్యయగు పరమేశ్వరీపక్షమునను శంకరులు వర్ణించిరి.(శ్లో. 88) ఇది సాక్షీభూతుడగు పరమేశ్వరుడు జగత్కుటుంబభారమును శక్తిస్వరూపిణియగు పరమేశ్వరిపై నుంచుటకు సూచనము.

ఇట్లు సౌందర్యలహరిలో రెండుమూడు లౌకికాచారములను పరమేశ్వరి పరముగా శంకరులచే కల్పింపబడినవి

## 4. సౌందర్యలహరిపై ప్రాచీనస్తోత్రముల ప్రభావము

సౌందర్యలహరీస్తవము దేవీవర్ణనాత్మకము మాత్రమేగాక శ్రీవిద్యారహస్య ప్రతిపాదకముగూడ నైయున్నది. శాక్తులకు, అందును శ్రీవిద్యోపాసకులకు పరమ ప్రామాణికములు, పూజాస్థానములునైనవి శ్రీలలితాసహస్రస్తోత్ర, శ్రీలలితాత్రిశతీ స్తోత్రములు. బ్రహ్మాండ పురాణాంతర్గతములగు ఈ స్తోత్రములలో సహస్రనామావళి వశిన్యాదివాగ్దేవతాగణముచేతను, త్రిశతి పరమేశ్వరీ పరమేశ్వరులచేతను ఉపదేశింపబడినవి గనుక ఇవి అపౌరుషేయములై వేదతుల్యములగుచున్నవి.

విశేషించి, శంకరభగవత్పాదులు త్రిశతీనామావళికి వ్యాఖ్యానమును గూడ రచించిరి. పైస్తోత్రములవలెనే దేవీపరమును, తంత్రరహస్య నిధానముననగు సౌందర్యలహరిపై వీని ప్రభావము స్పష్టముగ కొన్నచోట్లను, స్పష్టాస్పష్టముగ కొన్నిచోట్లను గోచరించును.

**1. శ్రీలలితా సహస్రనామ స్తోత్రము:-** శ్రీలలితా సహస్రనామావళిలోని కొన్ని నామములు సౌందర్యలహరీస్తవమున 1) యథాతథముగ కన్పించును. మరికొన్ని నామముల 2) పర్యాయవాచకములు, 3) స్వల్పభేదాలు గోచరించును. కొన్నిచోట్ల సహస్రనామావలిలోని 4) భావమే సౌందర్యలహరీ స్తోత్రమున శ్లోకమునగాని, శ్లోకైకదేశమునగా వివరింపబడినది. సహస్ర నాములలోని కొన్నినామములు సంక్షిప్తీకరణతో కొన్నిచోట్లను, ఉన్న విశేషణమును విడిచియో, క్రొత్తవిశేషణమును చేర్చియో కొన్నిచోట్లను కన్పించును. దేవీవర్ణనములోని కొన్నిపదములు సహస్రనామావళిలోని నామములను స్ఫురింపజేయును. సహస్రనామావళిలోని నామములకు శ్లోకములో భావము వ్యాఖ్యానముగ కొన్నిచోట్ల ఉన్నట్లే సంక్షిప్తీకరణగా మరికొన్ని చోట్ల కన్పించును. ఇట్లు పలువిధములుగా సహస్రనామావళీ స్తోత్రము సౌందర్యలహరిని ప్రభావితమొనర్చినది. స్థాలీపులాకన్యాయమున కొన్ని మాత్రమీ వ్యాసమున సూచింపబడుచున్నవి.

'విశాలా కల్యాణీ...' (శ్లో. 49) ఇత్యాది శ్లోకములోని కల్యాణీ యోగ్యా విజయా అను పదములు యథాతథముగ దేవీ సహస్రనామములలో కన్పించును. 'గిరామాహుర్దేవీం...' అను (శ్లో. 97) శ్లోకములోని మహామాయాశబ్దము యథాతథముగానున్నది. ఇదే శ్లోకములోని 'దురధిగమ నిస్సీమమహిమా' అనుచోట 'నిస్సీమమహిమా' అను నామము యథా తథముగను, దుర్గమా అను నామము 'దురధిగమా' అను విశేషణముగను కన్పించును. భవాని, అపర్ణ, శర్వాణి, ఉమ, భగవతి, జనని, దేవి, సతి, అరుణ వంటి నామములు పలుతావుల యథాతథముగ వాడబడినవి.

తుర్యా అను నామము (ల.స.నా.262) తురీయా అని శ్లోకములో పరిణమించినది.

ఆరాధ్యాం హరిహరవిరించిదభిరపి (శ్లో.1) అనునది హరిబ్రహ్మేంద్ర సేవితా (ల.స.నా.297) అనునామమునకు రూపాంతరమే. 'పరిణత శరచ్చంద్ర వదనా' (సౌ.ల. శ్లో.7) అనునది శరచ్చంద్రనిభాననా (ల.స.నా.129), రాకేందు వదనా (ల.స.నా. 314) అనునామముల రూపాంతరమే. 'తనుమధ్యా' అను నామము (ల.స.నా.360) 'తన్వీమధ్యే (సౌ.ల.శ్లో.93 అయినది. 'విశాలా కల్యాణీ' (సౌ.ల. శ్లో.49) శ్లోకములోని కృపాధారా మధురా శబ్దములు రాజత్కృపా (ల.స.నా.687), స్వభావమధురా (ల.స.నా. 915) అను నామములే. 'సుధాసింధోర్మధ్యే...' (సౌ.ల.శ్లో.8) ఇత్యాది శ్లోకములోని వర్ణనమంతయు సుధాసాగరమధ్యస్థా (ల.స.నా. 61), కదంబవనవాసినీ (ల.స.నా.60), చింతామణిగృహాతస్థా (ల.సనా.57), శివకామేశ్వరాంకస్థా (ల.స.నా.52), పంచబ్రహ్మాసనస్థితా (ల.స.నా.68), పంచప్రేతమంచాధి శాయినీ (ల.స.నా. 947) అనునామముల సమాహారమే. 'ధన్యాః కతిచన భజంతి' (సౌ.ల.శ్లో.8) అనుటలో అంతర్ముఖసమారాధ్యా (ల.స.నా. 870), శిష్టపూజితా (ల.స.నా.412), తాపసారాధ్యా (ల.స.నా.359) అను నామములను; 'చిదానందలహరీ' అనునది చిన్మయీ (ల.స.నా.251), పరమానందా (ల.స.నా.252) అనునామములను శంకరులు స్మరించుట స్పష్టమగును. లలితాసహస్రనామములలోని మహాకామేశ మహిషీ (233) అనునామము శంకరుల శ్లోకములలో పరబ్రహ్మమహిషి (97), సదాశివకుటుంబినీ (శివయువతి (సౌ.ల.శ్లో.35) అను రూపమును పొందినది. శివప్రియా (ల.స.నా.409), మృడప్రియా (ల.స.నా.211) అనునామములు 'ఈశానదయితే' (సౌ.ల. శ్లో. 53) అను సంబోధనమైనది. 'చండికా' (755) అనునామము 'చండి' (సౌ.ల. శ్లో.89)గా అయినది. 'శివపరా'

(140), సదాశివకుటుంబినీ(911), సదాశివ పతివ్రతా (709) అను నామములు ‘పశుపతి పరాధీనహృదయే’ (సౌ.ల.శ్లో. 54), ‘సతీనామచరమే (సౌ.ల. శ్లో. 96) అనియు రూపొందినవి.

‘విశాలా కల్యాణీ...’ (శ్లో. 49) అను శ్లోకములోని ‘అయోధ్యా’ అననది దురాధర్షా (772), సర్వానుల్లంఘ్యశాసనా (995) అనియు; ‘అవంతీ’ అనుపదము రక్షాకరీ (317) నామమును, ‘భోగవతీ’ (సౌ.ల.శ్లో.49) అనునది భోగినీ (391) అనునామమునకును పర్యాయములే. లలితా సహస్రనామములలోని ధరసుతా (956), శైలేంద్రతనయా (634) అను నామములు సౌందర్యలహరియందు హిమగిరిసుతే (6), తుహినగిరికన్యే (12), గోత్రాధరపతికులోత్తంసకలికే (52), ధరణిధరరాజన్యతనయే (55), అగరాజన్య తనయే (58), తుహినగిరివంశధ్వజపటి (61), గిరిసుతే (67,78,82,83), నగపతిపతాకే (73), ధరణిధరకన్యే (78), అచలతనయే (76), శైలతనయే (79), అని వివిధరూపములతో సాక్షాత్కరించును. ‘అనాకలిక సాదృశ్యచుబుక శ్రీ విరాజితా (ల.స.నా.29) అను నామము శంకరుల రచనలో ‘తవ చుబుకమౌపమ్యరహితమ్’ అని (సౌ.ల.శ్లో.67) అయినది. ‘విశ్వభ్రమణ కారిణీ (889) అనునామము ‘గిరామహుర్దేవీం’ (సౌ.ల.శ్లో.97) అనుశ్లోకమున ‘విశ్వంభ్రమయసి’ అని అయినది.

సౌందర్యలహరిలోని కొన్నిశ్లోకములు, శ్లోకైకదేశములు లలితా సహస్ర నామావళిలోని నామములకు వ్యాఖ్యానములుగా కన్పించును. ‘స్మరోపి త్వాం నత్వా రతినయన లేహ్యేన వపుషా మునీనామప్యంతః ప్రభవతి హి మోహాయ జగతామ్’ అను (సౌ.ల. 5) శ్లోకార్ధములో పరమేశ్వరుని నేత్రాగ్నిలో మన్మథుడు దగ్ధమగుట పరమేశ్వరి అనుగ్రహముచే రతీదేవికి మాత్రము సశరీరిగను, లోకమునకు అనంగుడుగను పునరుజ్జీవనమును పొందుట మన్మథుడు శ్రీవిద్యా సంప్రదాయ కర్తలలో నొకడగుట అను

అంశములిమిడియున్నవి. శ్రీవిద్యా సంప్రదాయములోని కాదివిద్యకు కందర్పుడు ఋషి. ఈ అంశములన్నియు సమీకరింపబడిన ఈ శ్లోకభాగము 'హరనేత్రాగ్నిసందగ్ధ కామసంజీవనౌషధిః' (84), కామపూజితా (375), కామసేవితా (586), రతిప్రియా (316) అను నామములకు వ్యాసీకరణము. 'మనస్త్వం వ్యోమత్వం...' అను (సౌ.ల.శ్లో.35) అను శ్లోకము 'అష్టమూర్తిః' (662) అనునామమును వివరించును. 'అహః సూతేధాతా...' అను (సౌ.ల.శ్లో. 35) శ్లోకమున 'త్రినయనా' (453) అను పరమేశ్వరీ నామమునకు వ్యాఖ్యానరూపము. 'ఉన్మేషనిమిషోత్పన్న విపన్న భువనావళిః (ల.స.నా.281) అను నామమే 'నిమేషోన్మేషాభ్యాం' (సౌ.ల.శ్లో. 55) అను శ్లోకమున ప్రస్తరింపబడినది. పరమేశ్వరి ఎఱ్ఱని పెదవికి పగడపు కాంతులను, బింబఫలపు రక్తిమయు సరిగావని శంకరులు 'ప్రకృత్యాఽఽరక్తాయాః' అను (సౌ.ల.శ్లో.62) శ్లోకమున వర్ణించిరి. ఇది నవ విద్రుమబింబశ్రీన్యక్కారి రదనచ్ఛదా' (ల.స.నా.24) అను నామమునకు ప్రపంచీ కరణము. 'నిజసల్లాపమాధుర్యవినిర్భర్త్సితకచ్ఛపీ (27) అని దేవీ వాఙ్మాధుర్యము సహస్రనామావళిలో స్తుతింపబడినది. సరస్వతీదేవి పరమేశ్వరి సన్నిధిలో శివుని గుణగణములను తన కచ్ఛపిని మీటి గానము చేసినది. పరమేశ్వరి సాధువాదములు పలికినది. ఆమె కంఠమాధుర్యముచే కచ్ఛపి తంత్రీనాద మాధుర్యము మందీకృతముకాగా, వాణి తన వీణను గౌసెనతో కప్పినది. 'విపంచ్యా గాయంతీ...' (సౌ.ల.శ్లో.66) అను శ్లోకములోని ఈ భావము పై నామమునకు వివరణమనుట స్పష్టము. 'పరాజేతుం రుద్రం...' అను (సౌ.ల.శ్లో.83) శ్లోకమున పరమేశ్వరి జంఘలు మన్మథుని తూణీరములుగా వర్ణింపబడినవి. ఇది 'ఇంద్రగోపపరిక్షిప్త స్మరతూణాభ జంఘికా' అను (41) నామమునకు కమనీయమగు వ్యాఖ్యానము. 'మృషాకృత్వా గోత్రస్ఖలనం...' అను (సౌ.ల.శ్లో.86) శ్లోకములోని 'తులా కోటిక్వాణ'ములు 'శింజాన మణి మంజీరమండిత

శ్రీపదాంబుజా (46) అను నామములోని మణిమంజీర శింజానముల విలాసములే. 'పదద్వయ ప్రభాజాల పరాకృత సరోరుహా (45) అను నామమే 'హిమానీహంతవ్యం...' (సౌ.ల.శ్లో.87) అను శ్లోకమున వ్యాఖ్యాతమై సరోరుహములకన్న పరమేశ్వరి పాదముల ఆధిక్యమును వివరించును.

ఒక్కొక్కచోట పెక్కునామములు ఒకశ్లోకమున సంగ్రహింప బడుటయు, ఒకానొక నామములోని ప్రధానభావము శ్లోకగతములగు ఒకటిరెండు పదములలో సంక్షిప్తీకరింపబడుటయు కన్పించును. 'రాగస్వరూపపాశాఢ్యా' (ల.స.నా. 8) క్రోధాకారాంకుశోజ్జ్వలా (9), మనోరూపేక్షుకోదండా (10), పంచ 'తన్మాత్రసాయకా' (11) అను నామములు 'ధనుర్బాణాన్ పాశం సృణి మపి దధానాకరతలైః...' (సౌ.ల.శ్లో.7) అను శ్లోకమున సంగ్రహింపబడినవి. పరమేశ్వరిని వశిన్యాది వాగ్దేవతాగణము 'శ్రుతిసీమంతసిందూరీకృత పాదాబ్జ ధూళికా' అని (ల.స.నా.289) స్తుతింపగా శంకరులు పరమేశ్వరి పాదములు శ్రుతిశిరస్సులపై విహరించు భావమును 'శ్రుతీనాం మూర్ధానో...' (సౌ.ల.శ్లో. 84) అను శ్లోకమున సంగ్రహించిరి.

సహస్రనామములందు పరమేశ్వరి కుండలిని (110), కులోత్తీర్ణా (714) అని వర్ణింపబడినది. కుండలినీశక్తి మూలాధారమునుండి బ్రహ్మరంధ్రము వరకు పయనించు మార్గమును కులపథమందురు. (అకులపథమని కొందఱి మతము). కులపథమునుత్తరించి సహస్రారమును జేరునది గనుక దేవి కులోత్తీర్ణ. కుండలినీ రూపయగు దేవి ఊర్ధ్వగమనమును శంకరులిట్లు వర్ణించిరి –

**'మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహమ్**
**స్థితం స్వాధిష్ఠానే హృది మరుతమాకాశముపరి ।**
**మనోపి భ్రూమధ్యే సకలమపి భిత్వా కులపథం**
**సహస్రారే పద్మే సహరహసి పత్యా విహరసి ॥ (సౌ.ల.శ్లో. 9)**

ఇందలి 'సహస్రారే పద్మే' ఇత్యాది పాదము 'సహస్రారాంబుజారూఢా (105) అను నామమునకు స్ఫోరకమే. పై శ్లోకములోని వర్ణనమంతయు కుండలినీ, కులోత్తీర్ణా అను నామముల వ్యాఖ్యానరూపమే. అనంతరశ్లోకమగు 'సుధాధారా సారైః...' అను దానిలోన కుండలిని సహస్రారమును ద్రవింపజేసి, షట్చక్రములను సుధావర్షముచే ఆప్లావితముజేసి తిరిగి కులకుండకు హరమున నిద్రించుట వర్ణింపబడినది. ఇది 'సుధాసారాభివర్షిణీ (106), కులకండాలయా (440) అను నామములకు వ్యాఖ్యానమే. 'చతుర్భిః శ్రీకంఠైః' అను (11) శ్లోకమున శ్రీచక్రస్వరూపము వర్ణింపబడినది. శ్రీదేవికినీ, శ్రీచక్రమునకును అభిన్నత సంప్రదాయసిద్ధము. శ్రీశివాశివులు నిత్యానపాయులు. శ్రీచక్రము కూడ ఉభయుల సమస్తరూపము. శ్రీచక్రము దేవీస్వరూపమే గాక నివాస భవనముకూడ. పైశ్లోక భావమంతయు శ్రీకంఠార్ధశరీరిణీ (392), చక్రరాజనికేతనా (245), శ్రీచక్రరాజనిలయా (996), శ్రీశివాశివశక్త్యైక్యరూపిణీ (999) అనునామములలో వ్యంజింప బడినదే. 'క్షితౌ షట్పంచాశత్' (సౌ.ల.శ్లో. 14) అను శ్లోకమున పంచ భూతములు, మనస్సు ఈ ఆరింటి మయూఖముల సంఖ్య వర్ణింపబడినది. ఈ ఆరు తత్త్వములును మూలాధారాది ఆజ్ఞాంతమగు షట్చక్రములలో వరుసగా నుండును. వీనికి ఊర్ధ్వమున సహస్రదళపద్మము. అది పరమేశ్వరీ నివాసము. ఈ ఆరుతత్త్వముల కిరణములమొత్తము సంఖ్య360. ఇవి అహోరాత్రాత్మకమగు మున్నూటరువది దినముల సంవత్సరమునకు ప్రతీకలు. వీనికి పైనుండు దేవి కాలాతీత. కనుక కాలాతీతయై ప్రతిపదాది రాకాంత తిథులలో షోడశనిత్యలరూపమున అర్చింపబడుచున్నది. ఈ శ్లోకాభిప్రాయమంతయు నిత్యాషోడశికారూపా (391), ప్రతిపన్ముఖ్యరాకాంత తిథిమండల పూజితా (610), షట్చక్రోపరి సంస్థితా (108) అను నామములకు వ్యాఖ్యానమే. 'జగత్సూతే ధాతా...' (సౌ.ల.శ్లో. 24) అను శ్లోకమున సృష్టికర్త్రీ, బ్రహ్మరూపా, గోప్త్రీ, గోవిందరూపిణీ, సంహారిణీ,

రుద్రరూపా, తిరోధానకరీ, ఈశ్వరీ, సదాశివా, అనుగ్రహదా, పంచకృత్య పరాయణా (264 నుండి 274) అను పదకొండు నామములయు, పంచబ్రహ్మస్వరూపిణీ (250) అను నామము యొక్కయు భావములను పొందుపరచుకొన్నది. అవిద్యానా మంతస్తిమిర మిహిరద్వీపనగరీ (సౌ.ల. శ్లో. 3) అను శ్లోకమునకూడ లలితా సహస్రనామ భావనయే గోచరించును. పరమేశ్వరీ కృప లభించువరకు భక్తులు కూడ అవిద్యులే. అవిద్యులగు భక్తులలోని అజ్ఞానరూపమగు తిమిరమును తొలగించునది పరమేశ్వరి ఈ బావమే లలితా సహస్రనామ స్తోత్రమున భక్తహార్దతమోభేదభాను స్త్రమద్భాను సంతతిః (404) అనజ్ఞానధ్వాంత దీపికా (993) అను నామములలో గోచరించును. దేవి చేతనా రూప. ఈ చేతనమే విద్యయని లలితా సహస్రనామ స్తోత్ర భాస్కరరాయుల వ్యాఖ్య (పుట 246) పేర్కొనుచున్నది. కనుక పై శ్లోక ద్వితీయ పాదము చిచ్ఛక్తిః, చేతనారూపా (416,417) అనునామముల వివరణమే. సంసారపంక నిర్మగ్న సముద్ధరణపండితా (880) అను నామమే శంకరుల శ్లోకమున 'జన్మజలధౌ నిమగ్నానాం...' (సౌ.ల. శ్లో. 3)గా పరిణమించినది.

పరమేశ్వరికి విశేషణములుగా చెప్పిన పెక్కు వర్ణనలు లలితాసహస్ర నామములోని నామములను స్ఫురింపజేయునవే. 'క్వణత్కాంచీదామా...' (సౌ.ల.శ్లో.7) ఇత్యాది శ్లోకములోని 'క్వణత్కాంచీదామా' అను వర్ణన 'రత్నకింకిణికారమ్యరశనాధామభూషితా' (ల.స.నా.38) 'రణత్కింకిణి మేఖలా' (ల.స.నా.312) అను నామములను; 'తటిల్లేఖాతన్వీ...' (సౌ.ల.శ్లో.21) ఇత్యాది శ్లోకములోని తటిల్లేఖాతన్వీ, నిషణ్ణాం షణ్ణామప్యుపరి అను పదములు లలితా సహస్రనామములోని 'తటి ల్లతాసమరుచిః' (107), 'షట్చక్రోపరిసంస్థితా (108) అను నామములను; 'మహాపద్మాటవ్యాం' (సౌ.ల.శ్లో. 21) అనునది 'మహాపద్మాటవీసంస్థా' (ల.స.నా.59) అను నామమును స్ఫురింపజేయును.

పరమేశ్వరీపరమేశ్వరులు సమరసపరానందపరులని శంకరుల వర్ణనము (సౌ.ల.శ్లో.34). ఇది సామరస్యపరాయణా (792) అను పరమేశ్వరీనామమునకు వివరణము. 'మనస్త్వం వ్యోమత్వం' (సౌ.ల.35) అను శ్లోకములోని 'విశ్వవపుషా' అనుమాట 'విశ్వరూపా' (256) అను నామమునకు ప్రతిబింబమే.

**అష్టమూర్తి వర్ణన:-**

పరమేశ్వరిని 'అష్టమీచంద్ర విభ్రాజ దళికస్థలశోభితా (15), రాకేందు వదనా (314) అని సహస్రనామములు స్తుతించుచున్నవి. దేవి శిరస్సునందలి అర్ధచంద్రుడు ఆమె ఫాలమనెడు అర్ధచంద్రునితో కలిసి రాకాహిమకరుడుగా చంద్రుడు పరిణమించుచున్నాడను శంకరుల వర్ణనము పై నామముల ప్రతిఫలమే. 'రసజ్ఞా' (779) అనునామము సౌందర్యలహరిలో 'నవరసాస్వాద తరళౌ' అను కర్ణయుగళ విశేషణముగా పరిణమించినది. 'కవీనాం సందర్భస్తబక మకరందైకరసికం' (సౌ.ల.శ్లో. 50) అను కర్ణయుగళ విశేషణము 'కావ్యాలాపవినోదినీ' (613) అను దేవీనామమునకు ప్రతిబింబము. 'రసశేవధిః' (780) అనునామమే 'శివేశృంగారార్ద్రా' (సౌ.ల.శ్లో.51) 'గతేకర్ణాభ్యర్ణం (సౌ.ల.శ్లో.52) అను శ్లోకములలో వివరింపబడినది. ఆకర్ణాంతములగు పరమేశ్వరి కన్నులపైశున్యమునకు జడిసి, మీనములు నీటిలో దాగియున్నవను శంకరుల వర్ణనము(సౌ.ల. శ్లో. 56) 'వక్త్రలక్ష్మీపరీవాహ చలన్మీనాభలోచనా (ల.స.నా.18) అనునామమును స్ఫురింపజేయును. 'రణేజిత్వా...' (సౌ.ల.శ్లో. 65) ఇత్యాది శ్లోకములోని శశివిశదకర్పూర శకలయుతములగు పరమేశ్వరీ వదనతాంబూలకబళములును 'తాంబూలపూరితముఖీ' (559), 'కర్పూర వీటికామోద సమాకర్షద్దిగంతరా' (26) అను నామములనుండి గ్రహింపబడినవే. లలితా సహస్రనామములో వర్ణింపబడిన దేవి చింతాకు

పతకములోని ముత్యములు (ల.స.నా. 32) శంకరుల వాక్కులలో స్తంబేరమదనుజకుంభప్రకృతులగు ముక్తామణులైనవి.(సౌ.ల.శ్లో.74).

దేవి త్రివళులు స్తనకలశముల బరువునకు భంగపడు నడుమును రక్షించుటకు మన్మథునిచే దేవికి త్రివళులు కూర్పబడినట్లు శంకరుల వర్ణన. (సౌ.ల.శ్లో.80). ఇది 'స్తనభారదళన్మధ్యపట్టబంధవళిత్రయా' (ల.స.నా.36) నామమునకు రూపాంతరము. మన్మథప్రమేయము పై నామమునకు శంకరులు పూసిన రసాలేపము. 'పదం తే కీర్తీనాం...' (సౌ.ల.శ్లో.88) ఇత్యాది శ్లోకములో దేవి ప్రపదమును కఠినమగు కమఠకర్పరముతో పోల్చుట తగదని శంకరులు వర్ణించిరి. ఇది 'కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా' అను (43) నామమును దృష్టిలో నుంచుకొని చేసిన వర్ణనమే. శ్లోకములోని 'సద్భిః' అను పదముచే నిర్దేశింప బడినది శ్రీలలితా సహస్రనామ ప్రవక్తలగు వశిన్యాది వాగ్దేవతాగణమే .'పదన్యాసక్రీడా' (సౌ.ల.శ్లో.91) శ్లోకములోని వర్ణనము మరాళీ మందగమనా' (47) అను నామమును పురస్కరించుకొన్నదే. పరమేశ్వరీ చరణ నిర్ణేజనజలపానము కవిత్వశక్తి ప్రదమను విషయము 'కదాకాలే మాతః. . .' అను (సౌ.ల.శ్లో.98) శ్లోకమున శంకరులు వివరించిరి. ఇది వాగ్వాదినీ (350), వాగధీశ్వరీ (640) అను నామములను స్ఫురింపజేయును.

**2. శ్రీలలితాత్రిశతీ ప్రభావము:-** శ్రీశంకర భగవత్పాదులు శ్రీలలితా త్రిశతీ నామావళికి వ్యాఖ్యానమును రచించిరి. ఆ వ్యాఖ్యను పరిశీలించినచో ఆయా నామముల రహస్యార్థములు సౌందర్యలహరీ స్తవమున విస్తృతముగా నిక్షిప్తము లైనట్లు స్పష్టమగును.

కల్యాణీ (2) వంటి నామములు కొన్ని యథాతథముగా సౌందర్యలహరిలో సాక్షాత్కరింపగా, కల్యాణగుణశాలినీ (3), కదంబకాననా వాసా (10) వంటి నామములు చారుచరితే (సౌ.ల.శ్లో.91), నీపోపవనవతి

(సౌ.ల.శ్లో.8) వంటి రూపాంతరములలో కనిపించును. త్రిశతిలోని ఈశ్వరప్రేరణకరీ (53), ఈశశక్తీ (59) నామములు 'శివశ్శక్త్యా యుక్తః ... (సౌ.ల.1) ఇత్యాది ప్రారంభశ్లోకమున వివృతములైనవి. హలధృత్పూజితా (102) అను నామము 'తనీయాంసం పాంసుం...' (సౌ.ల.శ్లో.2) ఇత్యాది శ్లోకములోని 'వహత్యేనం శౌరిః' అను భావములకు మూలమైనది. 'సమున్మీలత్సంవిత్' (సౌ.ల.శ్లో.38) ఇత్యాది సౌందర్యలహరి శ్లోకమున వ్యాఖ్యాతలు హంసమంత్రోద్ధారమును పేర్కొనిరి. ఈ శ్లోకము త్రిశతిలోని 'హంసమంత్రార్థరూపిణీ' (73) అని దేవిని అజపామంత్రాకృతిగా వర్ణించుటను స్ఫురింపజేయును. పరమేశ్వరిని త్రిశతి హాదివిద్య అనియు పేర్కొనినది. సౌందర్యలహరిలోని 'స్మరోమారోమారః...' (సౌ.ల.శ్లో. ) ఇత్యాది శ్లోకము హాదివిద్యోద్ధారముగ కూడా వ్యాఖ్యాతలచే వివరింపబడినది. పంచదశీ మంత్రాత్మకమగు త్రిశతీనామావళిని గూర్చి ఇంతకన్నలోతుగా ప్రస్తావించుటకు సంప్రదాయము అనుమతింపదు.

**3. శ్రీశివమహిమ్నఃస్తోత్రము:-** మేరుపర్వతశిఖరములపై సౌందర్య లహరీ స్తవమును పుష్పదంతుడను యక్షుడు లిఖింపగా, గౌడపాదులు దానిని శంకరులకుపదేశించిరను ఆభాణకమిదివరకే ప్రస్తావింపబడినది. ఈ యాభాణకము సుప్రసిద్ధమగు పుష్పదంతాచార్యకృత శివమహిమ్నమునకును, సౌందర్యలహరికిని గల కించిత్ సాదృశ్యమును వ్యంజింపజేయునదే. పుష్పదంతాచార్యుల స్తవము శివపరము కాగా, సౌందర్యలహరి శివాపరము. రెండును శిఖరిణీ వృత్తనిబద్ధములే. శైలీ సామ్యముగూడ కొంతగోచరించును. 'మోహాయజగతామ్' (శి.మ.శ్లో.5, సౌ.ల.శ్లో.5) వంటి పదబంధము లొకటి రెండు గోచరించును. మహోక్షః ఖట్వాంగం (8), భవశ్శర్వోరుద్రః (29) ఇత్యాదిశ్లోకముల శైలి సౌందర్యలహరిలోని 'ధనుఃపౌష్పం మౌర్వీ(6), శివశ్శక్తిః కామః (32) అను శ్లోకముల శైలియు సదృశము. 'మనస్త్వం వ్యోమత్వం' అను శంకరుల

(సౌ.ల. 35), త్వమర్కస్త్వం వ్యోమస్త్వమసి (శి.మ. 26) ఇత్యాది శివమహిమ్న శ్లోకభావమునకు ప్రతిబింబము.

**4. శ్రీసుభగోదయ స్తుతి:-** సౌందర్యలహరీకర్తృత్వమును గూర్చిన భిన్నాభిప్రాయములలో శ్రీగౌడపాదాచార్యులీ స్తవమును మేరుపర్వతము నుండి తెచ్చి శంకరుల కనుగ్రహించిరని యొక మతము. ఇందు కల్పన ఎంత యున్నను, గౌడపాదాచార్యులకును, సౌందర్యలహరికిని ఎంతో కొంత సంబంధముండుటను వ్యంజింపజేయుచున్నది. గౌడపాదులు పరమేశ్వరీ వర్ణనాత్మకముగా సమయాచార పద్ధతిని, పంచవిధసామ్యములను వివరించు శాస్త్రముగా సుభగోదయ స్తవమును రచించిరి. సౌందర్యలహరిపై అందును ఆనందలహరీ విభాగముపై సుభగోదయ ప్రభావము స్పష్టముగా గోచరించును. దీనిని పురస్కరించుకొనియే పై కల్పనము పుట్టియుండును.

సుభగోదయ సౌందర్యలహరీస్తవముల నామములకు గల సంబంధము పూర్వమే వివరింపబడినది. గౌడపాదులు తమ ప్రథమ శ్లోకమందు పరమేశ్వరిని అమృతలహరిగా వర్ణించిరి. ఇందలి లహరీ శబ్దము సౌందర్యలహరీ నామమున ఆవృతమైనది. అమృతబీజములు సకార, ఔకారములు శంకరుల స్తోత్రనామములో కాద్యక్షరమైనవి. పరమగురువగు గౌడపాదుల స్తోత్రమును హృదయనిష్ఠము చేసుకొనియే శంకరులు తామీ స్తోత్రమును రచించినట్లు వ్యంజింపజేసిరనవచ్చును.

**'భవాని! త్వాం వందే భవమహిషి! సచ్చిత్సుఖవపుః**
**పరాకారాం దేవీ మమృతలహరీ మైందవకళామ్ ।**
**మహాకాలాతీతాం కలితసరణీకల్పితతనుం**
**సుధాసింధోరంతర్వసతిమనిశం వాసరమయీమ్ ॥'**

(సు.స్త.శ్లో 1)

ఇది శ్రీగౌడపాదుల సుభగోదయస్తవములోని ప్రార్థనాశ్లోకము. ఇందలి పదబంధములు, భావము సౌందర్యలహరిలో వివిధశ్లోకములలో ప్రతిఫలించినవి.

ఈ శ్లోకారంభము సౌందర్యలహరిలోని 'భవాని త్వం దాసే' అను శ్లోకపు టెత్తుగడను స్ఫురింపజేయును (సౌ.ల.శ్లో.22). 'సుధాసింధో రంతర్వసతిం' (సు.స్త.శ్లో.1) అనునది 'సుధాసింధోర్మధ్యే. . .' (సౌ.ల.శ్లో.8) అను శ్లోకమున ప్రస్తావింపబడినది. మహాకాలాతీతా, వాసరమయీ అను విశేషణములు 'క్షితౌ షట్పంచాశత్...' అను (సౌ.ల.14) శ్లోకమున వ్యాఖ్యాతములైనవి. 'మనస్తత్త్వం జిత్వా (సు.స్త.శ్లో.2), మనోమార్గం జిత్వా (సు.స్త.శ్లో.3), యదా తౌ చంద్రార్కౌ (సు.స్త.శ్లో.4), పృథివ్యాపస్తేజః (సు.స్త.శ్లో.5) కుమారీయన్మంద్రం (సు.స్త.శ్లో.6) అను శ్లోకముల భావమునే శంకరులు 'మహీం మూలాధారే...' అను (సౌ.ల.9) శ్లోకమున సంగ్రహించిరి. 'త్రిఖండం తే చంద్రం...' అను (సౌ.ల.8) శ్లోకములో గౌడపాదులు ప్రస్తావించిన షట్త్రింశద్దశ మయూఖము లాయా తత్త్వములలో (తత్సంబంధిత మూలాధారాది చక్రములలో ఎన్నెన్నియుండునో వివరించునదే శంకరుల 'క్షితౌషట్పంచాశత్...' అను (సౌ.ల.14) శ్లోకము. 'చతుర్భిః శ్రీకంఠైః...' (సౌ.ల.11) ఇత్యాది సౌందర్యలహరీ శ్లోకము 'త్రికోణే తే వృత్తత్రితయమిభకోణే...' (సు.స్త.11) అను గౌడపాదుల శ్లోకభావమునే వ్యక్తముచేయును. రెండును శ్లోకముల వరుసలో ఏకాదశస్థానీయములగుట చిత్రమగు సాదృశ్యము. 'తటిల్లేఖామధ్యే...' (సు.స్త.14) అను గౌడపాదుల శ్లోకము మణిపూరమున దేవీస్వరూపమును వర్ణించును. మణిపూరమున గల దేవిని శంకరులు స్తుతించిన శ్లోకపు టెత్తుగడయు 'తటిత్వన్తం శక్త్యా' అనియే. గౌడపాదుల ఈ శ్లోకమున దేవి హస్తములలోని ఆయుధముల ప్రస్తావన 'ధనుర్బాణానిక్షూద్భవ' (సు.స్త.శ్లో.14) అని యుండగా, శంకరులిట్లే 'ధనుర్బాణాన్ పాశం...' (7) అని దేవి ఆయుధములను పేర్కొనిరి.

గౌడపాదుల ఈ శ్లోకమున దేవి 'ఉదితరవిబింబాకృతిరుచిగా' చెప్పబడినది. శంకరులు 'తనుచ్ఛాయాభిస్తే తరుణతరణిశ్రీసరణిభిః' (సౌ.ల.శ్లో.18) అని దేవి ఆరుణ్యమును ప్రస్తావించిరి.

చతుఃషష్టి తంత్రములకన్న శ్రీవిద్య వేదప్రతిపాదితము, సమయమతానుసారిణియగుటచే దాని శ్రేష్ఠతను గౌడపాదులు 'చతుఃషష్టి స్తంత్రాణ్యపి...' (సు.స్త.18) ఇత్యాది శ్లోకమున ప్రశంసించిరి. ఆ యభిప్రాయమునే మరికొంత మృదువుగా శంకరులు 'చతుఃషష్ట్యా తంత్రైః ...' (సౌ.ల. 31) ఇత్యాది శ్లోకమున వివరించిరి.

గౌడపాదులు పంచదశీమంత్రస్వరూపమును 'స్మరోమారోమారః ...' ఇత్యాది (సు.స్త.19) శ్లోకము నందు వివరింపగా శంకరులు 'శివః శక్తిః కామః...' ఇత్యాది శ్లోకముగ వర్ణించిరి. ఉభయులకును ప్రాచీనతంత్ర గ్రంథములే మూలములు.

ఆజ్ఞాచక్రమున యోగులు పరమేశ్వరిని సేవించు పద్ధతిని 'మనోమార్గం జిత్వా...' (సు.స్త. శ్లో.3) అని గౌడపాదులు నిరూపింపగా, శంకరులు 'ఆజ్ఞా చక్రస్థుడగు పరశంభునాథుని 'తవాజ్ఞాచక్రస్థం...' ఇత్యాది (సౌ.ల.శ్లో.36) శ్లోకమున స్తుతించిరి. ఈ ఆరంభపదము గౌడపాదుల శ్లోకములోని చతుర్థ పాదారంభ పదమే. ఇట్లే ఆయా చక్రములలోని శివాశివులను శంకరులు స్తుతించిన శ్లోకములకు గౌడపాదులాయా చక్రములను పేర్కొని శ్లోకములకును సంబంధము గోచరించును.

యోగసంప్రదాయమున పృథివీతత్త్వాత్మకమగు తదుపరి జల తత్త్వాత్మకముగా స్వాధిష్ఠానమును, అనంతరము తేజోమయమగు మణిపూరమును పేర్కొందురు. శంకరులు తద్భిన్నముగా జలతత్త్వాత్మకమగు ద్వితీయచక్రమును మణిపూరమనియు, వహ్న్యాత్మకమగు తృతీయచక్రమును స్వాధిష్ఠానమనియు 'మహీంమూలాధారే...' (సౌ.ల.9) ఇత్యాది శ్లోకమున

పేర్కొనిరి. మణిపూరము జలతత్త్వాత్మకమనుటకు గౌడపాదుల ఈ క్రింది శ్లోక మాధారము.

**'వదన్త్యేకే వృద్ధా మణిరితి జలం తేన నిబిడం**
**పరేతు త్వద్రూపం మణిధనురితీదం సమయినః ...'** (సు.స్త.శ్లో. 28)

కౌలమతమును గౌడపాదులు ఇట్లు పేర్కొనిరి. –

**నవవ్యూహం కౌలప్రభృతికమతం తేన స విభు**
**ర్నవాత్మా దేవోఽయం జగదుదయకృద్భైరవవపుః ।**
**నవాత్మా వామాదిప్రభృతిబిరిదం భైరవవపు**
**ర్మహాదేవీ తాభ్యాం జనకజననీమజ్జగదిదమ్ ॥** (సు.స్త.శ్లో. 44)

మూలాధారమున శంకరులు దేవిని వర్ణించిన పద్ధతియు ఈ విధముగనే యున్నది. –

**తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా**
**నవాత్మానం మన్యే నవరసమహాతాండవనటమ్ ।**
**ఉభాభ్యామేతాభ్యాముద్వయవిధిముద్దిశ్య దయయా**
**సనాథాభ్యాం జజ్ఞే జనకజననీమజ్జగదిదమ్ ॥** (సౌ.ల. 41)

ఈ శ్లోకములో కనిపించు నవాత్మ పదమును శంకరులు 'శరీరం త్వం శంభోః ...' (సౌ.ల. 34) అను శ్లోకమునగూడ ప్రయోగించిరి. వ్యాఖ్యాతలిచట కౌలసంప్రదాయమున చెప్పబడు నవవ్యూహములను వివరించిరి.

మణిపూరమున సమయాచారుల అర్చనను – 'క్షకారః పంచాశత్కల ఇతి...' ఇత్యాది శ్లోకము గౌడపాదులు వివరింపగా శంకరులు అచట దేవీ స్థితిని 'తటిత్త్వన్తం శక్త్యా...' ఇత్యాది (సౌ.ల. 40) శ్లోకమున వివరించిరి. రెండును భావసామ్యముచే సన్నిహితములు.

ఇట్లు తంత్రయోగప్రాధాన్యముగల పెక్కు శ్లోకములను శంకరులు తమ పరమగురువుల ఉపదేశములనే పొందుపరచిరనుట స్పష్టము.

గౌడపాదుల వాక్కు శాస్త్రపద్ధతిలో ప్రభుసమ్మతము కాగా, శంకరుల వాక్కు కావ్యాలాపమై కాంతాసమ్మితముగ ఉండును. ప్రతిపాద్యవిషయము మాత్రము అభిన్నమే.

**కవితా సౌందర్యము**

కవితా సౌందర్యవిషయమున శంకరుల కవిత్వము పలుతావులలో కాళిదాసమహాకవిరచనలను స్ఫురింపజేయును. పార్వతీదేవి యౌవన వర్ణనావసరము కుమారసంభవకావ్యములో కాళిదాసమహాకవి ఆమెయూరువుల నిట్లు వర్ణించెను –

**'నాగేంద్రహస్తాః త్వచికర్కశత్వాదేకాంత శైత్యాత్కదళీవిశేషాః ।**
**లబ్ధ్వాహి లోకే పరిణాహి రూపం జాతాస్తదూర్వోరుపమానబాహ్యాః॥**
(కు.సం, సర్గ1.శ్లో.36).

సౌందర్యలహరియందు పరమేశ్వరియూరువులను శంకరులిట్లే వర్ణించిరి,

**కరీంద్రాణాం శుండాన్ కనకదలీకాండపటలీ**
**ముభాభ్యామూరుభ్యాముభయమపి నిర్జిత్యభవతీ...'** (సౌ.ల.శ్లో.82)

పై రెండు భావముల పోలిక స్పష్టము. ఇట్లు సౌందర్యలహరీ స్తవమున శ్రుతిస్మృత్యుపనిషత్తంత్రస్తోత్రాది వాఙ్మయముయొక్క ప్రభావము బహుధా ప్రతిఫలించుచు ఈ స్తోత్రముయొక్క ఆర్షత్వమును నిరూపించుచున్నది.

## 5. అనంతరస్తోత్రసాహిత్యముపై సౌందర్యలహరీప్రభావము

ప్రతిభాసమగ్రులైన కవుల రచన అనంతరుల రచనలను ప్రభావిత మొనర్చుట సహజము. అట్లు అనుసరించినవారుకూడ విశేష ప్రతిభాశాలురై రనుట కూడ సంభవించును. అది అనుసర్తల ప్రతిభాదారిద్ర్యమునకు

చిహ్నముకాదు. పూర్వులపట్ల వారి రచనపట్లగల గౌరవాదరములకది నిదర్శనము. అంతేగాక ఈ పూర్వరచనలో తత్కర్తచూపిన ప్రతిభావిశేషము నకును అది నిదర్శనమే.

ఈ ప్రభావము అనేకవిధములుగ నుండవచ్చును. ప్రక్రియాపరముగ శైలీపరముగ భావముల విషయమున, పదబంధముల విషమున, శ్లోకముల ఆరంభముల విషయమునకూడ ఉండవచ్చును.

సంస్కృతస్తోత్రవాఙ్మయమును అత్యంత ప్రభావితమొనర్చినవారు శ్రీశంకరులు. శ్రీశంకరులకు పూర్వము కూడ అపారమగు స్తోత్రవాఙ్మయ మున్నది. వానిలో కవితా గాంభీర్యముచే శిరోధార్యములైన శివమహిమ్నము వంటివియు గలవు. కాని శంకరులకు పూర్వపు స్తోత్రములలో శతకములు కనిపింపవు. స్తుతి విషయకములైన శతకములు, పంచశతులు, సహస్రములకు ప్రేరణము శంకరుల ఈ శతకమే. అట్లే స్తోత్రనామమున లహరీ శబ్దముకూడ శంకరుల అనుగ్రహమే. పూర్వస్తోత్రములలో కేవలము తంత్రవేదాంతాది శాస్త్ర విషయములో, సౌందర్యవర్ణనమో మహిమావర్ణనమో ఏదోయొకటి ప్రధానముగ కన్పించును. అన్నింటికిని తుల్యప్రాధాన్యమునిచ్చినవారు శంకరులు. తంత్రశాస్త్ర విషయ గర్భితమగు కవిత్వమునకు మార్గదర్శకులు కూడ శంకరులే యనవచ్చుస్త్రను. విద్వదౌషధములగు తంత్రాది జటిలశాస్త్రాంశములను కవితాసౌందర్యములో సమ్మిశ్రితముచేసి, రసజ్ఞరసాయనముగా వలచుటకు శంకరులే మార్గదర్శకులు.

**1. మూకపంచశతి:–** శంకరులచే ప్రభాతులైనవారిలో మూకశంకరులవారిని ప్రథముగ పేర్కొనవచ్చును. ఈ ఆచార్యులు ఆదిశంకరుల ఆధ్యాత్మిక వారసత్వమునే గాక, కవితావారసత్వమునుకూడ పుణికి పుచ్చుకొనిరి. శ్రీకాంచీపీఠాధిపతులుగా నుండిన వీరు 'మూకపంచశతి' యందు కామాక్షీ దేవిని స్తుతించిరి. ఈ రచనలో పెక్కు సందర్భములలో సౌందర్యలహరీ

శ్లోకముల ఎత్తుగడలు, విశేషపదప్రయోగములు, భావములు, సంబోధనలు కూడ ప్రతిఫలించినవి.

**2. జగన్నాథపండితరాజకృతులు:–** శంకరులచే ప్రభావితుడైన మరియొక ప్రతిభాసమగ్రుడగు విద్వత్కవి జగన్నాథపండితరాయలు. స్వీయకవితా విషయమున అపారమగు ఆత్మ విశ్వాసమును ప్రకటించిన ఈ కవి శంకరులచే ప్రభావితుడైనాడనుటకు గంగాలహరీ, అమృతలహరీ, లక్ష్మీలహరీ అను స్తోత్ర నామములే ప్రత్యక్ష నిదర్శనములు. పలుతావులలో శంకరుల పదబంధములకు ప్రతిబింబము లీ స్తోత్రములలో కన్పించును.

శాంకరపీఠములనధిష్ఠించిన అనంతరాచార్యులే గాక పలువులు ఇతర సంప్రదాయములకు చెందిన ఆచార్యులు కూడ విస్తృతముగ స్తోత్రములను వెలయించుట శంకరులు చూపిన మార్గమే. ఇట్లు అనంతర స్తోత్రవాఙ్మయముపై శంకరులు తమ సౌందర్యలహరీస్తవముచే ప్రభావితమొనర్చిరని చెప్పవచ్చును

# 6. సమాజముపై సౌందర్యలహరీ ప్రభావము

అద్వైతవేదాంత ప్రవర్తకులగు శ్రీశంకరభగవత్పాదులు జ్ఞానమార్గమునే ప్రధానముగా ప్రతిపాదించినను, అధికారి భేదముచే కర్మోపాసనారూపములగు భక్తిమార్గములనుకూడ జ్ఞానమార్గమునకు నిరూపించిరి. 'త్వదన్యః పాణిభ్యాం' (సౌ.ల.శ్లో.4) ఇత్యాదిశ్లోకములో పరమేశ్వరీ చరణములే అభయవరదాన సమర్థములనుట దీనికి తార్కాణము. పరమేశ్వరీ అర్చనమును శంకరులు పాదములతో ప్రారంభించి, 'పాదనిర్ణేజనజల' ప్రభావ వర్ణనతో (సౌ.ల.శ్లో.98) ముగించిరి. ఆనందలహరీ విభాగమున క్రమముగా పరమేశ్వరి రూప భేదములను ఆయా ప్రయోజనములకెట్లుపాసింపవలెనో పేర్కొని యంత్రమంత్ర

స్వరూపమును వివరించిరి. తంత్ర, యోగవిధానమును కూడ వర్ణించిరి. ఇట్లు ఒక నిర్దిష్టమగు ప్రణాళికకనుగుణముగ ఐహికాముష్మిక ఫలసాధకముగ, శ్రీవిద్యోపాసనమును శంకరులీస్తవమును ప్రతిపాదించిరి.

పరమేశ్వరి 'సుందరి' యని గ్రంథనామముచే పేర్కొనుటనుబట్టి ఆ తల్లి కాపాలికాదులచే నుపాసింపబడు దేవతామూర్తులవలె భయంకర స్వరూపము, క్రూరస్వభావము కలిగినది కాదనియు, బహిరంతస్స్ఫుర త్సౌందర్యోజ్జ్వల అనియు స్పష్టముచేసిరి. ఇది పరోక్షముగ అవైదికములగు క్రూరాచారములతో కూడిన క్షుద్రోపాసనలనుండి సామాన్యజనులను విముక్తులనుజేసి, ఉద్ధరించుటకుట నిరూపించిన మార్గము. లోకము సాధారణముగ ఐహిక పురుషార్థ వాంఛాలోలుపము. అట్టి జనులకు కేవల పరమార్థమును బోధించి విషయవాంఛావిముఖులను చేయుట దుర్ఘటము. తొలుత వారి సాధనములను సాత్త్వికముగా పరిణమింపజేసి, సాధ్యములను ధర్మపథమునకు మరలించి, పరమార్థమను గమ్యమునకు చేర్చుటయే శంకరుల ప్రధానాశయము. తదనుగుణముగ సాగిన సౌందర్య లహరీరచనము అఖిల పురుషార్థైక ఘటనమై సమాజమునకు సుందరమగు మార్గమును చూపినది. క్రూరకర్మరహితమును, ధర్మబద్ధమును, సుకరమును నగు మార్గము కన్పించు చుండగా, సమాజము క్షుద్రములుగా భావించినవియు, రహస్యముగా చోరులవలె జనులకంటపడక ప్రయాసతో చేయదగినవియునగు క్షుద్రోపాసనలవైపు సాధారణజనులు ఆకర్షితులుకారు. ఇట్లు సౌందర్యలహరీ స్తవము కాపాలికాది క్షుద్రమతములను నింద్యములగు వామాచారములను అణచుటలో ప్రముఖపాత్రవహించెను.

పరతత్త్వమును మాతృరూపమున ఉపాసించుట సమాజమున స్త్రీలపై గౌరవాదరములు పెంపొందుటకును, ఇది యుపకరించినది. శంకరుల ఈ ఆశయము ఫలించినదనుటకు దేశమున మూలమూలల ఏర్పడిన పరమేశ్వరీ దేవాలయములు, అందలి సాత్త్విక పూజా విధానములు

ప్రత్యక్షనిదర్శనములు. శాక్తము అవైదికమనియు, కేవలలౌకిక ప్రయోజన కారకమనియు, లోకమున ఒక భ్రమ కలదు. దానిని తొలగించుటకు సౌందర్యలహరీ ప్రయోజనములలో నొకటి. ఈ స్తవము శ్రీవిష్ణుసహస్రనామ, శ్రీలలితాసహస్రనామాదులకువలె ఉపాసకులనేకులకు నిత్య పారాయణగ్రంథముగ నలరారుట సమాజముపై సౌందర్యలహరీ ప్రభావమునకు నిదర్శనము.

## 7. నీరాజనము

సంస్కృతస్తోత్రవాఙ్మయములో సౌందర్యలహరి విశిష్టస్థానాన్ని అలంకరిస్తున్నది. భగవత్పాదులు రచించిన ఇతరస్తోత్రాలు సౌందర్యలహరి దృష్టితో చిన్నవి. వానిలో అద్వైతముకాని, భక్తికాని చెప్పబడినవి. శివానందలహరి భక్తికి నిలయము. అందులో అద్వైతము కూడా చేరియున్నది. దక్షిణామూర్తి స్తోత్రాదులు వేదాంతమును బోధించుచున్నవి. కనకధారా స్తవము భక్తిప్రతిపాదకము. శాక్తతంత్రమును బోధించిన సౌందర్యలహరి విశిష్టము.

భగవత్పాదులు సౌందర్యలహరిని గొప్పప్రణాళికతో రచించిరి. భగవత్పాదుల కాలములో దేశములో అవైదికమతములగు బౌద్ధజైనాదుల విజృంభణ ఎక్కువగా ఉండినది. శాక్తతంత్రములోని వైదికమార్గము సత్త్వగుణ సంపన్నమై, తామసమతములను నిరసించినది. కొన్ని అవైదిక తంత్రమార్గములు మారణమోహనాది దుష్టక్రియలకు ఆలవాలములై యుండెను. ఇట్టి దుస్థితిలో తాంత్రికులనగానే అందరికీ భయము కలుగుచుండెను. భక్తిగౌరవాదులు నశించెను.

ఈ అవస్థలో శంకరులు అద్వైతమతమును స్థాపించి, దానిని ఆసేతుశీతాచల పర్యంతము ప్రచారము చేయబూనుకొనిరి. ఆ

సమయములోనే సౌందర్యలహరిని రచించిరి. ఈస్తోత్రము శ్రీగౌడపాదులు రచించిన సుభగోదయస్తవములోని సమయాచారమును చక్కగా ప్రతిబింబించెను. శ్రీలలితా సహస్రనామస్తోత్రములోని శ్రీవిద్యా సంప్రదాయమును ప్రతిఫలించెను. శంకరుల బ్రహ్మసూత్రభాష్యములోని తాత్త్వికాంశములను వివరించినది. భక్తి మాధుర్యమును పంచిపెట్టినవి.

ఈ స్తోత్రములో ఆయా సిద్ధాంతములు ఎంతో నేర్పుతో శంకరులచే రచింపబడినవి. ఈ స్తోత్రములోని రచనాశైలిని ప్రతిభను పరిశీలించినప్పుడు ఈ స్తోత్రము 'మానవ నిర్మితమా లేక దేవతానిర్మితమా' అను సందేహము కలుగును. శంకరులు సాక్షాత్తుశంకరులే అను నానుడి ఈ స్తోత్రము పట్ల నిరూపణమగును.

భగవత్పాదులు ఈ స్తోత్రమునకు చివర చెప్పినట్లు ఈ స్తుతి పరమేశ్వరి నోట వెలువడిన పవిత్రసాహిత్యమని చెప్పకతప్పదు. ఈ స్తోత్రము భగవతికి ప్రతిబింబము. ఈ విధముగ సాధనము, సాధకులు, సాధ్యము (ధ్యానము, ధ్యాత, ధ్యేయము భగవతియే) అనుట నిర్వివాదము. ఈ విధముగ శాక్తాద్వైతము ఈ స్తోత్రములో సంపూర్ణముగ భాసించుచున్నది.

ఈ శోధప్రబంధమును ముగించు ఈ సమయమున శంకరుల ఈ శ్లోకమే నీరాజనమగుచున్నది. –

**'ప్రదీపజ్వాలాభిర్దివసకర నీరాజనవిధిః**
**సుధాసూతేశ్చంద్రోపలజలలవై రర్ఘ్య రచనా ।**
**స్వకీయైరంభోభిః సలిలనిధిసౌహిత్యకరణమ్**
**త్వదీయాభిర్వాగ్భిః తవ జనని! వాచాం స్తుతిరియమ్ ॥** (శ్లో. 100)

# పరిశిష్టము

## 1. సంగీత సంప్రదాయములు

దక్షిణభారతదేశములో సౌందర్యలహరీ శ్లోకములను వివిధ రాగములలో గానము చేయు సంప్రదాయమున్నది. ఏయే శ్లోకమునకు ఏయే రాగమును సమకూర్చవలెనో ఈక్రింది పట్టికలో వివరించబడినది.

శ్లోకముల వరుస సంఖ్యను అనుసరించి రాగములు సూచింపబడినవి.

| | | |
|---|---|---|
| 1. ఆనందభైరవి | 2. మోహన | 3.ధన్యాసి |
| 4. శంకరాభరణము | 5. తోడి | 6. మలయమారుతము |
| 7. భైరవి | 8. కాంభోజి | 9. కన్నడ |
| 10. బిలహరి | 11. ధన్యాసి | 12. సింహేంద్రమధ్యమ |
| 13. బేగడ | 14. ఆరభి | 15. సహాన |
| 16. నీలాంబరి | 17. హిందోళం | 18. హంసధ్వని |
| 19. యదుకులకాంభోజి | 20.వసంత | 21. శ్యామ |
| 22. సావేరి | 23. అఠాణ | 24. సురుటి |
| 25. కూడంవరాళి | 26. ఆభేరి | 27. సంజురుటి |
| 28. నాటకురుంజి | 29. పూర్వకళ్యాణి | 30. మంద |
| 31. ముఖారి | 32. ఖమాస్ | 33. ఖరహరప్రియ |
| 34. కేదార | 35. సారంగి | 36. నాట |
| 37. పంతువరాళి | 38. శ్రీ | 39. చక్రవాకం |
| 40. దర్బార్ | 41. నవరసకన్నడ | 42. హుసేనీ |
| 43. షణ్ముఖప్రియ | 44. దేవగాంధారి | 45. సౌరాష్ట్రి |

46. నగగాంధారి
47. రీతిగౌళ
48. కాఫీ
49. విజయనగరి
50. భూపాల
51. అసావేరి
52. హేమావతి
53. నాదనామక్రియ
54. అభేరి
55. కేదారగౌళ
56. రంజని
57. నాగస్వరాళి
58. కురంగి
59. గౌళ
60. సంజురుటి
61. పున్నాగవరాళి
62. యమునాకళ్యాణి
63. శ్రీరంజని
64. ద్విజావంతి
65. ఆనందభైరవి
66. హిందుస్థాన్‌కాఫీ
67. కదనకుతూహలము
68. శంకరాభరణము
69. సింధుభైరవి
70. విజయశ్రీ
71. ఆందోళిక
72. మాళవి
73. బేగడ
74. బేగడ
75. హరికాంభోజి
76. జగన్మోహిని
77. తరంగిణి
78. శుద్ధబంగాళ
79. భౌలి
80. బహుధారి
81. చారుకేశి
82. శివరంజని
83. శుద్ధసావేరి
84. దేశి
85. భీంప్లాస్
86. వాచస్పతి
87. శుద్ధధన్యాసి
88. ఆహిరి
89. ఉదయరవిచంద్రక
90. బిలహరి
91. హంసానంది
92. పూర్ణచంద్రిక
93. జోన్‌పురి
94. రామప్రియ
95. జయంతశ్రీ
96. గౌడమలబార్
97. వాగీశ్వరి
98. అమృతవర్షిణి
99. వరాళి
100. మధ్యమావతి

–0–

# 2. శ్లోకప్రయోగసంప్రదాయములు

శ్రీసౌందర్యలహరీస్తవమును స్తోత్రమాత్రముగ గాక, మంత్ర మయముగ శ్రీవిద్యాసంప్రదాయజ్ఞులు భావింతురు. ఈస్తోత్రమును మాలామంత్రముగ అంగన్యాకరన్యాసములతో శ్రీలలితాసహస్రనామాదుల వలె సర్వకార్యసిద్ధిని, సర్వారిష్టశాంతిని వాంఛించి పారాయణము చేయు సంప్రదాయము కలదు.

అంతేగాక, ఒక్కొక్క శ్లోకమును ప్రతేకముగా మంత్రమువలె జపించు విధానములు కూడ కలవు. ప్రతిశ్లోకమునకును జపవిధానము, జపసంఖ్య, జపింపవలసిన దినముల సంఖ్య, బీజసమన్వితమగు యంత్ర స్వరూపము, ఫలము నిర్దేశింపబడినవి. సౌందర్యలహరి ప్రతులను భిన్న దేశీయములను పరిశీలించిన శ్రీకుప్పుస్వామిగారు కంచి కామకోటి పీఠమువారు ప్రచురించిన ప్రతిలో ఈ విషయమును పేర్కొనిరి. శ్లోకప్రయోగ సంప్రదాయములు ప్రధానముగ వంగ కేరళ తమిళదేశ సంప్రదాయములు మూడున్నవని ఆయన పేర్కొనిరి. (Prayoga of SaundaryaLayari : Verses - A. Kuppuswamy. P: ) ప్రయోగవిధానములో ఈషద్భేదమున్నను ఫలమునకు సంబంధించి అన్ని సంప్రదాయములలోను ఏకవాక్యత కన్పించును. కేరళీయ సంప్రదాయములో ఒకటిరెండు శ్లోకముల విషయమున యంత్రస్వరూపలోను, బీజాక్షరములలోను కొంచత భేదమును శ్రీకుప్పుస్వామిగారు పేర్కొనిరి. గణేశ్ & కో వారు ప్రచురించిన ప్రతిలో పీఠికాకర్తలగు శ్రీఅనంతకృష్ణశర్మగారు కూడ ఇట్టి యభిప్రాయమునే ప్రకటించిరి. యంత్రస్వరూపములో ఈ రెండుప్రతులు సమానముగ నున్నవి. అముద్రితమును, వంగదేశీయ ప్రసిద్ధమునగు అచ్యుతానందవ్యాఖ్యయందు సూచించిన విధముగ యంత్రస్వరూపములు ప్రకటింపబడినవని శ్రీ అనంతకృష్ణ శర్మగారు పేర్కొనిరి. తెలుగు ముద్రణములలో శ్రీచదలువాడ

జయరామశాస్త్రి గారు, శ్రీఈశ్వర సత్యనారాయణశర్మగారు, శ్రీతుమ్మలపల్లి రామలింగేశ్వర రావుగారు ప్రచురించిన ప్రతులు కూడ యంత్రబీజఫల విషయమున పై ప్రతులతో సంవదించుచున్నవి. లక్ష్మీధరులు అధిక పాఠములుగా పేర్కొన్న సమానీతః పద్భ్యాం, సముద్భూతస్థూల, నిదేనిత్యస్మేరే అను మూడుశ్లోకములకు కూడ శ్రీఅనంతకృష్ణశర్మ గారును, శ్రీరామ లింగేశ్వరరావు గారును యంత్ర ఫలాదులను పేర్కొనిరి.

ఆయాశ్లోకములకు పేర్కొనబడిన ఫలములలో సకలకార్యజయము, సర్వస్త్రీ పురుష మృగ ప్రకృతి వశ్యత, శత్రుజయము, కారాగృహ దారిద్ర్య దుర్భిక్ష ఋణాదిబాధా నివారణము, విద్యాకవితాలాపము, షండత్వనాశము, పుత్రప్రాప్తి, వివిధరోగ నివారణము, భూతప్రేతాగ్నివిషాది దుస్స్వప్నజ్వరాది బాధా నివృత్తి మున్నగు వివిధప్రయోజనులు పేర్కొనబడినవి. స్థూలముగ చెప్పవలెనన్నచో ఐహికాముష్మికములగు సర్వఫలములను సాధించుటకును శ్లోకప్రయోగవిధానము నిర్దేశింపబడినది. ఉపలబ్ధగ్రంథములను బట్టి మూడు సంప్రదాయములను పేర్కొన్నను, తత్తద్గురుపరంపరాగత సంప్రదాయము లింకను ఎన్నో ఉండవచ్చుననియు, ఈశ్లోకములను కేవలము గ్రంథ సహాయముచే ఫలాపేక్షతో ప్రయోగించుట ప్రమాదకర మనియు, శ్రీవిద్యా సంప్రదాయజ్ఞులగు గురువుల ఉపదేశమును అనుశాసనమును అనుసరించియే వీని ననుష్ఠింపవలెననియు ఇంచుమించు పై పీఠికాకర్తలెల్లరును సూచించిరి. ఈ సూచనకూడ పై శ్లోకముల మంత్రతుల్యతను దృష్టిలో నుంచుకొని చేసినదే.

ఇట్లు శ్రీసౌందర్యలహరీ స్తవము జపపారాయణాదుల మూలమున ఐహికాముష్మిక ఫలప్రదాయకమగుచున్నది. పెక్కుచోట్ల శంకరులే విషయములను గుప్తముగా సూచించినను 'నరం వర్షీయాంసం', 'ముఖం బిందుం కృత్వా మున్నగు కొన్నిశ్లోకములలో మాదనాది ప్రయోగములను కొంత స్పష్టముగనే సూచించిరి. లక్ష్మీధరాది ప్రామాణిక వ్యాఖ్యాతలుగూడ

శంకర భగవత్పాదులీ స్తవమును ఉద్దేశ్యపూర్వకముగనే మంత్రమయముగ నిర్మించినట్లు అభిప్రాయపడిరి. వారి వ్యాఖ్యానములలో ఇట్టి రహస్యములను కొన్నించిని వివరించిరి. పూర్తి వివరములను గుర్వనుగ్రహముచే గ్రహింపవలసియుండు ననియు, నిర్దేశించిరి.

ఇట్లీ స్తోత్రమును శంకరభగవత్పాదులు ప్రయత్నపూర్వకముగనే చతుర్విధ పురుషార్థసాధకముగ నిర్మించిరని స్పష్టమగుచున్నది.

# ఉపసంహారము

సౌందర్యలహరి స్తోత్రవాఙ్మయములో విశిష్టమైనది. శంకరుల స్తోత్ర రచనలలో తక్కినవి ఇంతకంటె పరిణామమున చిన్నవి. అంతేగాక ఆయా స్తోత్రములలో అద్వైతమునో, భక్తినో ఇట్లేదో యొక అంశమును మాత్రమే ప్రధానముగా ప్రతిపాదించుట జరిగినది. శివానందలహరి భక్తి ప్రతిపాదకము. అద్వైతప్రతిపాదనమందు ఆనుషంగికము. దక్షిణామూర్తి స్తవము వంటివి వేదాంత ప్రతిపాదకములు. కనకధారాస్తవము వంటివి భక్తిప్రతిపాదకములు. శాక్తతంత్రపాదకమగు స్తోత్రము మరియొకటి శంకరులది కన్పింపదు. ఇతరుల రచనలలో తంత్రప్రతిపాదకములగు దేవీమహిమ్నము, సుభగోదయస్తవము, పంచదశీస్తవము వంటివి కొన్నియున్నవి. వానికంటె పెక్కు విశిష్టలక్షణములతో సౌందర్యలహరి విరాజిల్లుచున్నది. కవితారామణీయకమున సౌందర్యలహరితో పోల్చదగిన రచనలు సంస్కృతస్తోత్రవాఙ్మయములోనే చాలతక్కువ.

సౌందర్యలహరీ స్తవమును శంకరులు బహుముఖీనమగు ప్రణాళికతో, నైకప్రయోజనాపేక్షతో నిర్మించిరి. ఆనాటికి అవైదికములగు బౌద్ధజైనములు దేశమున వ్యాప్తిలో నుండినవి. శాక్తతంత్రములోని వైదికత మరుగునపడి, కౌలమార్గము పరివ్యాప్తమై క్షుద్రప్రయోగములే తంత్రముగా భావింపబడు దురవస్థ ఏర్పడినది. శాక్తమనగా వామాచారమే అనియు, వశీకరణ, మారణాది క్షుద్రప్రక్రియలే దీని ప్రయోజనమనియు భావించు దుస్థితి కలిగినది. లోకమున తాంత్రికులన్న భయము, ఏహ్యాభావమే గాని, భక్తి గౌరవములు లేకపోయినవి.

ఇట్టి పరిస్థితులలో తన ప్రధాన సిద్ధాంతమగు అద్వైత ప్రచారమును, గురుపరంపరాప్రాప్తమును, వేదప్రతిపాదితమును నగు శ్రీవిద్యా సంప్రదాయమును, భక్తిమార్గమునుకూడ లోకమున పరివ్యాప్తమొనర్చుటకు శంకరులీ స్తవమును నిర్మించిరి. ఈ స్తవము గౌడపాదులు సుభగోదయమున

ప్రతిపాదించిన సమయాచార సంప్రదాయమునకును, లలితా సహస్ర నామాదులందు నిరూపింపబడిన శ్రీవిద్యా సంప్రదాయమునకును శాక్తాద్వైతమునకును తాను బ్రహ్మసూత్రాది భాష్యములలో ప్రతిపాదించిన అద్వైతమునకును అవిరద్ధముగ, సమన్వయాత్మకముగ నున్నది. వీనికితోడు ఈ స్తవమున కవితా మాధుర్యమును కూడ మేళవించి శంకరులీ మహత్తరమగు స్తోత్రమును నిర్మించిరి. ఇట్లు నిర్మించుటలో ఇది కేవలము తంత్రవిద్యా సంప్రదాయ రహస్య ప్రతిపాదకమేగాక, తాంత్రిక ప్రయోజనము కూడ కలిగి, అఖిల పురుషార్థైక ఘటనముగ ఒకొక్క శ్లోకమొక్కొక్క మహామంత్రముగ నిర్మించుట శంకరుల ఆశయము. ఇంత విస్తృతమగు ప్రణాళికతో శంకరులీ స్తోత్రరచనము అసిధారా వ్రతముగ నిర్వహించిరి.

ఈ స్తోత్రమున శంకరులాయా అంశములను ఎట్లు నిపుణతరముగ ప్రతిపాదించిరో, ఈ సిద్ధాంత వ్యాసములోని ఆయా భాగములందు చర్చింప బడినది. ప్రతి అంశమునను శంకరులు సంపూర్ణ విజయమును సాధించిరనుట ఫలితార్థము. ఈ స్తోత్రములోని శంకరుల సర్వాంగీణమును, సర్వంకషమునగు ప్రతిభను పరిశీలించినచో ఇది మానవ నిర్మితమా? అను సందేహము కలుగక మానదు. శంకరులు అవతారపురుషులనుటకీ స్తోత్రమే నిదర్శనము. ఆయనయే స్తోత్రము చివర ఉద్ఘోషించినట్లు – ఇది పరమేశ్వరి వాణియే. స్తోత్రమున విషయము పరమేశ్వరి. స్తోత్రము పరమేశ్వరీ స్వరూపమగు శ్రీవిద్యా ప్రతిబింబము. స్తోత్రనిర్మాతయు శంకరుల హృదయమందిరములోని పరమేశ్వరియే. సాధ్యము, సాధనము, సాధకుడు (ధ్యానము, ధ్యేయము, ధ్యాత) సర్వమును పరమేశ్వరియే యను శాక్తాద్వైతమునకిది లక్ష్యభూతము. కనుకనే శంకరులు స్తోత్రాంతము ఇట్లు దేవిని స్తుతించిరి.

‘ప్రదీపజ్వాలాభి ర్దివసకర నీరాజనవిధిః
సుధాసూతేశ్చంద్రోపలజ జల లవై రర్ఘ్యరచనా ।
స్వకీయైరంభోభి స్సరిలనిధి సౌహిత్యకరణం
త్వదీయాభిర్వాగ్భి స్తవ జనని వాచాం స్తుతి రియమ్ ॥

# ఉపయుక్త గ్రంథసూచిక

**సంస్కృతగ్రంథాలు**

1. అగ్నిపురాణమ్
2. అథర్వవేదః
3. అథర్వవేదసాయనభాష్యమ్
4. అంబాస్తవః
5. అమరకోశః
6. అమృతలహరీ
7. అరుణామోదినీవ్యాఖ్యా
8. అరుణోపనిషత్
9. అలంకారసంగ్రహః
10. ఆనందగిరీయవ్యాఖ్యా
11. ఆనందలహరీవ్యాఖ్యా
12. ఆపస్తంబగహ్యసూత్రమ్
13. ఉజ్జ్వలనీలమణిః
14. ఉత్తరరామచరితమ్
15. ఋగ్వేదః
16. ఋగ్వేదభాష్యమ్
17. ఔచిత్యవిచారచర్చా
18. కఠోపనిషత్
19. కావ్యప్రకాశః
20. కావ్యమీమాంసా
21. కావ్యానుశాసనమ్
22. కావ్యాదర్శః
23. కావ్యాలంకారః
24. కావ్యాలంకారసూత్రమ్
25. కావ్యాలంకార సూత్రవృత్తిః
26. కుమారసంభవః
27. కుమారసంభవ మల్లినాథ వ్యాఖ్యా
28. కూర్మపురాణమ్
29. కైవల్యవర్ధనీవ్యాఖ్యా
30. గర్గసంహితా
31. గంగాలహరీ
32. గోపాలసుందరీవ్యాఖ్యా
33. చతుశ్శతీ
34. చర్పటపంజరికా
35. ఛాందోగ్యోపనిషత్
36. డిండిమభాష్యమ్
37. తంత్రరాజః
38. తాత్పర్యదీపినీవ్యాఖ్యా
39. తాత్పర్యదీపికా
40. తైత్తిరీయోపనిషత్

41. తైత్తిరీయ బ్రాహ్మణమ్
42. తైత్తిరీయారణ్యకమ్
43. తైత్తిరీయసంహితా
44. త్రిపురోపనిషత్
45. దశరూపకమ్
46. దేవీభాగవతమ్
47. ధ్వన్యాలోకః
48. ధ్వన్యాలోకలోచనమ్
49. నారాయణ సూక్తమ్
50. నాట్యశాస్త్రమ్
51. నారదభక్తిసూత్రాణి
52. నిరుక్తమ్
53. పదార్థచంద్రికావ్యాఖ్యా
54. పాతంజల యోగసూత్రమ్
55. పురుషసూక్తమ్
56. ప్రతాపరుద్రీయమ్
57. బృహద్దేవతా
58. బ్రహ్మాండపురాణమ్
59. భక్తిరసాయనమ్
60. భగవద్గీతా
61. భావనోపనిషత్
62. భావప్రకాశః
63. మత్స్యపురాణమ్
64. మంత్రమహోదధిః
65. మాఘకావ్యమ్
66. మూకపంచశతీ
67. మౌక్తికోపనిషత్
68. రసగంగాధరః
69. రత్నాపణవ్యాఖ్యా
70. రుద్రాధ్యాయః
71. రుద్రయామళమ్
72. లక్షణదీపికా
73. లక్ష్మీధరవ్యాఖ్యా
74. లక్ష్మీలహరీ
75. వరివస్యారహస్యమ్
76. వాచస్పత్యమ్
77. వామకేశ్వర మహాతంత్రమ్
78. వృత్తరత్నాకరః
79. వ్యాకరణమహాభాష్యమ్
80. శబ్దకల్పద్రుమః
81. శివానందలహరీ
82. శ్రీమద్భాగవతమ్
83. శ్రీలలితాత్రిశతీ
84. శ్రీలలితాసహస్రనామభాష్యమ్
85. శ్రీవిద్యారత్నాకరః
86. శ్రీవిష్ణుసహస్రనామభాష్యమ్
87. శ్రీశివమహిమ్నఃస్తోత్రమ్

88. శ్రీసూక్తమ్
89. శ్వేతాశ్వతరోపనిషత్
90. స్పందనిర్ణయః
91. సంస్కృతే పంచదేవతాస్తోత్రాణి
92. సాహిత్యదర్పణః
93. సుభగోదయస్తుతి
94. సూతసంహితా
95. సౌందర్యలహరీ (O.R.I. మైసూర్)
96. సౌందర్యలహరీ (Ganesh & Co., Madras)
97. సౌభాగ్యవర్ధనీవ్యాఖ్యా
98. హలాయుధకోశః

**తెలుగు గ్రంథములు**

1. ఆంధ్రశతక సాహిత్యవికాసము
2. కావ్యాలంకార సంగ్రహము
3. సౌందర్యలహరి (తుమ్మలపల్లి వ్యాఖ్యతో)
4. సౌందర్యలహరి (ఈమనివారి వ్యాఖ్యతో)
5. శ్రీశంకరభగవత్పాద జీవనచరితము (ఆచార్య పిఎస్ శాస్త్రి)

**హిందీగ్రంథాలు**

१. वैदिक साहित्य और संस्कृति (डा. बलदेव उबाध्याय)

२. श्रीशंकराचार्य (डा. बलदेव उबाध्याय)

**ఆంగ్లగ్రంథాలు**

1. Commentaries on Saundaryalahari - A. Kuppu swamy.
2. History of Classical Sanskrit Literature - M. Krishnamacharya
3. Introduction of SriVidya - A. Kuppu Swamy
4. Notes on Saundaryalahari - A. Kuppu Swamy
5. Saundaryalahari - An Introduction - Sir John Woodroffe
6. Studies in Devi Bhagavate - Prof. P.G. Lalye.



కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి వారికి సన్మాన పత్ర సమర్పణ




తెలుగు విశ్వ విద్యాలయం వారిచే ప్రతిభా పురస్కారం



జీయర్ స్వామి వారిచే విద్వత్ సన్మానం



“దర్శనమ్” వార్షికోత్సవ సభలో “సినారె” తో సన్మానం